# అవినీతి

## భవిష్యత్ భారతం - 1

(ఈనాడు వార్తాపత్రికలో ప్రచురితమైన వ్యాసాలు)

డా॥ జయప్రకాష్ నారాయణ్

లోక్‌సత్తా

ప్రజలే ప్రభువులు

# అవినీతి

## భవిష్యత్ భారతం - 1

మొదటి ముద్రణ : నవంబరు, 2013
ప్రతులు : 1000

**వెల : రూ. 75/-**

*ప్రచురణ :* **Foundation for Democratic Reforms (FDR)**

*ముద్రణ :* Kalajyothi Process Pvt. Ltd., RTC "X" Road, Hyderabad

---

ప్రతులకు

**FOUNDATION FOR DEMOCRATIC REFORMS (FDR)**
ఫ్లాట్ నెం. 801 & 806, శ్రీనివాస టవర్స్,
ఐటిసి కాకతీయ హోటల్ ప్రక్కన,
బేగంపేట్, హైదరాబాద్ - 500 016.
ఫ్యాక్స్ : 040 - 23419948, ఫోన్ : 23419949
E-mail : info@fdrindia.org, www.fdrindia.org

# విషయసూచిక


1. సామాన్యుడికి అందని సంస్కరణల ఫలాలు............................మార్చి 13, 2000
2. పాలనలో అతిరహస్యం అవినీతికి మూలం ...........................సెప్టెంబర్ 29, 1997
3. సహించినకొద్దీ కబళించే అవినీతి ...............................................మే 13, 2002
4. లంచగొండి వ్యవస్థలో అభివృద్ధి అసాధ్యం! ...............................ఫిబ్రవరి 5, 2001
5. అభివృద్ధిని తుడిచిపెట్టే అవినీతి ప్లేగు .............................................................
6. ప్రజాస్వామ్యంలో స్వాహారాయుళ్ల స్వైరవిహారం.........................ఫిబ్రవరి 26, 2001
7. చట్టసభల్లో అవినీతిని అడ్డుకునే చర్యలేవి? ....................................మే 8, 2000
8. పడగెత్తిన అవినీతిని పరిమార్చే చేతనేదీ? ..................................జనవరి 1, 2000
9. తెహల్కా ఉదంతం లేవనెత్తిన ప్రశ్నలు ........................................ఏప్రిల్ 2, 2001
10. ఆత్మన్యూనత కాదు, అవగాహన నేటి అవసరం..........................సెప్టెంబర్ 1, 1997
11. మధ్యయుగాల సంస్కృతిని కాలరాస్తేనే ప్రగతి ...........................జనవరి 17, 2000
12. సమస్యకు పరిష్కారం సభా బహిష్కారం .............................సెప్టెంబర్ 15, 2003
13. ముప్పు తెస్తున్న ముడుపుల సంస్కృతి ..................................డిశంబర్ 19, 2005
14. ప్రజాధనాన్ని భోంచేసేందుకు అధికారం లైసెన్సు కాదు!..............ఆగస్టు 8, 2001
15. అనైతిక సంపాదనతో అధికారానికి గాలం!..............................డిశంబర్ 6, 1999
16. నేరాలకు బహుమతులు - నిజాయతీకి శిక్షలు.......................సెప్టెంబర్ 21, 2012
17. అరాచకత్వం అంతమైతేనే ప్రజాస్వామ్యం భద్రం ....................డిసెంబర్ 15,2003
18. నీతిని నిలబెట్టడానికి నిర్దిష్టమైన ఏర్పాట్లు .............................సెప్టెంబర్ 22, 1997
19. చెడుకు శిక్ష మంచికి రక్షణ ఉన్నప్పుడే సత్ఫలితాలు ................సెప్టెంబర్ 8, 1997
20. ఆటగాళ్ళను మారిస్తే చాలదు ఆటనియమాల్నే మార్చాలి............ఆగస్టు 25, 1997

21. అవినీతి పై సమరం జాతీయావసరం! ....................................డిసెంబర్ 10, 2001

22. అవినీతిని అంతంచేస్తేనే సంపద సృష్టికి అవకాశం....................ఫిబ్రవరి 12, 2001

23. సంక్షోభం కాదిది- జాతికి మహదవకాశం.................................మార్చి 19, 2001

24. అవినీతికి అడ్డుకట్ట వేసేదెలా? ..................................................జూలై 18, 2005

25. పటుతర చట్టంతోనే అవినీతికి పగ్గం.............................................మే 15, 2006

26. అవినీతి నిరోధక చట్టాలు పదును తేలాలి ఇకనైనా!.......................జూన్ 2, 2003

27. ప్రజాపోరాటంతోనే అవినీతి అంతం..........................................జూన్ 30, 2003

28. రాజకీయ సంకల్పంతోనే అవినీతికి అడ్డుకట్ట!............................నవంబరు 3, 2003

29. రూపు మార్చుకొని కాటు వేస్తున్న అవినీతి సర్పాలు! ..................డిసెంబర్ 1, 2003

30. పాలకుల ప్రయోజకత్వంలో పెరుగుతున్న అవినీతి......................ఏప్రిల్ 21, 2003

31. రాజకీయ అవినీతిని అరికట్టే మార్గమేది? .................................సెప్టెంబరు 9, 2002

32. పునాదుల నుంచి పెకలిస్తేనే అవినీతి అంతం .........................సెప్టెంబర్ 18, 2000

33. అధికారం-అక్రమార్జనల విషవలయాన్ని ఛేదించడం ఎలా?.......ఆగస్టు 12, 2002

34. నిజాయతీపరులకు గౌరవం సామాజిక బాధ్యత ...........................ఏప్రిల్ 1, 2002

# పీఠిక

దాదాపు 16 ఏళ్ల క్రితం, కిందటి శతాబ్దం నాటి మాట. రోజువారీ చిన్నపనికి కూడా లంచాలిస్తూ కూడా అది తమ తలరాత అని కోట్లాదిమంది ప్రజలు నలిగిపోతున్నా కూడా వ్యవస్థను మార్చగల వనరులు, ఆలోచనాసామర్థ్యం ఉన్నవారు, రాజకీయాన్ని నడిపిస్తున్న నేతలు, అవినీతి ఒక పెద్దసమస్య కాదు అని భావిస్తున్న రోజులవి. తొలితరం నేతల స్ఫూర్తిని ఇంకా వీడనివారు, అవినీతి తీవ్రత అర్థమై నలిగిపోతున్న మధ్యతరగతివారు, పాఠశాలల్లో నైతికపాఠాలు బోధిస్తున్నవారిలో, నేర్చుకుంటున్నవారిలో కొందరు మాత్రం అవినీతి అంతానికి ఏదోక గట్టి ప్రయత్నం జరగాలని బలంగా కోరుకునే దశ అది. వారు కూడా ఒక అమూర్తభావనగా అవినీతిపై పోరాటానికి సన్నద్ధంగా వున్నారు తప్ప నిర్దిష్ట పరిష్కారాలేమిటో, వాటి ద్వారా మార్పులు ఏ క్రమంలో సాధించాలో వారికీ అవగాహన లేదు. కేవలం రోడ్లెక్కి నినాదాలు చేస్తే అవినీతికి వ్యతిరేకంగా పోరాటం జరుగుతుందని భావించేవారు.

ఈ దశలో ఆ రెండు అంశాలపై స్పష్టతతో అవినీతిపై లోక్‌సత్తా ఓ సమగ్ర ఉద్యమంగా సమరభేరి మోగించింది. గతంలో చేసిన అవినీతి వ్యతిరేక పోరాటాలను, ప్రక్షాళనకు చేసిన ప్రయత్నాలను పరిగణలోకి తీసుకుంటూనే, అవినీతి నిరోధానికి తగిన బలమైన వ్యవస్థల్ని ఏర్పాటు చేయటానికి మునుపెన్నడూలేని పరిష్కారాలను, అవకాశాలను చూపుతూ అవినీతి అంతాన్ని ఓ బలమైన రాజకీయ ఎజెండాగా లోక్‌సత్తా చేయగలిగింది.

మొదటగా, అవినీతి అనేది భారతదేశం ఎదుర్కొంటున్న ఒక భయంకర జాడ్యమని, దాన్నలాగే వదిలేస్తే పేదలను, నిస్సహాయులను పీల్చిపిప్పిచేస్తుందని, అభివృద్ధిని, సమాజాన్ని క్రమంగా కబళించేస్తుందని, కాబట్టి భారతదేశ నిర్మాణానికి మౌలిక ఎజెండాగా అవినీతి నిర్మూలన పోరాటాన్ని చేపట్టాలని లోక్‌సత్తా నిర్ద్వంద్వంగా పేర్కొంది. అలాగే, ఇదేదో కేవలం గడచిన కొన్ని సంవత్సరాల నుంచి మాత్రమే వచ్చిన సమస్యకాదని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచే ఉన్నసమస్యని, బహుముఖ వ్యవస్థీకృతంగానే ఆ జాడ్యాన్ని అంతం చేయాలని స్పష్టంచేసింది. ఉదాహరణకు, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే 1948లోనే మహాత్మాగాంధీకి వచ్చిన లేఖలలో సైతం అవినీతి ప్రస్తావన ఉంది. అందులో దేశభక్త

కొండా వెంకటప్పయ్య వంటి వారు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌లో ఆనాటి లంచగొండితనాన్ని సవివరంగా పేర్కొంటూ ఎంతో ఆవేదనతో గాంధీగారికి లేఖ రాశారు. ఆ లేఖను స్వయంగా తన ప్రార్థనాసమయంలో గాంధీజీ బైటపెట్టారు. అలాగే కేవలం లోక్‌పాల్ వంటి ఒక చట్టంతోనే అవినీతి అంతం సాధ్యంకాదని, అధికార వికేంద్రీకరణతో జనం చేతులలోకి అధికారం తీసుకెళ్లటం సహా వివిధ సమూల సంస్కరణలతో బహుముఖ పోరాటం చేయాలని వివరించింది.

అవినీతిపై పోరాట చైతన్యాన్ని ఇంకా విస్తరించే మంచి ఉద్యమాలు వచ్చినా, ఎజెండా, పంథా లోక్‌సత్తాదే సరైనదని ఇన్నేళ్లకాలంలో నిగ్గుతేలింది. 1997లో లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించిన సమయంలో 'భవిష్యత్ భారతం' దార్శనిక వ్యాసాల ద్వారా ప్రజలతో నేను పంచుకున్న ఈ మాటలు ఆ వాస్తవాన్నే రుజువుచేస్తున్నాయి...

"అవినీతి నశించాలని నినాదాలు చేస్తే కాదనే వారెవరూ ఉండరు. అవినీతికి పాల్పడేవారు కూడా అందులో చేరి నినదిస్తారు. అవినీతి కొనసాగాలని బహిరంగంగా కోరే మనిషి ఒక్కరూ కనిపించరు. కానీ అంతమాత్రాన అవినీతి తొలగిపోదు. మనిషి ప్రవర్తనని మంది సంక్షేమం కోసం క్రమబద్ధంచేసే రాజ్యవ్యవస్థ లేనినాడు అవినీతి ఖాయంగా వర్ధిల్లుతుంది. మనదేశంలో నేడదే జరుగుతోంది. జనసామాన్యాన్ని ప్రతిరోజూ, ప్రతిచోటా అవినీతి పీడిస్తోంది. సరైన సంస్కరణల్ని సమగ్రంగా చేపట్టనంతవరకూ ఎన్నిసార్లు ఎన్ని ప్రభుత్వాలను ఓడించి కొత్త ప్రభుత్వాలను ఎన్నుకున్నా ప్రజలకు అవినీతి బాధలు తప్పవు. చివరకు ప్రజాస్వామ్యం అంటే ప్రజలకున్న విశ్వాసం సడలిపోతోంది. 'ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోవటానికి, ఎవరు గెలిస్తేనేమి, జరిగేది ఒకటేగా!' అనే నిరాశ వ్యాప్తి చెందుతోంది.

అందుకే నినాదాలతో కాలక్షేపం చేయకుండా, అవినీతిని అంతమొందించటానికి అవసరమైన నిర్దిష్ట కార్యక్రమాల్ని, పాలనా సంస్కరణల్ని చేపట్టాలి. వీటి పట్ల అవగాహనతో క్రమపద్ధతిలో పోరాడితే ఖచ్చితంగా విజయం సాధించగలం.

అవినీతి పోవాలంటే మన వ్యవస్థలో ఆటగాళ్లను మారిస్తే చాలదు–ఆట నియమాలనే మార్చి ప్రజలకు జవాబుదారీగా ఉండే దాపరికంలేని పాలనావ్యవస్థను నిర్మించాలి. ప్రజలకు నిజమైన అధికారాన్నిచ్చి ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేయాలి. తప్పుచేసిన వాళ్లకి వెంటనే దండన ఉండే విధంగా పాలనని సంస్కరించాలి.

అవినీతికి పాల్పడినవారికి శిక్ష పడుతుందన్న భయాన్ని, నీతిపరులకు గుర్తింపు ఉందన్న విశ్వాసాన్ని కలిగించటం తక్షణావసరం. కౌటిల్యుడి అర్థశాస్త్ర కాలం నుంచి నేటివరకు, అభివృద్ధి చెందిన దేశాల నుంచి భారత్ తదితర అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలవరకు, అన్ని కాలాలలోనూ, అన్ని సమాజాలలోనూ ఇదే సత్యం.

అన్ని స్థాయిలలో బలమైన అవినీతి నిరోధక సంస్థల్ని ఏర్పాటు చేసే చట్టం తెచ్చి, నిర్దిష్ట కాలంలో–ఆరోపణలు వచ్చిన నాటి నుంచి 90రోజులలోగా– విచారణ పూర్తిచేసి నిజనిర్ధారణ చేయాలి. ఒకసారి ఫలానా వ్యక్తి అవినీతికి పాల్పడ్డాడని సంస్థ నిర్ణయం చేస్తే ఆ నిర్ణయం ప్రభుత్వానికి శిరోధార్యం కావాలి. మళ్లీ వేరే ప్రక్రియ లేకుండా తక్షణం కొన్ని శిక్షలు అమలు జరగాలి. అవినీతిపరుడు వెంటనే పదవి కోల్పోవాలి. దాంతోపాటు అతడి ఆస్తిపాస్తుల మొత్తం, అతడి సమీప బంధువుల ఆస్తులు తక్షణం ప్రభుత్వపరం కావాలి. ఆస్తులు జప్తుచేయకపోతే లక్షల రూపాయల లంచం పొందాక, ఆ ఉద్యోగికి జరిగే నష్టం స్వల్పం. కోట్లు తినేసినవాళ్ళకి నెలజీతం ఇచ్చే ఉద్యోగం పోవటం మాత్రమే శిక్ష అయితే, చాలామంది అందుకు సిద్ధపడతారు. నేటి పరిస్థితులలో ఉద్యోగం ఊడటంతోపాటు, ఆ ఉద్యోగికి, అతని కుటుంబానికి చెందిన ఆస్తులు పోతాయన్న భయం ఉంటే, చాలామంది అవినీతికి దూరంగా ఉంటారు. అతణ్ణి వెంటనే న్యాయస్థానంలో విచారించి, కనీసం ఐదుసంవత్సరాలకు తగ్గకుండా కఠిన జైలుశిక్ష విధించే ఏర్పాటు ఉండాలి. అలాంటి కేసులలో ఒక అప్పీలుకి మించి లేకుండా న్యాయవిచారణ, అప్పీలు రెంటికీ ఒక్కొక్కస్థాయిలో 90 రోజుల పరిమితిలో విధిగా న్యాయనిర్ణయం జరిగే విధంగా చట్టం చేయాలి. నిష్పాక్షిక రాజ్యాంగ నియామకం, 90 రోజులలో అవినీతి ఆరోపణలపై తుది నిర్ణయం, విధిగా పదవి నుంచి తొలగింపు, సొంత, ఇతర కుటుంబసభ్యుల ఆస్తి ప్రభుత్వపరం, కనీస జైలుశిక్ష, అప్పీళ్ళకు పరిమితులు– ఇవన్నీ కఠినంగా అనిపించవచ్చు. కానీ దేశవాసుల భవిష్యత్తుని సంరక్షించుకోవాలంటే, ఈపాటి కాఠిన్యం నేటి పరిస్థితులలో అవసరం. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అంటే విశృంఖలత్వం కాకూడదు. నిర్లజ్జగా అవినీతికి పాల్పడేవాళ్లని శిక్షించకపోవటంతో, అవినీతి స్వేచ్ఛని, జాతి ప్రగతిని తీవ్రంగా దెబ్బతీస్తోంది.

అవినీతిని పూర్తిగా అదుపులోకి తేవాలంటే కేవలం చట్టపరమైన ఏర్పాట్లు చాలవు. బలమైన అవినీతి నిరోధక చట్టంతోపాటు ఇతర పాలన, రాజకీయ సంస్కరణలను

చేపట్టాలి. అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతులలోకి తీసుకెళ్ళేందుకు, రాజకీయ, ఎన్నికల వ్యవస్థల్ని సమూలంగా మార్చేందుకు, ఉద్యోగులు, అధికారుల నియామకాలలో మధ్య యుగ సంస్కృతిని అంతమొందించేందుకు, నేరమయ రాజకీయాన్ని అణచివేసేందుకు, న్యాయస్థానాలు సకాలంలో న్యాయాన్నందించేందుకు కావలసిన మౌలిక ప్రజాస్వామ్య సంస్కరణలు చేపట్టాలి. అలాగని ఒక దానికోసం మరొకటి ఆగనక్కర్లేదు. రాజ్యవ్యవస్థని కలుషితం చేస్తున్న అవినీతిని సమర్థవంతంగా ఎదుర్కొనాలంటే వెంటనే అందుకు యుద్ధప్రాతిపదికన చట్టపరమైన చర్యలు చేపట్టాలి."

అవినీతి అంతానికి సింగిల్ ఫార్ములా లేదు కాబట్టి, బహుముఖ పోరాటం చేయాలి కాబట్టి, ఆవేశంతోపాటు అవగాహనతో, ఓర్పుతో పోరాడితేనే ఫలితాలు సాధించగలమని ప్రజలకు వివరిస్తూ, ఆ దిశగానే ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేందుకు తగిన కార్యాచరణను తీసుకున్నాం. చివరకు అవినీతి అంతానికి, లోక్‌సత్తా పర్యాయపదంగా మారింది. అవినీతి అంతం... లోక్‌సత్తా పంతం నినాదం ప్రజలలో విశేష ప్రాచుర్యం పొందింది.

లోక్‌సత్తా కృషి వల్ల అవినీతి జాడ్యంపై, అవినీతి నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ దిశగా ప్రజలలో కొంత చైతన్యం వ్యాపించింది. ఆంధ్రప్రదేశ్‌తో మొదలుపెట్టి దేశవ్యాప్తంగా రాజకీయనేతలు, పార్టీలు అవినీతి గురించి మొక్కుబడిగానైనా మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా తమ ఆస్తుల వివరాలను, నేరచరిత్రను వివరించాల్సిన చట్టాన్ని, పార్టీలకు ఇచ్చే విరాళాలలో నల్లధనాన్ని అదుపుచేయటానికి ఆ చందాలకు ఆదాయపు పన్ను రాయితీని కల్పించే పార్టీ ఫండింగ్ చట్టాన్ని లోక్‌సత్తాయే సాధించింది. అవినీతి నిరోధకంలో ఇవి కీలకపరిణామాలే అయినా, దేశనిర్మాణానికి అవసరమైన ఎజెండాపై రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలనూ ఏకం చేసేందుకు లోక్‌సత్తా ప్రయత్నిస్తున్నా అవినీతిరహిత పార్టీని, అభ్యర్థులను ఎన్నుకునే అవకాశం ప్రజలకు లేకపోవటం, పార్టీలు కూడా ప్రజలకు తాము తప్ప గత్యంతరం లేదనే పెత్తందారీ ధోరణితో అవినీతిపై దాటవేత ధోరణితో వ్యవహరిస్తుండటం వల్ల లోక్‌సత్తా 2006లో రాజకీయ పార్టీగా వచ్చి అవినీతి నిర్మూలన కోరుకునే వారికి ఒక వేదికను అందించింది. వివిధ దేశాలలో అవినీతి నిర్మూలనకు జరిగిన ప్రామాణిక ప్రయత్నాలన్నిటినీ

అధ్యయనం చేసి భారతీయ పరిస్థితులకు అన్వయించి బలమైన లోక్‌పాల్ కోసం రెండో పరిపాలనాసంస్కరణల సంఘం (ఏఆర్సీ)లో సభ్యునిగా నేను రాసిన అంశాలను క్రోడీకరించి కేంద్రంలో బలమైన లోక్‌పాల్, రాష్ట్రాలలో బలమైన లోకాయుక్త, జిల్లాలలో అంబుడ్స్‌మన్‌ని ఏర్పాటు చేయాలని ప్రయత్నం ప్రారంభించాం. (రెండో ఏఆర్సీలోని అంశాలను పరిగణలోకి తీసుకునే బ్రిటన్ వంటి దేశాలు తమ అవినీతి నిరోధక వ్యవస్థను పటిష్ఠం చేసుకునేలా కొత్తచట్టాలు చేసుకున్నాయి). ఆంధ్రప్రదేశ్‌లో అప్పటికే రాజకీయ నేతలు, ఉన్నతాధికారుల అవినీతి మేటలు వేసింది. దేశంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అవినీతి సొమ్ముతో అధికారంలోకి రావటం, తరతరాలకూ సరిపడా వేలకోట్ల సొమ్ముల్ని దోచేయటం జరిగిందని, ఇందులో కొందరు ఐఏఎస్, ఇతర ఉన్నతాధికారులు కూడా వాటాలు పొంది వందలకోట్లు పోగేసుకున్నారని స్పష్టమైన ఆరోపణలు వచ్చాయి. డబ్బు, మద్యం పంచకుండా కేవలం రూ. 4,92,326 వ్యయంతో 2009 ఎన్నికలలో కూకట్‌పల్లి శాసనసభాస్థానం నుంచి ఎన్నికైన నేను, అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన జూన్ నెలలోనే రాష్ట్రంలో బలమైన లోకాయుక్తని తెచ్చి అవినీతిపరుల ఆటకట్టించటానికి అవినీతి నిరోధక చట్టసవరణ బిల్లు–2009ని అధికార, ప్రతిపక్ష పార్టీలతోపాటు శాసనసభలోని అన్ని విపక్షపార్టీలకూ అందచేశాను (జూన్ 10, 2009న). ఆ చట్టాన్ని ఆమోదించి అవినీతి నిర్మూలనకు చిత్తశుద్ధిని, రాజకీయ సంకల్పాన్నీ చాటాలని కోరాను. ఆ బిల్లు స్ఫూర్తితోనే తెలుగులో 'లీడర్' అనే సినిమా కూడా వచ్చింది.

ఆ బిల్లుకు అన్ని పార్టీల మద్దతును కోరటంతోపాటు ప్రజల్ని చైతన్యపరిచేందుకు అమెరికాలోని పీపుల్ ఫర్ లోక్‌సత్తా అనే స్వచ్ఛంద రాజకీయ సంస్థ 1930లలో గాంధీ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా దండియాత్ర తరహాలో యాత్ర నిర్వహించింది. 2011 మార్చిలో వారు దండియాత్ర–2 పేరుతో అమెరికాలోని శాన్‌డిగో నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వరకూ 35 నగరాలలో గాంధీ ఆనాడు నడిచినంత దూరం (240 మైళ్లు) అవినీతికి వ్యతిరేకంగా పాదయాత్ర చేశారు.

ఆ స్ఫూర్తితోనే అన్నా హజారే బృందం 2011లో లోక్‌పాల్‌పై ఢిల్లీ, ముంబయి కేంద్రంగా ఐఏసీ (ఇండియా ఎగనెస్ట్ కరప్షన్) పేరుతో ఉద్యమం చేపట్టింది. 2జీ స్పెక్ట్రం, కామన్వెల్త్, ఆదర్శ్ వంటి అతి భారీ కుంభకోణాలు వరసగా వెలుగులోకి రావటం, మున్నెన్నడూ లేని రీతిలో మీడియా కూడా అవినీతి వ్యతిరేక ఉద్యమానికి

తనవంతు సహకారం అందించటంతో అన్నా ఉద్యమం జాతి మొత్తాన్నీ కదిలించింది. అవినీతికి వ్యతిరేకంగా ప్రజలలో ఆలోచనాపరులు మూకుమ్మడిగా పెద్దఎత్తున కదిలారు. అన్నా పోరాటపంథాను వ్యతిరేకించినా, ఆయన బృందం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని లోక్‌సత్తా మనస్ఫూర్తిగా సమర్థించింది. యూపీయే ప్రభుత్వ నియంతృత్వ, అనుచిత దాడుల నుంచి ఆయనకు అండగా నిలబడింది. రాజకీయ, పాలనావ్యవస్థలలోని అవినీతిని కట్టడిచేసేలా బలమైన అవినీతి నిరోధక వ్యవస్థల్ని వేగంగా నిర్మించేందుకు అదో మంచి అవకాశంగా వినియోగించాలని లోక్‌సత్తా భావించింది. నేను దేశవ్యాప్తంగా వివిధ నగరాలలో పలు కార్యక్రమాలలో పాల్గనటంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకంగా లోక్‌పాల్ రథయాత్ర పేరుతో విస్తృతంగా పర్యటించి ఆయా వ్యవస్థల ఏర్పాటుపై పైపైన కాకుండా లోతైన అవగాహనను ప్రజలలో, ముఖ్యంగా యువత, విద్యార్థులలో పెంచేందుకు గట్టి ప్రయత్నం చేశాను. కరపత్రాలు, చిన్నపుస్తకాలను విరివిగా వారికి అందించాం. లోక్‌సత్తా ప్రధాన కృషితో 2005లో వచ్చిన పాలనా సమాచారహక్కు చట్టంతో రూపుదిద్దుకున్న పౌరయోధులు, లోక్‌సత్తా కార్యకర్తలు ఐఏసీ ఉద్యమంలో పెద్దఎత్తున పాల్గన్నారు.

లోక్‌పాల్ ఉద్యమ సమయంలో చాలా బాధ్యతాయుతంగా, వాస్తవిక దృక్పథంతో స్పందించిన లోక్‌సత్తా, తన వంతు బాధ్యతగా లోక్‌పాల్ ముసాయిదా బిల్లును తయారుచేసి కేంద్రప్రభుత్వానికి, పార్లమెంటులోని అన్నిపార్టీల సభ్యులకు, పార్లమెంటు స్థాయీ సంఘానికి అందచేసింది. లోక్‌సత్తా డ్రాఫ్ట్ బిల్లులోని అంశాలను తీసుకుని జన్ లోక్‌పాల్‌లో పలుమార్లు మార్పులుచేర్పులు చేసుకున్నారు కూడా. విభేదాలపేరుతో ఉద్యమం నీరుగారిపోకుండా లోక్‌పాల్‌పై ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు ఢిల్లీ, హైదరాబాద్‌లో వివిధ అవినీతి నిరోధక వ్యవస్థలలో పనిచేసిన నిజాయతీపరులైన ఉన్నతాధికారులతో, మీడియా, న్యాయ వ్యవస్థల ప్రముఖులతో, అరవింద్ కేజ్రీవాల్, కిరణ్‌బేడీ తదితర సామాజిక ఉద్యమకారులుసహా జాతీయస్థాయి పౌరప్రముఖులతో రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించాం. ఇందులో ఏకాభిప్రాయంతో కొన్ని అంశాలను ఆమోదించి పార్లమెంటరీ స్థాయీసంఘం ముందు వాదనల్ని వినిపించాం. ముఖ్యంగా జాతీయస్థాయిలో లోక్‌పాల్‌లాగే, రాష్ట్రాలలో బలమైన లోకాయుక్త ఒకేసారి వచ్చేలా పార్లమెంటులో లోక్‌పాల్ చట్టాన్ని తేవాలని, ఐక్యరాజ్యసమితి అవినీతి

నిరోధక తీర్మానాన్ని భారతప్రభుత్వం ధృవీకరించినందున ఇలా జాతీయస్థాయి చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉందని లోక్‌సత్తా వాదించింది. అయితే రాష్ట్రాలకు అధికారం పేరుతో సాంప్రదాయ రాజకీయ పార్టీలు ఆ వాదనను వీగిపోయేలా చేశాయి. దాదాపు 80శాతం బలమైన లోక్‌పాల్ 2011లోనే వచ్చే అవకాశాన్ని పంతాలు, పట్టింపులు, పక్షపాత రాజకీయాల వల్ల భారతదేశం కోల్పోయినా లోక్‌సత్తా నిరుత్సాహపడ లేదు. జాతిహితం కోసం అందరినీ ఏకం చేసి బలమైన చట్టాన్ని తెచ్చేందుకు తన పోరాటాన్ని ఇంకా కొనసాగిస్తూనే ఉంది. లోక్‌పాల్, లోకాయుక్తలతోపాటు, పౌరులకు ప్రభుత్వ సేవల్ని, అంటే ధ్రువపత్రాలు, పాసుపుస్తకాలు వంటి సేవల్ని ఒక హక్కుగా నిర్ణీత కాలవ్యవధిలో అందించటం, అందించలేకపోతే రోజుకు కనీసం రూ.100 చొప్పున జరిమానా చెల్లించేలా సిటిజన్స్ ఛార్టర్ చట్టం, రాజ్యాంగపరిరక్షణకు కీలకమైన న్యాయవ్యవస్థలో అవినీతి నిరోధానికి జాతీయ జ్యుడీషియల్ ఏర్పాటు కోసం లోక్‌సత్తా కృషి చేస్తోంది. వీటన్నిటినీ త్వరలో సాకారం చేయగలమన్న విశ్వాసం ఉంది.

**లోక్‌పాల్, లోకాయుక్త, సిటిజన్స్ ఛార్టర్లు, జాతీయ జ్యుడీషియల్ కమిషన్‌లపై లోక్‌సత్తా ప్రతిపాదనలు స్థూలంగా...**

**లోక్‌పాల్‌పై...**

(ప్రభుత్వ లోక్‌పాల్ బిల్లుతోపాటు పౌరసమాజ కార్యకర్తల నుంచి, డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నుంచి వచ్చిన అన్ని సూచనల్ని కూడా పార్లమెంటు స్థాయీ సంఘం పరిగణలోకి తీసుకుంటుందని ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్ ఆగస్టు 25, 2011న లోక్‌సభకు చెప్పారు) భారత ప్రభుత్వ లోక్‌పాల్, లోకాయుక్త బిల్లు, 2011కు సవరణలు సూచిస్తూ ఆగస్టు 26, 2011న, సెప్టెంబర్ 07,2012న పార్లమెంటరీ స్థాయీ సంఘం ముందు నిర్మాణాత్మకంగా, సృజనాత్మకంగా లోక్‌సత్తా వినిపించిన ప్రధాన వాదనలివి...

- లోక్‌పాల్ బిల్లులో భాగంగానే రాష్ట్రాల్లో బలమైన లోకాయుక్తల్ని ఏర్పాటు చేయాలి. పార్లమెంటు 'లోక్‌పాల్ మరియు లోకాయుక్తల చట్టం'ను తీసుకురావాలి. క్రిమినల్ చట్ట నిబంధనలు, నేర పరిశోధన కేంద్రం రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోకి వస్తాయి కాబట్టి లోకాయుక్తపై చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉంది.

దాంతోపాటు, ఐక్యరాజ్యసమితి అవినీతి వ్యతిరేక ఒప్పందాన్ని భారతదేశం ధృవీకరించినందున రాజ్యాంగంలోని ఆర్టికల్ 253కింద కూడా అవినీతిపై దేశవ్యాప్తంగా వర్తించే చట్టాన్ని చేసే అధికారం పార్లమెంటుకు ఉంది. అంతర్జాతీయ ఒప్పందాలకనుగుణంగానే గతంలో భారత ప్రభుత్వం మానవ హక్కులకు సంబంధించి, మనీ లాండరింగ్‌కు సంబంధించి చట్టాల్ని చేసిందని మేం కమిటీ దృష్టికి తీసుకొచ్చింది. అయితే రాష్ట్రాల అధికారాలను హరిస్తున్నారంటూ అసలు లోక్‌పాల్ బిల్లుకే ఎసరు పెట్టేలా సాంప్రదాయపార్టీలు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు వ్యవహరిస్తున్నందున, వివాదాన్ని అధిగమించేందుకు లోకాయుక్తపై తుదినిర్ణయాన్ని రాష్ట్రాలకే వదిలివేయాలి.

● అవినీతికి నిర్వచనాన్ని మార్చి పరిధిని విస్తరించాలి. లాలూచీ పడి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించిన కేసుల్లో శిక్షల స్థాయిని పెంచటానికి, అవినీతిపరులైన ప్రజాప్రతినిధులు, ఇతర ప్రజాసేవకుల ఆస్తుల్ని జప్తు చేయటానికి, సి.వి.సి, లోకాయుక్తలకు ప్రాసిక్యూషన్ అధికారాలు ఇవ్వటానికి అవినీతి నిరోధక చట్టం, ఇతర చట్టాలను సవరించాలి. 1988లో ఓ విచారణ సందర్భంగా స్మగ్లర్లు, విదేశీమారకద్రవ్యం ఎగవేతదారుల చట్టం, 1976ను పూర్తిగా సమర్థిస్తూ, అవినీతి కేసులలో కూడా అలా ఆస్తులు జప్తుచేసే చట్టపరమైన నిబంధనలు ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. (అక్రమార్జన చేసినందుకు ఇటీవల అమెరికాలో ఇల్లినాయిస్ గవర్నర్, ఒక ఎన్నారై వైద్యుల జంట తమ ఆస్తులు మొత్తం కోల్పోయిన వైనాన్ని ఇక్కడ కమిటీ సభ్యులకు ఉదాహరణగా వివరించాం).

● లోక్‌పాల్, లోకాయుక్తలు అవి విచారణ జరుపుతున్న కేసుల విషయంలోనే కాకుండా, అవినీతి నిరోధానికి సంబంధించిన అన్ని కేసులకూ సంబంధించిన విషయాలలో మొత్తం ప్రాసిక్యూటర్లను నియమించి, వారిని పర్యవేక్షించే అధికారం ఉండాలి.

● కొన్ని మినహాయింపులు, ముందు జాగ్రత్తలతో ప్రధానమంత్రిని కూడా లోక్‌పాల్ పరిధిలోకి తీసుకురావచ్చు. పదవిలో ఉన్న ప్రధానమంత్రిపై లోక్‌పాల్ విచారణ జరపాలంటే... లోక్‌పాల్‌లోని మూడింట రెండు వంతుల మంది సభ్యులు తమ ముందున్న సాక్ష్యాధారాలను పరిగణలోకి తీసుకుని, పార్లమెంటరీ కమిటీకి అందచేసి, ఆ కమిటీ అనుమతిస్తే ప్రధానమంత్రి ప్రవర్తనపై విచారణ చేపట్టవచ్చు. పార్లమెంటరీ కమిటీలో ఉప రాష్ట్రపతి, స్పీకర్, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు/ నాయకురాలు

ఉంటారు. అదే సందర్భంలో, భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రత, దేశ రక్షణ, ఇతర దేశాలతో స్నేహసంబంధాలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై వచ్చే ఎటువంటి ఆరోపణలపై విచారణను లోక్‌పాల్ లేదా పార్లమెంటరీ కమిటీ అనుమతించకుండా ప్రధాని పదవికి రెండవ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయాలి.

● మంత్రులు, ఎంపీలు, ఒక హోదా దాటిన అధికారులందరూ, గ్రూప్ 'ఎ' అధికారులందరూ, రాష్ట్రాల ముఖ్యమంత్రులందరూ, ఒక పరిధి దాటిన స్వచ్ఛంద సంస్థలు లోక్‌పాల్ పరిధిలోకి వస్తారు. ముఖ్యమంత్రులందరూ లోక్‌పాల్ పరిధిలోకి రావాలి. (ఒకవేళ లోక్‌పాల్ పరిధిలోకి చట్టం ముఖ్యమంత్రులను చేర్చకపోతే, వాళ్లు లోకాయుక్త పరిధిలోకి రావాలి)

● దిగువస్థాయి అధికారులు సి.వి.సి (కేంద్ర విజిలెన్స్ కమిషన్) పరిధిలోకి వస్తారని, ఎక్స్-అఫీషియో సభ్యులుగా సి.వి.సి లోక్‌పాల్ పరిధిలో ఉంటూ అయితే సి.వి.సి చట్టం కిందే ప్రత్యేక ప్రతిపత్తితో పనిచేస్తుంది.

● ఉన్నతస్థాయి జ్యుడీషియరీకి చెందిన న్యాయమూర్తులు లోక్‌పాల్ పరిధిలోకి రాకూడదని సవరణ పేర్కొంది. న్యాయమూర్తుల నియామకాలకు, తొలగింపునకు ఉప రాష్ట్రపతి నేతృత్వంలో ప్రధానమంత్రి, స్పీకర్, న్యాయశాఖామంత్రి, పార్లమెంటు ఉభయసభల ప్రతిపక్ష నాయకులు, ప్రధాన న్యాయమూర్తి (ముఖ్యమంత్రి, హైకోర్టు న్యాయమూర్తుల విషయంలో సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి)లతో ఒక జాతీయ జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. జ్యుడీషియల్ స్టాండర్స్ మరియు అకౌంటబిలిటీ బిల్లును చట్టంగా చేయాలి. ఈ రెండూ ఉన్నతస్థాయి న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలను పరిష్కరించగలుగుతాయి. హైకోర్టు నియంత్రణలో ఉన్న దిగువస్థాయి న్యాయవ్యవస్థ అలాగే కొనసాగుతుంది.

● బిల్లులో ప్రతిపాదించిన 9మంది లోక్‌పాల్ ఎంపిక కమిటీ ఒక చిన్న సవరణతో సహేతుకంగానే ఉంది: న్యాయ కోవిదుని మరియు విశిష్ట పౌరుని కేంద్రప్రభుత్వం కాకుండా మిగిలిన ఏడుగురు సభ్యులూ నామినేట్ చేయాలి.

● సి.వి.సి (ఛైర్మన్ + 2 సభ్యులు) లోక్‌పాల్ ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉండాలి. లోక్‌పాల్ తరహాలోనే వారి నియామకాలు జరగాలి. గ్రూప్ 'ఎ', ఉన్నత స్థాయి అధికారులపై వచ్చిన ఆరోపణలను లోక్‌పాల్‌కు బదిలీ చేయటం మినహా చట్టంలోని అన్ని బాధ్యతల్నీ సి.వి.సి నిర్వర్తిస్తుంది.

- ఒక్కసారి సి.వి.సిని లోక్‌పాల్‌తో సంధానం చేసి లోక్‌పాల్ చట్టం, సి.వి.సి చట్టం కిందే ఆ వ్యవస్థ పనిచేస్తుంటే, సి.బి.ఐపై పర్యవేక్షణతోపాటు మార్గదర్శకత్వాన్ని కూడా ఆ వ్యవస్థ అందించగలుగుతుంది. సి.బి.ఐని రెండు విభాగాలుగా చేయాలి. సాధారణ నేరపరిశోధనా విభాగం, రెండోది అవినీతి నిరోధక విభాగం. అవినీతి నిరోధక సి.బి.ఐ కేవలం సి.వి.సికి జవాబుదారీగా ఉంటుంది తప్ప ప్రభుత్వానికి కాదు.

- రాష్ట్రాల ఏసీబీలను (అవినీతి నిరోధక సంస్థలను) లోకాయుక్తల పర్యవేక్షణ, మార్గదర్శకత్వంలోకి తేవాలి. రాష్ట్రాల్లో విజిలెన్స్ యంత్రాంగాన్ని లోకాయుక్త పర్యవేక్షిస్తుంది.

- రెండవ పరిపాలనా సంస్కరణల సంఘం సిఫార్సు చేసినట్టుగా... ఫిర్యాదుల పరిష్కార అథారిటీని (గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ)ని జాతీయస్థాయిలో, ప్రతి రాష్ట్రంలో కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి.

- లోక్‌పాల్/ లోకాయుక్త విచారణ ఆధారంగా అధికారులను పదవి నుంచి వైదొలగమనే, తొలగించే, హోదాను తగ్గించే ఏర్పాటు లోక్‌పాల్ బిల్లులో ఉండాలి. ఒక ప్రజాసేవకుని ప్రవర్తన తీవ్ర శిక్షార్హమైనదని ఒక్కసారి లోక్‌పాల్/ లోకాయుక్త నిర్ణయించాక అనంతర విచారణను తప్పనిసరి చేయకూడదు.

- లోక్‌పాల్, లోకాయుక్త బిల్లులోని కొన్ని లొసుగుల్ని, అసంబద్ధ జోడింపుల్ని కూడా స్పష్టంగా కమిటీ దృష్టికి తెచ్చాం. ఉదాహరణకు, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలలోని ప్రజావనరుల కేటాయింపు, గుత్తాధిపత్యం అంశాలను లోక్‌పాల్ పరిధిలోకి తేవటంలో విఫలమయ్యారని వివరించాం. అలాగే కాలనీ సంక్షేమ సంఘాల నుంచి మీడియా సంస్థలు, రాజకీయ పార్టీల వరకూ లక్షలాదిసంస్థలను ఈ బిల్లు లోక్‌పాల్ పరిధిలోకి తీసుకొస్తుందని, ఈ నిబంధన వల్ల లోక్‌పాల్ బాధ్యతల నిర్వహణ ఆచరణలో అసాధ్యంగా మారుతుందని, అసంబద్ధమైన విషయాలలో జోక్యం చేసుకుని పౌరుల స్వేచ్ఛకు భంగం కలిగించటం రాజ్యాంగ విరుద్ధం కూడా అని తెలిపింది. ఇలాంటి లొసుగుల్ని, ఆచరణసాధ్యంకాని జోడింపుల్ని సెలెక్ట్ కమిటీ సరిదిద్దాలని కోరాం.

**సిటిజన్స్ ఛార్టర్ల ఏర్పాటుపైనా లోక్‌సత్తా కృషికి గుర్తింపు, కమిటీ ముందు ప్రతిపాదనలు...**

లోక్‌పాల్‌పై లోక్‌సత్తా ఇచ్చిన పలు సమగ్ర సూచనల్ని పరిగణలోకి తీసుకున్న పార్లమెంటరీ కమిటీ, ఆ నేపథ్యంలోనే సిటిజన్స్ ఛార్టర్ల చట్టానికి సంబంధించి కూడా సూచనల్ని కోరుతూ లోక్‌సత్తాను ఆహ్వానించింది. 2000 సంవత్సరంలోనే లోక్‌సత్తా సిటిజన్స్ ఛార్టర్లను రూపొందించి వాటి అమలు కోసం ఉద్యమించింది. 2001 నుంచి తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోని మునిసిపాలిటీలలో సిటిజన్స్ ఛార్టర్లు అమలులోకి వచ్చేలా చేసిన విషయం తెలిసిందే.

నిర్ణీత కాలవ్యవధిలో పౌరులకు వస్తు,సేవల్ని ఒక హక్కుగా అందించటం, పౌరుల ఫిర్యాదుల్ని పరిష్కరించటం కోసం ఉద్దేశించిన సిటిజన్స్ ఛార్టర్ల బిల్లు, 2011పై 2012, ఫిబ్రవరి 8న న్యూఢిల్లీలో కేంద్ర న్యాయ, ప్రజాఫిర్యాదుల విభాగ పార్లమెంటరీ సంఘం ముందు హాజరై లోక్‌సత్తా వాదనల్ని వినిపించాం.

**2 జీ లైసెన్సుల రద్దుకు సుప్రీంకోర్టులో పోరాటం, కార్పొరేట్ చట్టాలలో మార్పు కోసం కృషి...**

దేశాన్ని కుదిపేసిన 2జీ స్పెక్ట్రంలో లైసెన్సుల అతిభారీ కుంభకోణంపై లోక్‌సత్తా పదులవేల పోస్టుకార్డులతో, ప్రధానికి రూ.1 మనియార్డర్లతో ప్రచారయుద్ధం చేశాక డిసెంబర్, 2010లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జె.ఎం లింగ్డో, ఎన్.గోపాలస్వామి, టి.ఎస్ కృష్ణమూర్తి, పి.శంకర్, జూలియో రెబీరో, అడ్మిరల్ తహిల్యాని తదితర సుప్రసిద్ధ భారతీయులు కూడా పిటిషన్‌లో భాగస్వాములుగా ఉన్నారు. 2జీ అక్రమాల వల్ల ఖజానాకు నష్టం ఎన్ని వేలకోట్లు అనే అంశాన్ని పక్కనపెడితే, ఆ కేటాయింపులో అక్రమాలు జరిగాయనటంలో సందేహం లేదని లోక్‌సత్తా తిరుగులేని సాక్ష్యాలను చూపింది. లాలూచీపడి ప్రకృతి వనరుల్ని కేటాయింపు చేసిన ఈ అవినీతిపై లోక్‌సత్తా వాదనల్ని అంగీకరించిన సుప్రీంకోర్టు 122 లైసెసుల్ని రద్దుచేసింది. (2జీ కుంభకోణం జరగటానికి ముందు, అంతర్జాతీయ పోటీ వేలం ద్వారా కేటాయింపుల్ని చేసి వుంటే ఖచ్చితంగా పదుల వేలకోట్లు ఖజానాకు లభించేవని 3జీ వేలం, ఇతర ప్రామాణిక గణాంకాలను పరిగణలోకి తీసుకుంటే అర్థమవుతుంది).

ఈ సందర్భంగా కార్పొరేట్ అవినీతి కట్టడికి లోక్‌సత్తా కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనల్ని దేశప్రజల ముందుకు, రాజకీయ పక్షాల ముందుకు, చట్టసభల సభ్యుల ముందుకు తెచ్చింది. అవి...

- భవిష్యత్తులో 2జీ వంటి స్కాంలు, బొగ్గు తదితర కేటాయింపులలో అక్రమాలు పునరావృతం కాకుండా, అవినీతి/అక్రమం/లాలూచీ/ప్రభుత్వానికి నష్టం జరిగినట్టు సాక్ష్యం ఉన్నప్పుడు ప్రకృతి వనరుల కేటాయింపులో కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం ఇచ్చే లైసెన్సు లేదా లీజు రద్దయ్యేట్టు ప్రభుత్వం చట్టం చేయాలి. అవినీతి సొమ్ముతో సంపాదించిన లైసెన్సులు/లీజులు రద్దవుతాయనే భయం ఉంటే కార్పొరేట్లు అవినీతికి పాల్పడటం బాగా తగ్గుతుంది.

- విలువైన, పరిమితమైన ప్రకృతి వనరులను అంతర్జాతీయ పోటీ వేలం ద్వారానే ప్రభుత్వం కేటాయించాలి. ఆ వనరుల నుంచి కార్పొరేట్లు గుత్తాధిపత్యం ద్వారా లేక ప్రపంచ ఆర్థిక వాతావరణం వల్ల అనూహ్య లాభాలను (విండ్‌ఫాల్ ప్రాఫిట్స్) ఆర్జించినప్పుడు ఆ అనూహ్య లాభాలపై కఠిన పన్ను విధించేలా రెండో చట్టాన్ని తేవాలి. కొన్ని బ్రిటీషు కంపెనీలు ఉత్తర సముద్రంలో చమురును కనుగొని, చమురు ధరలు ఆకాశాన్నంటినప్పుడు బ్రిటీషు ప్రభుత్వం 1977లో అటువంటి చట్టాన్ని అమలు చేసింది. 2-జీ స్పెక్ట్రం లైసెన్సుల్ని అడ్డదారుల్లో తెచ్చుకుని, వాటిని కొన్ని వారాల్లోనే వేలకోట్ల అదనపు ధరకు అమ్ముకున్న కంపెనీలన్నీ విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ పన్ను పరిధిలోకి వస్తాయి.

- అదేసమయంలో, అమెరికాలోని తప్పుడు క్లెయిమ్‌ల చట్టం తరహాలో మరో చట్టాన్ని కూడా మనదేశంలో తేవాల్సిన సమయం ఆసన్నమైంది. స్వతంత్ర ప్రతిపత్తి, స్థామర్థ్యంగల అథారిటీ నిర్ణయించిన విధానంలో అక్రమాలు/వక్రీకరణ/ఉల్లంఘన చేయటం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లితే, నష్టానికి మూడు నుంచి ఐదురెట్లు సమానంగా సివిల్ పెనాల్టీని దోషి చెల్లించాల్సుంటుందన్నారు. అమెరికా ప్రభుత్వం ఆ చట్టం ద్వారా 10బిలియన్ డాలర్లను వసూలు చేసింది.

చట్టాలలో ఈ మార్పులతోపాటు అవినీతికి మూలమైన రాజకీయ, ఎన్నికల వ్యవస్థల ప్రక్షాళన కూడా ఎంతో అవసరం. 2009 ఎన్నికలలో మన రాష్ట్రంలో ఒక్కో ప్రధాన సాంప్రదాయ పార్టీ చాలా అసెంబ్లీ స్థానాలలో రూ. 5కోట్లు, పార్లమెంటు

స్థానాలలో రూ. 20కోట్లు ఖర్చు చేసినట్టు స్వయంగా అభ్యర్థులే ఒప్పుకుంటున్నారు. అంతకుఅంత అవినీతి ద్వారా దండుకునేందుకే వారు అలా ఖర్చుచేస్తున్నారు. ఇంత భారీ వ్యయం వల్ల నిజాయతీపరులు, సమర్థులు రాజకీయాలలోకి రాలేకపోతున్నారు. ఫలితంగా అవినీతి నిరాఘాటంగా కొనసాగుతోంది. ఈ పరిస్థితిని మార్చాలంటే ఒక్క ఓటుతో నెగ్గినా నెగ్గినట్టే అనే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో గెలుపును శాసించే కాసిని ఓట్ల కోసమే విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతారు. ఎన్నికలలో ధనప్రవాహాన్ని కట్టడిచేయాలంటే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను మార్చాలి. నిజాయతీ, సేవాసామర్థ్యం గలవారు రాజకీయాలలోకి వచ్చేలా పార్టీలను ప్రజాస్వామీకరించి ప్రజల ఆస్తిగా మార్చాలి, పార్టీల విరాళాల సేకరణలో నల్లధనం లేకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరిగేలా చేయాలి, ఎన్నికల వ్యవస్థను మార్చాలి. ఆ లక్ష్యాల కోసం కూడా లోక్‌సత్తా కృషి చేస్తోంది. అలాగే స్థానికంగా అవినీతిని ఎదుర్కోగలిగే అవకాశం ఉంటేనే, పర్యవేక్షించే అవకాశం ఉంటేనే ప్రజలు అవినీతిని కట్టడి చేయగలుగుతారు. ప్రజాస్వామ్యం విస్తరించినకొద్దీ అవినీతి తగ్గుతుంది. అందుకే అవినీతిపరులైన నేతలు, అధికారులు ప్రజాస్వామ్య వికాసాన్ని అడ్డుకుంటుంటారు. నియంతృత్వం సైనికపాలన రూపంలో వున్నా, కమ్యూనిజం రూపంలో వున్నా అక్కడ అవినీతి విశృంఖలమవుతూ మేటలు వేస్తుందని పొరుగున ఉన్న చైనా తదితర దేశాల అనుభవాలు మనకు తాజా ఉదాహరణలు. ఈ నేపథ్యంలోనే, అవినీతిపై పోరులో కీలకాంశంగా అధికార వికేంద్రీకరణ కోసం రాజీలేకుండా పోరాడుతున్నాం.

లోక్‌సత్తా సుదీర్ఘ బహుముఖ కృషి, అన్నా బృందం చేసిన మేలుకొలుపు వల్ల ప్రజలలో అవినీతిపై చైతన్యం మరింత పెరిగిందిగానీ, ఇంకా ప్రజలలో గందరగోళం, నిరాశ తొలగిపోలేదు. ఎన్నికలలో తమ ఓటు ద్వారా, తమ భావప్రకటనా స్వేచ్ఛ ద్వారా అవినీతిపరుల్ని ఓడించి మంచివారిని గెలిపించగలమని, బలమైన అవినీతి నిరోధక వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకోగలమని ఇంకా వారు తమనుతాము విశ్వసించటం లేదు.

కానీ, అవినీతి పోతుందా అని నిరాశ అక్కర్లేదు. అది మానవస్వభావానికే విరుద్ధం కాబట్టి ఖచ్చితంగా పోతుంది. బ్రిటన్, అమెరికా వంటి దేశాలు కూడా 19వ శతాబ్దంలో మనలాగే అవినీతిలో కూరుకుపోయాయి. అక్కడ ఇలాంటి బహుముఖ పోరుతో తెచ్చిన సంస్కరణలతో అవినీతి అదుపులోకి వచ్చింది. రాష్ట్ర

గవర్నర్ అయినా అవినీతికి పాల్పడితే అరెస్టుచేసి ఆస్తుల్ని జప్తుచేసే పరిస్థితి అక్కడుంది. అయితే ఆ దేశాలకంటే భారత్‌లో వైవిధ్యం, సంక్లిష్టతలుఎక్కువ కాబట్టి ఇంకొన్ని అదనపు కృషి, ఏర్పాట్లు అవసరమవుతాయి. కానీ అంతిమంగా ప్రజలు గందరగోళం, నిరాశను వీడి తమ బాధ్యతను సక్రమంగా నెరవేరస్తుంటే, ఇవేవీ అసాధ్యాలు కావు. అమెరికాలో బానిసత్వం పోతుందని ఒకప్పుడు ఎవరూ కనీసం ఊహించేవారు కూడా కారు. కానీ ఇప్పుడు ఆ పేరు ఎత్తడానికి కూడా ఎవరూ ఇష్టపడరు. అలాగే మనదేశంలో మన తాతతండ్రుల కాలం నాడు లంచాలు ఇచ్చిన ఫోన్ కనెక్షన్ కోసమో, సిమెంటు పర్మిట్ల కోసమో ఇప్పుడు లంచాలు ఇవ్వాల్సిన పన్లేదు. సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకత పెరుగుతుండటం, ప్రజలలో చైతన్యం పెరుగుతుండటంతో కొంత మార్పు వస్తోంది. కానీ అదే ఊపులో పైన పేర్కొన్న పరిష్కారాల దిశగా కూడా కృషి చేస్తే సమూలంగా అవినీతిని కట్టడి చేయవచ్చు. సమాచార హక్కు చట్టాన్ని, న్యాయం వేగంగా అందించటం కోసం స్థానికంగా న్యాయస్థానాలను అందుబాటులో ఉంచే గ్రామన్యాయాలయాల చట్టాన్ని, రాజకీయ పార్టీల నిధుల సేకరణ, ఎన్నికలలో అభ్యర్థులు తమ వివరాలు సమర్పించాల్సిన చట్టాల్ని మీ అందరి సహకారంతో లోక్‌సత్తా సాధించి చూపింది గదా? ప్రతివ్యక్తీ తన జీవితంలో తానే హీరోనని భావించి, పక్కవారితో పోల్చుకోకుండా సరైన నిర్ణయాలతో వ్యవహరించటం మొదలుపెడితే ఖచ్చితంగా అవినీతి అంతమవుతుంది. అవినీతిపై మీ నిర్మాణాత్మక పోరాటానికి ఈ భవిష్యత్ భారతం వ్యాసాలు దిక్సూచిగా, అస్త్రసంపత్తిగా ఉపయోగపడతాయి.

**డా॥ జయప్రకాష్ నారాయణ్,**

జాతీయ అధ్యక్షులు, లోక్‌సత్తా పార్టీ

నవంబర్, 2012 – హైదరాబాద్.

* * *

# సామాన్యుడికి అందని సంస్కరణల ఫలాలు

మార్చి 13, 2000

ఢిల్లీ నగరంలో దాదాపు కోటికి పైగా జనాభా ఉంది. దేశంలో అత్యంత సంపన్నమయిన నగరం అది. మరి దేశం మొత్తంలో నేర రాజకీయాలకు అవినీతికి, పైరవీలకు పర్మిటు – లైసెన్సు రాజ్యానికి రాజధాని కదా! దగ్గరలో ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ రాష్ట్రాలలో గ్రామీణ ప్రాంతాలలో విపరీతమయిన బీదరికం తాండవిస్తోంది. గ్రామాలలో కనీస సదుపాయాలు కాని, ఉపాధి అవకాశాలు కాని లేవు. అక్షరజ్ఞానం ఎలాగూ మన దేశంలో సగం మందికి అందనే అందదు. పల్లెటూళ్ళలో చేయటానికి ఏ పనీ లేక పట్టణాలకు లక్షల మంది వలసపోతున్నారు. ఆ రాష్ట్రాలలో చిన్న, ఒక మోస్తరు పట్టణాలు కూడా క్రమక్రమంగా అంతరించిపోతున్నాయి. సౌకర్యాలు లేక, పెట్టుబడులు రాక, ఉపాధి అవకాశాలు పెరగక, ఆర్థికంగా అలా ఎన్నో పట్టణాలు కూనారిల్లుతున్నాయి. అందుకని అత్యధిక సంఖ్యాకులు పొట్టచేత పట్టుకుని ఢిల్లీ నగరానికి చేరుకుంటున్నారు. ఆ నగరంలో దాదాపు నాలుగు లక్షల మంది రిక్షా కార్మికులున్నారు. ప్రతి రిక్షాకు లైసెన్సు కావాలి. ఒక్కో ప్రాంతానికి కొన్ని రిక్షాలను కేటాయించి నమోదు చేస్తారు. రిక్షా ఆ ప్రాంతం దాటి వేరే పేటలో ప్రవేశించటం నిషిద్ధం! రిక్షా లైసెన్సు ఫీజును నగర పాలక సంస్థ వసూలు చేస్తుంది. ఆ శాఖకు అధిపతి ఓ పశువుల డాక్టరు. అతనాపని ఎందుకు చేస్తున్నాడని అడగకండి! మన దేశంలో ఇలాంటి విచిత్రాలు ఎన్నో! ఆ రిక్షాలకు లైసెన్సు ఫీజు సంవత్సరానికి కేవలం 27 రూపాయలే. కాని వాస్తవానికి దాని వెనక చాలా పెద్ద కథ ఉంది. ప్రతి రిక్షాకు నెలకు తొంభై నుంచి వంద రూపాయలు 'మామూలు' ఇవ్వాలి. అంటే నాలుగు లక్షల రిక్షాల మీద నెలకు నాలుగు కోట్ల రూపాయలు లంచం పుచ్చుకుంటున్నారు. సాలుకు కేవలం రిక్షాల వల్ల ఢిల్లీ నగరంలో వసూళ్ళు చేసే లంచాలు దాదాపు 50 కోట్ల రూపాయలు!

## అడుగడుగునా బకాసురులు

ఇంత మంది దగ్గర డబ్బు వసూలు చేయటం చాలా కష్టం కాబట్టి లైసెన్సులను

కొంత మంది కాంట్రాక్టర్లకు టోకున ఇస్తారు. రిక్షా తొక్కే వారికే లైసెన్స్‌ను మంజూరు చేయాలని నిబంధన ఉంది. కాబట్టి కాంట్రాక్టర్లకు వేర్వేరు బినామీ పేర్లతో లైసెన్సులు ఇస్తారు. వాళ్ళ వాళ్ళ పరపతిని బట్టి, శక్తిని బట్టి, డబ్బుని బట్టి ఒక్కో కాంట్రాక్టరు కొన్ని వందల నుంచి కొన్ని వేల వరకు రిక్షా లైసెన్సులు తీసుకుంటాడు. రిక్షాల సంఖ్యను బట్టి నెల నెలా మామూళ్ళు సమర్పించుకుంటాడు. ఇలా పకడ్బందీగా లంచాలు వసూలవుతాయి. ఒక్కో రిక్షా ఖరీదు దాదాపు మూడు వేల రూపాయలు. ఆ రిక్షాని కాంట్రక్టరు బడుగు జీవులకు రోజూ అద్దెకిస్తాడు. రోజుకు అద్దె ఇరవై రూపాయలు. అంటే మూడు వేల రూపాయల పెట్టుబడి, సాలుకు వచ్చే ఆదాయం ఏడువేల రెండు వందల రూపాయలు! రిక్షా కార్మికులు స్వయంగా లైసెన్సులు పొందటం, అసాధ్యం. పోనీ స్వంత రిక్షా కొనుక్కుందామంటే ఆ మాత్రం డబ్బు కూడా లేని వాళ్ళు, అప్పులు పట్టని వాళ్ళు కోకొల్లలు. పోనీ అప్పోసప్పో చేసి రిక్షా కొన్నా లైసెన్సు దొరకదు. ఉన్నా, నగరాలలో ఉండటానికి సరైన వసతి కూడా లేదు. కాబట్టి రిక్షాను ఎక్కడ పెట్టాలో తెలియదు. ఎక్కువో తక్కువో లారీలకు కార్లకు పార్కింగు స్థలాలున్నాయి. కాని రిక్షాలకు లేవాయె! అందుకుని రోజువారీగా రిక్షాలను అద్దెకు తీసుకోవటమే సుఖం. ఇక అడపాతడపా పోలీసులు, మునిసిపల్ అధికారులు రిక్షా వాళ్ళ మీద పడతారు. వాళ్ళు ఎప్పుడు కోరితే అప్పుడు డబ్బులు సమర్పించుకోవాలిసిందే. లంచం తినటంలో కూడా ఓ పద్ధతి, న్యాయం లేవు. ఎప్పుడుబడితే అప్పుడు వీపుల మీద లాఠీ దెబ్బలు పడాల్సిందే. ఇష్టం వచ్చినట్లు రిక్షా చక్రాల గాలి తీసేయవలసిందే. ఆ మాత్రం భయం, భక్తి లేకపోతే వాళ్ళు మాట వింటారా మరి? లంచాలు, బాడుగలు క్రమం తప్పకుండా పైవాళ్ళకు అందాలంటే ఆ మాత్రం క్రమశిక్షణ కావాలి గదా! రోడ్ల మీద తిరగాలన్నా, పోలీసుల కంట పడాలన్నా, కాయకష్టం చేసుకుని బ్రతకాలన్నా, నేరం చేస్తున్నట్లుగా భయపడుతూ, క్షణం క్షణం ఒదిగి ఒదిగి బ్రతుకుతూ ఏదో ఒక విధంగా జీవనాన్ని వెళ్ళదీస్తున్నారు. ఆ లక్షలాది కార్మికులు. ఇదీ స్వతంత్ర భారతం సామాన్యుడికిచ్చిన సౌఖ్యం. ఈ కథ రిక్షా కార్మికులకే పరిమితం కాదు. ఢిల్లీలోనే దాదాపు ఐదు లక్షల మంది తోపుడు బళ్ళ మీద పళ్ళు, కూరగాయల్ని, తినుబండారాలని, రకరకాల వస్తువులని అమ్ముకునేవాళ్ళున్నారు. వాళ్ళగతీ అంతే.

## బడుగు జీవులకు సంకెళ్ళు

మరొకళ్ళకు అన్యాయం చేయకుండా కష్టపడుతూ, ఇతరులకు కావలసిన

వస్తువులను, సేవలను అందించటమే ఆర్థిక వ్యవస్థ ఉద్దేశ్యం. ప్రభుత్వం నుంచి, చుట్టూ ఉన్న వాళ్ళ నుంచి ప్రత్యేకంగా ఏమీ ఆశించకుండా, పరాన్నభుక్కులలాగా చేయిచాచి అర్థించకుండా, కష్టపడి బ్రతుకుదామని కోట్లమంది బీదలు నిరంతరం శ్రమిస్తున్నారు. తమ సేవలకు మామూలుగా వచ్చే బాడుగ కంటే ఎక్కువ ఇస్తే తీసుకోవటానికి సైతం బిడియపడే నిజాయితీపరులు వారిలో అత్యధికులు. దేవరకొండ బాల గంగాధర్ తిలక్ చెప్పినట్లు 'కడుపు నిండా తిండి గుండెనిండుగా ఆహార్యం, బ్రతుకు పొడుగునా కాస్తంత స్వతంత్రం ఉంటేనే చాలనుకునే' అల్పసంతోషులు వారంతా. అలా రిక్షాలు తొక్కేవాళ్ళు, కూరగాయలను అమ్మేవాళ్ళు, ఇళ్ళలో పనిచేసేవాళ్ళు లేకపోతే చదువు, ఉద్యోగం, డబ్బు, పరపతి ఉన్నాయని అహంకరించే వారికి ఒక్క రోజు కూడా గడవదు. నిజాయతీగా కష్టపడే కోట్లాది మందికి మన వ్యవస్థ అందించేది అనునిత్యం చేదు అనుభవాలు, అడుగడుగునా పరాభవాలే, పూట పూటకీ లంచాలే, అడపా దడపా లాఠీ దెబ్బలే. 1991లో ఆర్థిక సంస్కరణల్ని ప్రవేశపెట్టినప్పుడు ఈ లైసెన్సు - పర్మిటు- కోటారాజ్యం వల్ల దేశం ఎంత నలిగిపోతోందో బోధపడిన ఆలోచనపరులందరూ మార్పులను సంతోషంగా ఆహ్వానించారు. కొంతమేరకు డబ్బు, నైపుణ్యం, వ్యాపారం ఉన్న వాళ్ళకు ఊపిరి పీల్చుకునే అవకాశం దొరికింది. ప్రభుత్వ యంత్రాంగం నుంచి కొంతవరకు విముక్తి లభించింది. సంపన్నుల ఆశలు నెరవేరటానికి మార్గం దొరకు తుంది. మరి కాయకష్టం చేసుకు బతికే సామాన్యుల సంగతేమిటి? అవ్యవస్థీకృత రంగంలో, పెట్టుబడులు లేకుండా స్వయం ఉపాధితో బతుకుతున్న వాళ్ళ సంగతేమిటి? చిన్న పెట్టుబడితో వ్యాపారామో, ఏదో ఒక చిన్న పరిశ్రమో పెట్టుకున్న వాళ్ళ విముక్తి ఎప్పుడు? ఉన్నదంతా పెట్టి, అప్పులు తెచ్చి, ఎంతో రిస్కు తీసుకుని మార్కెట్లో పోటీకి సిద్ధపడి నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్న చిన్న పరిశ్రమల మాటేమిటి? ఎంతమందిని ఎన్ని లైసెన్సులు, పర్మిట్లు, ఇప్పటికి కూడా పీడిస్తున్నయో అధ్యయనం చేస్తే గుండె అవిసిపోతుంది. ఓ పరిశ్రమ చుట్టూ ఎంతమంది ఉద్యోగులు, అధికారులు ఎన్నిసార్లు 'అమ్యామ్యా'ల కోసం తిరుగుతున్నారో తెలిస్తే రోత పుడుతుంది. ఎంత మంది ఈ జాప్యాల మూలంగా, వేధింపు మూలంగా దివాలాతీశారో తలుచుకుంటే ఆగ్రహం వస్తుంది. ఎందరు గడుసు వాళ్ళు ఈ పరిస్థితుల్ని, చూసి, ఈ సమాజంలో బతకాలంటే చేతిలో కర్ర, కత్తి, పిస్తోలు పట్టుకుని దోపిడీ చేయటమే మార్గమని నేరగాళ్ళుగా మిగులుతున్నారో తెలిస్తే ఒళ్ళు జలదరిస్తుంది. ఎందరు అమాయకులు, ఈ దోపిడీని

తట్టుకోలేక, కనీసం హింసామార్గం ద్వారానైనా పరిస్థితుల్ని మారుద్దామని బలిపశువులవుతున్నారో తలుచుకుంటే గుండె ద్రవించిపోతుంది. ఓ రైతు పత్తి పండిస్తే అతనికి జిన్నింగు చేసే స్వతంత్రం లేదు. అందుకో లైసెన్సు కావాలి. ఆ లైసెన్సుకు అమ్యామ్యాలు కావాలి. ఓ చెరకు ఫ్యాక్టరీ ఉన్న ప్రాంతంలో తన చెరకురసంతో బెల్లం వండుకుంటే ఆ రైతు నేరస్తుడు! పత్తిని అమ్మాలంటే, చేనేత కార్మికులకు తక్కువ ఖరీదుకు నూలు దొరకాలనే వంకతో పత్తి ధరని అదుపు చేయాలి! పోనీ చేనేత కార్మికులకు మిగిలింది పస్తులు, ఆకలి చావులే! ధాన్యం వండిస్తే లెవీ పేరుతో ఎవరికి అమ్మాలో, ఎంతకి అమ్మాలో నిర్ణయించేది ప్రభుత్వ యంత్రాంగం. తాను పండించిన పంట దాచుకోటానికి గాని రవాణా చేయటానికి గాని, అమ్మటానికి గాని పర్మిట్లు కావాలి. లైసెన్సులు కావాలి. అదేమంటే బీదలకు చవగ్గా నిత్యావసరాలు అందాలి కాబట్టి ఈ నిబంధనలు తప్పవని సమాధానం వాస్తవానికి బాగుపడేది మధ్య దళారీలు, లంచాలిచ్చి లైసెన్సులు తెచ్చుకున్న వాళ్ళు, ప్రజల మీదపడి దోచుకుంటున్న అధికారులు, నాయకులు ! దేశం లోపల ధరలు అదుపులో ఉండాలి కాబట్టి దిగుమతుల్ని ఇతోధికంగా ప్రోత్సహించాలి. కాని దేశం లోపల ధరలు తక్కువగా ఉండి ఇతర దేశాలలో గిరాకీ ఉంటే ధాన్యాలను, కాయగూరల్ని ఎగుమతి చేయటానికి అన్నీ అడ్డంకులే.

## బీదల కళ్ళలో కాంతి ఎక్కడ

మరి ఆర్థిక సంస్కరణలు ఎవరి కోసం తెచ్చినట్లు. కోట్లాది సామాన్యులని అణిచి వేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం బారి నుంచి వారికి విముక్తి గలిగించకుండా ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా ఏం ప్రయోజనం? బడుగు జీవుల బతుకుతెరువుకి ఆటంకంగా ఉన్న చట్టాలని, నిబంధనలని, సంకెళ్ళని తొలగించకుండా ఎవరిని ఉద్ధరిద్దామని? ఆర్థిక సంస్కరణల మీద జరుగుతున్న వివాదాలన్నీ కుహనా వాదనల మీద ఆధారపడ్డవే. ఇదేదో స్వదేశీ, విదేశీల మధ్య పోరాటంగా భావిస్తున్నారు. ఈ దేశ ప్రజలకి కాంపాకోలా వచ్చినా, కోకోకోలా వచ్చినా ఏం ప్రయోజనం? ఎవరినీ నొప్పించకుండా తమ జీవితాన్ని తాము గడుపుకుంటామంటే వాళ్ళను వేధించి బానిసలుగా మార్చే వ్యవస్థలో స్వేచ్ఛ ఎక్కడున్నట్లు? స్టాక్ మార్కెటల్లో షేరు వ్యవస్థలో స్వేచ్ఛ ఎక్కడున్నట్లు? స్టాక్ మార్కెట్లో, షేరు ధరలు పెరిగి మన వాళ్ళు వేల కోట్లకు పడగలెత్తితే సంతోషమే. కొందరు మంచి ఉద్యోగాలలో స్థిరపడితే ఆనందమే. చదువు,

చొరవ ఉన్నవాళ్ళు ఎదిగితే, సంపద సృష్టిస్తే సమాజానికి లాభమే. కాని సమాజం అంచున ఉండి, ఏ సౌకర్యానికీ, స్వేచ్ఛకు నోచుకోని వాళ్ళను ఇంత కర్కశంగా, పాశవికంగా అణిచి వేస్తే మన చుట్టూ సుఖసంతోషాలు ఎలా ఉంటాయి? నిజమైన ఆర్థిక సంస్కరణలు సామాన్యులకు చేరనంత కాలం చర్యల పేరిట చేసేదంతా వృథా కాలయాపన. ప్రచారమంతా బూటకం. ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరు. సామాన్యులలో ఇంకా దాగి ఉన్న నిజాయతీని, ఆత్మగౌరవాన్ని, స్వేచ్ఛా పిపాసను గుర్తించి, గౌరవించి, స్వతంత్రంగా జీవించే పరిస్థితులు కల్పించినప్పుడే సంస్కరణలు ఫలిస్తాయి. అప్పుడే ప్రజాస్వామ్యం వికసిస్తుంది. సంపద సృష్టించే వాళ్ళను నేరస్తులుగా భావించి అణిచి వేస్తున్నంత కాలం జాతికి విముక్తి లేదు. ఎవరిపట్లనో, దయతోనో, దాక్షిణ్యంతోనో మనం స్వేచ్ఛ కోసం పోరాడనక్కరలేదు. మన సుఖం కోసం, సంతోషం కోసం, సమాజంలో సౌష్ఠవం కోసం మన బిడ్డలకు రక్షణ కోసం నిజమయిన ఆర్థిక సంస్కరణల్ని వెనువెంటనే చేపట్టి బీదల కళ్ళల్లో కాంతిని నింపాలి.

* * *

# పాలనలో అతిరహస్యం అవినీతికి మూలం

**సెప్టెంబర్ 29, 1997**

అధికారం, ఎక్కడ ఉంటె అక్కడ అవినీతి, ఆశ్రిత పక్షపాతం ప్రజాపీడన, అధికార దుర్వినియోగం ఉండే అవకాశం ఉంది. ఇది చరిత్రలో అన్ని వ్యవస్థలలో కానవచ్చే సత్యం. మంచి ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార దుర్వినియోగాన్ని నిరోధించే శక్తి రాజ్యవ్యవస్థలో ఇమిడి ఉండాలి. పౌరుల నిరంతర జాగురూకతకి శోధనకి, దోష నివారణకి అవకాశం ఉండాలి. రాజ్యాధికారంలో ఉన్నవాళ్లు విర్రవీగకుండా, అప్రమత్తంగా, ప్రజలకు జవాబుదారీగా ఉండేలా ఏర్పాట్లు ఉండాలి. భారత ప్రజాస్వామ్యంలో అలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని 50 ఏళ్ళ అనుభవం రుజువు చేస్తుంది. ప్రజాస్వామ్యంలో నిజమైన అధికారం ప్రజలది అయితే పౌరులు విడిగా కాని, సమష్టిగా కాని అనుదినం పాలన నిర్ణయాలు తీసుకోలేరు కాబట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒకరి స్వేచ్ఛ మరొకరికి ప్రతిబంధకం కాకుండా కొన్ని చట్టాలను తయారు చేసుకొని, వాటి అమలుకు ప్రభుత్వాలను నెలకొల్పుకున్నారు. అంటే, తమమీద తమకున్న అధికారంలో కొంత భాగాన్ని స్వచ్ఛందంగా, అందరి ఉమ్మడి అవసరాల కోసం ప్రభుత్వానికి అప్పగించి, పౌరుల పర్యవేక్షణలో, పౌరులకు జవాబుదారీగా ఆ అధికారాన్ని వినియోగించాలని పౌరులు ఆదేశించారన్నమాట.

## ప్రజలకు సమాచారం అందితేనే ప్రజాస్వామ్యం

ప్రభుత్వాలకి తాము ఇచ్చిన అధికారం సద్వినియోగం కావాలంటె ప్రజలలో నిరంతరం విషయ పరిజ్ఞానంతో కూడిన బహిరంగ చర్చ అవసరం. అది కావాలంటే ప్రజలకు నిరంతరం పాలనా సంబంధమైన సమాచారం అందుతుండాలి. ప్రభుత్వాన్ని దాపరికం లేకుండా, ప్రజలకు అర్థమయ్యేలా నడపాలి. కాని మన దేశంలో ప్రజాస్వామ్యం పేరిట ప్రభుత్వాలను నడుపుతున్నా పాలనలో ఎక్కడ చూసినా రహస్యపు చీకట్లు ముసురుకున్నాయి. ఎక్కడ రహస్యం ఉంటుందో అక్కడ అవినీతి, అన్యాయం, అక్రమం దాగి ఉంటాయి. పరిపాలన ధర్మబద్ధంగా ఉండాలంటే, రహస్యం అనే

చీకటి తొలగిపోవాలి. ప్రజలు పాలన మీద దృష్టి సారించడానికి వీల్లేకుండా రహస్యపు చీకట్లలో పాలనని బంధిస్తే అవినీతి, అక్రమాల క్రిములు లుకలుకలాడుతాయి. ఎప్పుడో వలస పాలనలో భారతీయులకు పాలనను గూర్చి ఏమీ తెలియకూడదన్న ఉద్దేశంతో, తెల్లవాళ్లు అధికార రహస్యాల పేరుతో చట్టం చేసి, పెత్తనం చేశారు. స్వతంత్ర భారతంలో నేటికీ ఆ చట్టం శిరోధార్యమయింది. మనదేశంలో మంత్రి పదవి పొందినవాళ్లు చేసే మొదటి ప్రతిజ్ఞ పాలనా రహస్యాల్ని దాచిపెడతామని, ఏ ప్రజలు తమని ఎన్నుకున్నారో, ఎవరి పేరుతో అధికారాన్ని పొందారో, ఎవరి కోసం ఆ అధికారాన్ని వినియోగించాలో, ఎవరు పన్నులు చెల్లిస్తున్నారో, ఎవరు స్వచ్ఛందంగా అధికారాన్ని కొంతమేరకు తమ ప్రతినిధులకు అప్పుచెప్పాలో, ఆ ప్రజలకు ఏమీ తెలియకుండా అధికార రహస్యాల పేరుతో గుట్టుగా రాజ్యం చేస్తామని మన మంత్రులంతా ప్రమాణం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇంతకన్న దారుణం, అన్యాయం, అక్రమం లేదు.

ఒక ఇంట్లో నౌకరుగా ఎవరైనా ఉద్యోగంలో చేరి, ఆ ఇంటి యజమానికి ఏమీ తెలియకుండా జాగ్రత్తపడతానని అతడు ప్రతిజ్ఞ చేస్తే, చేవగల యజమాని మరుక్షణం నౌకరు ఉద్యోగం పీకేస్తాడు. ఒక ఫ్యాక్టరీలో కార్మికుడు తనేం చేస్తున్నాడో యజమానికి చెప్పనంటె మర్నాడు ఇంటికి పోవల్సి వస్తుంది. ఒక గుమస్తా తన పై అధికారికి తనేం చేస్తున్నానో చెప్పనంటె శంకరగిరిమాన్యాలు పట్టిపోతాడు. కాని, ప్రజల సేవకుడుగా, ప్రజలిచ్చిన అధికారాన్ని అనుభవించే వారు మాత్రం ఆ ప్రజలకు ఏమీ తెలియకుండా పరిపాలించాలని, చట్టాలు తయారు చేసుకున్నాం. ఏనాడో తెల్లవాళ్ళ వలస పాలనలో, భారతీయుల పట్ల చిన్న చూపుతో, ఏవగింపుతో ఏర్పడ్డ దుర్మార్గ చట్టాలు, స్వతంత్ర భారతంలో నేతలకి శిరోధార్యాలయ్యాయి. పదేళ్లక్రితం, నేను ఒక జిల్లా కలెక్టరుగా ఉండగా జరిగిన చిన్న సంఘటననొకదాన్ని వివరిస్తాను. పౌరులు ఎవ్వరైనా, ఏ సమయంలోనైనా, నిరభ్యంతరంగా కలెక్టరును కలవవచ్చు అనే సంప్రదాయాన్ని ఖచ్చితంగా పాటించేవాణ్ణి. ఒకరోజు సాయంత్రం 8 గంటల సమయంలో కలెక్టరు బంగళాకి పాతిక ముప్ఫై మంది రైతులు వచ్చారు. వెంటనే వాళ్లని కలుసుకొని విషయం ఏమిటో అని ఆరా తీశాను. ఆ రోజుల్లో ఆ జిల్లాలో పెద్దయెత్తున చిన్న నీటి వనరుల కార్యక్రమాన్ని చేపట్టాం. వందలాది ఎత్తిపోతల పథకాల్ని, వేలాది గొట్టపు బావుల్ని రైతుల ఆధ్వర్యంలో, సగం డబ్బు ప్రభుత్వం నుండి, సగం డబ్బు రైతులకు బ్యాంకుల ద్వారా అప్పులతో చేపట్టి విజయవంతంగా

అమలు చేస్తున్న రోజులవి. ప్రభుత్వ యంత్రాంగం ఎన్ని ఇబ్బందులు పెడుతుందో తెలుసు కాబట్టి పథకాల అమలు పూర్తిగా బహిరంగా, ప్రజలకు అర్థమయ్యేలా, ఏ దాపరికం లేకుండా జరుపుతున్నాం. అనవసరమైన అడ్డంకుల్ని తొలగించి, ఏ ఇబ్బంది లేకుండా కార్యక్రమాల అమలు కోసం చర్యలు తీసుకున్నాం. సాధారణంగా ఎత్తిపోతల పథకాల అమలు, నిర్వహణ కోసం రైతులు ఒక సహకార సంఘంగా ఏర్పడటం పరిపాటి. కాని సహకార చట్టంలోని లొసుగులు తెలుసు కాబట్టి మళ్ళీ రైతులకు అది ఒక బెడద అని ఆ అవసరం లేకుండా ఏర్పాట్లు చేశాం. అయినా పాత అలవాటు ప్రకారం ఆ రైతులంతా తమ ఊళ్లో అమలు చేసుకుంటున్న ఎత్తిపోతల పథకం కోసం సహకార సంఘంగా ఏర్పడదామని దరఖాస్తు పెట్టుకున్నారు. దాన్ని డివిజనల్ స్థాయిలో సహకార అధికారి నమోదు చేసుకోవాలి. కాని ఎంత కాలం గడిచినా పని జరగటం లేదు. చివరికి ఓపిక నశించి, మండువేసవిలో ఒకరోజు ఉదయమే బయలుదేరి ఆ రైతులంతా తమ ఊరికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణంలో సహకార అధికారి ఆఫీసుకు వెళ్లారు. రైతుల భాషలో చెప్పాలంటే ఆ అధికారి కాస్త మంచివాడేనట. 'కింద నుంచి కాగితం వస్తే సంతకం పెట్టడానికి సిద్ధమేనట.' కాని కింది గుమస్తా ఫైలు పంపలేద"ట. ఆ అధికారి ఉత్సవ విగ్రహంలాగా వేచి ఉన్నాడట. సరే రైతులు ఆ గుమస్తా దగ్గరకు పోయి మొర పెట్టుకున్నారు. మిట్టమధ్యాహ్నం. ఎండాకాలం. గంటలు గడిచినా గుమాస్తా మాత్రం ఆ కాగితాలు పై అధికారి చేతికివ్వడు. పాపం, రైతుల కాళ్లు కాలుతున్నాయి., కడుపులు మాడుతున్నాయి, ఎండ మాడిపోతుంటె శోష వస్తోంది. దప్పిక అవుతోంది. 6 గంటలసేపు అంతమంది పడగాపులు కాచి, ఇక ఓపిక నశించి, ఆ గుమాస్తా దగ్గరకు పోయి "అయ్యా ఎండనపడి వచ్చాం. 3 గంటలు పడిగాపులు కాచినా మీరు ఆ కాగితాలు మటుకు పై అధికారికి పంపటం లేదు. తొందరగా ఆ విషయం ఏమిటో చెప్పి మా పని కానివ్వు" అని అర్థించారు. అప్పుడు ప్రజలిచ్చిన పన్నుల నుంచి జీతభత్యాలు పొందుతున్న ఆ ఉద్యోగి వాళ్ళతో "ఏరా! ఆరు గంటలు కాకపోతే ఆరు రోజులు నిలబడండిరా! ఎవడి కోసం పడి ఉంటారు. మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకేమీ లేదు" అని చాలా అవమానకరంగా, పెడసరంగా, అహంకారంగా జవాబిచ్చాడు. పొద్దుట్నుంచి ఎండన పడి, చివరికి అంత మాట అనిపించుకున్న రైతులకి ఏడుపు వచ్చినంత పనయ్యింది. దిక్కు తోచలేదు. అప్పుడు వెంటనే తరువాత బస్సెక్కి ఎప్పుడు వచ్చినా నేను చూసి మాట్లాడుతాననే నమ్మకం ఉంది కాబట్టి, 50

కిలోమీటర్ల దూరం ఉన్న జిల్లా కేంద్రానికి సాయంత్రం 8 గంటలకల్లా చేరారు అదీ కథ. ఆ తరువాత ఏం జరిగిందో అప్రస్తుతం. అసలు పరిస్థితి అక్కడిదాకా వచ్చిందంటే, ఏం జరుగుతోందో తెలుసుకునే హక్కు తమ డబ్బుతో, కొంత ప్రభుత్వసాయంతో పనిచేసుకునే పౌరులకి లేకపోవటంతో ఎంత అన్యాయం, అవమానం జరుగుతాయో, ఎంత ఇబ్బంది, వేదన ఎదురవుతాయో ఈ సంఘటన వల్ల స్పష్టంగా బోధపడుతుంది.

పాలనలో రహస్యం, దాపరికం అవినీతిని పెంచి పోషిస్తాయి. ఇటీవల నా దృష్టికి వచ్చిన ఉదంతం పాఠకులకు తెలియజేస్తాను.ఒకాయన కొన్నేళ్లుగా తన ఇంటి పన్ను కట్టడంలో బకాయిపడ్డాడు. కార్పొరేషన్ అధికారులు ఇంటి పన్ను నోటీసులు ఇవ్వలేదు. సరే వాళ్ళు అడగలేదు గదా అని ఇంటి ఆసామి అశ్రద్ధ చేశాడు. చివరికి ఇల్లు అమ్మకానికి పెడదామని నిర్ణయించకుని, ఇల్లమ్మాలంటే పన్నులు అప్పటి వరకు పూర్తిగా కట్టకపోతే రిజిస్ట్రేషన్ చెయ్యరు కాబట్టి పన్నులు కడతామని నగర పాలక సంస్థ ఆఫీసుకు వెళ్లాడు. ఆయనేమీ అక్షర జ్ఞానం లేనివాడేమీ కాదు. ఒక ఎలక్ట్రానిక్ షాపు స్వంతంగా నడుపుకుంటున్నాడు. టి.వి., వి.సి,ఆర్. రిపేర్లతో ఆదాయం బాగానే ఉంది. భార్య ఉన్నత విద్య పొంది యూనివర్శిటీలో పనిచేస్తోంది. అలాంటి మనిషి ఇంటిపన్ను బకాయిలు ఆలస్యం అయినందుకు జరిమానాలు మొత్తం కలిపి ఎంత కట్టాలో తెలపమని కోరితే అధికారులు సమాచారం ఇవ్వరు. పట్టువదలని విక్రమార్కుడిలా కొన్ని మాసాలపాటు, కాళ్లు వాచేలా, చెప్పలరిగేలా తిరిగాడు. మొత్తం నలభైమూడు సార్లు తిరగాల్సి వచ్చిందట. అన్ని సార్లు వాళ్ల వెంటబడ్డాక కూడా, మూడు సంవత్సరాల ఇంటిపన్నుకు సమానమైన డబ్బుని లంచంగా స్వీకరించి, అప్పుడు పన్ను ఎంత కట్టాలో సమాచారం ఇచ్చారు. ఆ అధికారులు తన బాధనంతా ఏకరువు పెట్టి, పన్ను కట్టడానికి కావలసిన సమాచారం ఎంత రహస్యంగా దాచారో, చివరికి పన్ను కట్టాలంటె ఎంత లంచం ఇవ్వాల్సి వచ్చిందో చెప్తూ కళ్లనీళ్ల పర్యంతం అయ్యాడాయన. కాస్తో కూస్తో ఆస్తిపరులకు, చదువుకున్న వాళ్ళకు ఇంత బాధ కలుగుతుంటే, అక్షర జ్ఞానం లేక, రెక్కాడితే గాని డొక్కాడని సామాన్య జనానికి పాలనలో రహస్యం వల్ల అధికారులు ప్రజల్ని బానిసలుగా చూడటం వల్ల ఎంత అన్యాయం జరుగుతుందో ఊహించగలం. పాలనని రహస్యంగా ఉంచితే ఇష్టం వచ్చిన అక్రమాలు చెయ్యవచ్చు చట్టాల్ని నిబంధనల్ని ఒక్కొక్కళ్లకి ఒక్కో రకంగా వర్తింపచేయవచ్చు అధికారాన్ని చట్టబద్ధంగా కాక, స్వంత ఆస్తిలాగా వాడుకుని ప్రజల్ని హింసించవచ్చు. అందుకే పాలనలో రహస్యపు చీకట్లు చాలా దట్టంగా

ముసురుకున్నాయి. దాన్ని తొలగించటానికి పాలకులు ఆసక్తి చూపటం లేదు. చివరకు అత్యున్నత స్థాయిలో విచారణ సంఘాల నివేదికలు ప్రజలకు కనీసం పార్లమెంటకు అందటం లేదు. శ్రీమతి గాంధీ హత్యపై విచారణ జరిపిన థక్కర్ కమిషన్ నివేదిక చివరికి రాష్ట్రపతికి కూడా చూపడానికి నిరాకరించారు. చినికి చినికి గాలివానై, అది రాష్ట్రపతికి, ప్రధానికి మధ్య సంబంధాల్నే దెబ్బకొట్టింది. నేరమయ రాజకీయాలపై పరిశీలన చేసి సమర్పించిన వోహ్రా కమిటీ నివేదిక ఇంకా ప్రభుత్వం దగ్గర చాలా భద్రంగా, దేశ ప్రజలకు ఏమీ తెలియకుండా ఉంది. ఆ వోహ్రాగారు ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యదర్శిగా ఉన్నా, ఆ నివేదిక మాత్రం రహస్యంగానే ఉంది. ఎన్నో పెద్ద పెద్ద కాంట్రాక్టులలో రహస్యంగా, గుట్టుచప్పుడు కాకుండా నిర్ణయాలు జరగటం వల్ల కోట్లు చేతుల మారుతున్నాయని ఆరోపలున్నాయి.

## మేలు చేయాల్సిన పథకాలు దేవతావస్త్రాలు

సామాన్య పౌరుల విషయానికొస్తే, భూమి రికార్డులు, రేషన్‌కార్డులు, రేషన్ షాపులో సరుకులు ఏ మేరకు వస్తున్నాయి. ఎన్ని కార్డులు ఆ షాపుకి చెంది ఉన్నాయి – ఇవేమీ ప్రజలకు తెలియవు. తమ గ్రామంలో ఏయే పథకాలకు ఎంత డబ్బు ఖర్చవుతోంది, ఎవరెవరికి ఏయే రకంగా సబ్సీడీలు వచ్చాయి.– ఇవన్నీ రహస్యమే. అందుకే పాడి లేని చోట, కరవు ప్రాంతాల్లో వేలాది పాడి పశువుల్ని సరఫరా చేసినట్లు ప్రభుత్వ రికార్డులు చూపిస్తున్నాయి. గడ్డి కూడా దొరకని ప్రాంతంలో లక్షలాది మొక్కల్ని నాటి, కోట్లు ఖర్చు పెట్టినట్లు లెక్కలున్నాయి. పశువుల దాణా పేరుతో వందల కోట్లు ఖర్చు పెట్టినట్లు కల్పనలున్నాయి. కంటికి కనిపించని వంతెనలు, రహదార్లు, దేవతావస్త్రాల వంటి మరెన్నో పథకాలున్నాయి. ఏ కేసులో పోలీసులు ఎవరిమీద ఎందుకు చర్య తీసుకుంటారో తెలియని పరిస్థితులున్నాయి. పాలన రహస్యాల్ని పాలకులు పోషిస్తున్నంతకాలం ప్రజాస్వామ్యం ఇలాగే అపహాస్యం పాలవుతుంది. అవినీతి వర్ధిల్లుతుంది. రహస్యపు చీకట్లలో లుకలుకలాడుతున్న అవినీతి క్రిముల్ని సంహరించాలంటే ప్రజలకు పాలన సమాచారం అనే సూర్యరశ్మి సోకాలి. రహస్యాల్ని ఛేదించాలి. పౌరులకి, ప్రజాస్వామ్యంలో నిజమైన ప్రభువులకి పాలకులు జవాబుదారీ కావాలి.

* * *

# సహించినకొద్దీ కబళించే అవినీతి

**మే 13, 2002**

నిత్యజీవితంలో మనందరికీ లంచాల బెడద తప్పడం లేదు. కొన్ని అంచనాల ప్రకారం మనదేశంలో ప్రతి ఏడాది దాదాపు 150,000 కోట్ల రూపాయలకిపైగా లంచాలు దండుకుంటున్నారు. రాజకీయ నాయకులు, ఉద్యోగులు అందరూ కుమ్మక్కై వ్యవస్థని భ్రష్టుపట్టిస్తున్నారు. కొందరు తమ స్వార్థం కోసం లంచాలనిచ్చి పడ్డం గడుపుకుంటూ సమాజాన్ని దోచుకుంటున్నారు. చాలామంది వేధింపులకు గురై, ఆందోళనకు లోనై, ఏదో ఒక విధంగా అత్యవసర పనులు సాధించటం కోసం గత్యంతరం లేక లంచాలిచ్చు కుంటున్నారు. కాబట్టి, లంచాలిచ్చినవాళ్ళంతా నేరస్తులని భావించటం పొరపాటు. ఎంతో కొంత మేరకయినా లంచాలను ప్రతిఘటించటం చాలా కష్టం. సామాన్యులకు లంచగొండితనాన్ని ఎదిరించటంవల్ల కలిగే లాభం కన్నా, పనులు ఆలస్యం కావటం వల్ల, వేధింపుల వల్ల, ఏం జరుగుతుందోనన్న ఆందోళన వల్ల కలిగే నష్టం చాలా రెట్లు ఎక్కువ, మన చట్టాలు, న్యాయస్థానాలు కూడా తప్పులు చేసినవాళ్లను దండించటంలో విఫలమవుతున్నాయి.

## శిక్ష తప్పదన్న భయం కలిగించాలి

అందుకే, మన వ్యవస్థలో అవినీతిని ఎదిరించటానికి చాలా ఒడుపైన మార్గాలు అవసరం. సంఘటితంగా, బలమైన వేదికను నిర్మించుకుని ఎదిరిస్తే విజయం సాధించటం తేలిక. మనం ఇప్పుడు గొప్పగా చెప్పుకుంటున్న చాలా దేశాలలో ఒకప్పుడు అవినీతి విపరీతంగా ఉండేది. కాలక్రమేణా సంఘటిత పోరాటం ద్వారాను, నిర్దిష్టమయిన వ్యవస్థాగత సంస్కరణల ద్వారాను ఆ దేశాలలో అవినీతిని చాలావరకు అదుపు చేయగలిగాలి. అవినీతి మీద పోరాటాన్ని కేవలం నిజాయతీపరులయిన అధికారులు చేపడితే చాలదు. పౌరసమాజం వారికి దన్నుగా నిలవాలి. రాజకీయ రంగంలో ఉన్న లోపాలు, ఎన్నికలలో పెట్టే విపరీతమయిన పెట్టుబడి, రాజ్యవ్యవస్థలోని తప్పిదాలు అవినీతికి పునాదులుగా ఉన్నమాట వాస్తవం. వాటన్నిటినీ సంస్కరించేంతవరకు అవినీతి ఆగదని మనం తీర్మానించుకుని మౌనంగా భరిస్తూ కూర్చుంటే సమస్య పరిష్కారం కాదు. అవినీతిని నిర్మూలించడానికి మౌలిక రాజకీయ

సంస్కరణలు ఎంత అవసరమో, శిక్ష పడుతుందన్న భయాన్ని లంచగొండులలో కలిగించటం కూడా అంతే అవసరం. ముఖ్యంగా మూడు రంగాలలో అవినీతిని తాత్కాలికంగానైనా సహించటం అత్యంత ప్రమాదకరం. మొదటిది, ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, ప్రభుత్వ నియామకాలు నిష్పాక్షికంగా, నిజాయతీగా, ఏ ఒత్తిళ్లకు లొంగకుండా జరగాలన్న లక్ష్యంతో మన రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలుగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పరచుకున్నాం. కాని, కొన్ని రాష్ట్రాలలో ఈ రాజ్యాంగ సంస్థ సభ్యులే తమకు రాజ్యాంగం కల్పించిన రక్షణను ఆసరాగా చేసుకుని డబ్బు కక్కుర్తితో లంచాలు దిగమింగుతున్నారు. డబ్బిచ్చి ఉద్యోగాలు కొనుక్కోవటంవల్ల నాలుగు ప్రమాదాలున్నాయి. సమర్థులకు ఉద్యోగాలు రాక సమాజం వారి సేవలను కోల్పోతుంది. అసమర్థులను అందలాలెక్కించటంవల్ల ప్రజాసంక్షేమానికి భంగం వాటిల్లుతుంది. డబ్బుతో ఉద్యోగం కొనుక్కున్నవ్యక్తి ఒకసారి పదవిలోకి వచ్చాక జనాన్ని పీడించి లంచాలు దండుకోవటం తన జన్మహక్కుగా భావించి పెట్రేగిపోతాడు. జనసామాన్యానికి రాజ్యవ్యవస్థ మీద ఉన్న నమ్మకం పూర్తిగా నశించిపోతుంది. లంచాలు తిన్నా పట్టుకునేవాళ్ళు లేరన్న ధీమాతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సభ్యులు కొందరు అవినీతికి పాల్పడుతున్నారు. మన రాష్ట్రంలో గతంలో ప్రభుత్వోద్యోగాలను అమ్ముకున్నారని ఫిర్యాదులు, వదంతులు వెల్లువెత్తాయి. కొన్ని జిల్లాల్లో అధ్యాపకుల నియామకంలో కూడా డబ్బు తిన్నారనే వార్తలు వచ్చాయి. ప్రస్తుతం నిజాయతీగా, నికార్సుగా, నిష్పాక్షికంగా, వేగంగా నియామకాలను చేస్తున్నారని మన రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు మంచి పేరుంది. కమీషన్ అధ్యక్షుడు, సభ్యులు చిత్తశుద్ధితో కృషిచేయడం ద్వారా గతంలోని చెడుపేరుని తొలగించగలిగారు. పంజాబ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధ్యక్షుడు సిద్ధూ దగ్గర కోట్లాది రూపాయల అక్రమార్జన బయటపడటం, ఎన్నో ఉద్యోగాల నియామకాలకు రేట్లు పలకటం, డి.ఎస్.పి. లాంటి ఉద్యోగాలను కోటి రూపాయలదాకా ఇచ్చి కొనుక్కోవడం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చను రేకెత్తిస్తున్నాయి. ఈ రాజ్యాంగ సంస్థలకు అనామకులను, అవినీతిపరులను, పైరవీలకి పాల్పడేవాళ్లను, ఆశ్రిత పక్షపాతులను ఇష్టం వచ్చినట్లు నియమించడం వల్ల ప్రస్తుత సమస్య ఉత్పన్నమయింది. సర్వీసు కమిషన్ సభ్యుల నియామకాన్ని రాజకీయం చేయడం వల్ల వచ్చిన పాట్లు ఇవి. అవినీతి వాసన సోకితేనే సమాజంపైన తీవ్ర ప్రభావాన్ని చూపే రెండో వ్యవస్థ న్యాయస్థానాలు. న్యాయమూర్తులు లంచాలు మింగితే ప్రజలకు వేరే దిక్కులేదు. కంచే చేను మేస్తే పైరును కాపాడేదెవరు?

మనదేశంలో న్యాయవ్యవస్థ చాలామేరకు నిష్పాక్షికతతో, స్వతంత్రంగా పనిచేస్తోంది. కానీ, కొందరు చీడపురుగుల వల్ల న్యాయస్థానాల మీద విశ్వాసం నశించిపోతోంది. ఉన్నత న్యాయస్థానాలలో కూడా డబ్బుతో న్యాయాన్ని కొనుక్కోవచ్చుననే భావం బాగా వ్యాపిస్తోంది. న్యాయస్థానాల మీద విశ్వాసం నశిస్తే అది ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదకరం. మహారాష్ట్ర లాంటి కొన్ని రాష్ట్రాల్లో హైకోర్టు న్యాయమూర్తులే చొరవ తీసుకుని న్యాయవ్యవస్థలో అవినీతిని కూకటివేళ్లతోసహా పెళ్ళగిస్తున్నారు.

## పరీక్షల్లో కూడా అవినీతి

కొద్దిపాటి అవినీతివల్ల సమాజం తీవ్రంగా నష్టపోయే మరో రంగం విద్యారంగం. లంచం తీసుకుని పరీక్షలలో పాసు చేస్తారని విద్యార్థులు నమ్మటం మొదలుపెడితె ప్రతిభావంతులు నీరసపడిపోతారు. వాజమ్మలు డబ్బిచ్చి డిగ్రీలు కొనుక్కుంటారు. తమ చదువుకు, ఫలితాలకు సంబంధం లేదని భావించే విద్యార్థులు అసలు అధ్యయనం మీ దృష్టిపెట్టడం మానేసి ఆవారాలుగా తిరుగుతారు. లంచాలిచ్చి ఉత్తీర్ణులయిన పట్టభద్రులు రేపు సమాజంలోకి వచ్చాక జనాన్ని పీడించుకుతింటారు. పిన్నవయసులోనే వారికి వ్యవస్థపట్ల విశ్వాసం నశిస్తుంది. మనుగడ సాగించడానికి దోచుకోవడమే మార్గంగా యువత భావిస్తుంది. వర్తమానంతోపాటు సమాజ భవిష్యత్తు కూడా సమాధి అవుతుంది. అందుకే, కనీసం ఈ మూడు రంగాలలోనయినా (ఉద్యోగ నియామకాలు, న్యాయవ్యవస్థ, విద్యార్థుల పరీక్షలు) లంచాలను ఆపడానికి సమాజంలోని అన్ని వర్గాలు విశ్వప్రయత్నం చేయడం అవసరం. ఇటీవల బయటపడ్డ ఓ ఉదంతం పరిస్థితి తీవ్రతను మరోమారు తేటతెల్ల చేసింది. కొద్దిరోజుల క్రితం ఓ ప్రసిద్ధ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టరొకాయన ఫోనులో ఓ అవినీతి బాగోతాన్ని గూర్చి నాకు వివరించారు. ఆ డాక్టరు తమ్ముడు ఉస్మానియా వైద్యకళాశాలలో యం.బి.బి.యస్. చివరి సంవత్సరం పరీక్షలకు కూర్చుంటున్నాడు. వాళ్ళ క్లాసులో 80 మంది దాకా విద్యార్థులు సర్జరీ ప్రొఫెసర్ ఒకాయనకి పరీక్ష పాసు చేయడం కోసమని లంచాలిచ్చారట. ఆ ప్రొఫెసర్ నిర్లజ్జగా, జంకూ గొంకు లేకుండా ఎడాపెడా విద్యార్థుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారట. మొదట కొంతమంది పాసు కావాలని ఇచ్చి ఉంటారు. అది చూసిన మరికొందరు ఎందుకయినా మంచిద'ని ఇచ్చారు. అసలే వైద్యవిద్యలో తుది పరీక్షలు. ఈ వృత్తిలో ప్రొఫెసర్ అంటే అపారమయిన గౌరవం. అలవిమాలిన భయం! డబ్బివ్వలేదన్న కసితో తమని కావాలని

తప్పిస్తాడేమోనని వాళ్ళకి బెరకు. ఇలా విద్యార్థులలో అధిక సంఖ్యాకులు ఆ ప్రొఫెసర్‌కి ముడుపులు చెల్లించుకున్నారట! నాతో ఫోనులో మాట్లాడిన డాక్టరు ఇవన్నీ వివరించారు. స్వయానా తన తమ్ముడు ఆ కాలేజీలో ఆ పరీక్షకి హాజరవుతున్నాడని, అందుకే తనకా వాస్తవాలు తెలిశాయని ఆయన చెప్పారు. వెంటనే నేను ఆ ప్రొఫెసర్‌ని పట్టిద్దామని ఆలోచించి, ఆయన లంచం తీసుకుంటుండగా పట్టుబడేలా 'ట్రాప్' చేయిద్దామని, అవినీతి నిరోధకశాఖతో సహకరించమని నాకు ఫోను చేసిన డాక్టరును కోరాను. ఆయన తన తమ్ముడితో మాట్లాడి ఏ సంగతీ చెబుతానన్నారు. కొన్ని గంటల తరువాత ఆయన మళ్ళీ ఫోను చేసి, పరీక్ష తప్పిస్తారన్న భయంతో తన తమ్ముడు కూడా లంచం ఇచ్చేశాడని, తాను ఆపేలోగానే ఆ పని జరిగిపోయిందని చెప్పారు. లంచగొండిని డబ్బు తీసుకునేటప్పుడు పట్టుకునే అవకాశం అలా చేజారిపోయింది. జరుగుతున్న అక్రమాన్ని ఎలాగైనా నిరోధించాలని నేను వెంటనే విజిలెన్స్ కమిషనర్‌కు, అవినీతి నిరోధకశాఖ అధిపతికి, వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్ జనరల్‌కు, ఆరోగ్య కార్యదర్శికి విషయం వివరించి చెప్పాను. అదృష్టవశాత్తు వీరంతా నిజాయతీపరులు. కనీసం ఆ ప్రొఫెసర్‌ను ఈ పరీక్షలలో విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఎగ్జామినర్ కాకుండా తొలగించాలని సూచించాను. నా సూచనకు స్పందించిన వైద్య ఆర్యోగశాఖ డెరక్టర్ జనరల్ డాక్టర్ అంజిరెడ్డి తాను కూడా రహస్యంగా వాస్తవాలను వాకబు చేశారు. ఆ ప్రొఫెసర్ 95 మంది విద్యార్థుల దగ్గర డబ్బు సేకరించారని తెలుసుకున్నారు. వెంటనే ఆ వ్యక్తిని ఎగ్జామినర్‌గా తీసివేయాలని ఆదేశించారు. ఇక మిగతా అవినీతిని గూర్చి విచారణ జరుగుతుంది. కనీసం డబ్బు తీసుకుని విద్యార్థులను పాసు చేయటం, డబ్బివ్వకపోతే తప్పించటం ఈ ఉదంతంతో ఆగిపోతే అది మన వ్యవస్థకు కొంతవరకు మేలు చేస్తుంది. డబ్బు తీసుకున్నాక ఎగ్జామినర్ కాకుండా పోయినందుకు కొందరు విద్యార్థులయినా లంచగొండి ప్రొఫెసర్‌ని నిలదీస్తారు. అలా అటు ప్రభుత్వం నుంచి, ఇటు లంచాల బెడదకు గురవుతున్నవారినుంచి, పౌర సమాజం నుంచి సరయిన స్పందన వస్తే కొంతమేరకయినా అవినీతిని అదుపు చేయవచ్చు. అవినీతిని అంతం చేయాలంటే ఎన్నికల సంస్కరణలు, ఇంకా ఇతర మార్పులు అత్యవసరమే. కనీసం కొన్ని రంగాలలోనయినా లంచగొండులకు బుద్ధి చెప్పితీరాలి.

## ఎందుకీ పిరికితనం

మరో విచిత్రమేమంటే – ఆ ప్రొఫెసర్‌ని ఎగ్జామినర్‌గా తొలగిస్తున్నారని

బయటపడ్డాక 110 మంది వైద్య విద్యార్థులు ఆయననే ఎగ్జామినర్‌గా కొనసాగించాలని ప్రాధేయపడ్డారట! ఎలాగు డబ్బిచ్చాం కాబట్టి అది వృథా కాకూడన్న కోరిక కావచ్చు, మరొకరు ఎగ్జామినర్‌గా వస్తే కఠినంగా వ్యవహరించవచ్చున్న భయం కావచ్చు. తనను ఆదుకోకపోతే సహచరుల సాయంతో విద్యార్థులను ముప్పుతిప్పలు పెడతానని లంచగొండి ప్రొఫెసర్ బెదిరించటం వల్ల కావచ్చు; మన సమాజంలో చెడు చేసిన వాడిని నిర్ద్వంద్వంగా ఎదిరించి, శిక్షించే సంప్రదాయం కొరవడి, "పోనీలే, ఎవడి పాపాన వాడే పోతాడు. మనవల్ల వాడి ఉద్యోగం పోవటం ఎందుకు?" అనే పిరికితనం, ఆత్మవంచన, బలహీనతలకు మనం అలవాటుపడటం వల్ల కావచ్చు – ఇలా వివిధ కారణాల దృష్ట్యా అవినీతిని ఎదిరించటానికి బిడియపడుతున్నాం. తప్పు చేసినవాడు మన బలహీనత వల్ల నిర్లజ్జగా తలెత్తుకుని, కాలరెగరేసుకుని తిరుగుతుండగా, లంచాలకు, దోపిడీలకు గురయ్యే సామాన్య జనం వణికిపోతూ, భయపడుతూ, తప్పు చేసినట్లు తలవంచుకుంటూ జీవితాలను గడిపేస్తున్నారు. ఈ ఉదంతంలో నిజాయతీకి మారుపేరయిన డాక్టర్ అంజిరెడ్డి చొరవతో కొంతమేరకయినా అక్రమానికి తెరపడింది. కాని అన్ని ప్రభుత్వ సంస్థలు లంచగొండులకు శిక్షపడేలా చిత్తశుద్ధితో కృషిచేయటం అవసరం. ప్రభుత్వంలో అందరూ చెడ్డవాళ్ళు కాదు. నిజాయతీపరులు, అవినీతిని వ్యతిరేకించేవారు ఎందరో ఉన్నారు. వారికి మద్దతివ్వడం, లంచగొండుల భరతం పట్టడంలో సాయం చేయడం మన కర్తవ్యం. ఇలా ఒక్క కేసులో శిక్షపడితే ఇక పరీక్షలలో లంచాలు తీసుకునే దుస్సాహసాన్ని ఏ అధ్యాపకుడు చేయడు. కనీసం ఒక కీలక రంగంలో అవినీతికి తెరపడుతుంది. ఒక్కడి వల్ల దేశంలో పరిస్థితులు ఏం మారతాయిలెమ్మని నిస్పృహతో మనమంతా రాజీపడిపోతుంటే ఈ అవినీతి ఊబిలో సమాజం అంతా కూరుకుపోయి మంచి నశించిపోతుంది. భారం అంతా కూరుకుపోయి మంచి నశించిపోతుంది. భారం అంతా ఇతరుల మీద నెట్టి మనం మౌన ప్రేక్షకులుగా మిగిలిపోతే సమస్యలో భాగమవుతాం. పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నా పౌరులు తలుచుకుంటే, సంఘటితంగా ఎదుర్కొంటే, మంచిని సాధించగలం.

* * *

# లంచగొండి వ్యవస్థలో అభివృద్ధి అసాధ్యం!

ఫిబ్రవరి 5, 2001

పత్రికలలో ఇటీవల ఓ ఆసక్తికరమైన వార్త వచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ప్రభుత్వం మీద కోర్టులో కేస్తు వేస్తామని ప్రకటించారు. ఎందుకంటే రూ. 600 కోట్లకు పైగా చేసిన పనులకు ప్రభుత్వం బకాయి పడిందట. ఎంత ప్రయత్నం చేసినా ప్రభుత్వ శాఖలు బిల్లులు చెల్లించటం లేదని, డబ్బు ముందుగా వడ్డీలకు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టిన తాము దివాలా స్థితిలో ఉన్నామని అందువల్ల కేసు వేస్తున్నామని ప్రకటించారు. ఇంకా విచిత్రం ఏమంటే గోరుచుట్టు మీద రోకలిపోటులాగా డబ్బు సకాలంలో చెల్లించని ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు లంచాలు మాత్రం క్రమం తప్పకుండా పెద్ద ఎత్తున గుంజుతున్నారట. సాధారణంగా పని విలువలో 15 శాతం వాళ్ళకు సమర్పించుకోవాల్సి వస్తోందట. ఇక నుంచి లంచాలు తగ్గించి మూడు శాతం మించకుండా ఇవ్వాలని రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు బహిరంగంగా తమ సభ్యులకు పిలుపు ఇవ్వడం విశేషం. పదివేలు నెలజీతం తీసుకునే అధికారికి పదిహేను లక్షలు లంచం ఇవ్వటమేమిటని ఆయన వాదన. ఓ కాంట్రాక్టరు లంచాల బాధ పడలేక ఇలా డబ్బు కోసం ఓ కాంట్రాక్టరు లంచాల బాధ పడలేక ఇలా డబ్బు కోసం వేధించే అధికారులను అవినీతి నిరోధక శాఖకు పట్టిద్దామని సూచించగా, ఆ శాఖ అధికారులు కూడా అందుకు లంచం అడుగుతున్నారని మరో కాంట్రాక్టరు వివరించారు. ఇది నిజంగా జరుగుతోందా, లేక పీడకల కంటున్నామో అనిపిస్తుంది.

రెండు వారాల క్రితం మరో వార్త ప్రముఖంగా వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమాలు ప్రారంభించటానికి గజ్వేల్ గ్రామం వెళ్ళారు. అక్కడ ఓ రైతు విద్యుత్‌శాఖ అధికారుల మీద ఫిర్యాదు చేస్తూ లంచాలు మింగి కూడా పనిచేయటం లేదని, ఆపైన చాలా దురుసుగా, అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని వివరించారు. 'సొమ్ము పోయె, శని పట్టె' అని ఆ రైతు బాధ. ముఖ్యమంత్రి ఆ విద్యుత్ అధికారిని పిలిపించి 'రైతులతో అమర్యాదగా ప్రవర్తించటం

తప్పు' అని మందలించారే తప్ప సరైన చర్య తీసుకోకపోవడం ఉద్యోగులను సంతోష పెట్టవచ్చుగానీ రైతులను నిరాశపరచింది. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు ఉద్యోగులను హెచ్చరిస్తున్నా ఆరు నెలలు గడువిస్తున్నానని చెబుతున్నా, తప్పు చేస్తే చర్య తీసుకుంటామంటున్నా సరైన ఫలితం ఉండటం లేదు. అవినీతికి కళ్ళెం పడటం లేదు.

## మరుగుదొడ్ల పథకంలోనూ కక్కుర్తి

లోక్‌సత్తా ఉద్యమం ఎంతో పట్టుబట్టగా ప్రభుత్వం ఇంటింటా మరుగుదొడ్డి పథకాన్ని ప్రవేశపెట్టింది. మామూలు ప్రభుత్వ పథకాల మాదిరిగానే ఇందులో కూడా జాప్యం, అసమర్ధత, వేధింపులు చోటు చేసుకున్నాయి. మా గ్రామంలో 408 మరుగుదొడ్లు కట్టించటానికి పూనుకుని ఆ గ్రామంలో చదువుకున్నవాళ్ళు ఓ స్వచ్ఛంద సంస్థగా ఏర్పడి చివరికి విజయం సాధించారు. కాని చేపట్టిన పనిని పూర్తిచేయటానికి ప్రభుత్వ యంత్రాంగంతో ఎంత కష్టపడాల్సి వచ్చిందో, ఎన్ని అడ్డంకులు ఎదురయ్యాయో వివరిస్తే అదో పెద్ద గ్రంథం అవుతుంది. చివరికి అనుకున్న లక్ష్యం నెరవేరి ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఏర్పడింది. గ్రామంలో ఉన్న దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు ప్రతి ఒక్కరికీ బహిరంగ మలవిసర్జన నుంచి విముక్తి లభించింది. ప్రతి కుటుంబం సగర్వంగా వాటిని వినియోగించుకుంటూ జీవితంలో మొదటిసారి హూందాగా బతుకుతోంది. ఎంతో పలుకుబడి, ప్రతిష్ఠ పెట్టుబడిగా పెట్టటం వల్ల, కొద్దిమంది నిజాయతీపరులయిన పెద్దలు ఆ గ్రామంలో పనుల కోసం అహోరాత్రాలూ విసుగనుకోకుండా శ్రమ పడటంవల్ల, కలెక్టరు స్థాయిలో చిత్తశుద్ధితో సహకరించటం వల్ల ఒక్క గ్రామంలో ఈ పనిచేయటం సాధ్యమయింది. ఎన్నోచోట్ల చివరికి మరుగుదొడ్ల నిర్మాణంలో కూడా ప్రత్యక్షమవుతోంది! దొంగలెక్కలు చూపి, లంచాలు మింగి, ప్రజాధానాన్ని పెద్దఎత్తున కైంకర్యం చేస్తున్నారు. సామర్లకోట పట్టణంలో కొంతకాలం క్రితం ఈ మరుగుదొడ్ల పథకంలో రూ.48 లక్షలు కైంకర్యం చేశారని వార్తలొచ్చాయి. విశాఖ జిల్లా తంగేడు గ్రామ సర్పంచి స్వయంగా నాకు తమ గ్రామంలో ఈ పథకం అమలు గురించి వివరించారు. ఊళ్ళో 250 మరుగుదొడ్లు కట్టినట్లుగాఅధికారులు దొంగ లెక్కులు చూపారట. నిజానికి అన్ని మరుగుదొడ్లు కట్టలేదని, అదంతా మోసమని సర్పంచి ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడు లేదు! జరుగుతున్న మోసాన్ని బయటపెట్టం ఎన్నికయిన వాళ్ళకు కాస్త

ఇబ్బంది. పని జరగకపోయినా జరిగినట్లు లెక్కలు వేస్తే అందువల్ల ఆ ఇంటి ఆసామికి కొంత డబ్బు అక్రమంగా ముడుతుంది. దొంగ లెక్కలు వేసి డబ్బు మంజూరు చేసినందుకు ప్రభుత్వ అధికారులకు తలా కొంత లంచం దక్కుతుంది. కాబట్టి ఫిర్యాదు చేసే వాళ్ళే ఉండరు. దాన్ని ఆపాలని ప్రయత్నం చేసే వాళ్ళ మీద అందరికీ గుర్రుగా ఉంటుంది. అదే ఎన్నికయిన సర్పంచి అయితే మళ్ళీ ఎన్నికలొచ్చినప్పుడు ఓట్లు పడకపోవచ్చు. "అందరూ తిన్నట్లుగానే మేమూ కాస్త తిన్నాం. ఈయనకేం రోగం? నోరు మూసుకు కూర్చోవచ్చు కదా! ఈయనొక్కడేనా మడికట్టుకు కూర్చునేది? దీనివల్ల దేశం ఏమైనా బాగుపడిపోతుందా?" అని ఆ ఆసాములకు, అధికారులకు అక్కసు! పోయేది ప్రజాధనమే కాబట్టి ఇలాంటి అంశాలలో బాధపడేవాళ్ళు చాలా తక్కువ. ఆ డబ్బు మనదేనని, దాన్ని ఇలా దోచుకుతినటం వల్లనే దేశం దివాలా తీస్తోందని, ప్రజలకు అన్ని సౌకర్యాలు కరవవుతున్నాయని, తమ పిల్లలు బీదరికంలో మునిగిపోతున్నారని సామాన్య ప్రజలకు తట్టదు. పోనీ తెలిసినా, "అధికారం, పలుకుబడి ఉన్న వాళ్ళంతా దోచుకుని కోట్లకు పడగలెత్తుతుంటే మనం ఒంటరిగా ఏం చేయగలం?" అని మౌనంగా కూర్చుంటున్నారు. తంగేడు గ్రామ సర్పంచి వివరాలు సేకరించగా గ్రామంలో 250 మరుగుదొడ్లు కట్టినట్లుగా లెక్కలు చూపి డబ్బులు తిని, మిగిలింది ఆ కుటుంబాలకు పంచారట. వాస్తవానికి వివరాలు సేకరిస్తే తేలిందేమంటే కేవలం 25 మరుగుదొడ్లు మాత్రం కట్టారట! అంటే 90 శాతం డబ్బు కైంకర్యం అయిపోయిందన్నమాట! తంగేడు సర్పంచి చివరికి అత్యున్నతాధికారుల వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారట. అందుకా అధికారుల నుంచి "అయ్యా అంతా లంచాలు మింగుతున్నారు. మీరూ, నేనూ మాత్రం మడిగట్టుకుని కూర్చుంటే ఇదంతా మార్చగలమా, మీ పిచ్చిగాని" అని వేదాంత ధోరణిలో సమాధానం వచ్చిందట. ఇటీవల నేను తెనాలి పట్టణంలో పర్యటించాను. అక్కడ నాకు మరో ఆసక్తికరమయిన విషయం తెలిసింది. ప్రభుత్వం నుంచి అక్కడి మునిసిపాలిటీకి రూ. 44 లక్షలు గ్రాంటు వచ్చింది. పురపాలక సంఘానికి డబ్బు వెంటనే కావాలి. ఆ మునిసిపల్ ఛైర్మన్ నిజాయతీపరుడు. అందునా అధికార పార్టీకి చెందినవాడాయన. సరే ప్రభుత్వ గ్రాంటు ప్రజల కోసం వచ్చింది కదా, దాన్ని వినియోగించకుందామని ప్రయత్నం చేశారట. తీరా ప్రభుత్వ ఖజానా (ట్రెజరీ) అధికారులను ఆ డబ్బు విడుదల చేయాల్సిందిగా కోరితే, పదివేల రూపాయలు లంచంగా అక్కడ పెట్టాకే ఆ డబ్బు విడుదల గురించి ఆలోచిస్తామని, కుండ బద్దలుగొట్టినట్లు చెప్పారట. ఏదో ప్రజలకు

మేలు చేద్దామని ఎన్నికలలో పోటీ చేసి పదవిని చేపడితే, ప్రజాధనాన్ని ప్రజల కోసం ఖర్చు చేయాలంటే ఈ లంచం ఏమిటని ఆయన మధనపడ్డారు. చివరికి లంచం లేకపోతే డబ్బు మంజూరు కాదు కాబట్టి, ఆ డబ్బు లేకపోతే పనంతా ఆగిపోతుంది కాబట్టి, గతిలేక లంచం ఇచ్చయినా ఆ డబ్బు విడుదల చేయించాలని ఆయన నిర్ణయించుకోవటం వాస్తవ పరిస్థితులకు దర్పణం పడుతోంది.

## బరితెగించి దోపిడీ

ఇలా ఎక్కడ చూసినా అవినీతిస్వైర విహారం చేస్తోంది. ఓ వంక ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోయింది. ఏటా రూ. 36000 కోట్లు ఖర్చు చేసి రాష్ట్ర ప్రభుత్వం కేవలం అందులో 60వ వంతు, రూ. 600 కోట్ల బకాయిలు కాంట్రాక్టర్లకు చెల్లించలేక అవస్థపడుతోంది. కాని లంచాలు మింగటంలో మాత్రం ఎలాంటి రాయితీలు లేవు. పేరుకు రోజుకు రూ.100 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే ప్రజాధనాన్ని ఖర్చు పెడుతోంది. దానిలో ఎంత డబ్బు వృథాగా పోతోందో ఊహించుకోవటం కష్టమేమీ కాదు. ప్రభుత్వంలో ఉన్నవాళ్ళకు ప్రజల్ని ఏదో విధంగా బాధించే శక్తి ఉంది. ఓ పని సకాలంలో చేయకపోతే జనానికి చాలా కష్టం. ఓ సర్టిఫికేటు వెంటనే అందకపోతే ఓ విద్యార్థికి చాలా నష్టం. ఓ కేసులో సాక్ష్యాన్ని తారుమారు చేస్తే ఓ అసామికి చాలా క్లేశం. ఓ నేరాన్ని సరిగ్గా నమోదు చేయకపోతే ఓ అభాగ్యుడికి తీరని అన్యాయం, ఇలా ప్రభుత్వం సరిగ్గా పనిచేయకపోతే నష్టపోయేవాళ్ళనేకులు. ఆ నష్టాన్ని, బాధను ఎరచూపించి, బెదిరించి డబ్బు వసూలు చేయటం పాలన యంత్రాంగానికి, రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. లంచం డబ్బు కాస్త తక్కువగా ఇస్తే (మన స్థోమతకు చాలా ఎక్కువ డబ్బయినా, పుచ్చుకునే వాడికి అది చాలా తక్కువ.) "ఏమనుకుంటున్నారు? నేను చాలా ఉన్నతాధికారిని, నా స్థాయికి తగినట్లుగా ఇవ్వకపోతే ఎలా? అని బరితెగించి దోచుకుంటున్నారు. ఉన్నతాధికారుల్లో ఎవరు నిజాయతీపరులో, ఎవరు లంచగొండులో, ఎవరు సమర్థులో, ఎవరు పనిదొంగలో అందరికీ తెలుసు. కాని అధికారుల నియామకాలలో మాత్రం ఆ తేడా కనిపించదు! అదేమంటే, "ఇదంతా రాజకీయంలో సహజమండీ. అందర్నీ కలుపుకొనిపోవాలి. మరీ ఆదర్శం అంటే బండి నడవదు. అదీగాక ఎన్నికలకు కోట్లు ఖర్చుపెట్టాలి. అది కావాలంటే లంచాలు గుంజాలి. కోటి రూపాయలు ఖర్చుపెడితే ఐదు కోట్లయినా ఆదాయం రావాలి. లేకపోతే గిట్టుబాటు కాదు. ఐదు కోట్లు వసూలు చేయాలంటే

అధికార యంత్రాంగం, ఉద్యోగులు 50 కోట్లు తింటారు. ప్రతి నాయకుడికి 2000 మందికిపైగా ఉద్యోగులున్నప్పుడు వాళ్ళు తలా కాస్త తిన్నా కనీసం పది రెట్లు లంచాలు గుంజాలి. మరేం చేస్తాం? ఉన్నంతలో ఏదో ప్రయత్నం చేస్తున్నాం" అని సమాధానం చెబుతారు. ఇదీ మన పాలన తీరు. కబుర్లను కట్టిపెట్టి వాస్తవాలను కాస్త పరిశీలిస్తే మన కళ్ళకు కనపడే భయంకర సత్యమది.

## సంక్షోభాలు నిత్యకృత్యం

రోజూ ఓ సంక్షోభం వస్తుంది. మర్నాడు మరో అంశం రాగానే నిన్నటిది మరుగునపడిపోతుంది. విద్యుత్‌రంగంలో అవినీతి, అసమర్థత వల్ల ఛార్జీలు పెంచితే ఓ నెల రోజులు గందరగోళం అవుతుంది. ఆ తరవాత ఏ తుఫానో వస్తుంది. అదయ్యాక రైతుల పంటలకు ధరలు తగ్గి మరో సంక్షోభం వస్తుంది. దానిమీద మరింత హడావుడి చేసే సరికి రైతులు మరచిపోతారు. ఆ తరువాత ఏదో ఓ రాజకీయ దుమారం వస్తుంది. మందిరం కట్టాలా, మసీదు నిర్మించాలా అని తర్జన భర్జలు పడతారు. బెదిరింపులు, ప్రకటనలు, విమర్శలు, ప్రతి విమర్శలతో ఓ నెల గడిచిపోతుంది. మళ్ళీ ప్రభుత్వం దివాలా తీస్తోందని ప్రకటనలు వస్తాయి. ధరలు, పన్నులు పెరుగుతాయి. వాటిని గురించి బాధపడేలోగా మళ్ళీ విద్యుత్తు రంగంలో సంక్షోభం ఉందని వార్తలొస్తాయి. ఇలా కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది. ప్రజల సమస్యలు మరింత పెరుగుతూనే ఉంటాయి. ఏది ఎలా అయినా క్రమం తప్పకుండా జరిగే పని మాత్రం ఒకటుంది అదేమంటే లంచాలు గుంజటం, దోపిడీని నిర్విఘ్నంగా కొనసాగించటం. ఇదీ మన పాలనలో రహస్యం! మన రాజకీయంలోని మర్మం! లంచాలు నిరాటంకంగా కొనసాగినంత వరకు మన పాలకులకేమీ ఢోకా లేదు! వాళ్ళు పెట్టదగిన పెట్టుబడికి పదింతలు ఆదాయం వచ్చినంత వరకు వాళ్ళకేమీ చీమకుట్టినట్లు అనిపించదు. గద్దె మీద కూర్చున్న వారి భారాన్ని మనం మోస్తున్నంత వరకు వాళ్ళు మన డొక్కల్లో తంతూనే ఉంటారు. అందుకు వాళ్ళను తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అది వాళ్ళ సహజ లక్షణం. తప్పేమన్నా ఉంటే మనది. వాళ్ళ మాటల్ని మౌనంగా వింటూ వాళ్ళకు భజన చేస్తూ మనల్ని మనం ఈసడించుకుంటున్నాం. మన వేళ్ళతో మన కళ్ళను మనమే పొడుచుకుంటున్నాం. బిడ్డల భవిష్యత్తును మనమే కాలరాస్తున్నాం. పరిష్కారాలు ఆలోచించే వాళ్ళందరికీ తెలుసు. వాటి కోసం పోరాడే చేవ కరవయింది. ఎవరో వస్తారనీ, ఏదో చేస్తారని

ఎదురు చూస్తున్నాం. ఎవరయినా కాస్తంత చొరవ తీసుకుంటే వాళ్ళ భుజాల మీద భారమంతా పెట్టి మనం చోద్యం చేస్తున్నాం. జీవితాలు కాలి బూడిద అయిపోతుంటే అదేదో మనకు సంబంధించిన విషయం కానట్టుగా, సినిమానో, నాటకాన్నో చూస్తున్నట్లుగా మౌనంగా కూర్చుంటున్నాం. మనం మళ్ళీ పాత్రధారులమయ్యేదాకా, మన సార్వభౌమత్వాన్ని, తిరిగి పుచ్చుకునేదాకా, గద్దె మీద కూర్చున్న వాళ్ళు మన సేవకులమని తెలుసుకునేదాకా ఈ తిప్పలు తప్పవు. పాపం చేస్తున్న వాళ్ళకన్నా... జరుగుతోంది తప్పని తెలిసీ ఎదురించని వాళ్ళు మహాపాపులు. మనలో చాలామంది ప్రస్తుతం ఆ కోవలోకే వస్తారు.

* * *

# అభివృద్ధిని తుడిచిపెట్టే అవినీతి ప్లేగు

అవినీతి నిరోధంపై ఐక్యరాజ్య సమితి ఏడాది కిందట ఒక ఒప్పందాన్ని ఆమోదించింది. అవినీతిపై సమరానికి ప్రపంచ దేశాలు వేసిన తొలి అడుగుగా ఈ ఒప్పందాన్ని చెప్పుకోవచ్చు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో అవినీతి నిరోధానికి సంబంధించి వెలువరించిన ఓ నివేదికలో అవినీతిపై సమితి ప్రారంభించిన సమరాన్ని స్వాగతించింది. "అవినీతి నిరోధానికి పరస్పరం సహకరించుకునేందుకు, ముడుపుల రుపేణా చేతులు మారిన ఆస్తులను ఒకరికొకరు తిరిగి అప్పగించేందుకు అంగీకరిస్తూ ఈ ఒప్పందంపై అనేక దేశాలు సంతకాలు చేశాయి. తద్వారా దేశీయ, అంతర్జాతీయ చట్టాల్లో కొత్త ప్రమాణాలు నెలకొల్పేందుకు అవి దోహదం చేశాయి. అయితే ఈ ఒప్పందం ఆచరణలో విజయం సాధించాలంటే రాజకీయ దృఢ సంకల్పం అవసరం. దాని అమలును పర్యవేక్షించడానికి ఆయా దేశాలు నిబద్ధతతో వ్యవహరించడం ముఖ్యం" అని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టి.ఐ.) పేర్కొంది. ఈ సంస్థ ఇటీవల 146 దేశాల్లో అవినీతి ఏ స్థాయిలో ఉందో అంచనావేసేందుకు సర్వేలు నిర్వహించి, వాటికి ర్యాంకులు ఇచ్చింది. ఈ జాబితాలో ఇండియా తొంభయ్యో స్థానంలో ఉంది. సర్వేలో పాల్గొన్న వారిని ఆయా దేశాల్లో అవినీతి స్థాయినిబట్టి ఒకటి నుంచి పదిలోపు పాయింట్లు వేయమని కోరింది. ఒక పాయింటు అంటే అవినీతి తీవ్రస్థాయిలో ఉన్నట్టు, పది పాయింట్లు వస్తే ఆ దేశాల్లో అవినీతి లేదని అర్థం. ఈ సర్వేలలో ఇండియాకు సగటున 2.8 పాయింట్లు వచ్చాయి. ఈ ప్రకారం అవినీతి తీవ్రంగా ఉన్నట్టు తెలుస్తోంది. అయినప్పటికీ మన దేశ వృద్ధి రేటు ఆరు నుంచి ఏడు శాతం వరకూ ఉంది. దీనినిబట్టి ప్రభుత్వాలు త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేందుకు, వాటి యంత్రాంగాలలో చురుకు పుట్టించేందుకు ఈ అవినీతి 'కందెన'లా ఉపయోగపడుతోందని భావించవచ్చా?

## పర్యవసాలు

అవినీతి పర్యవసానాలు ఎంత దారుణంగా ఉంటాయనడానికి ఆ మధ్య జరిగిన ఓ సంఘటన ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో

పెచ్చుమీరిపోతున్న అవినీతిపై  రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల సంఘాల సమాఖ్యకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మూడేళ్ళకిందట పెద్దయెత్తున ఉద్యమం ప్రారంభించారు. వాస్తవానికి సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ శాఖల అధికారులకు రెవిన్యూ పోలీస్ శాఖలకు ఉన్నట్టే విస్తృత అధికారాలు ఉన్నాయి. వారు తలచుకుంటే పారిశ్రామికవేత్తల్ని అరెస్టు చేయగలరు. వారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకోగలరు. వారి జీవితాలను దుర్భరం చేయగలరు. అయితే, పారిశ్రామికవేత్తలు ఉద్యమం లేవదీసింది అవినీతిని తుడిచిపెట్టాలని కాదు. మామూళ్ళు వసూలు చేయడంలో ఓ పద్ధతి పాటించమని కోరడమే వారి అసలు ఉద్దేశం. తమను వేధింపులకు గురిచేయకుండా, డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఏదో ఒక విభాగం వారు మాత్రమే నెలవారీ మామూళ్ళ వసూలుకు వచ్చేలా ఓ 'పద్ధతి' ఏర్పాటు చేయాలన్నది వారి డిమాండ్. ఇందుకోసం పారిశ్రామికవేత్తలు ఇలా రోడ్డెక్కి టెంట్లువేసి, ధర్నాలు, నిరాహారదీక్షలు చేయడం ఎందుకు? అనే ప్రశ్న తలెత్తవచ్చు. గతంలో ఎవరైనా ఓ పారిశ్రామికవేత్త వ్యాపారం ప్రారంభించదలచుకుంటే రాజకీయ నాయకులకు, ఉన్నతాధికారులకూ పెద్ద మొత్తంలో లంచాలు ముట్టచెప్పవలసి వచ్చేది. పన్నులు వసూలు చేసే అధికారులకు, ఇతరులకు క్రమం తప్పకుండా చెల్లించే మామూళ్ళు సరేసరి. ఇలా వ్యాపారం మొదలుపెట్టి అతను నాసిరకం వస్తువులు తయారుచేసి అధిక ధరలకు అమ్మేవాడు. లైసెన్స్ పర్మిట్ కోటా రాజ్ అమలులో ఉన్న అప్పటికాలంలో పారిశ్రామికవేత్తలదే ఇష్టారాజ్యం. వినియోగదారుడు మారుమాట్లాడే వీలుండేది కాదు. డిమాండ్‌కు తగినట్టుగా సరఫరా ఎప్పుడూ సాధ్యపడనిచ్చేవారు కాదు. ఓ కారు కొనాలంటే ప్రీమియం చెల్లించాల్సిన దుస్థితి. టెలిఫోన్ అయితే అదో లగ్జరీ వస్తువుగా భావించాల్సి వచ్చేది. సిమెంట్ కోసం ప్రజలు దుకాణాల ముందు బారులు తీరేవారు. బహిరంగ మార్కెట్‌లో చక్కెర లభించడం అపురూపంగా ఉండేది. ఆ కారణంగా అధికారుల్లో అవినీతి ఎంతగా వేళ్ళూనుకుపోయినా, వ్యాపారులు అంతో ఇంతో లాభాలు సంపాదించేవారు. 1991లో ఆర్థిక సంస్కరణలు అమలులోకి వచ్చాక లైసెన్స్ పర్మిట్ కోటా రాజ్ చాలావరకూ కనుమరుగైంది. వాణిజ్య వ్యాపార రంగాలకు అవరోధాలు తొలగాయి. దిగుమతి సుంకాలు తగ్గాయి. ఒక్కసారిగా వ్యాపార వర్గాల్లో దేశీయంగాను, అంతర్జాతీయంగానూ పోటీ పెరిగింది. పెరిగిన పోటీని తట్టుకోవడమెలా అని వ్యాపారులు మల్లగుల్లాలు పడుతున్న సమయంలో సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ అధికారులు ముడుపుల కోసం వేధింపులు ఎక్కువ చేయడంతో వ్యాపారులు అధికారులపై తిరగబడవలసి వచ్చింది.

పరోక్ష పన్నులలో అవినీతికి అడ్డూ అదుపు ఉండదు. నిజాయతీ గల వ్యాపారులను వేధించడం, కొన్ని సందర్భాలలో వారి వ్యాపారాలను మూసివేయించడం కూడా జరుగుతుంది. అయితే, పన్ను ఎగవేతదారులకు మద్దతు ఇవ్వడంవల్ల వ్యాపారంలో పోటీకి విఘాతం కలుగుతుందన్నది నిజం. అధికారులతో ఓ వ్యాపారి కుమ్మక్కై ఎక్సైజ్ సుంకాన్ని ఎగవేశాడనే అనుకుందాం. అతని పని అంతటితో ముగియదు. అతడు రహస్యంగా వ్యాపారం కొనసాగించవలసి వస్తుంది. అందుకని విద్యుత్ చౌర్యానికి పాల్పడాల్సి ఉంటుంది. ఉత్పత్తుల అమ్మకాన్ని కూడా రహస్యంగానే సాగించాలి కాబట్టి అమ్మకం పన్నును ఎగవేస్తాడు. చివరకు ఎలాగూ ఆదాయాన్ని రికార్డులకు ఎక్కించడు. కాబట్టి కార్పొరేట్ పన్నును, ఆదాయ పన్నును కూడా ఎగవేస్తాడు. ఇలా విద్యుత్ బోర్డును, రాష్ట్ర ఖజానాను కూడా దెబ్బతీస్తాడు. ఇలాంటి దొంగ వ్యాపారితో నిజాయతీగా అన్ని పన్నుల్నీ చెల్లిస్తూ వ్యాపారం చేసుకునేవారు ఎలా పోటీ పడగలుగుతారు? పోనీ... అన్ని ప్రతికూలతలనూ తట్టుకుని అంతో ఇంతో లాభాలు గడించినా, చివర్లో కార్పొరేట్ పన్ను కూడా కట్టవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో నిజాయతీపరులైన వ్యాపారులు కూడా అవినీతి దారులు తొక్కడమో, తమ వ్యాపాలను మూసివేసుకోవడమో చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇలా... అవినీతి అధికారులతో వేగలేక ఎన్నో చిన్నతరహా పరిశ్రమలు మూతపడుతున్నాయి. అవినీతి అనేది వ్యాపారంలో పోటీని నిరోధించడమే కాకుండా వినియోగదారుణ్ని, వ్యాపారిని, చివరకు రాష్ట్ర ఖజానాను నష్టాలపాలు చేస్తోంది. ఐక్యరాజ్యసమితి అవినీతి వ్యతిరేక ఉద్యమం ప్రారంభించిన సందర్భంగా సెక్రటరీ జనరల్ కోఫీఅన్నన్ మాట్లాడుతూ సమాజంలో అవినీతి ఎన్ని వ్యవస్థల్ని విచ్ఛిన్నం చేస్తుందో విశదంగా చెప్పారు. "అవినీతి ప్లేగు వ్యాధి వంటిది. సమాజాలను తుడిచిపెట్టే దుష్టశక్తి. దీనివల్ల ప్రజాస్వామ్య వ్యవస్థ చిన్నాభిన్నమవుతుంది. మానవ హక్కులు మంటగలుస్తాయి. మార్కెట్లు విచ్ఛిన్నం అవుతాయి. ప్రజల జీవన ప్రమాణాలు అడుగంటుతాయి. హింస, ఉగ్రవాదం పెచ్చరిల్లుతాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు.

## కీలక పరిణామాలు

గత మూడు దశాబ్దాలలో అవినీతి నిరోధం దిశగా రెండు చెప్పుకోదగిన పరిణామాలు సంభవించాయి. అవినీతికి కళ్ళెం వేసేందుకు ఐరోపా దేశాలు అమెరికా ప్రధామైన చట్టాలు చేయడం ఒకటి కాగా, అవినీతి భరతం పట్టేందుకు ట్రాన్స్‌పరెన్సీ

ఇంటర్నేషనల్ సంస్థ ఆవిర్భవించడం మరొకటి. అవినీతిపై ఐక్యరాజ్యసమితి ఉద్యమించడానికి ఈ రెండు సంఘటనలూ ప్రధాన కారణాలుగా కనబడతాయి. వాటర్‌గేట్ కుంభకోణంలో చిక్కుకుని నాటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ రాజీనామా చేయడం, అక్రమ ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో ఉపాధ్యక్షుడు స్పైరో అగ్న్యూ పదవిని వదులుకోవడం అమెరికన్లను ఓ కుదుపు కుదిపాయి. ఈ నేపథ్యంలో అమెరికన్ కాంగ్రెస్ 1974లో విదేశీ అవినీతి వ్యవహారాల (నిరోధక) చట్టాన్ని రూపొందించింది. కాంట్రాక్టులు, ఆర్డర్లు పొందేందుకు, లేదా వ్యాపారపరమైన ఇతర ప్రయోజనాల కోసం విదేశీ ప్రభుత్వాలకు, అధికారులకు అమెరికన్ కంపెనీలు లంచాలను ఎరగా వేయడాన్ని ఈ చట్టం నిషేధించింది. ఇది అమలులోకి వచ్చాక అనేక అవినీతి కంపెనీలకు కళ్ళెం పడింది. విదేశీ కాంట్రాక్టుల కోసం లంచాలు ఇవ్వజూపిన ఎందరో వ్యాపారవేత్తలను ఈ చట్టం కింద అరెస్టు చేసి జైలుకు పంపారు. అమెరికాకు చెందిన లాక్‌హీడ్ కంపెనీ 1970లో ఓ కాంట్రాక్టు కోసం జపాన్ ప్రభుత్వానికి పెద్దమొత్తంలో లంచాలు ఆశచూపింది. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో లాక్‌హీడ్ కంపెనీ అధికారులు జైలుపాలయ్యారు. విదేశీ కంపెనీలను ప్రలోభపెట్టడాన్ని నివారించే ఇలాంటి చట్టమేదీ ఐరోపా దేశాలలో లేకపోవడంతో, ఈ పద్ధతిని ఆ దేశాలు యథేచ్ఛగా కొనసాగిస్తూ వచ్చాయి. దీంతో విదేశీ కాంట్రాక్టుల్ని సంపాదించడంలో అమెరికన్ కంపెనీలపై ఐరోపా కంపెనీలదీ పైచేయి అయింది. ఇది గమనించిన అమెరికా ఐరోపా దేశాల సమాఖ్యపై తీవ్రంగా ఒత్తిడి తీసుకువచ్చింది. ఫలితంగా అమెరికా తరహాలో ఐరోపా దేశాల సమాఖ్య కూడా అవినీతి నిరోధానికి ఇటీవలే ఓ ఒప్పందానికి వచ్చింది. ఇక ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ఆవిర్భావం అవినీతి నిరోధం దిశగా పడిన మరో ముందగుడు' తొమ్మిదో దశకం తొలినాళ్ళలో ప్రారంభమైన ఈ సంస్థ వివిధ దేశాలలో అవినీతిని సర్వేలు నిర్వహించడం ద్వారా గుర్తించి, వాటిని ప్రచురించడం ప్రారంభించింది. ఇలా అవినీతిని వెలికితీయడంతోపాటు అవినీతి స్థాయిని బట్టి ఆయా దేశాలకు ర్యాంకులు ఇవ్వడం, లంచాలు ఇవ్వడాన్ని, తీసుకోవడాన్ని అరికట్టేందుకు చేపట్టిన పలు చర్యలు, ప్రజలలో చైతన్యం రేకెత్తడానికి దోహదం చేశాయి. అవినీతిపై పోరాటం జరిపేందుకు ప్రభుత్వాలను సమాయత్తం చేయడంలో ప్రజల పరంగానూ, పరిస్థితుల పరంగానూ వచ్చే ఒత్తిడులు దోహదం చేస్తాయనడానికి ఇది ఒక నిదర్శనం.

## ప్రక్షాళనకు సంస్కరణలు

నిజానికి, ఇప్పుడు అవినీతిరహిత రాజ్యాలుగా వెలుగొందుతున్న అభివృద్ధి చెందిన దేశాలన్నీ ఒకప్పుడు అవినీతిలో పీకలవరకూ కూరుపోయినవే. ఉదాహరణకు 19వ శతాబ్దం మధ్యలో బ్రిటన్‌లో అవినీతి తాండవించేదా. 1868-1892 మధ్యకాలంలో బ్రిటన్ ప్రధానికిగా నాలుగు దఫాలుగా పనిచేసి గ్లాడ్‌స్టన్ అవినీతిని అంతమొందించేందుకు పాలనాపరంగా, రాజకీయపరంగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. శతాబ్దం కిందట ఆయన వేసిన పునాదులపైనే ఆధునిక బ్రిటన్ నిర్మాణం జరిగింది. అమెరికాలో కూడా వంద సంవత్సరాల కిందట అవినీతి రాజ్యమేలేది. అమెరికన్ ఉమెన్ ఓటర్స్ లీగ్ వంటి ఎన్నో సామాజిక సంస్థలు ప్రజాభిప్రాయన్ని కూడగట్టి, అవినీతిని దునుమాడేందుకు ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చాయి. మన దేశంలోనూ అవినీతిని అంతమొందించి, ఆధునిక భారతాన్ని నిర్మించవచ్చు. అయితే అందుకు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు చిత్తశుద్ధితో, దీక్షాదక్షతతో కృషి చేయవలసి వుంటుంది. ముందుగా పరోక్ష పన్నులు, మౌలిక సదుపాయాల కల్పన, న్యాయ సహాయం త్వరితగతిన అందించడం, తదితర అంశాలపై దృష్టి సారించాలి. వృద్ధి రేటును తొమ్మిది శాతానికి లేదా అంతకుమించి సాధించగల శక్తియుక్తులు మనకున్నాయి. కష్టనష్టాలకు వెరవకుండా దృఢ సంకల్పంతో కృషి చేస్తే, అవినీతిని నిరోధించడం సాధ్యమే. ఆర్భాట ప్రకటనలతో, ఊకదంపుడు ఉపన్యాసాలతో మాత్రం మన సాధించేదేమీ ఉండదు.

* * *

# ప్రజాస్వామ్యంలో స్వాహారాయుళ్ల స్వైరవిహారం

ఫిబ్రవరి 26, 2001

రాష్ట్రంలో పెట్రోలు బంకులు, వంటగ్యాసు పంపిణీ డీలర్‌షిప్పుల ఎంపిక తెలుగుదేశం, బి.జె.పిల మధ్య వివాదాల్ని రేకెత్తిస్తోందని పత్రికలలో వార్తలు వచ్చాయి. మన పరిపాలన తీరుతెన్నుల్ని పరిశీలించాలంటే పెద్దగా పాండిత్యం అవసరం లేదు. ఇలాంటి ఏదో ఒక అంశాన్ని పట్టుకుని తుదకంటూ లాగితే డొంకంతా కదులుతుంది. ఈ డీలర్ల ఎంపిక మూడు ప్రాంతీయ బోర్డుల ఆధ్వర్యంలో జరుగుతోంది. ఈ బోర్డులకు రిటైరయిన న్యాయమూర్తులు అధ్యక్షులు. ఆయిల్ కంపెనీల అధికారులు ఇతర సభ్యులు కాని అధ్యక్షుడికే ఎక్కువ మార్కులు వేసే అవకాశం ఉండటంతో ఆయనదే పైచేయి. ఆ అధ్యక్షుల్ని నియమించేది కేంద్ర ప్రభుత్వం. ఈ పదవుల కోసం ఎన్నో పైరవీలు! ఒకసారి ఈ ఎంపిక చేసే ప్రాంతీయ బోర్డులను నెలకొల్పాక డీలర్ల నియామకానికి సాధారణంగా అనుసరించే మార్గాలు రెండు. మొదటిది లక్షల రూపాయల లంచం. ఒక్కో డీలరుషిప్పు కోసం పది లక్షల రూపాయలు, కాస్త గిరాకీ ఉన్న ప్రాంతమయితే ఇంకా ఎక్కువ ముడుపులు అందుతాయి. రెండోది రాజకీయవేత్తల సిఫారసు. ఇది కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉంది కాబట్టి పార్లమెంటు సభ్యులు కాని, కేంద్రమంత్రులుగాని సిఫారసు చేయాలి. సహజంగానే అధికార పార్టీకి చెందినవారి మాట చెల్లుతుంది. అతి కొద్దిమంది, ముఖ్యంగా మాజీ సైనికులు లాంటివారు మాత్రం నిజాయతీగా ఎంపికవుతుంటారు. అత్యధిక కేసులలో డబ్బు, పలుకుబడి పనిచేస్తాయి.

కల్తీలతోపాటు కొలతల్లోనూ అక్రమాలు ఆయిల్ కంపెనీలు కేంద్ర పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలో ఉంటాయి. ఈ వ్యవహారాలకు సంబంధించి తుది నిర్ణయం పెట్రోలియం మంత్రిదే. సెలక్షన్ బోర్డుల అధ్యక్షుల పని సభ్యులను నియమించటం, డబ్బులు రాబట్టడం, అస్మదీయుల సిఫారసులందుకోవటం, ఎవరిని నియమించాలో నిర్దేశించటం, కావలసిన వాళ్లను ఎంపిక చేయించటం, ఇవన్నీ పెట్రోలియం మంత్రి చేతుల్లోనే ఉంటాయి. ఇక సెలక్షన్ బోర్డు సభ్యులు లంచాలు తినటం, డబ్బులిచ్చిన

వాళ్లనే ఎంపిక చేయటం ఈ డీలర్‌షిప్పుల గురించి పరిచయం ఉన్నవారందరికీ తెలుసు. పేరుకు అర్హతలంటూ నిర్దేశిస్తారు. సమాజంలో దళితులకు, గిరిజనులకు, మాజీ సైనికులకు, వికలాంగులకు, ఇతర వర్గాలవారికి కొన్ని డీలర్‌షిప్పులు కేటాయిస్తారు. కాని వాస్తవానికి చాలా సందర్భాలలో డబ్బు చేతులు మారుతుంది. ఏదోవిధంగా ఉపాధి దొరుకుతుందని, అక్రమంగా డబ్బు సంపాదించవచ్చని ఆశతో ఎందరో లక్షల రూపాయలు ముట్టచెప్పటానికి సిద్ధపడతారు. వివిధ వర్గాలకు, స్థానాలకు కేటాయించినా, డబ్బులిచ్చి వారి పేర్లతో బినామీగా పెట్రోలు బంకులు, వంటగ్యాసు డీలర్‌షిప్పులు నడపటం కద్దు. ఇలాంటి ఎన్నో డబ్బు సంపాదించే మార్గాలున్నాయి కాబట్టే, కేంద్రంలో పెట్రోలియం శాఖకు చాలా గిరాకీ ఉంటుంది. గతంలో పి.వి. నరసింహారావు ప్రభుత్వంలో సతీశ్‌శర్మ పెట్రోలియం శాఖ మంత్రిగా పనిచేసినప్పుడే డీలర్ల ఎంపికలో అవతవతలకు పాల్పడినట్లు రుజువు కావటంతో ఆయనను దోషిగా నిర్ణయించి రూ. 50 లక్షల జరిమానా విధించింది. సుప్రీంకోర్టు. మళ్లీ అదే సుప్రీంకోర్టు కొన్ని సాంకేతిక కారణాలను చూపి ఆయనను దోష విముక్తుడిని చేసింది. ఇక ఇలా డీలర్‌షిప్పులు సంపాదించినవారు ఏం చేస్తారో తెలుసుకుంటే అసలు బాగోతం బయటపడుతుంది. ఎలాగోలా ఒక డీలర్‌గా ఎంపికయితే ఇక జీవితంలో పంట పండినట్లే. ప్రజలకు వంటగ్యాస్ కొత్తగా ఇచ్చే రోజుల్లోనయితే డీలర్ల సంపాదనకు అడ్డే ఉండదు. గతంలో గ్యాసు కనెక్షను కావాలన్నా, రెండో సిలిండర్ కావాలన్నా ఎంతో కష్టమయ్యేది. అందుకోసం డీలరుకు ప్రీమియంగా కొన్ని వేలు ముట్టజెప్పాల్సి వచ్చేది. ఈ విధంగా కోట్ల రూపాయలు గడించిన వాళ్లున్నారు. ఆ తరువాత వంటగ్యాస్‌ను అక్రమంగా హొటళ్లకు, ఖరీదైన ఇళ్లకు, ఇతరులకు ఎక్కువ ధరకు చీకటి బజారులో అమ్ముకోవటం పరిపాటి. వంటగ్యాసుమీద ప్రభుత్వ సిబ్సిడీ ఉంది. ప్రభుత్వం ద్వారా తప్ప వేరే విధంగా గ్యాసు సరఫరా లేకపోవటం చేత గ్యాసు కోసం నానాతిప్పలు పడాల్సి వచ్చేది. డీలర్లకు లక్షల సంపాదన ఉండేది. ఇక ఇళ్లకు గ్యాసు అందించాలంటే రెండు రకాల అక్రమాల ద్వారా డబ్బును ఆర్జించవచ్చు. సిలిండరు ఖాళీ అయినప్పుడు రిజిస్టరులో నమోదయిన వరుసక్రమం ప్రకారం కొత్త సిలిండరును అందించాలి. ఇక అదనంగా డబ్బు తీసుకుని వెనకవచ్చిన వాళ్లకు ముందుగా సరఫరా చేస్తుంటారు. అలాగే అసలు ప్రభుత్వ నిర్దేశించిన ధరకన్నా ఎక్కువ వసూలు చేసి అక్రమార్జన చేస్తుంటారు. ఇలా కేవలం గ్యాసు డీలర్‌షిప్ వచ్చినందువల్లనే కోటీశ్వరులయిన వాళ్లున్నారు. ఇంతటి అవకాశాలున్నాయి కాబట్టే

ఒక్కో డీలర్‌షిప్పుకోసం పది లక్షల రూపాయలు, ఆపైన లంచం ఇచ్చేందుకు కూడా వెనకాడరు. పెట్రోలు, డీజిల్ డీలర్ల సంగతి సరేసరి. రెండు రకాలుగా డీలర్లు అక్రమార్జన చేయవచ్చు. మొదటిది కొలతలు చూపే మీటర్లను గోల్‌మాల్ చేసి ఎక్కువ పోసినట్లుగా చూపెట్టడం. ఆ రకంగా మీటరు 10 లీటర్లు చూపెడితే వాస్తవానికి తొమ్మిది లీటర్లే ట్యాంకులో పడుతుంది. మీటరు చూపిన ప్రకారం డబ్బు చెల్లించటం వాహనదారుకు తప్పనిసరి. ఇలా మోసం చేసిన డబ్బులు కొంత డీలరు, మరికొంత తూనికలు, కొలతలు తనిఖీచేసి మీటర్లను నియంత్రించే శాఖ అధికారులు పంచుకోవటం అనవాయితీ. ఎవరన్నా డీలరు నిజాయతీగా పంపిణీ చేద్దామనుకున్నా అవినీతిపరులయిన అధికారుల నుంచి ఒత్తిడి ఉంటుంది. వినియోగదార్లను మోసం చేసి ఎవరి వాటా వారికి సమర్పించుకోకపోతే ఏదో ఒక విధంగా తప్పులుపట్టి ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్లు తాగిస్తారని భయం! రెండేళ్ల క్రితం ఈ పెట్రోలు బంకుల్లో కొలతల మోసాన్ని నివారించటం కోసం లోక్‌సత్తా ఉద్యమం చేపట్టింది. అనాటివరకు రాష్ట్రంలో ఉన్న దాదాపు 1500 పెట్రోలు బంకులలో 90 శాతం పైగా కొలతల్లో మోసం చేసేవారు. ప్రభుత్వ శాఖ, డీలరు కలిసిపోయి లాలూచీపడేవారు. హైదరాబాద్ నగరంలో ఆనాటికి ఉన్న 104 పెట్రోలు బంకులలో కేవలం మూడు బంకుల్లో మాత్రమే నిజాయతీగా పెట్రోలు అందుతుందని ప్రజలు నమ్మేవారు. అందుకే ఆ బంకుల ముందు శని, ఆదివారాల్లో ఎన్నో వాహనాలు బారులుతీరి ఉండేవి. లోక్‌సత్తా చిన్న ప్రయత్నంతో పెట్రోలు బంకులలో కొలత మోసాన్ని చాలావరక అరికట్టగలిగింది. ముందుగా కొలిచిన ఒక లీటరు, ఐదు లీటర్లు, పది లీటర్ల పాత్రలను తీసుకుని వాటిల్లో పెట్రోలు పోయమని కోరటంతో మీటర్లలో మోసం బయటపడుతుంది. ఓ పద్ధతి ప్రకారం ఈ చిట్కాను అనుసరించటంతో అనతికాలంలోనే రాష్ట్రంలో అన్ని పెట్రోలు బంకులలోను మీటర్లను సరిచేశారు. అడపాదడపా లోక్‌సత్తా కార్యకర్తలు ఈ మీటర్లను ఈ విధంగా తనిఖీ చేస్తుండడంతో కొలతల్లో మోసం చాలావరకు ఆగిపోయింది. ఒక్క ఈ ప్రయత్నంవల్ల ప్రతిరోజు వాహనదారులకు దాదాపు కోటి రూపాయల నష్టం కలుగకుండా నివారించవచ్చునంటే ఈ రంగంలో ఎంత అక్రమ లాభాలు సంపాదించవచ్చో తెలస్తుంది. ఇక పెట్రోలు బంకుల్లో అక్రమార్జన కోసం పాల్పడే రెండో మోసం కల్తీ. పెట్రోలు ధర హైదరాబాద్ నగరంలో లీటరుకు రూ. 31.70 అదే కిరోసిన్ ధర సబ్సిడీవల్ల చాలా తక్కువ. కిరోసిన్‌ను పెట్రోలులో కలిపితే డీలరుకు వచ్చే లాభం

అపారం. ఆమేరకు వాహనం చెడిపోతుంది. వాతావరణంలో కాలుష్యం పెరుగుతుంది. ఇవన్నీ జనం సమస్యలు. కాని పెట్రోలు డీలరుకు మాత్రం లీటరుకు రూ. 15 నుంచి 20 దాకా లాభం ఉంటుంది. ఈ కల్తీని కనుక్కోవటం కొంచెం కష్టం కాబట్టి ప్రజలను సులభంగా మోసం చేసి అక్రమంగా ఆర్జించవచ్చు. ఇలా ఆయిల్ కంపెనీల డీలర్ల ఎంపికపై చెలరేగుతున్న దుమారంతో ప్రారంభిస్తే చివరికి ఏం జరుగుతుందో ఎంత అవినీతికి, దోపిడీకి మనం గురవుతున్నామో, సమాజం ఎంతగా నష్టపోతోందో తెలుస్తుంది. ఇలాంటి సంపాదనకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి కాబట్టే రాజకీయ పదవులంటే ఇంత గిరాకీ, మోజు. ఎన్నికలు వస్తున్నాయంటే పార్టీల ఆఫీసుల ముందు వందలమంది పడిగాపులు కాస్తారు. ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి, అడ్డమయిన వాళ్ల కాళ్లు పట్టుకుని, లక్షలు ఖర్చుపెట్టి సీట్ల కోసం తంటాలు పడతారు. కొన్ని పార్టీలు కలిసి కూటమిగా పోటీ చేస్తే ఏ పార్టీకి ఎన్ని సీట్లు కేటాయించాలని మల్లగుల్లాలు, తర్జనభర్జలు పడతారు. తమిళనాడులో ప్రస్తుతం జరుగుతున్న సీట్ల పంపిణీ బాగోతాన్ని చూస్తే ఈ విషయం చప్పున బోధపడుతుంది. నానాతంటాలు పడి చివరికి టికెట్ సంపాదిస్తే ఆపైన విపరీతంగా డబ్బు ఖర్చుపెట్టి గెలవాలి. ఓ అసెంబ్లీ సీటుకు కోటి రూపాయలు ఖర్చు పెట్టడం పెద్ద విచిత్రమేమీ కాదు. ఓసారి అలా ఖర్చుపెట్టి ఓడిపోయే రిస్కు తీసుకుని చివరికి గెలిచాక, అందుకు ఎన్నో రెట్లు డబ్బు సంపాదించాలి. అలా చేస్తేగాని రాజకీయం గిట్టుబాటు కాదు. అలా సంపాదించాలంటే ప్రతి ప్రభుత్వ నిర్ణయంలో డబ్బులు గుంజాలి. ఆయిల్ డీలర్ల నియామకం దగ్గర్నుంచి నేరాలలో పెట్రోల్‌దాకా, పరిశ్రమలకు లైసెన్సులు, పర్మిట్ల దగ్గర్నుంచి రోజువారీ తనిఖీలు, మామూళ్లదాకా ప్రతిఅంశంలో డబ్బు గుంజాలి. దాని పర్యవసానం వస్తువుల ధరలు పెరగటం, నాణ్యత తగ్గటం, ప్రజలకు ప్రతి ప్రభుత్వ సేవలో వేధింపులు ఎదురవటం!

## ఎవరిపని వారు చేసేదెప్పుడు?

అసలు ఆయిల్ కంపెనీలకు ప్రభుత్వంతో సంబంధమేమిటి? మిగిలిన వస్తువులలాగా వివిధ కంపెనీలు పోటీపడి మార్కెట్‌లో అమ్ముకుంటే ఈ గొడవంతా సమసిపోతుంది కదా? ఆ విధంగా పోటీ ఉంటే సరసమయిన ధరకు సరైన వస్తువులు, సేవలు అందుతాయి కదా? అక్కడే అసలు కిటుకుంది. మరి రాజకీయవేత్తలు కోట్లు సంపాదించుకోవాలంటే ఇవన్నీ ప్రభుత్వం చేతుల్లో ఉండాలి. అప్పుడే ఎన్నికల్లో పెట్టే పెట్టుబడి, రాజకీయం పేరుతో చేసే వ్యాపారం గిట్టుబాటవుతాయి. చివరికి ఈ పరిస్థితివల్ల ప్రజలకు ఒరుగుతున్నదేమిటి? ఎన్నికయిన వాళ్లకు, అధికారులకు,

ఉద్యోగులకు అసలు ప్రభుత్వం చేయవలసిన పనులమీద శ్రద్ధ లేదు. ప్రజలకు సకాలంలో న్యాయం అందటం, నేర పరిశోధన నిజాయతీగా, సమర్థంగా చేసి సమాజంలో శాంతిభద్రతల్ని కాపాడటం, ప్రతి బిడ్డకు కనీస ప్రమాణాలతో అక్షరజ్ఞానం అందటం, ప్రతి పౌరుడికి ఆరోగ్యసేవలు అందుబాటులోకి తేవటం, ఉపాధికల్పనకు, సంపద సృష్టికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించటం, సహజ వనరుల అభివృద్ధికి ఏర్పాట్లు చేయటం, చట్టబద్ధ పాలననందించి ప్రజలందరికీ నిష్పాక్షికంగా న్యాయం చేయటం – ఇవి ప్రభుత్వాల నిజమయిన కర్తవ్యాలు. కాని ఈ పనుల్ని చిత్తశుద్ధితో చేస్తే పాలకులకు ఇబ్బందులున్నాయి. ఇవన్నీ చేస్తే అధికారం బాధ్యత అవుతుంది తప్ప, అందులో మజా లేదు. రాజకీయం ముళ్లకిరీటంగా తయారయితే ఇక దానిలో లాభం ఏముంటుంది. జనానికి విద్య, ఆరోగ్యం అందుబాటులోకి వచ్చి, మౌలిక సదుపాయాలు ఏర్పడి, ఉత్పత్తి, ఉపాధి పెరిగితే ఇక అధికారంలో ఉన్నవాణ్ని ప్రజలెందుకు లెక్కచేస్తారు? అప్పుడీ రాజకీయ క్రీడలో సుఖం ఏముంది? మన అధికారం 'మనవాళ్ల' కోసం ఉపయోగపడకపోతే, పదవివల్ల రెండు చేతులా సంపాదించుకోలేకపోతే ఒక ఈ తిప్పలెందుకు? – ఇదీ మన రాజకీయం అసలు రంగు. ఇదీ మన పాలన వెనక ఉన్న బండారం. గుర్రం పని గుర్రం, గాడిద పని గాడిద, కుక్క పని కుక్క చేయాలి. లేకపోతే అందరికీ అనర్థమే. ఈ పరిస్థితి మారాలంటే ఎన్నికల్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలి. ప్రభుత్వం తన పని తాను చేయాలి. ప్రజలు కళ్లు తెరిచి సంఘటితంగా నిలదీయాలి.

* * *

# చట్టసభల్లో అవినీతిని అడ్డుకునే చర్యలేవి?

**మే 8, 2000**

సుప్రీంకోర్టు ఇటీవల ఓ కేసు విచారణ సందర్భంగా పార్లమెంటు సభ్యుల హక్కుల పరిమితులను నిశితంగా పరిశీలించాలని నిర్ణయించింది. గతంలో పి.వి. నరసింహారావు ప్రభుత్వాన్ని విశ్వాస పరీక్షలో గట్టెక్కించేందుకు జార్ఖండ్ ముక్తిమోర్చాకు చెందిన లోక్‌సభ సభ్యులకు పెద్దయెత్తున లంచాలిచ్చారని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. వారికి ముట్టిన ముడుపులను బ్యాంకు ఎకౌంట్లతో సహా రుజువు చేయగలిగారు. అయినా, లోక్‌సభలో అనుకూలంగా ఓటు చేయటానికి లంచం తీసుకున్న సభ్యులను శిక్షించలేమని 1998లో 3-2 మెజారిటీతో అయిదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. దాంతో ఓ విచిత్ర పరిస్థితి నెలకొంది. లంచాలిచ్చారన్న కారణంగా మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు, తదితరులపై న్యాయస్థానాలలో విచారణ సాగుతోంది. కాని లంచం పుచ్చుకున్నట్లు రుజువైన వాళ్ళకు మాత్రం శిక్షపడదు. ఇది ఎంత వరకు సబబనే ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతుంది. లంచం తీసుకున్నవాళ్ళను వదలివేసి, లంచం ఇచ్చినవాళ్ళను మాత్రమే శిక్షించడం చూసే ఎవరికయినా అన్యాయమనిపిస్తుంది.

## లంచం తీసుకుంటే నేరం కాదా?

ఇటీవల కాలంలో కొందరు లంచం తీసుకున్న వారికంటే ఇచ్చేవారే శిక్షార్హుడని వాదిస్తున్నారు. కాస్తంత లోతుగా పరిశీలిస్తే ఈ వాదన పస లేనిదని తేలిపోతుంది. నూటికి తొంభైమంది గతిలేక, వేరే మార్గం దొరకక, వేధింపులకు లొంగి, ఆలస్యాన్ని లేదా అన్యాయాన్ని తట్టుకునే శక్తి లేక లంచాలివ్వటానికి సిద్ధపడుతున్నారు. ఓ చిన్న సర్టిఫికెటుకో, పనికో లంచం ఇవ్వకపోతే పదిసార్లు పని మానుకుని తిరగాల్సి వస్తుంది. అన్నిసార్లు అధికారుల్ని, గుమాస్తాలని కలిసి అభిమానం చంపుకొని తలదించుకుని అభ్యర్థించినా పని జరగదు. మిగిలిన పనులు, వ్యాపారాలు ఆగిపోతాయి. లంచం రూపంలో పోయే డబ్బుకన్నా పది రెట్లు నష్టం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో సకాలంలో పని జరగక పూడ్చలేని నష్టం సంభవించవచ్చు.

ఉదాహరణకు – నివాస సర్టిఫికెటు లేకపోతే ఓ విద్యార్థికి కాలేజీ సీటు పోవచ్చు, లేదా ఓ నిరుద్యోగికి ఉద్యోగం దొరక్కపోవచ్చు. ఇలాంటి పరిస్థితులలో గత్యంతరం లేక చాలామంది మధనపడుతూనే మరేం చేయాలో తోచక లంచాలు సమర్పించుకుంటున్నారు. కొద్దిమంది మాత్రం అన్యాయపు లాభాలను ఆశించి ప్రజాధనం కొల్లగొట్టడం కోసం అధికార యంత్రాంగంతో లాలూచీపడి లంచాలిచ్చి సొంత పనులు చేయించుకోవచ్చు. కాని ఎక్కువ సందర్భాలలో లంచాలు మరో మార్గం లేక ఇచ్చేవే. అలాంటప్పుడు లంచం ఇచ్చినవాళ్లను దోషులుగా పేర్కొని, లంచం మింగిన వాళ్లపై కేసులు పెట్టరాదని సుప్రీంకోర్టు తీర్పివ్వటం సహజంగానే చాలామందిని నిరాశకు, ఆగ్రహానికి గురిచేసింది. పార్లమెంటు సభ్యులు ముడుపుల కేసులో ఇచ్చినవాళ్లు, పుచ్చుకున్న వాళ్లు లాలూచీపడి మన ప్రజాస్వామ్యాన్ని మంటగలిపారు. అదీ కాక సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులో లంచం తీసుకున్న వ్యక్తి నిర్దోషి అని పేర్కొనలేదు. రాజ్యాంగంలోని 105వ అధికరణం ప్రకారం పార్లమెంటు సభ్యులకు సంక్రమించిన హక్కుల విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవటం సాధ్యం కాదనే అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇప్పుడు ఆ అంశాన్ని మరోమారు ఇంకో రాజ్యాంగ ధర్మాసనం కూలంకషంగా పరిశీలించాలని నిర్ణయించారు. రాజ్యాంగంలోని 105 (1)వ అధికరణం ప్రకారం రాజ్యాంగంలో విధించిన పరిమితులకు లోబడి, పార్లమెంటు స్వయంగా ఏర్పరచుకున్న నియమనిబంధనలకు లోబడి, పార్లమెంటు సభ్యులకు పార్లమెంటులో పూర్తి వాక్స్వాతంత్ర్యం ఉంటుంది. అలాగే 105(2)వ అధికరణం ప్రకారం ఓ పార్లమెంటు సభ్యుడు సభలో చేసిన ప్రసంగం కారణంగా కాని, వేసిన ఓటు కారణంగా కాని అతనిపై న్యాయస్థానంలో ఎలాంటి చర్య తీసుకోరాదు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఓ సభ్యుడు పార్లమెంటులో వేసిన ఓటు అతడి వాక్స్వతంత్ర్యంలో భాగం. అలాంటప్పుడు అతడు వేసే ఓటు కారణంగా శిక్షించరాదు. ఫిరాయింపుల నిరోధక చట్టం (రాజ్యాంగలో 52వ సవరణ ద్వారా చేర్చిన పదో షెడ్యూలు) ప్రకారం పార్టీ ఆదేశాన్ని ధిక్కరిస్తే అతడి సభ్యత్వం రద్దు కావచ్చు. ఎందుచేతంటే సభ్యుడి వాక్స్వాతంత్ర్యం రాజ్యాంగంలో నిర్దేశించిన పరిమితులకు లోబడి ఉంటుంది. అలాగే ఓ సభ్యుడు లంచం తీసుకుని సభలో ఓ ప్రశ్న వేసినా అతణ్ని అవినీతి పేరుతో శిక్షించే వీలు లేదు. కారణమేమంటే సభలో ప్రశ్నలు వేయటం సభ్యుడిగా అతడి వాక్స్వాతంత్ర్యం లో భాగం. అందుకు ఏ పరిమితులూ లేవు. 212వ అధికరణం ప్రకారం పార్లమెంటులో సుప్రీంకోర్టు

లేదా హైకోర్టు జడ్జి విధినిర్వహణలో చర్చ జరగరాదు. ఆ జడ్జిని తొలగించాలనే అభిశంసన తీర్మానం ప్రవేశపెడితే, దానిపై చర్చ జరగవచ్చు. రాష్ట్ర శాసనసభలకు కూడా ఇలాంటి నిబంధనలే ఉన్నాయి. ఇలా పార్లమెంటు సభ్యులకు కొన్ని ప్రత్యేక సందర్భాలలో మినహాయించి సభలో పూర్తిగా వాక్స్వాతంత్ర్యం, ఇష్టం వచ్చినట్లు ఓటు వేసే స్వాతంత్ర్యం ఉన్నాయి.

## సభాహక్కుల సంప్రదాయం

ఆ సభా హక్కుల సంప్రదాయం బ్రిటన్ నుంచి సంక్రమించింది. బ్రిటన్‌లో రాచరికం ఇంకా బలంగా ఉండి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వేళ్లూనుకోని కాలంలో ఆనాటి రాజు సభ్యులను అరెస్టుచేసేందుకు ప్రయత్నించిన సందర్భాలున్నాయి. దాంతో బ్రిటిష్ రాజు లేదా రాణి దిగువసభ అయిన హౌస్‌ఆఫ్ కామన్స్‌లో కనీసం అడుగు కూడా పెట్టరాదని చట్టం చేశారు. పార్లమెంటు, ప్రభుత్వం రాజుకు విధేయులుగా ఉన్నా, రాజు మాత్రం సభలో అడుగుపెట్టరాదు. అందువల్లే బ్రిటిష్‌రాణి సాంప్రదాయకంగా ప్రతి ఏటా ఉభయసభలనుద్దేశించి చేసే ప్రసంగం ఎగువసభ అయిన హౌస్‌ఆఫ్ లార్డ్స్‌లోనే జరుగుతుంది. ఆ సభలో కూర్చునే సీట్ల సంఖ్య రెండు సభల సభ్యులకు చాలక వందల మంది బల్లలమీద ఎక్కి నుంచుని మరీ రాణి ప్రసంగాన్ని వింటారు. అలాగే రాజు ఆగ్రహానికో, మరో ముఠా, బలనికో లొంగిపోవనసరం లేకుండా ఎన్నికయిన ప్రతినిధులకు కొన్ని హక్కుల్ని రూపొందించారు. ఆధునిక యుగంలో మాంటెస్క్యూ ప్రతిపాదించిన అధికారాల విభజన సూత్రాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులయ్యాయి. అంటే చట్టసభ, చట్టాలను అమలుచేసే ప్రభుత్వం, న్యాయ నిర్ణయం చేసే న్యాయ వ్యవస్థ విడివిడిగా ఉండాలి. ఏ ఒక్కటీ అతిగా బలపడరాదు; ఇతర సంస్థల పనిలో జోక్యం చేసుకోరాదు. ప్రతి సంస్థకు తన బాధ్యతల నిర్వహణలో స్వేచ్ఛ ఉండాలి; పరిమితులు దాటితే ఎదుర్కోవటానికి ఇతర సంస్థలకు అవకాశాలుండాలి. ఈ సిద్ధాంతం ప్రకారం పార్లమెంటు పనితీరుపైన, సభ్యుల ఓటింగు తీరుపైన న్యాయస్థానాలకు ఎలాంటి అదుపూ ఉండరాదు. అలాగే న్యాయమూర్తుల పనితీరుపైన పార్లమెంటులో వ్యాఖ్యలు, విమర్శలు చేయరాదు. ప్రజాస్వామ్య సూత్రాలరీత్యా, అధికార విభజనరీత్యా, రాజ్యాంగ నియమాల రీత్యా. సంప్రదాయ రీత్యా పార్లమెంటులో, రాజ్యాంగ నియమాల రీత్యా, సంప్రదాయం రీత్యా పార్లమెంటులో, రాష్ట్ర శాసనసభలలో సభ్యుల ప్రవర్తనపైన న్యాయస్థానాలకు ఎలాంటి అధికారాలు లేకపోవటం సబబే. కాని సభ్యులు లంచం తీసుకుని ఓటు వేసినా అది

అతడి వాక్స్వాతంత్ర్యంలో భాగంగా ఉంటుందని, అతడికి ఏ శిక్షా వర్తించదని భావించటం మాత్రం కచ్చితంగా రాజ్యాంగానికి అపచారమే! దాన్ని మనం అంగీకరిస్తే ఏ శాసనసభ్యుడయినా, పార్లమెంటు సభ్యుడయినా నిర్లజ్జగా నిర్భయంగా లంచాలు మింగవచ్చు అతడు కేవలం ఎన్నికయిన సభ్యుడయిన కారణంగా మనం గుడ్లప్పగించి కూర్చోవటం తప్ప మరేమీ చేయలేము. డబ్బు తీసుకుని ఓటు వేసేవారు. లేదా ప్రశ్న వేసేవారు, లేదా ప్రభుత్వాన్ని, ఇతర పార్టీలను బెదిరించేవారు చేస్తున్నది వాక్స్వాతంత్ర్యాన్ని పరిరక్షించటం కాదు; డబ్బు తిని ప్రజాస్వామ్యాన్ని అమ్మడమే. ఓటు వేసి గెలిపించిన పాపానికి ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. ఇందులో భావప్రకటన, స్వేచ్ఛ ఎక్కడా లేవు. నిజానికి డబ్బుకు అమ్ముడుపోయి ఓటు వేసేవారు ఆ స్వేచ్ఛను హరిస్తున్నారు. రాజ్యాంగంలోని 105 (2)వ అధికరణం ప్రకారం పార్లమెంటు సభ్యుడు సభలో వేసిన ఓటుపైన, చేసిన ప్రసంగంపైన ఎలాంటి న్యాయపరమైన విచారణ జరగరాదు. అయితే అతడు లంచం తీసుకోవటానికి సభలో వాక్స్వాతంత్ర్యానికి, ఓటు వేసే హక్కు పేరుతో సభ్యుడికి లంచం తీసుకునే హక్కును ప్రసాదించటం అసంబద్ధం. లంచం తీసుకోటానికి, ఇష్టం వచ్చినట్లు ఓటు వేసే హక్కును మధ్య తేడాను సుప్రీంకోర్టు గుర్తించలేకపోవటం విడ్డూరం. ఇలాంటి వితండవాదనలే రాజ్యాంగాన్ని భ్రష్టుపట్టించి ప్రజాస్వామ్యాన్ని ఆపహాస్యం చేస్తున్నాయి. వేసిన ఓటుపై విచారణ చేయరాదనటం నిజాయతీకి సమాధి కట్టటమే. మన రాజ్య వ్యవస్థలో అవినీతి అంతం కావాలనే ఆలోచన మన చట్టసభలకు, ప్రభుత్వాలకు లేనే లేదు. అందుకే అవినీతికి పాల్పడ్డ అధికారిపైన నేరం మోపాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి కావాలి. సుప్రీంకోర్టు 1998 నాటి తీర్పు దురదృష్టవశాన చట్టసభలలో అవినీతికి మరింత ఊతం ఇచ్చింది.

## అవినీతికి చట్టబద్ధత !

ప్రపంచంలో పరిణతి చెందిన అన్ని ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికయిన వాళ్ల అవినీతిని నిరోధించే పకడ్బందీ ఏర్పాట్లున్నాయి. ఎన్నికలలో పాల్గొన్ననాటినుంచి పదవీ విరమణ చేసే వరకు సభ్యుల ఆస్తులు, ఆదాయ వివరాలు ప్రకటించాలి. ఏ చిన్న బహుమానం వచ్చినా, ఎలాంటి ఆదాయం వచ్చినా బహిర్గతం చేయాలి. లంచం ఏ రూపంలో తీసుకున్నా పదవి ఊడటం ఖాయం. ఇలా కఠిన నిబంధనలను అమలు చేస్తున్నందువల్లే ఆ దేశాలలో రాజకీయం స్వచ్ఛంగా ఉంది. రాజకీయాల్లో పాల్గొనాలంటే ఆ దేశాలలో వ్యక్తిగతంగా ఎంతో నష్టానికి గురికావలసి వస్తుంది. మనదేశంలో ఎందుకూ కొరగాని

వాళ్లు, నిజాయతీగా మరే సంపాదనా చేతకాని వాళ్లు రాజకీయాల్లోకి ప్రవేశించి అచిరకాలంలో కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే చట్టసభ సభ్యుల ఆదాయం, ఆస్తుల విషయంలో కఠినమైన నిబంధనలను వెంటనే అమలు చేయటం అవసరం. పార్టీలు కాని, అభ్యర్థులు కాని, ఎన్నికయిన ప్రతినిధులు కాని, ప్రభుత్వాలనేతలు కాని తీసుకునే ప్రతిపైసాకు పెట్టే ప్రతి ఖర్చుకు ఖచ్చితమైన లెక్కలు, జమా ఖర్చుల వివరాలు విధిగా ప్రజల ముందుంచాలి. జర్మనీలో మాజీ ఛాన్సెలర్, క్రిస్టియన్ డెమోక్రాట్ల నాయకుడు హెల్మట్ కోల్ లంచం తీసుకోకపోయినా, నిధుల వసూళ్ల నిబంధనలను ఉల్లంఘించినందుకే తీవ్ర అవమానికి గురై పెద్దయెత్తున జరిమానా చెల్లించారు. అలాంటిది మనదేశంలో సాక్షాత్తు కోట్ల రూపాయల లంచం మింగినవాళ్లకు కూడా శిక్షలు వేయరాదని నిర్ణయిస్తే ఇక రాజకీయ అవినీతికి చట్టబద్ధత కల్పించినట్లవుతుంది. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇప్పటికయినా గతంలో చేసిన పొరపాటును సరిదిద్దుకుని రాజకీయంలో అవినీతికి అడ్డుకట్టవేస్తుందని ఆశిద్దాం.

* * *

# పడగెత్తిన అవినీతిని పరిమార్చే చేతనేదీ?

## జనవరి 1, 2000

హైజాక్ డ్రామా గడచి వారం దాటింది. యథాప్రకారం ఆరోపణలు, ప్రత్యారోపణలు, దూషణ భూషణ తిరస్కారాలు కొనసాగుతున్నాయి. ఒక్క విషయం మాత్రం ఖాయం – ఒకవేళ జరిగిన అనర్థంలో ఎవరిదైనా పొరపాటుగాని, తప్పుగాని ఉన్నట్లు తేలినా శిక్ష మాత్రం పడదు. మళ్లీ వచ్చేవారం మరో సంక్షోభమో, కుంభకోణమో పత్రికలకెక్కుతుంది, జనం దృష్టి మరో సమస్య మీదికి మళ్లుతుంది, గతాన్ని వెంటనే విస్మరిస్తారు. ఎమర్జెన్సీ సంఘటనలలో జరిగింది ఇదే. అన్యాయంగా, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా లక్షమందికి పైగా ప్రజలను అకస్మాత్తుగా ఆనాడు జైళ్లలో వేశారు. కొందరిని చిత్రవధలకు గురిచేశారు. అనాటి అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఓడిపోవటమే అందుకు తగిన శిక్షగా ప్రజలు భావించారు. అసంఖ్యాకుల స్వేచ్ఛను కాలరాచి దేశాన్ని తమ స్వప్రయోజనాలకోసం గుప్పిట్లో పెట్టుకొన్నవాళ్లకు మాత్రం ఎలాంటి శిక్షలు పడలేదు! 1984లో ఇందిరాగాంధీని ఆమె రక్షకులే దారుణంగా చంపేశారు. కుట్రలో ప్రత్యక్షంగా పాల్గొన్న వాళ్లకు శిక్ష పడింది. కాని, విధినిర్వహణలో విఫలమైనవాళ్లకు శిక్షలు లేవు. ఇందిరాగాంధీ వ్యక్తిగత సహాయకుడు ఆర్.కె. ధావన్‌కు అందులో పరోక్షపాత్ర ఉందని అనుమానించి కొంతకాలం అతణ్ని దూరంగా పెట్టారు. మళ్లీ తరవాత అతణ్నే ఆ పార్టీలో అగ్రశ్రేణి నాయకుడిగా చేశారు. అంతేగాని ప్రధానమంత్రి రక్షణ వైఫల్యానికి ఎవరికీ శిక్షపడలేదు. రాజీవ్‌గాంధీని దారుణంగా హత్య చేశారు. దానిపై విచారణ కమిషన్ రాజకీయ పార్టీలకంటే చవకబారుగా పక్షపాత ధోరణి అవలంబించి కేంద్ర స్థాయిలో ఓ ప్రభుత్వ పతనానికి, 1998 పార్లమెంటు ఎన్నికలకు కారణమయింది అంతేతప్ప నిజంగా ఎక్కడయినా శిక్షార్హమైన నేరం అధికార యంత్రాంగంలో జరిగిందేమో నిర్ధారించలేదు. ఢిల్లీలో ఓ సంచలనాత్మకమయిన, హత్య జరిగితే, అందుకు ప్రత్యక్ష సాక్షుల ఉనికి దేశంలో అత్యున్నత నేరపరిశోధన సంస్థ సి.బి.ఐ.కి తెలియలేదు. కాని ఓ మామూలు పాత్రకేయుడు ఆ సాక్షుల అడ్రసులు వెతికి వాళ్లను ఇంటర్వ్యూ చేయగలిగాడు! ఇంకా విచిత్రం ఏమంటే ముద్దాయే హత్య చేశాడని న్యాయమూర్తి పూర్తిగా

విశ్వసించారు. ఆ మాట తీర్పులోనే చెప్పారు. కాని సాక్ష్యాలు చాలలేదు కాబట్టి నేరగాళ్లను విడిచిపెట్టారు.

## ఆర్భాటం కాదు... కార్యాచరణ ముఖ్యం

అలాగే ఓ ముఖ్యమంత్రో, మంత్రో, ఉన్నతాధికారో ఆర్భాటంగా పాత్రికేయుల సమక్షంలో ఆకస్మిక తనిఖీలు చేస్తారు. తప్పులు చేశారనో, విధినిర్వహణలో లోపం జరిగిందనో టెలివిజన్ కెమెరాల ఎదురుగా ఉద్యోగులను నిలదీస్తారు. కొండొకచో చిరుద్యోగులను సస్పెండ్ చేస్తారు. తరవాత ఎవరి ఉద్యోగాలైనా పోయినట్లు ఎక్కడా దాఖలాలు లేవు. మళ్లీ అదే గ్రామానికో, వాడకో కొన్ని మాసాల తరవాత వెళ్లిచూస్తే ఏ మార్పూ ఉండదు. మరి ఈ హంగామా, ఆర్భాటం ఎందుకు అని ప్రశ్నిస్తే అది అమాయకత్వమే అవుతుంది. ఆనాటికి పబ్బం గడవటం, పత్రికలలో పతాక శీర్షికలు రావటం, ఏదో చేస్తున్నట్లు భ్రమ కల్పించటం మాత్రమే ఈ కార్యక్రమాల లక్ష్యం. రేపేమవుతుందన్నది ప్రజా 'సేవలకులకు' అప్రస్తుతం. ఏ అధికారులు ఎక్కడ లంచాలు తీసుకున్నా, ఏ ఉద్యోగులు నిస్సంకోచంగా ప్రజలను పీడిస్తున్నా, ఏ 'నాయకులు' పదవులను అడ్డంగా పెట్టుకుని డబ్బు సంపాదించినా కేవలం ప్రకటనలే తప్ప దండన ఉండదనేది రాజకీయంలో, పాలనా వ్యవస్థలో తిరుగులేని సత్యం! ఉదాహరణకు ఇటీవలే ఢిల్లీలో సంచలనం కలిగించిన ఒక కుంభకోణాన్ని తీసుకుందాం. అశోక్ అగర్వాల్ అనే ఓ కుర్రాడు 15 సంవత్సరాల క్రితం ఇంజనీరింగు డిగ్రీ పుచ్చుకున్నాక చాలామంది యూనివర్శిటీ గ్రాడ్యుయేట్లలాగానే ఐ.ఎ.ఎస్., ఇతర సర్వీసుల ప్రవేశపరీక్షలు రాశాడు. ఐ.ఎ.ఎస్. రాలేదు కాని ఆదాయపన్నుశాఖ అధికారిగా ఇండియన్ రెవెన్యూ సర్వీసులో చేరాడు. ఉద్యోగంలో చేరిన కొన్నాళ్లకే అక్రమ సంపాదనకు పూనుకున్నాడు. అతడి మీద విజిలెన్సుశాఖ విచారణ జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఆ విచారణ అలా కొనసాగుతూండగానే అతణ్ణి కేంద్ర గనులశాఖ మంత్రి బలరాంసింగ్ యాదవ్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా నియమించారు. అక్కడ గనులశాఖలోనూ ఇతని అవినీతిని, అధికార దుర్వినియోగాన్ని అశోక్ అగర్వాల్ నిరాటంకంగా కొనసాగించాడు. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'నాల్కో' ఛైర్మన్ ఎస్.ఎన్. జోహ్రీని తనకు అల్యూమినియం అమ్మకాలలో ముడుపులు అందించే ఏర్పాటు చేయాల్సిందిగా కోరగా ఆయన అందుకు తిరస్కరించారు. ఆ కోపంతో అగర్వాల్ తనమీద దొంగ ఫిర్యాదులు చేయించి, సి.బి.ఐ. విచారణ జరిపించాడని జోహ్రీ ఆరోపణ. ఆ కేసులో ఇరుక్కున్న జోహ్రీని రెండేళ్లపాటు సస్పెండ్ చేశారు.

మళ్లీ చివరికి ఏ అధారాలు లేవని కేసును ఎత్తివేయటంతో సస్పెన్షన్ రద్దయింది. కేంద్ర మంత్రికి వ్యక్తిగత కార్యదర్శిగా ఘనమైన 'సేవ' చేసినందుకు అశోక్ అగర్వాల్‌ను కేంద్ర ఆర్థికశాఖలో అత్యంత కీలకమైన ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగంలో డిప్యూటీ డైరెక్టరుగా నియమించారు. అక్కడ చేరినప్పటినుండి అగర్వాల్ బాగా డబ్బున్న ప్రముఖుల్ని దొంగ కేసుల్లోను, లేదా చాలా స్వల్పమైన సాంకేతిక కారణాలను వెతికి పట్టుకుని ఆ వంకన చాలా కఠిన శిక్షలు పడే 'షెరా' (విదేశీమారక ద్రవ్య నిబంధనల ఉల్లంఘన చట్టం (కింద కేసులు బనాయించి నానాహింసలు పెట్టటం, ప్రారంభించాడు. అలా దొంగ కేసులు పెట్టి, వాటిని ఎత్తివేయటానికి కోట్ల రూపాయలు బలవంతంగా గుంజాడు. ఆవిధంగా అతడి బ్లాక్‌మెయిల్‌కు గురయినవాళ్లలో టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక యజమాని అశోక్‌జైన్, దాబర్ గ్రూపునకు చెందిన అమిత్‌బర్మన్ వగైరాలు ఉన్నారట! ఈ బ్లాక్‌మెయిల్‌లో అతనికి రాజ్యసభ సభ్యురాలు వీణావర్మ కుమారుడు అభిషేక్‌వర్మ సహకరించాడు. బాగా డబ్బున్నవాళ్ల వివరాలు సేకరించి వాళ్లను ఎలాగోలా లావాదేవీలలోకి దింపి, చట్టాన్ని సాంకేతికంగా ఉల్లంఘించేలా చేయటం అభిషేక్‌వర్మ పని. ఇలా అక్రమ మార్గాలలో కోట్లు ఆర్జించిన అభిషేక్‌వర్మ కొంతకాలం లండన్ నగరంలో సంపన్నుడయిన భారతీయుడిగా ఒక వెలుగు వెలిగాడు. ఖరీదైన జీవితానికి అలవాటుపడ్డాడు. చివరికి ఇద్దరు కలిసి ఒక నగల వ్యాపారి ఎస్.సి.బార్జతీయుని విదేశీ కరెన్సీకి చెందిన దొంగ కేసులో ఇరికించి బ్లాక్‌మెయిల్ చేశారు. అయితే బార్జతీయ అందుకు లొంగక వాస్తవాలని వెలికితీసి తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకున్నాడు. తనకు జరిగిన అన్యాయానికి మౌనంగా ఏడుస్తూ, కూర్చోక, అధికారాన్ని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డ అశోక్ అగర్వాల్‌ను శిక్షించాలని గట్టిగా పట్టుపట్టాడు. అయినా అధికార యంత్రాంగం కదలలేదు. 1998 నుంచి అతడు విశ్వప్రయత్నం చేసినా ఇంతటి పెద్ద ప్రభుత్వ యంత్రాంగంలో పట్టించుకున్న నాథుడు లేడు! అగర్వాల్ పై అధికారి, సుప్రీంకోర్టు కితాబు పొందిన బెజ్‌బారువా ఎంత ప్రయత్నం చేసినా తన మీద వచ్చిన వత్తిడి కారణంగా ఏ చర్యా తీసుకోలేకపోయాడు. చివరికి కేంద్ర నిఘా కమిషనర్ ఎన్. విఠల్‌కు ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు అతణ్ని ఆ శాఖ నుంచి బదిలీ చేయాల్సిందిగా ఆదేశించారు. అయినా అగర్వాల్‌ని అదే శాఖలో ప్రాముఖ్యం లేని పోస్టులో నియమించి ఏ పనీ లేకుండా ఉత్త పుణ్యానికి సంవత్సరంపాటు జీతభత్యాలిచ్చారు. ఆ డబ్బంతా ప్రజల పన్నుల నుంచి వెళ్లిందే! చివరికి 1999 డిసెంబరులో కాస్త కాగితాలు కదిలి సి.బి.ఐ. వారు

అభిషేక్‌వర్మ నుంచి నిజాన్ని రాబట్టారు. వెంటనే అశోక్ అగర్వాల్ పలాయనం చిత్తగించాడు. చివరికి కొద్దిరోజుల క్రితం అతణ్ని సి.బి.ఐ. అరెస్టు చేసింది. అగర్వాల్ ఒక మామూలు మధ్యతరగతి కుటుంబం వాడయినప్పటికీ,, అబ్బాయికి ఉద్యోగం వల్ల వచ్చిన అదృష్టం పుణ్యమా అని అతని తల్లిదండ్రులు అమాంతం ఆమెరికా వెళ్లిపోయి టెక్సాస్‌లో ఓ హోటల్ కడుతున్నారు. అగర్వాల్ చేసేది, నెల జీతం తీసుకునే ప్రభుత్వోద్యమే అయినా ఇంకా చట్టబద్ధ ఆదాయం లేకుండానే అతడు కోట్లకు పడగలెత్తాడు. పదవి మీద పదవి సంపాదించి కుబేరుడైపోయాడు. అగర్వాల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ వ్యక్తిగత కార్యదర్శి విన్సెంట్ జార్జికి సన్నిహితుడని, జార్జికి ఖరీదయిన ఇల్లు కొనిపెట్టాడని ఆరోపణ వచ్చింది. వెంటనే కాంగ్రెస్‌లో కొందరు పెద్దలు ఆ విషయం బయటపడకూడదని విశ్వప్రయత్నం చేశారు, చేస్తున్నారు! ఇదీ పాలకుల నడవడి. ఎక్కడో ఢిల్లీకి పోనక్కరలేదు. రాష్ట్రంలోనే కలెక్టర్లుగా ఉన్న నలుగురయిదుగురు అధికారులే రెండు చేతులా అవినీతితో అక్రమార్జన చేస్తున్నారని, ఎందరో పోలీసు అధికారులు లంచాలు మేసి కోట్లకు పడగలెత్తారని ఇటీవలే పత్రికల్లో వార్తలొచ్చాయి. ఓ నగరాభివృద్ధి సంస్థకు వెళితే డబ్బు కట్టకుండా ప్లాట్ల నిర్మాణానికి అనుమతి పొందటం ఎంత కష్టమో అనుభవజ్ఞులకు తెలుసు! అలాగే అర్బన్ ల్యాండ్ సీలింగ్ విషయాలలో డబ్బు లేకుండా ఒక ఫైలు కదలాలంటే ఎంత అసాధ్యమో అందరికీ అనుభవమే. అంతదాకా ఎందుకు, ఓ డ్రైవింగు లైసెన్సు పొందాలన్నా, ఓ ఆస్తి దస్తావేజులు రిజిస్టరు చేయించుకోవాలన్నా, ఓ రేషన్‌కార్డు అడ్రసు మారాలన్నా, ఓ పోలీసుస్టేషన్‌లో న్యాయంగా కేసు రిజిస్టరు కావాలన్నా, ఓ ఆదాయ సర్టిఫికేటో, ఓ జనన సర్టిఫికేటో పొందాలన్నా ఎంతటి నరకయాతన పడాలో ప్రతి పౌరుడికి తెలుసు.

## అధికారం ఎవరి ఆస్తి?

ప్రభుత్వంలో అధికారం, ఉద్యోగిగా హోదా అంతా వ్యక్తులకు సొంత ఆస్తిగా మారిపోయింది. లంచాలు అన్నిచోట్ల చాలామంది తింటున్నారని అందరికీ తెలిసినా పైకి తెలియనట్లు నటిస్తున్నారు. చివరికి లంచగొండులే నిరంతరం ధర్మోపన్యాసాలిస్తున్నారు. తమ పదవిని అడ్డంపెట్టుకుని, అడ్డదారులు తొక్కి, అధికారాన్ని దుర్వినియోగపరిచి, కేవలం సొంతలాభం చేసుకోవటమే పరమావధిగా ప్రభుత్వ వ్యవస్థ మారిపోయింది. అందుకు వాళ్లను తప్పుపట్టి ప్రయోజనం లేదు. వాళ్లంతా ఉన్నది ప్రజల సేవ కోసమే. అంతే తప్ప వాళ్ల పనికి, పదవులకు మరో

అర్థం లేదు; మరో లక్ష్యం ఉండటానికి వీలులేదు. అయినా వాళ్లంతా తమ బాధ్యతలను విస్మరించి ప్రజలకు అన్యాయం చేసినా, ప్రజల డబ్బును, ప్రజలిచ్చిన అధికారాన్ని సొంత ఆస్తులుగా మార్చుకుని అనుభవించినా, చివరికి ప్రజల్ని పురుగులలాగా, అనవసరమయిన తలనొప్పి కల్గించే వారిలాగా చూసినా క్షమించటం నేరం. జవాబుదారీతనం లేని పాలన కేవలం చట్టబద్ధ దోపిడీ మాత్రమే ప్రజలకు ఏవిధంగాను సేవలందించకుండా డబ్బు వృధా చేసేవాళ్లు చేసేది కేవలం దొంగతనం మాత్రమే. మంచిమాటలు చెప్పి మన చేతికి నిజమయిన అధికారాన్ని అందించని వాళ్లు చేసేది కేవలం నటన మాత్రమే. ఈ దోపిడీని, ఈ దొంగతనాన్ని, ఆ నటనను, ఈ మోసాన్ని అంతమొందించి ప్రజలకు జవాబుదారీగా నిలిచేలా, నిజమైన ప్రజాస్వామ్యం పాలననందించేలా చూడాలి. అందుకు ప్రజలే కళ్లు తెరవాలి. ప్రజాస్వామ్యంలో యజమానులయిన ప్రజలు బీరువులుగా, నిశ్చేష్టులుగా ఉన్నంతకాలం అసమర్థులు అందలాలెక్కుతారు. అశోక్ అగర్వాల్‌లు అధికారాన్ని దోపిడీకి వినియోగిస్తారు. అభిషేక్‌వర్మలు కోట్లకు పడగలెత్తుతారు; లంచగొండులు స్వైరవిహారం చేస్తారు; ప్రజల సేవకులు నయవంచకులుగా మారతారు. కాస్తో కూస్తో చదువుకుని, ఇంగితజ్ఞానం ఉందని, తెలివిగలవాళ్లమని భావిస్తున్నవాళ్లు కళ్లు తెరిచి, పిరికితనాన్ని పారదోలి, చేవ తెచ్చుకుని, నిజాయితీతో, నిర్భీతితో జవాబుదారీతనం కోసం సంఘటితంగా పోరాడినప్పుడే మంచిపాలన వస్తుంది. ఆలస్యం చేస్తే పెరుగుతున్న ఆర్థిక సంక్షోభంలో, అప్పుల భారంలో జాతి మొత్తం మునిగిపోయే ప్రమాదం ఉంది.

* * *

# తెహల్కా ఉదంతం లేవనెత్తిన ప్రశ్నలు

## ఏప్రిల్ 2, 2001

ప్రజాస్వామ్య దేశాలలో పత్రికా స్వేచ్ఛ అతి ప్రధానమయిన హక్కు మనిషి భావస్వాతంత్ర్యానికి, వాక్స్వాతంత్ర్యానికి పత్రికా స్వేచ్ఛ సంకేతం. పత్రికలు నిర్భీతితో తమ స్వేచ్ఛను వినియోగించుకోవటం మనదేశంలో అనవాయితీగా వస్తోంది. మన పత్రికలు ప్రపంచదేశాలలో ఇతర పత్రికలకు తీసిపోవు. ప్రభుత్వాలను విమర్శించటంలోగాని, వార్తలను పరిశోధనాత్మక వార్తలను వెల్లడించటంలో గాని మన పత్రికలు మంచి ప్రమాణాలను సాధించాయి. నిజానికి రాజ్యాంగబద్ధమయిన మూడు వ్యవస్థలూ - చట్టసభలు, కార్యనిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థ- చాలా వరకు విఫలమయినా రాజ్యాంగానికి బయట ఉన్న పత్రికా వ్యవస్థ మన ప్రజాస్వామ్యానికి 'నాలుగో పాదమై స్వేచ్ఛను స్వపరిపాలనను కాపాడుతుంది. ఒక్క ఎమర్జెన్సీకాలంలో తప్ప మనకు ఏనాడూ పత్రికా స్వేచ్ఛ కొరవడలేదు. 1975-77 మధ్య మాత్రం పత్రికలపైన ఆంక్షలు విధించారు. వాస్తవాలను ప్రజలకు అందించకుండా సెన్సారు చేశారు. ఆనాడూ ప్రభుత్వం విధించిన ఆంక్షలకన్నా కొన్ని పత్రికలు స్వచ్ఛందంగా విధించుకున్న పరిమితులే ఎక్కువ. అందుకే ఎమర్జెన్సీ అంతమయి 1977 లో జనతా ప్రభుత్వ ఏర్పడ్డాక ఆనాటి సమాచార మంత్రి ఎల్.కె. అద్వానీ చిరకాలం నిలిచే వ్యాఖ్య చేశారు. "మిమ్మల్ని కాస్త వంగోమని ఆదేశిస్తే మీరు ఏకంగా మోకాళ్ళమీద దేకటానికే సిద్ధపడ్డారు" అని అలాంటి పత్రికలను, పాత్రికేయులను ఆయన విమర్శించారు. ఆ వ్యాఖ్యలో సత్యం ఉంది. 1977 తరవాత పత్రికలు మరింత నిర్భీతిగా, నిక్కచ్చిగా వ్యవహరించాయన్నది వాస్తవం. అలాగే గత 24 సంవత్సరాలుగా పత్రికల సంఖ్య, చదువరుల సంఖ్య చాలా రెట్లు పెరిగాయి. ఇటీవలి గణాంకాల ప్రకారం మనదేశంలో అక్షరాస్యుల సంఖ్య మొదటిసారిగా 60 శాతం దాటింది. ఏడేళ్లకు పైబడ్డ వారిలో దాదాపు మూడింట రెండువంతుల మందికి కొద్దోగొప్పో అక్షరజ్ఞానం ఉంది. ఈ ఒరవడి కొనసాగితే వచ్చే పది సంవత్సరాలలో 85 శాతం అక్షరాస్యత సాధించటం సాధ్యం కావచ్చు. అంటే పత్రికలను చదివేవారి సంఖ్య, సమాజం పట్ల, పాలన పట్ల అవగాహన కలిగినవారి సంఖ్య పెరుగుతుంది. దాంతో పాటే పత్రికల ప్రాముఖ్యం మరింత ఎక్కువవుతుంది.

## దేశానికి శుభసూచకం

ఇటీవలి తహెల్కా ఉదంతం, దానిమీద చెలరేగిన రభస, అంతకుమించి కోట్లమంది సామాన్య ప్రజలు తెహల్కా బయటపెట్టిన అవినీతి బాగోతాలకు స్పందించిన తీరు కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. మొదటిది తహల్కా పరిశోధన పేరుతో నాయకులను, అధికారుల్ని ప్రలోభపెట్టి లంచాలివ్వటం ఎంతవరకు నైతికంగా సమర్ధనీయం అనే ప్రశ్న. పాశ్చాత్య దేశాలలో ఇలా ప్రలోభపెట్టే ప్రక్రియను 'స్టింగ్' అంటారు. అమెరికాలో చాలా సందర్భాలలో 'స్టింగ్' ప్రక్రియ ద్వారా సేకరించిన సాక్షాలను తిరస్కరించారు. ఉదాహరణకు ఓ మహిళా పోలీసు అధికారి వేశ్యలాగా నటించి విటులను ఆకర్షించే ప్రయత్నంచేసి, వాళ్లు ఆ ప్రలోభానికి లోబడి శృంగారం కోసం డబ్బివ్వగానే అరెస్టుచేసి, నేరారోపణ చేసి కోర్టు ముందు దోషులుగా నిలబెట్టిన సందర్భాలున్నాయి. అలాంటి కేసులలో పోలీసులే ప్రలోభపెట్టి నేరానికి పాల్పడేలా ప్రోత్సహించారనే కారణంగా కోర్టులు ముద్దాయిలను విడిచిపెట్టడం అనవాయితీ అయింది. అలాంటప్పుడు – రాజకీయులకు, ఉద్యోగులకు లంచాలు ఎరగా చూపి ఆ ప్రలోభానికి వాళ్లు లొంగినప్పుడు రహస్యంగా వీడియో చిత్రాలు తీసి ప్రచారం చేయటం సబబా అని కొందరు విమర్శిస్తున్నారు. ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాలంటే ఓ మనిషి వ్యక్తిగత జీవితంలో ప్రవర్తనకు, ప్రజాజీవనంలో అతడి ప్రవర్తనకు మధ్య ఉన్న తేడాను పరిశీలించాలి. ఓ మనిషి ఇతరులకు ఇబ్బంది కలిగించనంత వరకు ఎలా ప్రవర్తించినా అతణ్ణి మనం అదుపు చేయనక్కరలేదు. ఒకవేళ చట్టాన్ని ఉల్లంఘించినా, అలాంటి ఉల్లంఘన వల్ల సమాజం నష్టపోనంత వరకుదాన్ని సహించవచ్చు. ఉదాహరణకు – పొగ తాగటాన్ని నిషేధించిన స్థలంలో ఎవరూ లేనప్పుడు సిగరెట్టు తాగితే అదేదో పెద్ద నేరంగా భావించటం తగదు. పక్కనున్న వారికి ఇబ్బంది కలిగితే అతణ్ని వెంటనే అదుపు చేయటం సబబు. అలాకాక ఎవరూ లేనప్పుడు 'పొగ తాగరాదు' అనే ప్రకటన కిందే అతనికి సిగరెట్టును అందించి, దాన్ని స్వయంగా వెలిగించి, పొగ తాగటానికి ప్రోత్సహించి, దాన్ని రహస్యంగా వీడియో తీసి బయటపెడితే అది సమర్ధనీయం కాకపోవచ్చు. అలాగే సారాయి నిషేధం అమలులో ఉన్నప్పుడు తాగుడుకు అలవాటు పడ్డ ఒక మనిషిని మచ్చిక చేసుకుని సారాయిని ఆకర్షణగా పెట్టి తాగబోయించటం, అలాంటప్పుడు రహస్యంగా దాన్ని వీడియో తీసి తరవాత నేరం బనాయించటం అనైతికమవుతుంది. ఎందుకంటే ఇలాంటి సందర్భాలలో వ్యక్తి ఒకవేళ చట్టరీత్యా నేరం చేసినా, ఆ నేరం చేయటానికి

ప్రోత్సహించటం జరిగింది. అంతకుమించి ఆ నేరం వల్ల నష్టపోయేది ప్రధానంగా ఆ వ్యక్తేకాని, సమాజానికి పెద్దగా నష్టం లేదు. అలాంటి వ్యక్తిగత నడవడికకి సంబంధించిన అంశాలలో 'స్టింగ్' ప్రక్రియ ద్వారా ప్రలోభపెట్టి వార్తలుగా ప్రచారం చేయటం గర్హనీయం. అయితే అవినీతి కేవలం వ్యక్తిగత నడవడికకి సంబంధించిన అంశంకాదు. లంచగొండితనం సమాజాన్నే అతలాకుతలం చేస్తున్న మహమ్మారి. అవినీతివల్ల లాభపడేది రాజకీయంలోగాని, అధికారంలోగాని ఉన్న వ్యక్తులు. నష్టపోయేది సమాజం మొత్తం. అలాంటి అవినీతిని కూకటివేళ్లతో పెళ్ళగించటం, ఎక్కడ అవినీతి ఉన్నా దాన్ని శోధించి బయటపెట్టడం పౌరులందరి కర్తవ్యం. కాబట్టి డబ్బు ఎరగా చూపి ప్రలోభపెట్టి డబ్బిచ్చి లేదా ఇప్పించి, లంచం పుచ్చుకుంటున్నప్పుడు రంగప్రవేశంచేసి అరెస్టు చేస్తారు. అలాంటి సాక్ష్యం కోర్టులో నూటికి నూరుపాళ్ళు చెల్లుతుంది. ఇలా వ్యక్తి ప్రవర్తన సమాజాన్ని తీవ్రంగా నష్టపరిచేదయినప్పుడు ప్రలోభపెట్టడం పూర్తిగా సబబైన పనే. అది పత్రికల కర్తవ్యం. తహల్కా నిస్సందేహంగా పాత్రికేయవృత్తిలో అత్యున్నత సంప్రదాయాల ప్రకారం వ్యవహరించింది. అయితే ఏ సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా తాగిన మైకంలో కొందరు వదరుబోతులు, పైరవీకార్లు తమ ప్రతాపం ప్రదర్శించుకోవాలనే ఉబలాటంతో మాట్లాడిన అవాకులు, చెవాకుల్ని వార్తలుగా చిత్రించటం పొరపాటు. ఏది గణించదగ్గదో, ఏ అంశం నిరాధారమో, ఏవీ నీలాపనిందలో సత్యాసత్య విశ్లేషణ చేయటం ప్రతి పత్రిక బాధ్యత. నిజంగా డబ్బు తీసుకున్నప్పుడు, ఆ చర్యను కెమెరాలో బంధించి బయటపెట్టడాన్ని అత్యుత్తమ జర్నలిజంగా గుర్తించి గౌరవించాలి. ఒకరకంగా తహల్కా పరిశోధన దేశానికి చాలా సేవ చేసింది. అడుగడుగునా అవినీతి ప్రజల్ని విపరీతమయిన వెతలకు గురిచేస్తోందని, వ్యవస్థను కుళ్ళబొడుస్తోందని అందరికీ తెలుసు. అలాంటి అవినీతి కూపాన్ని కప్పిపెట్టకుండా ఆ కుళ్ళును బయటపెట్టడం చాలా అవసరం. అందుకే దేశవ్యాప్తంగా కోట్లమంది సామాన్యులు తహల్కా బయటపెట్టిన వాస్తవాలకు విశేషంగా స్పందించారు. ఇది ఎవరో ఒకరిద్దరు రహస్యంగా నిధులు వసూలు చేస్తున్న వార్త కాదు. ఇది కేవలం కొందరు అధికారుల అవినీతి బాగోతం కాదు. ఇదేదో దేశ రక్షణలో జరుగుతున్న నిర్లక్ష్యం కాదు. ఇది దేశంలో అన్ని స్థాయిలలో, దాదాపు అన్ని శాఖలలో నిత్యకృత్యం. అందుకే జనసామాన్యం అంత ఉద్రేకంగా స్పందించింది.

నైతికంగా తెహల్కా పరిశోధనలు సమర్థనీయం అయినప్పుడు మరో ప్రశ్న ఉదయిస్తుంది. తహల్కా నిన్నగాక మొన్న ప్రారంభించిన ఓ చిన్న ఇంటర్‌నెట్ కంపెనీ, తహల్కాకు పత్రికలు లేవు. టీవీ ఛానళ్ళు లేవు. కోట్ల రూపాయల పెట్టుబడులు లేవు; అధికారంలో ఉన్నవాళ్ళలతో దగ్గర సంబంధాలు లేవు. కేవలం ఓ వెబ్‌సైట్‌తో ప్రారంభించిన ఓ చిన్న కంపెనీ చేసిన ప్రయత్నాన్ని ఎంతో కాలంగా పెద్ద సంస్థలుగా నిలబడ్డ పత్రికలు ఎందుకు చేయలేకపోతున్నాయి? వందల కోట్ల రూపాయల వార్షిక వ్యాపారం ఉన్న పత్రికా సంస్థలు ఎందుకు అవినీతిని వెలికితీసే సాహసానికి ఒడిగట్టలేకపోతున్నాయి? దేశవ్యాప్తంగా ఉపగ్రహ ఛానళ్లపై ఆధిపత్యం ఉన్న సంస్థలు ఏ కారణంగా లంచగొండితనాన్ని ఎదిరించలేకపోతున్నాయి? రాజ్యాంగం ప్రసాదించిన పత్రికా స్వేచ్ఛను ప్రజాప్రయోజనాల రక్షణ కోసం పత్రికలు ఎందువల్ల వినియోగించలేకపోతున్నాయి? ఎక్కడెక్కడ ఎంతెంత లంచాలు మింగుతున్నారో, అనునిత్యం సామాన్యులు అవినీతి కారణంగా ఎంతగా వెతలకు గురవుతున్నారో, అక్రమార్జన వల్ల ఎన్నో రంగాలలో ప్రజా ప్రయోజనాలు ఎలా తీవ్రంగా దెబ్బతింటున్నాయో, తెలియని పాత్రికేయులు లేరు. అప్పుడప్పుడు పార్లమెంటులో, అసెంబ్లీ నిందారోపణలు, వివాదాలను గురించి తప్ప, వాస్తవంగా జరుగుతున్న అంశాలను పత్రికలు ఎందుకని గొంతెత్తి ఘోషించటం లేదు? ఒకవేళ ఎప్పుడన్నా పొరపాటున కొన్ని చిన్నచిన్న అవినీతి బాగోతాల్ని ఎలుగెత్తి చాటినా ఎందుకు లోతుగా ఆ అంశాలను అధ్యయనం చేయటంలేదు? ఏ కారణంగా వ్యవస్థ లోపాలను అర్థం చేసుకుని బయటపెట్టలేకపోతున్నారు. ఓ అసెంబ్లీ ఉప ఎన్నికకు రెండు మూడు కోట్లు ఖర్చు పెడుతుంటే ఆ డబ్బు ఎక్కడ నుండి వస్తోందో పాత్రికేయులు ఎందుకని ఆరా తీయలేకపోతున్నారు. ఎందుకిలా స్వచ్ఛందంగా పత్రికలు తమ పాత్రని తామే పరిమితం చేసుకుంటున్నాయి? ఈ ప్రశ్నకు నిజాయతీగా సమాధానం వెతుక్కోవటం అవసరం.

## అధికార క్రీడపైనా మోజు

పత్రికలు కేవలం ప్రకటనలకు, ఉపన్యాసాలకు ప్రచారం ఇవ్వటం జాతి దురదృష్టం. సత్యాసత్య నిరూపణ చేయకుండా బాధ్యతగల స్థానాలలో ఉన్నవాళ్ళు మాట్లాడిందంతా 'విస్సన్న చెప్పిన వేదంలాగా మనకందించటం పత్రికా వృత్తికే అవమానం. ఇందుకు ప్రధాన కారణం పత్రికలు అధికార క్రీడపైన మోజు

పెంచుకోవటం. ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య విలువలు పత్రికలకు అతి ప్రధాన అంశాలుగా గోచరించటం లేదు. కేవలం ఎవరు అందలాలెక్కుతున్నారు, ఎవరు అధికారాన్ని కోల్పోతున్నారు. ఎవరిది పైచేయి, ఎవరిది ఓటమి – ఇలాంటి అంశాలకే ప్రాధాన్యం పెరిగింది. రాజకీయం, పరిపాలనను కేవలం ఓ క్రికెట్ ఆటలాగా పత్రికలు విశ్లేషిస్తున్నాయి తప్ప జన జీవనాన్ని బాగుచెయ్యాలన్న తపనను తగినంతగా ప్రదర్శించలేకపోతున్నాయి. అధికారాన్ని పూజించే తత్వమున్న సమాజంలో ఓ మామూలు పత్రిక, ఓ సాధారణ పాత్రికేయుడు ఆ అధికారాన్ని ఎదిరించే సాహసం చేయలేకపోతున్నారు. ఒకవేళ చిత్తశుద్ధి ఉన్నా విషయం పరిజ్ఞానం కరువవుతోంది. ప్రస్తుతం అమెరికాలో సమాజం మొత్తాన్ని ప్రభావితం చేసే ఓ రసవత్తరమయిన రాజకీయ చర్చ సాగుతోంది. పత్రికలలో, రేడియోలో, టి.వి. ఛానళ్లలో, ఇంటర్‌నెట్‌లో ఎక్కడ చూసినా, ఏ నోట విన్నా ఎన్నికల నిధులను నియంత్రించటం కోసం సెనెటర్ జాన్ మెకెయిన్ ప్రతిపాదించిన చట్టాన్ని గురించే చర్చ మెకెయిన్ కేవలం ఎగువ సభ సభ్యుడు. గత ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేయటానికి జరిగిన ప్రైమరీ ఎన్నికలలో జార్జిబుష్ చేతుల్లో పార్టీ ఎన్నికలలో పరాజయం పాలయ్యాడు గదా అని దేశంలో పత్రికలలో మెకెయిన్ పట్ల చులకన భావం లేదు. ఇప్పటికే ఎన్నికల నిధుల సేకరణ, వినియోగం, ప్రతి డాలరు విషయంలో వివరాలు బయటపడేలా పటిష్ఠమయిన చట్టాలు అమెరికాలో ఉన్నాయి. ఖర్చు చట్టబద్ధంగా, నిజాయతీగానే జరిగినా, ఎన్నికల్లో నిధుల వినియోగం అదుపు తప్పుతోందని అక్కడి పత్రికలలో ఎంతో ఆందోళన వ్యక్తమవుతోంది. మన దేశంలో ఎన్నికల నిధుల గురించిన చట్టాలు చాలా పేలవంగా, అధ్వాన్నంగా ఉన్నాయి. ఉన్న కొద్దిపాటి చట్టాలను ఉల్లంఘిస్తే ఎవరికీ ఏ శిక్షా లేదు. ఎన్నికల ఖర్చేమో అమెరికాలో, భారత్‌లో దాదాపు ఒకేలా ఉంది! మన రూపాయి కొనుగోలు శక్తిరీత్యా చూస్తే మన ఖర్చు అమెరికాకంటే ఐదురెట్లు! అమెరికాతో పోలిస్తే మన జాతీయాదాయం దాదాపు 20వ వంతు. అయినా ఈ ఖర్చును గురించి, దానివల్ల వ్యాపించిన అవినీతిని గురించి పత్రికలకు చీమకుట్టినట్లు లేదు. ఈ ఒక్క ఉదాహరణ చాలు మన పత్రికలు ఎంతగా విఫలమవుతున్నాయో తెలపటానికి. దేశం మారుతోంది. అక్షరజ్ఞానం పెరుగుతోంది. అవినీతి అంతం కావాలని, మంచిపాలన కావాలని ప్రజలలో బలమయిన కోర్కె ఉంది. పాలన పేరుతో దోపిడీ జరుగుతోందన్న అవగాహన ఉంది. అందుకే తెహల్కాకు అంత విశేష ప్రాచుర్యం లభించింది. పత్రికలు కూడా మారుతున్న ప్రజల మనోస్థితికి

అద్దం పట్టాలి. దుష్పరిపాలనపై  జన సామాన్యానికున్న కసిని నిర్మాణాత్మకంగా వ్యవస్థ ప్రక్షాళన కోసం మళ్ళించాలి. లేకపోతే పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానంతో, ఈ సమాచార యుగంలో, ఈ ఇంటర్‌నెట్ ప్రపంచంలో పత్రికలు నిర్వీర్యమయిపోతాయి. ఎన్ని లోపాలున్నా మనదేశంలో పత్రికలు స్వేచ్ఛగా, నిర్భీతిగా వ్యవహరించే సంప్రదాయాన్ని అనుసరించాయి. పత్రికలు ప్రజాస్వామ్యంలో నైతిక విలువలకు ప్రతీకలు. పత్రికలు అద్భుతమైన ఆయుధాలు. ఆ ఆయుధాలు ధర్మపోరాటంలో ప్రజల పక్షం వహించకపోతే స్వేచ్ఛ అంతరించిపోతుంది. తెహల్కా ఉదంతం మనకు నేర్పిన అతిపెద్ద గుణపాఠం ఇదే. మన సమస్యలకు పరిష్కారాలున్నాయి. వాటిని ప్రజలముందు పెట్టడం, జనాభిప్రాయాన్ని కూడగట్టడం పత్రికల కర్తవ్యం.

* * *

# ఆత్మన్యూనత కాదు, అవగాహన నేటి అవసరం

## సెప్టెంబర్ 1, 1997

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా పెరిగి సర్వాంతర్యామి అయిన అవినీతిని నిర్జించాలంటే, దాని స్వరూప స్వభాలను ఆకళింపు చేసుకోవాలి. వట్టిమాటలతో అవినీతి పోదు. దానికి కావలసింది స్పష్టమైన అవగాహన, నిర్దిష్టమైన విధానాలు, సంస్కరణలు, నేటి సమాజం తీవ్రమైన పాలన సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. రాజ్యవ్యవస్థ వైఫల్యం ఒక క్యాన్సరు వ్యాధి లాంటిది. ఆ వ్యాధి ప్రధాన లక్షణం మనకు సర్వత్రా కనిపించే అవినీతి. అంటే క్యాన్సరు వ్యాధి పీడితుడికి తీవ్రమైన నొప్పి కలగటంలాంటిదన్నమాట. నొప్పిని తగ్గించి రోగికి ఉపశమనం కలిగించినట్లుగా, అవినీతిని నిరోధించే ఏర్పాట్లు చేయాలి. అయితే రోగిని రక్షించాలంటే నొప్పికి మందు ఇస్తే చాలదు. దానితోపాటు కాన్సరు కణాలను శస్త్రచికిత్స ద్వారానో, ఔషధాల ద్వారానో, రేడియేషన్ చికిత్స ద్వారానో నాశనం చేయాలి. అలాగే రాజ్య వ్యవస్థలోని రుగ్మతలను రూపుమాపటానికి ప్రజాస్వామ్య సంస్కరణలను చేపట్టి పాలన ప్రజలకు జవాబుదారీగా ఉండేలా తీర్చి దిద్దాలి. ఈ రెండు చికిత్సలను ఏకకాలంలో అమలు చేసినపుడే రుగ్మతను నిర్మూలించగలం. ఈనాడు దినపత్రికలో ఆగస్టు 16న శ్రీధర్‌గారు వేసిన అద్భుతమైన కార్టూన్‌ను ప్రచురించారు. రాష్ట్రపతి, ప్రధాన చెట్టుమీద సురక్షితంగా, చేతుల్లో తుపాకులతో, నడుం చుట్టూ తూటాల బెల్టులతో కూర్చుని ఉంటారు. చెట్టుకింద అవినీతి అనే పెద్దపులి అర్భకంగా ఉన్న పౌరుణ్ణి మింగేస్తుంటుంది. కాళ్ళ నుంచి నడుందాకా పులినోట్లో చిక్కిన ఆ అభాగ్యుడి తల, చేతులు మాత్రం బయట ఉండి, అతడు లబోదిబోమంటుంటాడు. అప్పుడు చెట్టుమీద కూర్చున్న మన పెద్దలు వాళ్ళ తుపాకుల్ని, తూటాల్ని వాడకుండా ఆ సామాన్యుడితో “పోరాటం చెయ్యి! దాన్ని అంతం చెయ్యి” అని నాటకీయంగా అరిచి సలహాలిస్తుంటారు. ఇది నిజంగా నేటి పరిస్థితికి దర్పణం. వెయ్యి మాటలకన్నా ఒక చక్కని వ్యంగ్య చిత్రం వాస్తవాన్ని ప్రతిబింబిస్తుంది.

### ప్రజలే బాధ్యులా...?

అవినీతి మీద పోరాటానికి సంబంధించిన పెద్దల ఉపన్యాసాలలో, ఉచిత

సలహాలలో నర్మగర్భంలో ఒక అభిప్రాయం ధ్వనిస్తుంది. “అవినీతికి పౌరులే కారణం, వాళ్ళు లంచాలివ్వటం వలన, చేతులు ముడుచుకొని కూర్చోవటం వలన అవినీతి పెరుగుతోంది; ప్రభుత్వానికి, చట్టానికి, అధికార యంత్రాంగానికి దీనిలో బాధ్యత లేదు” అన్న భావం ప్రస్ఫుటమౌతుంది. అవినీతి సర్వాంతర్యామి; దీనివల్ల పౌరుడికి వేదన, సామాన్యుడికి అన్యాయం జరుగుతాయి. నేతలు, అధికారుల అక్రమ సంపాదన, ఆర్థిక రంగంలో నిజమైన పోటీ కొరవడి ప్రగతి స్తంభన, జాప్యంవల్ల అసౌకర్యం, కొందరి అక్రమ సంపాదన వల్ల మిగిలిన వాళ్లపై దుష్ప్రభావం... ఇవన్నీ మనకు తెలుసు. ఏ రోజు ఏ పౌరుడు ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఏ చిన్న పనికి వెళ్ళినా ఎదురయ్యే లంచాల బాగోతం, వేధింపు, అవమానం మనందరికీ అనుభవమే. మండల కార్యాలయానికి నివాసం సర్టిఫికేట్ కోసం కావచ్చు. రవాణా కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్సు కోసం కావచ్చు. పట్టణాభివృద్ధి సంస్థ ఆఫీసులో లేఔటు ప్లాను మంజూరు కోసం కావచ్చు. రోడ్డు మీద పోలీసులకిచ్చే మామూలు కావచ్చు. పన్ను కట్టించుకునే వాణిజ్య, ఎక్సైజ్ శాఖలకు కావచ్చు. ఇంటికో, బావికో విద్యుత్ కనెక్షన్ ఇవ్వటానికి కావచ్చు. టెలిఫోన్ కనెక్షన్ కోసం కావచ్చు. కోర్టులో తీర్పు ప్రతుల కోసం కావచ్చు... ఇలా నిత్య జీవితంలో లంచం ఇవ్వవలసిన పరిస్థితుల్ని ఏకరువు పెడితే ఒక గ్రంథం మొత్తం చాలదు. నూటికి తొంబై సందర్భాలలో లంచం ఇవ్వక తప్పడం లేదు. పౌరుడికి  గత్యంతరం ఉండటం లేదు. ఆ మధ్య ‘ భారతీయుడు’ అని ఒక సినిమా వచ్చింది. ఇతర భాషల్లో కూడా ఆ సినిమా వచ్చినట్లు విన్నాను. మన విశ్లేషణ కోసం ఆ సినిమాలో  తండ్రి పాత్రలోని కమల్‌హాసన్ ఒక గొప్ప దేశ భక్తుడు. సుభాష్‌చంద్రబోస్ స్థాపించిన ‘ఆజాద్ హింద్ ‘ఫౌజ్’ లో  స్వతంత్రం కోసం పోరాడిన వీర యోధుడు తన కుటుంబంతో స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ సంతోషంగా నివసిస్తుంటాడు. ఒకనాడు వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ హఠాత్తుగా పేలి కుమార్తె వళ్లు తీవ్రంగా కాలిపోతుంది. దగ్గరున్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తే  అక్కడి డాక్టరు లంచం అడుగుతాడు. డబ్బిచ్చే శక్తి ఉన్నా, నిజాయతీగల దేశభక్తుడు కాబట్టి తండ్రి లంచం ఇవ్వడు. డాక్టరు ప్రాణాపాయ స్థితిలో కూడా వైద్యం చేయకుండా, అగ్ని ప్రమాదం కాబట్టి పోలీసు సర్టిఫికేటు కావాలని జాప్యం చేస్తాడు. పోలీసు అధికారి లంచం ఇవ్వలేదని గ్రామాధికారి నుంచి నివేదిక తెమ్మని పంపుతాడు. చివరికి పుణ్యకాలం కాస్త గతించి కుమార్తె  మరణిస్తుంది. ఇదీ ఆ చిత్రంలోని ఒక సన్నివేశం. ఇది నిజంగా యదార్థాన్ని చిత్రించే సంఘటన.

అంటే లంచం ఇవ్వకూడదని భీష్మించుకూర్చుంటే జన సామాన్యానికి ఎంతటి విపత్తులు, నష్టం వాటిల్లుతాయో మనకు బోధపడింది. ప్రతి సందర్భంలోను చావుబతుకుల సమస్య ఎదురు కాకపోవచ్చు కాని సకాలంలో న్యాయం కోరే పౌరుడు లంచం ఇవ్వకపోతే అతడికి ఎదురయ్యేది వేధింపు, జాప్యం, అసహనం, వేదనలే. దాన్ని తట్టుకోలేక నూటికి తొంభైమంది లొంగిపోవలసివస్తోంది. అందుకు పౌరుల్ని తప్పు పట్టటం అన్యాయం; 'మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కినట్లుగా' ఉంటుంది. అలాగే చాలా మంది తమ వ్యాపారమో, పరిశ్రమో నడపాలంటే లంచం ఇవ్వటం తప్పనిసరి అవుతోంది. ఒక చిన్న వ్యాపారి వాణిజ్య పన్ను శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే లంచం తప్పనిసరి. అంటే పన్ను కట్టాలన్నా లంచం ఇవ్వాలి! అలాగే ఒక పరిశ్రమ పెట్టినపుడు ఎన్నో లైసెన్సులు, పర్మిట్లు, తనిఖీలు నేటికీ కావాలి. బాయిలర్ సురక్షితంగా ఉందని తనిఖీ చేయాలంటే ఆ ఇన్‌స్పెక్టర్‌కు లంచం ఇవ్వాలి. విద్యుత్తు వైరింగు బాగుందని కితాబు ఇవ్వాలంటే ఆ ఇన్‌స్పెక్టర్‌కు లంచం ఇవ్వాలి. లంచంతో ఆగిపోయే సమస్య కాదిది. కోట్ల పెట్టుబడి పెట్టి, జీవితాల్నే పణంగా పెట్టే పారిశ్రామికవేత్త లంచం ఇవ్వకుండా ఏదైనా ఆఫీసుకు వెళితే అతణ్ణి ఒక పురుగులాగానో, దొంగ లాగానో, భిక్షకుడిలాగానో చూస్తారు. కనీసం అవతలి మనిషిని మర్యాదగా పలుకరించి కూర్చోమనటం కాని, ఏ సహాయం చేయగలమో కనుక్కోవటం కాని జరగదు. దేశాన్ని ప్రేమించి, ప్రభుత్వోద్యోగాన్ని కోరకుండా, పెట్టుబడి పెట్టి ఉపాధికల్పన చేద్దామని, ఆ విధంగా స్వామి కార్యం, స్వకార్యం నెరవేర్చుకుందామని ముందుకు వచ్చే వాళ్ళకు ఎదురయ్యేది అడుగడుగునా అడ్డుగోడలే. పరిశ్రమ పెట్టాక స్థానిక రాజకీయ నాయకులనుండి వీధి రౌడీల దాకా అడిగిందే తడవుగా డబ్బులు ఇవ్వకపోతే ఏనాడు ఎవడు పరిశ్రమ మూయించేస్తాడో, ఎక్కడ ఏం తగాదా తెస్తాడో, ఏ రౌడీ రేపు శాసనసభ్యుడో, మంత్రవుతాడో తెలియని భయం. లంచం ఇవ్వకుండా సాహసం చేస్తే పెట్టుబడి పెట్టిన షేర్ హోల్డర్లకి, ఉపాధి పొందుతున్న కార్మికులకి ఏం ముప్పు వాటిల్లుతోందనని భయం. ఈ విధంగా లంచగొండితనం ఆర్థిక ప్రగతికి తీవ్ర అవరోధంగా పరిణమించింది. నిజాయతీపరులైన మంత్రుల్లో, అధికారుల్లో సంప్రదిస్తే "ఎలాగోలా కింది వాళ్ళని, పై వాళ్ళని సంతృప్తిపరచవయ్యా, లేకపోతే ఇది జరగటం కష్టం. నేను చేయాలని ప్రయత్నించినా రేపు మళ్ళీ ఎవడో ఒకడు అడ్డుపడతాడు. లేదా నామీద పిటీషన్లు పెడతాడు. ఈ గొడవంతా ఎందుకు" అని సలహా ఇస్తారు. అంటే లంచం లేకపోతే పని జరగదు. ఇదొక హంతకుడి తుపాకి తూటాలాంటిది.

దాన్నుంచి రక్షణ కావాలంటే అనుక్షణం అప్రమత్తంగా, భయం భయంగా, బితుకు బితుకుమంటూ గడపాలి. హత్య చేసేవాడు ఎన్ని ప్రయత్నాలు చేసినా విజయం పొందటానికి ఒక్క క్షణం అవకాశం చాలు. రక్షణ కోరేవాడు ప్రతిక్షణం అదృష్టవంతుడు కావాలి. తొంభైతొమ్మిది సార్లు తప్పించుకున్నా, వందోసారి తూటా తగిలితే బలైపోతాడు. అప్పుడతడికి 99 మార్కులు రావు. సున్నా మార్కులే మిగిలేది. అందుకే అత్యధిక సంఖ్యాకులు వేరే గతిలేక, లంచం ఇవ్వకపోతే జరిగే నష్టాన్ని, ఆపదని భరించలేక దానికి లొంగిపోతున్నారు. అలాగే ప్రభుత్వం ఆర్థిక నిర్ణయాలు చేసే విషయాలలో – అంటే కాంట్రాక్టులు, లైసెన్సులు, క్లియరెన్సులు ఉన్నచోట, లంచం ఇవ్వకపోతే పని జరగదు. చివరికి టోల్‌గేటు లాంటి చోట్ల కూడా ఇది తప్పటం లేదు. లంచం, రాజకీయ ప్రమేయం అన్నిచోట్ల అనివార్యమైపోయాయి. మన రాష్ట్రంలోనే ఎన్నోసార్లు రాజకీయ నాయకులు, గూండాలు కలిసి అసలు టెండర్లు ప్రత్యర్థులకు అందకుండా చేయటం గురించి పత్రికల్లో చదివాం. అంటే దక్షిణ సమర్పించుకోకపోతే, రాజకీయ నాయకుడికి లొంగకపోతే దేశంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో, ప్రభుత్వంలో పని జరగదు. కాంట్రాక్టు, లైసెన్సు, పరిశ్రమ దక్కదు. ఇందువల్ల స్వేచ్ఛా వాణిజ్యంలో కావలసిన నిజమైన పోటీ కొరవడుతోంది. టెండరు లేక లైసెన్సు ఖరారు కాబోయేముందే ఫలానా వాడికి ఖాయం అయిందని, ముడుపులు ముట్టాయని, పోటీ కంటితుడుపు చర్య మాత్రమేనని వింటూంటాం. చివరికి జరిగేది అదే. అంటే లంచం వల్ల ఖర్చు పెరగటం, లేకపోతే జాప్యం జరగటం మాత్రమే కాదు. అసలు ఆర్థికరంగంలో పోటీ లోపించి, వినియోగదార్లకి, జన సామాన్యానికి తీవ్ర నష్టం జరుగుతోంది. వస్తువులలో నాణ్యత లోపిస్తుంది. లేదా ఖరీదు పెరుగుతోంది. గత 5 దశాబ్దాలలో ఈ లైసెన్సు పర్మిటు – కోటాల రాజ్యంలో ఈ విధంగా అవినీతి విశృంఖలంగా పెరిగి ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమయింది. దేశ పౌరులు తీవ్రంగా నష్టపోయారు. అందుకే దేశంలో ఈ మధ్యదాకా ప్రభుత్వోద్యోగమంటే అంత మోజు. ఒక బీదదేశంలో ప్రభుత్వాధికారమంటే ఉండే గ్లామరుతోపాటు, ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తే పదవిని దుర్వినియోగం చేయవచ్చు. లంచాలు యథేచ్ఛగా సంపాదించవచ్చు. జీతం కంటే గీతం ఎక్కువ; పట్టుబడతామన్న భయం లేదు. అందుకే పరీక్షల్లో బట్టీ పట్టో, కాపీ కొట్టో, లంచం ఇచ్చో సిఫార్సు పొందో – ఏదో ఒకరకంగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలన్న తపన. లక్షలాది మంది ఎలాగోలా ఇలా ఉద్యోగం కోసం ఎక్కని గడపలేదు. తొక్కని అడ్డదారి లేదు. ఒకసారి

లంచం ఇచ్చి ఉద్యోగంలో చేరాక ఇక అతగాడి అవినీతికి అంతం లేదు. నిజాయతీగా ఉద్యోగం పొందినాసరే, లంచం తీసుకుంటే అంతా లాభమే. అసలు శిక్ష పడుతుందన్న భయమే లేదు. లంచం తీసుకోకుంటే ప్రత్యేకంగా గుర్తింపుగాని, ప్రభుత్వంలో మనన్నగాని లేవు. లేకపోగా “వాడు తిక్కవాడయ్యా తను తినడు, ఇంకొకణ్ణి తిననివ్వడు. దేశం మొత్తాన్ని తానే ఉద్ధరించినట్లుగా ఫోజు'' అని ఈసడింపు. ఎక్కడ నిజాయతీపరుడు అడ్డుపడతాడోనని నిరంతరం వేధింపు. మళ్ళీ మళ్ళీ బదిలీలు. ఎందరో అధికార్లకి మూడు నెల్లకొకసారి, ఆరు నెల్లకొకసారి బదిలీలు చూస్తున్నాం. వాటిలో అధిక భాగం ఆ అధికార్లు ముక్కుకు సూటిగా పోయి, అవినీతిని వ్యతిరేకించి, నిజాయతీగా ప్రజాసంక్షేమం కోసం పనిచేసే సాహసం చేశారన్న కారణంగానే! ఒక ఉద్యోగి నిజాయతీగా ఉండటం వల్ల, ప్రజలకి చట్టబద్ధంగా, ధర్మబద్ధంగా సేవ చేయటం వల్ల అతడికి కలిగే లాభనష్టాలు, అతడు అవినీతికి పాల్పడటం వల్ల అతిడికి కలిగే లాభనష్టాలు జాగ్రత్తగా బేరీజు వేసినట్లయితే, అవినీతిపరుడికి విపరీతమైన లాభం వుందనీ ఏ నష్టమూ కష్టమూ లేదని సులభంగా తేలిపోతుంది. అలాగే నిజాయితీపరుడికి... వేధింపు, కక్షసాధింపు, బదిలీలు, అవమానాలు, వేదనలు చాలా సందర్భాలలో తప్పవని బోధపడుతుంది. ఈ నేపథ్యంలో మనం అబ్బురపడవలసింది ఇంతమంది ఎందుకు లంచాలు తీసుకుంటున్నారని కాదు. ఈ పరిస్థితులలో కూడా నీతి తప్పకుండా ఇంతమంది ఎలా ఉండగలుగుతున్నారని ! దేశం జనాభాలో గాని, ఉద్యోగులలో గాని, రాజకీయంలో ఉన్నవాళ్ళలోగాని నేటికీ అధిక సంఖ్యాకులు పరిస్థితులు సరిగ్గా ఉంటే నిజాయతీగా ఉంటారు. మంచికి రక్షణ, చెడుకి శిక్ష లేని వ్యవస్థలో సహజంగానే కాలక్రమేణా అవినీతికి పాల్పడటమో, లొంగిపోవడమో జరుగుతుంది. అందుకే దేశంలో ఏదో ఒక రూపంలో అవినీతికి లొంగని వాళ్ళు, కొద్దోగొప్పో లంచం ఇచ్చి పనిచేయించుకోని వాళ్ళు అరుదు. అందుకు మనల్ని మనం తప్పుపట్టుకోవటం, దేశంలో ప్రజలంతా దొంగలనుకోవటం అనవసరమని ఆత్మహింస, ఆత్మన్యూనత తప్ప వాస్తవాల్ని ప్రతిబింబించదు. సమస్యని పరిష్కరించదు. మనకు నేడు కావలసింది జాతి ఆత్మవిశ్వాసాన్ని మరింతగా కుంగదీసే న్యూనతా భావం కాదు. పరిస్థితుల్ని సరిగ్గా ఆకళింపు చేసుకునే ఆత్మవిమర్శ, విషయ పరిజ్ఞానం దాన్నుంచి పుట్టే సమగ్ర పరిష్కారాలు, సంస్కరణలు.

## ఏ రాయితేనేం...?

అవినీతి వల్ల శిక్ష ఉందన్న భయాన్ని నీతిపరులకు గుర్తింపు ఉందన్న విశ్వాసాన్ని

కలిగించనంతవరకు ఎన్ని ఉపన్యాసాలిచ్చినా ప్రయోజనం శూన్యం. కౌటిల్యుడి అర్థశాస్త్ర కాలం నుండి నేటివరకు, అభివృద్ధి చెందిన దేశాల నుండి భారత్ వంటి బీద దేశాల వరకు, అన్ని కాలాలలోను, అన్ని సమాజాలలోను ఇదే సత్యం. అవినీతిని తొలగించే మంత్రదండాలేమీ ఉండవు. నినాదాలు దాన్ని అంతమొందించవు. మనిషి ప్రవర్తనని మంది సంక్షేమ కోసం క్రమబద్ధం చేసే రాజ్య వ్యవస్థ లేనినాడు అవినీతి ఖాయంగా వర్ధిల్లుతుంది. మనదేశంలో నేడదే జరుగుతోంది. జన సామాన్యాన్ని అనుదినం పీడిస్తోంది. సరైన సంస్కరణల్ని సమగ్రంగా చేపట్టనంత వరకు ఎన్నిసార్లు ఎన్ని ప్రభుత్వాలను ఓడించి కొత్త ప్రభుత్వాలను ఎన్నుకున్నా ప్రజలకు అవినీతి బాధ తప్పటం లేదు. చివరకు ప్రజాస్వామ్యం అంటే ప్రజలకున్న విశ్వాసం సడలిపోతోంది. 'ఏ రాయయితేనేమి పళ్ళూడగొట్టుకోవటానకి" ఎవరు గెలిస్తేనేమి జరిగేది ఒకటేగా! అన్న నిరాశ వ్యాప్తి చెందుతోంది. ఈ నేపథ్యంలో అవినీతిని శుష్క, నినాదాలతోను, వాగాడంబరంతోను, చిత్తశుద్ధిలేని వాగ్ధానాలతోనూ, ఆలోచన లేని ఉత్తర కుమార ప్రజ్ఞలతోను ఎదుర్కోలేము. అవినీతి అన్న భూతాన్ని అంతమొందించటం అస్యాధమేమీ కాదు. అందుకు కావలసింది చిత్తశుద్ధి, ధీశక్తి, దేశభక్తి, స్పష్టమైన అవగాహన. అవి కొరవడినప్పుడు మనం బాధ్యతనంతా ప్రజల మీదకు నెట్టి ఉపన్యాసాలతో కాలం గడుపుతాము. ప్రతిసారి ప్రజల్ని మభ్యపెడుతుంటాము. ఫలితం మాత్రం శూన్యం. ఆశాభంగం చెందిన ప్రజలు మరింతగా వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని కోల్పోతారు. అందుకే ఈ స్వర్ణోత్సవాల సందర్భంగా అవినీతిపట్ల ప్రారంభమైన చర్చ పరిష్కారాలకు దారితీసేదిగా ఉండాలి.

* * *

# మధ్యయుగాల సంస్కృతిని కాలరాస్తేనే ప్రగతి

## జనవరి 17, 2000

ఆధునిక ప్రపంచంలో బతకగలగటం అదృష్టం. ఒకప్పుడు ఒకాయన టాల్‌స్టాయ్‌కి ఓ లేఖ రాస్తూ "మీరు జీవించి ఉన్న కాలంలో బతకటం నా అదృష్టం" అన్నాడట. నేటి ప్రపంచంలో అలా భావించదగ్గ వాళ్లు ఎక్కువమంది ఉండకపోవచ్చు. అయినా ఓ నెల్సన్ మండేలా, ఓ ఆంగ్‌సాన్ సూకీలు ఉన్నారు. 1960సం॥ లకి ముందు పుట్టినవాళ్లకు ఓ మార్టిన్ లూథర్‌కింగ్ బతికి ఉండగా జీవించటం వాళ్ల భాగ్యం. 1948కి ముందు జీవించిన వాళ్ళకు మహాత్మాగాంధీ జీవితకాలంలో మనగలగటం మహాద్భాగ్యం. ఇలా ప్రతి కాలంలోను ప్రపంచానికి ప్రత్యేకతను చాటి చెప్పే మహనీయులు ఉంటూనే ఉంటారు. అంతకుమించి ఈ కాలంలో బతికే మనమంతా మరో కారణంగా ఎంతో అదృష్టవంతులం. మరే కాలంలోను బీదరికం నిర్మూలించటానికి, ప్రతి మనిషికి కావలసిన కనీస సదుపాయాలు కల్పించటానికి తగిన అవకాశాలు, శక్తి సాంకేతిక విజ్ఞానం మానవాళికి లేవు. మొదటిసారిగా ఈనాటి ప్రపంచంలో ప్రతి వ్యక్తిని దుర్భర దారిద్ర్యం నుంచి బయటపడేసే అవకాశం ఉంది.

### సంపద సృష్టి - దోపిడి

ఒకప్పుడు ఎందరో సామాజిక శాస్త్రజ్ఞులు ప్రపంచాన్ని శూన్య సమతా దృష్టితో (జీరో-సమ్-గేమ్) చూశారు. అంటే ఒక వ్యక్తికి ఏదన్నా సంపద కాని, సౌకర్యంగాని చేకూరాలంటే మరొకరికి అంతే మేరకు నష్టం జరిగితీరాలి. అంటే దోపిడీ లేనిదే సంపద లేదు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల మొత్తం నిరంతరం ఎదుగూబొదుగూ లేకుండా ఉండేకాలం అది. ప్రకృతి ఇచ్చిన పంటలు ఆకలి తీర్చుకోవటానికి సరిపోయేవి. కాస్త వర్షాలు అటూ ఇటూ అయితే కరవు లేదా వరదలు లక్షల మందిని పొట్టన పెట్టుకునేవి. మిగిలిన అన్ని రంగాలలోను అదనంగా వస్తు సేవలను ఉత్పత్తి చేయటం దాదాపు అసాధ్యంగా ఉండేది. ఒక రకంగా ఆ శూన్య సమతావాదం నుండే మార్క్సువాదం పుట్టింది. ఒకరి శ్రమను లేదా సంపదను మరొకడు దోచుకుంటేనే సంపద చేకూరుతుంది. కాని అందరికీ సంపద చేకూరటం

అసాధ్యమనే భావన ఓ శతాబ్దంపాటు ప్రపంచంలో రాజ్యమేలింది. అయితే గత 50 సంవత్సరాలలో సాంకేతిక విజ్ఞానం అపారంగా పెరగటంతో అందరికీ సరిపడే సంపదను సృష్టించటం సాధ్యమనే ఆశావాదం బలపడింది. అందువల్లనే ఇటీవలి కాలంలో దేశాలకి దేశాలు ఒక్క తరం కాలంలో దారిద్ర్యం నుంచి బయటపడగలిగాయి. 125 కోట్ల జనాభా ఉన్న చైనా 1970 ల నుండి నేటివరకు సాధించిన ప్రగతి మానవ చరిత్రలోనే అసాధారణమయింది. అందుకు డెంగ్ సియావో పింగ్ చేపట్టిన చరిత్రాత్మక విధానాలు ఎంత కారణమో, అంతకు ముందు మావో, చౌ ఎన్‌లైలు చేపట్టిన విధానాలూ అంతే కారణం. అందరికీ అక్షరజ్ఞానం, మౌలిక సదుపాయాలు అందించటంలో మావో విజయం సాధించిన కారణంగానే అతి స్వల్పకాలంలో చైనా బీదరికం నుండి బయటపడి ప్రపంచంలో ఓ పెద్ద ఆర్థిక శక్తిగా మారగలిగింది. చాలామంది సామ్యవాదులు బీదరికం పోవాలంటే విధిగా చైనా 1978 దాకా అనుసరించిన విధానాలనే అనుసరించాలని భావిస్తున్నారు. కాని ప్రపంచంలో ఎన్నో దేశాల అనుభవాన్ని చూస్తే బీదరికం నిర్మూలనకు ఎన్నో మార్గాలున్నాయని, చిత్తశుద్ధి ఉంటే స్వేచ్ఛను కాపాడుకుంటూనే సమాజంలో అందరికీ కనీస సౌకర్యాలు, పెరుగుదలకు అవకాశాలు కల్పించవచ్చని రుజువవుతుంది. జపాన్, దక్షిణ కొరియా, ఇండోనేసియా, మలేసియా, థాయ్‌లాండ్, సింగపూర్, హాంకాంగ్, ఫిలిప్పీన్స్ వంటి ఎన్నో దేశాలు మార్కెటు వ్యవస్థలోనే అభివృద్ధిని సాధించాయి. మరికొందరి వాదన ఏంటంటే వీటిల్లో చాలా దేశాలలో స్వేచ్ఛను బలవంతంగా అరికట్టబట్టే అభివృద్ధిని సాధించాయి. కాని ఆ వాదన చేస్తున్న లీకువాన్ యూ వంటివారు తమ నియంతృత్వానికి వంకలు చూపెడుతున్నారు. కాని స్వేచ్ఛ ఏనాడూ ప్రగతికి అవరోధం కాదు. వాస్తవానికి నిజమయిన స్వేచ్ఛ విశృంఖలత్వం కాదు. ఒకరి స్వేచ్ఛ మరొకరికి బాధ్యత అవుతుంది. అలాగే ఒకరి బాధ్యత మరొకరి స్వేచ్ఛను కాపాడుతుంది. ప్రపంచంలో ఎక్కడా నిర్బంధమైన స్వేచ్ఛ ఉండదు. మార్కెటు వ్యవస్థ అంటే అక్రమ సంపాదనకు నిరాటంకంగా అర్రులు చాచటం అనుకుంటే సమాజానికి అంతకంటే మరో ప్రమాదం లేదు. సమాజం అవసరాలను తీరుస్తూ సమకూర్చుకునేదే నిజమయిన సంపద. అంతేగాని దోపిడీ ద్వారాను, దొంగతనం, మోసం లంచాల ద్వారాను సమకూరేది కాదు. అది దొంగ డబ్బు మాత్రమే. అభివృద్ధి చెందిన అన్ని దేశాలలోను బాధ్యతతో కూడిన సంపదకు ప్రముఖ స్థానం ఉంది. అంతేకాదు. ఒకసారి సంపద చేకూరాక, ఎంతసేపటికీ దాన్నంతటినీ తమ పిల్లలకే

అందివ్వాలన్న వెర్రి వ్యామోహంకాక, సమాజానికి పనికివచ్చే విధంగా తమ సంపదను వినియోగించాలన్న తపన ఆ దేశాలలో కనిపిస్తుంది. అందువల్లనే అక్కడ ప్రజల తోడ్పాటుతో, సంపన్నుల సహకారంతో ఎన్నో గొప్ప విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, సాంఘిక ఉద్యమాలు, స్వచ్ఛంద సంస్థలు, పేదరిక నిర్మూలన పథకాలు సాధ్యమయ్యాయి. అదేదో గొప్ప దాతృత్వంగానో, స్వర్గప్రాప్తికి అవకాశంగానో నిజమయిన దాతలెవరూ భావించలేదు. సమాజం నుంచి ఎన్నో పొందిన తాము తిరిగి తమ రుణం తీర్చుకుంటున్నామని వారు భావించారు. మన సమాజంలో మరో అపోహ ఏమంటే మార్కెట్ వ్యవస్థలో ప్రభుత్వం ఏమీ చేయనక్కరలేదని, ఇంతకన్నా అనాలోచితమయిన వాదన మరొకటి లేదు. సమాజంలో శాంతిభద్రతలు కాపాడటం, సకాలంలో న్యాయాన్ని అందించటం, చట్టబద్ధ పాలనకు ఏర్పాట్లు చేయటం, అందరికీ పాఠశాల విద్యను అందించటం, పౌరులకు ప్రాథమిక ఆరోగ్య రక్షణ కల్పించటం, ఆర్థికాభివృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించటం ప్రతి నాగరిక ప్రభుత్వానికి ప్రథమ బాధ్యతలు. ఈ బాధ్యతల నిర్వహణలో ప్రభుత్వం విఫలమయినప్పుడు ఆ జాతి ప్రగతి కుంటుపడటం, ఆ సమాజం భ్రష్టుపట్టటం ఖాయం. ఇందుకు ప్రభుత్వాలకు తగిన వనరులు కావాలి. ఉన్న వనరుల్ని సద్వినియోగం చేయాలి. దుర్మార్గపు రాజ్యవ్యవస్థలో ప్రభుత్వ వనరుల్ని అవకాశం ఉన్నవాళ్లు అందిన మేరకు దోచుకోవటం జరుగుతుంది. తమ పన్నుల డబ్బులతో తమనే దోచుకుంటూ పీడిస్తున్నారని అర్థమయిన ప్రజలు ప్రభుత్వాన్ని ఖాతరు చెయ్యరు. కొత్తగా పన్నులు కట్టమంటే క్షమించరు. ప్రభుత్వం అంటే కేవలం భయం, అసహ్యం ఉంటాయి. కాని, గౌరవం కాని, ప్రభుత్వంమనదన్న భావం కాని ఉండవు. మనదేశంలో జరుగుతున్నది అదే. ఈ పరిస్థితి నుండి బయటపడటం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు కావలసింది సరైన అవగాహన. మన దుష్పరిపాలనకు కీలకాలేమిటో సరిగ్గా బోధపడితే మార్పులు తేవటం అత్యంత సులభం. ఉదాహరణకు ఎన్నికలలో అక్రమ ఖర్చులకు, పరిపాలనలో సర్వత్రా వ్యాపించి ఉన్న అవినీతికి, ప్రజల వేధింపులకు, దోపిడీకి అవినాభావ సంబంధం ఉంది. ఈ అవినీతి, దోపిడీ మనదేశానికి కొత్తగా వచ్చినవేమీ కాదు. ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితమయినవీ కావు.

లోపభూయిష్టమయిన ఎన్నికలకు, మన చుట్టూ పేరుకుపోయిన అవినీతికి మధ్య సంబంధం అర్థం కావాలంటే ఒక్క దృష్టాంతం చాలు. మన రాష్ట్ర శాసనసభకు,

పార్లమెంటుకు జరిగిన 1999 సాధారణ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పార్టీలు దాదాపు రూ.600 కోట్లు ఖర్చుచేశాయి. అసెంబ్లీ స్థానానికి కోటి రూపాయల పైన ఖర్చుపెట్టిన అభ్యర్థులు చాలామంది ఉన్నారు. ఈ ఖర్చులో కొద్దిభాగం మాత్రమే నిజంగా తమ భావాల ప్రచారానికి వినియోగించారు. అధిక భాగం ఓటర్లకు డబ్బు, సారా పంచటానికి, సిబ్బందికి, ఎదిరిపక్షం ఏజెంట్లకు లంచాలిచ్చి లోబరుచు కోవటానికి, గూండా మూకలను పోషించటానికి ఖర్చయింది. డబ్బుకు అమ్ముడుపోయారని ఓటర్లను నిందించి ప్రయోజనం లేదు. ఎవరు గెలిచినా పరిపాలనలో పెద్ద తేడా లేదని అనుభవం మీద గ్రహించిన ఓటర్లు కనీసం ఓటు కోసం డబ్బు తీసుకుంటే ఆ మాత్రమయినా గిట్టుబాటవుతుందని గ్రహించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆటగాళ్లు మారినా ఆట నియమాలు మారని కేంద్రీకృత జడత్వ వ్యవస్థలో ఇది సహజ పరిణామం. ఈ రూ. 600 కోట్ల ఖర్చు మన జీవితాన్ని ఎంతగా అతలాకుతలం చేస్తోందో సంక్షిప్తంగా పరిశీలిద్దాం. ఇలా విచ్చలవిడిగా ఖర్చుచేసిన వాళ్లందరూ ఏదో ప్రజాసేవ చేద్దామన్న తపనకొద్దీ తమ కుటుంబాల భవిష్యత్తును త్యాగం చేసి, సొంత ఆస్తులు తగలబెట్టి శాసనసభలో కూర్చుంటున్నారని మనమెవరం భావించటం లేదు. కాబట్టి పెట్టిన పెట్టుబడిపైన తగిన రాబడి రావాలి. అలాగే ఎన్నిక ఒక పెద్ద లాటరీ కాబట్టి, పోటీలో ఒక్కరే నెగ్గుతారు. కాబట్టి, ఓడితే మిగిలేది శూన్యం కాబట్టి రిస్కుని భరించాలి. ఆపైన వచ్చే ఎన్నికలలో పెట్టబోయే ఖర్చుకు డబ్బు ఆర్జించాలి. ఇంతా చేశాక తమ కుటుంబ ఇక ఏనాడూ భయపడాల్సిన అవసరం లేనంత డబ్బును పదవి ఉన్నప్పుడే వెనకేయాలి. ఆ లెక్కన కోటి రూపాయల ఖర్చుకు ఐదు కోట్లు తిరిగి రాబట్టాలి. అంటే మొత్తం రూ. 3000 కోట్లు దాకా రాష్ట్రంలో వసూలు చేయాలి. కాని మన ప్రజాస్వామ్యం ముసుగులో ఈ డబ్బు ఊరికే రాదు. అందుకు చట్టాన్ని, అధికారాన్ని ప్రభుత్వం యంత్రాంగాన్ని దుర్వినియోగపరచాలి. రవాణా చెక్‌పోస్టులలో, రెవెన్యూ ఆఫీసులలో, వాణిజ్య పన్నుల శాఖలో, పోలీసుస్టేషన్లలో, ఎక్సయిజు ఇన్‌స్పెక్షన్లలో, ప్రజా పంపిణీ వ్యవస్థలో, ఆస్తి రిజిస్ట్రేషను సమయంలో, ఎక్కడ వీలయితే అక్కడ ప్రజలకు అందివ్వాల్సిన ప్రతి సేవలో ప్రజల దగ్గర లక్షల సిబ్బంది ఆ డబ్బును అక్రమంగా గుంజాలి. ఇంత సిబ్బంది వసూళ్లు చేస్తున్నప్పుడు తీసుకున్న ప్రతి రూపాయి ఎన్నికలలో పెట్టుబడి పెట్టిన పెద్దల'కు చేరటం అసాధ్యం. వసూలు చేసిన ప్రతి వందరూపాయలలో పది రూపాయలే పైకి చేరుతుంది! కాబట్టి అవినీతి రూపంలో దోచుకునే డబ్బు పదింతలు

– అంటే రూ. 30,000 కోట్ల వరకు ఉండాలి. ఈ డబ్బు కూడా ప్రజాస్వామ్యంలో ఒక పట్టాన సలభంగా వసూలు కాదు. పౌరుడు ఈ దోపిడీకి తలవంచాలంటే అతణ్ణి రాచి రంపాన పెట్టాలి. డబ్బివ్వకపోతే వేధించాలి; సాధించాలి; ఆలస్యం చెయ్యాలి, లంచమివ్వకపోతే మరెన్నో రెట్లు నష్టం కలుగుతుందని అనుభవంమీద రుజువుచెయ్యాలి. వెరసి ప్రజలకు జరిగే నష్టం వివిధ రూపాల్లో తీసుకునే అహంకారం, నిరంకుశ ధోరణి, ప్రజలని వేధించే తత్వం ఇంత ఎక్కువ స్థాయిలో ఉన్నాయి. ఎన్నికలను సంస్కరించి, పరిపాలనను వికేంద్రీకరించేదాకా ఈ లంచాన్ని, వేధింపులను ఆపటం అసాధ్యం. ఇలా మన చుట్టూ ఉన్న దుష్పరిపాలనకు తరచి చూస్తే మూలాలెక్కడెక్కడో కనిపిస్తాయి.

## ప్రజల విచక్షణే అంతిమం

ఆధునిక యుగం మనకిచ్చిన అవకాశాలు సద్వినియోగం కావాలంటే నిజాయితీతో కూడిన సమర్ధపాలన అత్యంత కీలకమయినది. కాని దానిని సాధించాలంటే పైపై మాటలతో, పైపై మెరుగులతో సాధ్యం కాదు. వ్యవస్థలో కీలకమయిన లోపాలను వెతికి పట్టుకుని, కీలెరిగి వాతపెట్టాలి. అప్పుడు మంచి పాలన, ప్రగతికి కావలసిన సదుపాయాలు సాధ్యమవుతాయి. అలా జరిగితే ప్రజలందరకు కనీస అవకాశాలు, సౌకర్యాలు కలిగించే సాంకేతిక విజ్ఞానం, వనరులు పుష్కలంగా ఉన్నాయి. మంచి పాలన సాధ్యమయినప్పుడే మధ్యయుగాలను దాటి ఆధునిక ప్రపంచంలో భాగస్వాములం కాగలం. లేనట్లయితే నేటి ప్రపంచంలో అనాగరిక చరిత్ర అవశేషంగా భారతదేశం మిగిలిపోయే ప్రమాదముంది. ఆధునిక యుగం కల్పించే ఆశ, మధ్యయుగాల దోపిడీ కొనసాగటం వల్ల కలిగే నిరాశల మధ్య జరిగే ఈ సంఘర్షణ దరిమిలా సంభవించే పరిణామాలు పూర్తిగా నేటి మన చర్యలనుబట్టి మన విచక్షణనుబట్టి ఉంటాయి. జరుగుతున్న చరిత్రకి మనమే బాధ్యులం

* * *

# సమస్యకు పరిష్కారం సభా బహిష్కారం

## సెప్టెంబర్ 15, 2003

నకిలీ స్టాంపుల కుంభకోణంలో మాజీ మంత్రి, పాలక తెలుగుదేశం పార్టీకి చెందిన శాసనసభ్యుడు కృష్ణా యాదవ్ కీలకపాత్ర పోషించినట్లు బయటపడటంతో రాజకీయంగా పెను దుమారం చెలరేగింది. మహారాష్ట్ర పోలీసులు బలమైన సాక్ష్యాలను సేకరించి ఆయనను అరెస్టు చేశారు. దీంతో – మన సమాజాన్ని నేరమయ రాజకీయాలు ఎలా కలుషితం చేస్తున్నాయో మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఈ ఉదంతం మామూలు నేరాలకు సంబంధించింది కాదు. రాజకీయ నాయకులు నేరాలకు పాల్పడటం, కటకటాలు లెక్కించవలసిన నేరగాళ్లు రాజకీయ రంగంలో ప్రవేశించటం మామూలైపోయింది. రాష్ట్రాల శాసనసభలలో ఉన్న 4072 మంది సభ్యులలో 700 మందికి పైగా నేరచరితులున్నారని సాక్షాత్తూ ఎన్నికల సంఘమే ప్రకటించింది. పార్లమెంటులో కూడా 35 మందికి పైగా నేరచరితులున్నట్లు తేలింది. ఒకరకంగా దేశంలోని నేరగ్రస్త రాజకీయాలకు కృష్ణా యాదవ్ వ్యవహారం పరాకాష్ఠ. అంతర్జాతీయ మాఫియాతో, దేశద్రోహులతో కుమ్మక్కై సాక్షాత్తూ ఓ ప్రజా ప్రతినిధి – అదీ మంత్రిగా పని చేసిన వ్యక్తి – నకిలీ స్టాంపు పత్రాలను దేశంలో పెద్ద ఎత్తున అమ్మటానికి పన్నిన కుట్రలో పాల్గొన్నాడంటే దిగ్భ్రాంతి కలుగుతోంది. పత్రికల కథనాల ప్రకారం రు. 32,000 కోట్ల రూపాయల మేరకు నకిలీ స్టాంపులు ప్రజలలో చెలామణీ అయ్యాయి. అంటే ఆ మేరకు వివిధ రాష్ట్రాల ఖజానాలకు గండి పడటమే కాకుండా లక్షల మంది అమాయక పౌరులు దారుణంగా నష్టపోయి ఉంటారు.

### తిలాపాపం తలాపిడికెడు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలను పట్టి కుదిపేస్తున్న ఈ స్టాంపుల కుంభకోణం మన రాజకీయ, పాలనా వ్యవస్థలలోని అయిదు వికృత రూపాలకు అద్దం పడుతోంది. మొదటిది మన రాజకీయ నాయకులు, అధికారులు డబ్బు కోసం ఎంతకైనా తెగిస్తారని ఆ ఉదంతం రుజువు చేస్తోంది. ప్రజలకు సేవకులుగా, సమాజ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్న మంత్రులు, చట్ట సభల సభ్యులు,

ఉద్యోగులు జనహితాన్ని ఏ విధంగా తాకట్టు పెట్టి సొంత లాభం చూసుకుంటున్నారో అర్థమవుతోంది. ఇది లంచాలకో, ముఠా కక్షలకో సంబంధించిన నేరం కాదు. విదేశీ కుట్రదారులతో కుమ్మక్కై మనదేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయటమే లక్ష్యంగా గల ఈ నేరం దేశ ద్రోహమే. ఇలాంటి అసాంఘిక శక్తులు మన రాజకీయాల్లో, అధికార యంత్రాంగంలోని కీలకస్థానాలలో ఉన్నారంటే మన రాజ్య వ్యవస్థ ఎంతటి సంక్షోభంలో చిక్కుకుందో అర్థం చేసుకోవచ్చు. రెండవది – ఈ కుంభకోణం కొన్నేళ్ళక్రితమే బయటపడినా పాలకులు పట్టించుకోకపోవడం. రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన కొందరు అధికారులు – నకిలీ స్టాంపు పత్రాలపై గతంలోనే ఫిర్యాదులు చేసి, నివేదికలు సమర్పించారని ఇప్పుడు తెలుస్తోంది. మన రాష్ట్రంలోనే నేర పరిశోధన ఏళ్ల తరబడి నత్తనడకన నడిచిందని, ఇప్పుడు మహారాష్ట్ర పోలీసులు కృష్ణా యాదవ్‌ను అరెస్టు చేసేదాకా ఈ ఉదంతాన్ని ఎవరూ పట్టించుకోలేదని, ఉద్దేశపూర్వకంగానే నేరాన్ని దాచి పెట్టారని వెల్లడైంది. మహారాష్ట్రలో కూడా కొందరు పౌరులు గట్టిగా ఒత్తిడి తెస్తే తప్ప ఈ దారుణ నేరం మీద సరైన పరిశోధన జరగలేదు. జాతి మొత్తాన్ని నష్టపరిచే ఇంతటి భయంకర నేరాల విషయంలో కూడా అలసత్వం, ఉదాసీనత, కొన్ని సందర్భాలలో పోలీసు యంత్రాంగంతో లాలూచీ పడటం కానవస్తున్నాయంటే మన నేర న్యాయవ్యవస్థ ఎంత దుస్థితిలో ఉందో తెలుస్తోంది. ఆధారాలతో సహా ఫిర్యాదులు అందినవెంటనే ఈకేసును పరిశోధించి ఉన్నట్లయితే, బహుశా వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా అయ్యేది; కుట్రదారులు కోట్లకు పడగలెత్తక ముందే ఈ నేరానికి తెరపడేది. మూడో అంశం – వివిధ రాష్ట్రాలలోని రిజిస్ట్రేసన్ శాఖ, ఆర్థిక శాఖల వైఫల్యం. ఆస్తుల కొనుగోళ్లను రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో విధిగా నమోదు చెయ్యాలి. నమోదు చేయని లోపాయికారీ లావాదేవీలకు అసలు స్టాంపు పత్రాల అవసరమే ఉండదు. ఆస్తి చేతుల మారినప్పుడు ఎంత రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించారో, స్టాంప్ డ్యూటీ ఎంత కట్టారో.. వంటి వివరాలన్నీ ఉంటాయి. నకిలీ స్టాంపు కాగితాలను వాడినప్పుడు ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని, నిజంగా వచ్చిన ఆదాయంతో అధికారులు పోల్చి చూడలేదు. అందులో తేడా ఉందని గమనించలేదు. ఇలా ఏళ్ల తరబడి జరిగింది. చివరికి కొన్ని నకిలీ స్టాంపు పత్రాలు చెలామణీ అవుతున్న విషయాన్ని కొన్నేళ్ళక్రితం కొందరు కిందిస్థాయి అధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చినా ఖజానాకు గండిపడుతోందన్న అంశాన్ని అధికారులు గుర్తించలేదు. ఇలా కర్తవ్య నిర్వహణలో వారు నిర్లక్ష్యం వహించడం

నేరం వంటిదే. పెద్దమొత్తంలో జీతాలు పుచ్చుకొంటూ, చట్టబద్ధ అధికారాలు ఉన్న ప్రభుత్వ సేవకులు తమ కనీస బాధ్యతలను నిర్లక్ష్యం చేశారంటే, పాలనా యంత్రాంగం కేవలం దోచుకుతినేందుకే తప్ప ప్రజల కోసం పనిచేయటం లేదని రుజువవుతోంది. నాలుగోది – ప్రజా ప్రయోజనాలను రక్షించవలసిన వారు అసమర్థులు, అవినీతిపరులు కావడం. పర్యవసానంగా – ప్రజలను దోచుకునేవాళ్లు ఎంతటి చౌరవను, తెలివితేటలను ప్రదర్శిస్తున్నారో నకిలీ స్టాంపుల ఉదంతం తెలుపుతోంది. అబ్దుల కరీం తెల్గీ, ఇతర కుట్రదారులు ,వాళ్లతో కుమ్మక్కయిన దేశద్రోహ శక్తులు మన వ్యవస్థలోని బలహీనతను, ఇక్కడి అధికారులు అవినీతిని అసరాగా తీసుకున్నారు. నాసిక్‌లో గతంలో స్టాంపు పత్రాలు ముద్రించటానికి వాడిన అచ్చులనే వారు కొన్నారు. అందుకుగాను అధికారులకు ముడుపులు సమర్పించుకున్నారు. ముద్రణకు ఉపయోగించే కాగితాలను, సిరాను కూడా ప్రభుత్వానికి సరఫరా చేసే వ్యాపారుల నుంచే వారు కొన్నారట. ఇక ఐదో అంశం. – మన రాజకీయ నాయకులు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న తీరు. జరిగినదాని పట్ల వారు ఏమాత్రం పశ్చాత్తాపడటంలేదు... నేరాన్ని కట్టడిచేయటంలో ఇంతకు ముందు విఫలంకావడం పట్ల వారు సిగ్గుపడటం లేదు... కనీసం ఇప్పుడైనా వ్యవస్థను రక్షించుకుందామన్న సంకల్పం కూడా వారికి లేదు. ఒకరిమీద మరొకరు బురద జల్లుకోవటం, బుకాయించటం, బాధ్యతలనుంచి తప్పించుకోజూడటం, మళ్ళీ మరో కుంభకోణం బయడపడో, లేదా మరో దారుణం జరిగో ప్రజలు మరిచిపోతారని 'ఆశపడటం' తప్ప – ఇప్పుడు జరిగినదానికి బాధ్యులను గుర్తించి, నిజాయతీగా వ్యవహరిద్దామన్న ధ్యాసే వారికి లేదు. ప్రభుత్వం చేపట్టిన కొద్ది చర్యలూ ఎలాగోలా ప్రజలను తృప్తి పరచటానికో, లేదా రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాలలో భాగంగానో తీసుకున్నవే. అంతే తప్ప అవి ప్రజాప్రయోజనాలను రక్షించటం కోసం తీసుకున్నవి కాదని స్పష్టమవుతోంది. జాతి మనుగడకు సంబంధించిన అంశాలలో కూడా రాజకీయ వ్యూహాలే కనిపిస్తుంటే ఇక ఈ పెద్దలను ఎలా నమ్మగలం?

## వెలి వేయడం కొత్తేమీ కాదు

ఇప్పటికేనా మించిపోయింది లేదు. మహారాష్ట్రలో శాసనసభ్యుడు అనిల్ గోటే, మన రాష్ట్రంలో కృష్ణా యాదవ్ అరెస్టయ్యారు. నేర విచారణ తరువాత వాళ్లకు అత్యంత కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. ఈ కుంభకోణంలో కుమ్మక్కయిన ఇతర నేరగాళ్లను పట్టుకుని శిక్షించాలి. వీటికంటే ముందుగా చట్ట సభలకు మిగిలి

ఉన్న కొద్దిపాటి విలువను, గౌరవాన్ని కాపాడాలి. లేకపోతే ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది. లంచాలకు ఆశపడి ఈ కుట్రలో భాగస్వాములైన సభ్యులందరినీ వెంటనే చట్టసభల నుంచి బహిష్కరించాలి. ఇదేదో పార్టీల అంతర్గత వ్యవహారంగా భావించకూడదు. సభ్యులను సభ నుంచి బహిష్కరించి సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం చట్ట సభకు పూర్తిగా ఉంది.

మనదేశంలోనే స్వతంత్ర్యం వచ్చాక రెండు సందర్భాలలో లోక్‌సభ సభ్యులను సభ నుంచి బహిష్కరించారు. 1951లో ఆనాటి తాత్కాలిక పార్లమెంటులో అధికార పార్టీ సభ్యుడు హెచ్.జి. ముద్గల్‌ను బహిష్కరించటానికి అప్పటి ప్రధాని నెహ్రూ స్వయంగా తీర్మానం ప్రవేశపెట్టారు. దానిపై చర్చ జరిగి, తనను బహిష్కరించటం ఖాయమని తెలాక, ముద్గల్ రాజీనామా చేసి రాజకీయాల నుంచి నిష్క్రమించారు. బొంబాయి బులియన్ అసోసియేషన్ నుంచి రూ. 2700/– తీసుకుని తన పదవిని దుర్వినియోగం చేయటానికి సిద్దపడటమే ఆనాడు ముద్గల్ చేసిన తప్పు... ఆ సంస్థ తరపున ముద్గల్ పైరవీలు చేస్తున్నారని నెహ్రూకు ఆనాటి ఆర్థికమంత్రి సి.డి దేశ్‌ముఖ్ ఫిర్యాదు చేశారు. దానిపై టి.టి. కృష్ణమాచారి అధ్యక్షతన సభా సంఘాన్ని నియమించారు. సభాసంఘం సిఫారసు మేరకు ముద్గల్ బహిష్కరించే అధికారం చట్టసభకు ఉందని, సభ్యత్వానికి కళంకం తెచ్చే వారిని బహిష్కరించటం ద్వారా సభా గౌరవాన్ని ఇనుమడింపజేయాలని రాజ్యాంగ నిపుణుడు ఎర్స్కిన్ మే ని ఉదహరిస్తూ నెహ్రూ స్పష్టం చేశారు. 1978లో ఇందిరా గాంధీని లోక్‌సభ బహిష్కరించింది. ఐదో లోక్‌సభ కాలంలో, ఇందిరా ప్రధానిగా ఉన్న రోజుల్లో – సంజయ్‌గాంధీ స్థాపించిన మారుతి కార్ల ఫ్యాక్టరీ గురించి సభను ఆమె తప్పుదోవ పట్టించారన్న కారణంగా ఆరవ లోక్‌సభ ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసి బహిష్కరించింది. ఆ ఉదంతాలను దృష్టిలో ఉంచుకొని చూస్తే – వేల కోట్ల రూపాయలు కుంభకోణంలో ఇరుక్కున్న వాళ్లను, దారుణ నేరాలకు పాల్పడ్డవాళ్ళను సభలో సభ్యులుగా కొనసాగించటం అత్యంత హేయం. బ్రిటిష్ పార్లమెంటరీ చరిత్రలో 16 నుండి నేటి దాకా 60 మంది సభ్యులను బహిష్కరించారని అమెరికన్ కాంగ్రెస్, సెనెట్‌ల నుంచి 1789 నుండి నేటి వరకు ఎందరో సభ్యులను బహిష్కరించారు.

## వ్యవస్థ ప్రక్షాళనకు తొలిమెట్టు

ప్రస్తుతం మన రాజకీయ వ్యవస్థలో నేరచరితులు ప్రవేశించి వర్ధిల్లటానికి, అవినీతి

అంతులేకుండా పెరగటానికి స్పష్టమైన కారణాలున్నాయి. మన ఎన్నికల వ్యవస్థను సమూలంగా మారిస్తే తప్ప రాజకీయాల ప్రక్షాళన సాధ్యం కాదు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోలేం. నేర చరిత్ర గల శాసనసభలను సభ నుంచి బహిష్కరించడానికి చట్ట సభ ఇప్పుడు తీసుకునే చర్యలు – మన రాజకీయ వ్యవస్థ ప్రక్షాళనకు మొదటి మెట్టు కావాలి. నకిలీ స్టాంపుల కుంభకోణం వంటి దారుణాలకు పాల్పడిన వారిని సైతం ఏదో ఒక సాకుతో సభను బహిష్కరించకపోతే చట్ట సభల పట్ల ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదముంది. మన ప్రజాస్వామ్యాన్ని రక్షించటానికి కాక, దేశం అధః పాతాళానికి దిగజారుతున్నా మౌనంగా చూస్తూ ఉండటానికే అవి పరిమితమవుతున్నాయని ప్రజలు భావించినా ఆశ్చర్యపోనక్కర లేదు.

* * *

# ముప్పు తెస్తున్న ముడుపుల సంస్కృతి

## డిశంబర్ 19, 2005

సమాజంలో బాగోగులతో నిమిత్తం లేకుండా ఎవరికీ వారు తమ సొంత లాభాన్నే చూసుకుంటున్నారు. దాదాపు ప్రతిరంగంలోను ఇటువంటి పరిస్థితే నెలకొంది. పేదలకు ఎన్నడూ అందని సబ్సిడీల పేరిట ప్రభుత్వాలు ప్రజల ధనాన్ని వృథా చేస్తున్నాయి. పెద్దయెత్తున లంచాలిచ్చి లైసెన్సులు తెచ్చుకున్న డీలర్లు అవకాశాలను అందిపుచ్చుకొని అక్రమార్జనకు ఒడిగడుతున్నారు. అవినీతి రాజ్యమేలుతోంది.. పార్లమెంటు, రాజకీయ పక్షాలు ఇప్పటికైనా కళ్లుతెరిచి మన రాజకీయాలకు కొత్త రూపురేఖల్ని సంతరింపజేయాలి. మన ఎన్నికల విధానాన్ని సంస్కరించాలి. రాజకీయాలు – అధికారం... ఇవి నిజాయతీకి, చిత్తశుద్ధికి ప్రతీకలు కావాలి.

మార్కెట్‌లోని ధరల స్థితిగతులనుబట్టి ఒకచోట కొన్న సరుకులను మరోచోట లాభానికి విక్రయించడం వ్యాపారంలో మామూలే అందులో బేరసారాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. రాజకీయాల విషయానికొస్తే అవి – అధికార సాధనకో, లేదా దాన్ని వినియోగించుకునే క్రమంలోనో వ్యక్తులు సాగించే కార్యకలాపాలు. రాజకీయాల్లో ఉన్నవారిలోను లాభాలపై యావ, వ్యాపార దృక్పథం పెరిగిపోయాయి.

### అవినీతి విషవలయం

మన రాజకీయాలతోపాటు, ప్రభుత్వ నియంత్రణలో సాగే వ్యాపార లావాదేవీలూ సంతలో సరుకులాగా తయారయ్యాయని ఇటీవల జరిగిన రెండు సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. బాధాకరమైన ఈ రెండు సంఘటనల్లో ఒకటి – ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఐ.ఒ.సి)లో సేల్స్ అధికారిగా పనిచేస్తున్న మంజునాథ్ దారుణ హత్య. నిజాయతీపరుడైన ఈ యువ అధికారి డీజిల్ కల్తీకి పాల్పడే మాఫియా చేతిలో హతులయ్యారు. మరో సంఘటన ఏమిటంటే – సభలో ప్రశ్నలు అడగటానికి పార్లమెంటు సభ్యులు ముడుపులు తీసుకోవడం! రాజకీయాల వికృత రూపానికి, సమాజంలోని ప్రమాదకర పోకడలకు అద్దం పడుతున్న ఈ రెండు సంఘటనలకు మధ్య ఎంతో సారూప్యముంది. ముందుగా మంజునాథ్ హత్యోదంతాన్ని పరిశీలిద్దాం.

కొన్ని రంగాల్లో వ్యాపారం, నేరప్రవృత్తి కలగలసిపోవడం, ఆ రంగాల్లోని వ్యాపారులకు లాభాలను ఆర్జించడమే ప్రధానంగా మారడం, రాజకీయంగా అండదండలు ఉన్నవారికే వాణిజ్యపరమైన అవకాశాలు లభిస్తుండటం, ప్రభుత్వం ఏమీ పట్టించుకోకపోవడం – వీటన్నిటి పర్యవసానమే మంజునాధ్ హత్య. నిజాయతీపరుడైన మంజునాధ్ డీజిల్ కల్తీని సహించలేని అధికారి లంచాలతో అతణ్ని లోబర్చుకోవడం అసాధ్యం. డీజిల్ కల్తీకి పాల్పడే మాఫియా అతణ్ని రంగం నుంచి శాశ్వతంగా తప్పించాలనుకోవడానికి కారణం అదే. వ్యాపారిగా మారిన ఓ గూండా చేతిలో మంజునాద్ హతుడైనట్లు పైకి కనిపించవచ్చు. కానీ – ఆ అధికారి హత్యకు పరోక్షంగా దారితీసిన కారణాలు వేరే ఉన్నాయి. ఆ జాబితాలో – డీలర్‌షిప్పుల కేటాయింపులో అక్రమాలు, ప్రభుత్వ గుత్తాధిపత్యం, ముడుపులు సమర్పించుకుని డీలరుషిప్పులు పొందినవారు అంతకు రెట్టింపు సొమ్మును తిరిగి రాబట్టుకోవడంపై దృష్టి సారించడం, ఆ క్రమంలో వారు అవకతవకలకు పాల్పడటం వంటివి ఉ న్నాయి. ఆ కారణాలను విశ్లేషించవలసిన అవసరముంది.

పెట్రోల్‌పంపు డీలర్‌షిప్పులను ముడుపులు తీసుకునో, లేదా రాజకీయ లబ్ధి కోసమో కేటాయించడం పరిపాటయింది. పెట్రోల్ రంగం ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉండటం వల్ల – మంత్రులు, వారి అనుచరులు ఆ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధి పొందుతున్నారు.. డీలర్‌షిప్పుల కోసం పెద్దయెత్తున లంచాలు ముట్టజెప్పే డీలర్లు సహజంగానే అంతకు రెండింతలు తిరిగి రాబట్టుకోవాలనుకుంటారు. అయితే – పైకి చెప్పుకోలేని ఖర్చులు వారికి ఉంటాయి. ఉదాహరణకు – విజిలెన్స్, తూనికలు – కొలతలు, పౌరసరఫరాలు వంటి విభాగాలకు చెందిన ఇన్‌స్పెక్టర్లకు ముట్టజెప్పే 'మామూళ్ళ'తో సహా ఇతరత్రా కూడా పరోక్ష వ్యయాలు వారికి చాలానే ఉంటాయి. నిజాయతీగా వ్యాపారం చేస్తే – ఆ ఖర్చులకు సరిపోయేంత స్థాయిలో డీలర్లకు లాభాలు రావు. నియంత్రిత ధరల విధానంతోపాటు. మార్కెట్లో ఎదురయ్యే ఒడిదుడుకులు, తీవ్రతరమైన పోటీ అందుకు కారణం.

పేద ప్రజలకు ఊతమివ్వాలన్న తపనతో మన ప్రభుత్వాలు లోపభూయిష్టమైన విధానాలను ఎంచుకుంటున్నాయి. కిరోసిన్‌కు కూపన్లు, తదితర పద్ధతుల్లో నేరుగా సబ్సిడీలను అందించడానికి బదులు దాని ధరలపై సబ్సిడీ ఇస్తున్నాయి. నిజానికి పెట్రోలు, హెచ్.ఎస్.డి. (హై స్పీడ్ డీజిల్)ల వినియోగం పెరిగినంతగా కిరోసిన్

వాడకం పెరగడం లేదు. 1984 నుంచి 2004 వరకు పెట్రోలు వినియోగం 21 లక్షల టన్నుల నుంచి 83 లక్షల టన్నులకు అంటే దాదాపు నాలుగు రెట్లు పెరగగా, హెచ్.ఎస్.డి. వాడకం కోటీ ముప్పై ఏడులక్షల టన్నుల నుంచి మూడు కోట్ల డెబ్బైలక్షల టన్నులకు (దాదాపు మూడు రెట్లు) పెరిగింది. కిరోసిన్ వినియమంలో పెరుగుదల కొద్దిగానే ఉంది. అది అరవై లక్షల టన్నుల నుంచి 94 లక్షల టన్నులకు – అంటే 57 శాతం పెరిగింది. దీనిని బట్టి పేద ప్రజల పేరిట పాలకులు భారీయెత్తున సబ్సిడీలు ఇస్తూనే ఉన్నారు. పెద్ద పెద్ద మొత్తాల్లో లంచాలు ముట్టజెప్పి పెట్రోల్ పంపుల డీలర్‌షిప్పులను సంపాదించుకోవడం, నిజాయతీగా వ్యాపారాన్ని సాగిస్తే – లాభాలు వచ్చే అవకాశాలు పెద్దగా లేకపోవడం వంటి కారణాల వల్ల డీలర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. సబ్సిడీ ధరలకు లభించే కిరోసిన్ సాయంతో డీజిల్‌ను కల్తీ చేయడం, తూనికలు, కొలతల్లో అవకతవకలకు ఒడిగట్టడం వంటి అనుచిత పద్ధతులను అనుసరిస్తున్నారు. వినియోగాదారులు చెల్లించే ధరలకు తగినట్లుగా, వారు కోరిన పరిమాణంలో పెట్రోల్‌ను, డీజిల్‌ను డీలర్లు విక్రయించాలి. కానీ, వినియోగదారుల నుంచి డబ్బు కచ్చితంగా వసూలు చేస్తున్నా – వారికి వాస్తవంగా అమ్మవలసిన పెట్రోల్, డీజిల్‌లలో అయిదు నుంచి పదిశాతం వరకు డీలర్లు మిగుల్చుకోవడమన్నది ఓ దశాబ్దం క్రితం వరకు సర్వసాధారణమైన విషయం. మీటర్ల పనితీరును ప్రభావితం చేయడంతోపాటు, తూనికలు, కొలతల విభాగానికి చెందిన అధికారులతో కుమ్మక్కై – పెట్రోల్ పంపుల డీలర్లు ఇటువంటి అవకతవకలకు పాల్పడేవారు. 'లోక్‌సత్తా' కార్యకర్తలు 1998లో ఈ బండారాన్ని బహిర్గతం చేశారు. అందుకు వారు అనుసరించిన పద్ధతి సులువైనదే. నిర్దిష్టంగా కొలతలు సూచించే వీలున్న క్యాన్ సాయంతో వారు పెట్రోల్ బంకులు సాగిస్తున్న ఈ అక్రమాలను వెలుగులోకి తెచ్చారు. వాహనాల్లోని పెట్రోల్ ట్యాంకులకు బదులు తాము తెచ్చిన ఆ క్యాన్లలోనే పెట్రోల్‌ను నింపాలని వారు డిమాండ్ చేశారు. దాంతో – వాస్తవంగా ఇవ్వవలసినదాని కంటే తక్కువ పరిమాణంలో పెట్రోల్, డీజిల్‌లను సరఫరా చేస్తూ డీలర్లు వినియోగదారులను ఏ విధంగా మోసగిస్తున్నారో వెల్లడయింది. ఆ తరువాత ఓ పక్షం రోజుల వ్యవధిలోనే మన రాష్ట్రంలో ఉన్న మొత్తం 1500 పెట్రోల్ బంకులలోని మీటర్లను, అవి సక్రమంగా పనిచేసేలా చూడటం జరిగింది. క్రమక్రమంగా ఆయిల్ కంపెనీలు గట్టి చర్యలు తీసుకోవడంతో దేశమంతటా – పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో కొలతలపరంగా జరిగే మోసాలు గణనీయంగా తగ్గాయి. అయితే – పెట్రోల్

డీలర్‌షిప్పులకోసం పెద్ద మొత్తాల్లో లంచాలు ముట్టజెప్పవలసిరావడంతోపాటు, రాష్ట్రాల స్థాయిలో సంబంధిత అధికారులకూ క్రమం తప్పకుండా 'మామూళ్ళు' సమర్పించుకోవలసి వస్తుండటంతో – అక్రమ మార్గాల్లోనైనా సరే లాభాలే ఆర్జించాలన్న తపన డీలర్లలో మరింత పెరిగిపోయింది.దాంతో వారు సబ్సిడీ ధరలకు లభించే కిరోసిన్‌తో డీజిల్‌ను కల్తీ చేయడం ద్వారా లాభాలు ఆర్జించడం ప్రారంభించారు. డీజిల్ విక్రయంలో వినియోగదారుల కళ్లు గప్పి, దాని కొలతల్లో వారు మోసం చేయడాన్ని ప్రజల సహకారంతో అడ్డుకోవడం సాధ్యమే. కాని వారు అమ్మే డీజిల్ కల్తీదో, కాదో తెలుసుకోవాలంటే దాని సాంద్రతను హైడ్రోమీటర్ సాయంతో కనుగొనవలసి వుంటుంది. అయితే – నిర్దిష్ట కొలతలను సూచించి క్యాన్లలో డీజిల్‌ను తీసుకుని వెళ్లే హక్కు ప్రజలకు ఉంది కానీ డీజిల్ సాంద్రతను తనిఖీ చేసే అధికారం వారికి లేదు. నిర్దేశిత పద్ధతుల్లో సంబంధిత అధికారులే డీజిల్ శాంపుల్స్‌ను సేకరించాలి. అధీకృత ప్రయోగశాలల్లో వాటిని పరీక్షించాలి. రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి ఆ ఫలితాల ఆధారంగానే అది కల్తీతో కాదో నిర్ణయించాలి. డీజిల్ కల్తీని నిర్ధారించడానికి ఇంత తతంగం ఉంది. ఆ ప్రక్రియ సజావుగా సాగాలంటే అధికారుల్లో నిజాయితీ, చిత్తశుద్ధి ముఖ్యం.

సమాజం బాగోగులతో నిమిత్తం లేకుండా ఎవరికి వారు తమ సొంత లాభాన్నే చూసుకుంటున్నారు. దాదాపు ప్రతి రంగంలోను ఇటువంటి పరిస్థితే నెలకొంది. పేదలకు ఎన్నడూ అందని సబ్సిడీల పేరిట ప్రభుత్వాలు ప్రజల ధనాన్ని వృథా చేస్తున్నాయి. పెద్దయెత్తున లంచాలిచ్చి లైసెన్సులు తెచ్చుకున్న డీలర్లు అవకాశాలను అందిపుచ్చుకొని అక్రమార్జనకు ఒడిగడుతున్నారు. అవినీతి రాజ్యమేలుతోంది. ఈ విషవలయాన్ని ఛేదించే ప్రయత్నంలో మంజునాథ్ తన ప్రాణాలనే పణంగా పెట్టవలసి వచ్చింది.

## సమూల ప్రక్షాళనే కర్తవ్యం

సభలో ప్రశ్నలు వేయడానికి పార్లమెంటు సభ్యులు కొందరు ముడుపులు తీసుకున్న విషయానికొస్తే అది మన సమాజంలో బేరసారాల సంస్కృతికి తిరుగులేని నిదర్శనం. ఈ సమస్యకు మూలం మన దేశంలోని రాజకీయాల తీరుతెన్నుల్లోనే ఉంది. మన దేశంలోని ఎన్నికల విధానంలో అభ్యర్థుల జయాపజయాలను నిర్ణయించేది వారికి పడే ఓట్లలోని తేడానే. అందువల్లనే అభ్యర్థులు ఎన్నికలోల్ల గెలుపుకోసం డబ్బు

విచ్చలవిడిగా ఖర్చుపెడుతుంటారు. వారు భారీయెత్తున చేసే వ్యయంలో అధిక మొత్తాన్ని అడ్డదారుల్లో ఓట్లు కొనుగోలు చేయడానికే వెచ్చిస్తారు. అధికారులకు లంచాలు ఇవ్వడంతోపాటు, ఓటర్లను భయపెట్టడానికి గూండాలనూ వేపుతుంటారు. పెద్ద పెద్ద మొత్తాల్లో డబ్బు ఖర్చుపెట్టినంత మాత్రాన ఓ అభ్యర్థి కచ్చితంగా గెలిచి తీరుతారన్న పూచీ ఏదీ లేకపోయినా, న్యాయబద్ధంగా, తక్కువ వ్యయం చేసే అభ్యర్థి ఓడిపోవడం చాలా సందర్భాల్లో జరుగుతుంది. ఎన్నికల్లో డబ్బు వెదజల్లే అభ్యర్థులు గెలిచిన తరవాత తాను అపై పెట్టిన పెట్టుబడికి మరిన్ని రెట్ల మొత్తాన్ని తిరిగి రాబట్టు కోవాలనుకుంటారు. ప్రభుత్వ యంత్రాంగాలపై తమకు గల పట్టును ఉ పయోగించుకుని సంపాదనపరులవుతారు. బదిలీలు, కాంట్రాక్టులు, నేరాలపై జరిగే దర్యాప్తుల్లో జోక్యం చేసుకోవడం వంటి 'సంపాదనకు' వారికి ఉపకరించే మార్గాల్లో కొన్ని ఎంపీ లాడ్స్ (పార్లమెంటు సభ్యుని నియోజకవర్గ అభివృద్ధి నిధి), తదితర పథకాలనూ తమ స్వప్రయోజనాల సాధనకోసం వారు నిచ్చెనలుగా ఉపయోగించుకుంటారు. ఈక్రమంలో – మరింత దిగజారిన కొందరు శాసనకర్తలు సభలో ప్రశ్నలు వేసేందుకు సైతం లంచాలు అడుగుతారు, పుచ్చుకుంటారు. ఆర్భాటపు ప్రకటనలతోనో, తప్పు చేసిన ఆ కొద్దిమందిని బహిష్కరించడంతోనో ఈ సమస్య పరిష్కారం కాదు. పార్లమెంటు, రాజకీయ పక్షాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి మన రాజకీయాలకు కొత్త రూపురేఖల్ని సంతరింపజేయాలి. మన ఎన్నికల విధానాన్ని సంస్కరించాలి. రాజకీయాలు అధికారం... ఇవి నిజాయతీకి, చిత్తశుద్ధికి ప్రతీకలు కావాలి. అటువంటి నూతన రాజకీయ సంస్కృతిని పార్లమెంటు, పార్టీలు పాదుగొల్పాలి.

* * *

# ప్రజాధనాన్ని భోంచేసేందుకు అధికారం లైసెన్సు కాదు!

**ఆగస్టు 8, 2001**

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత స్వాతంత్ర్యం పొందిన దేశాల పాలనలో ఒక ప్రధాన లక్షణం కనిపిస్తుంది. ప్రజాస్వామ్యం ముసుగు ఉన్న సమాజాలలోను, నియంతృత్వం రాజ్యమేలుతున్న దేశాలలోను కూడా ఈ లక్షణాన్ని చూడవచ్చు. అదేమంటే అధికారంలో ఉన్నవాళ్ళు ప్రజాధనాన్ని ఏదో ఒక రూపంలో దొంగిలించటం, లేదా దోపిడీకి సాయపడటం, ఒకసారి అధికారంలోకి వస్తే ప్రజాధనాన్ని, స్వంత ఆస్తికంటే దుబారా చేస్తారు. స్వంత డబ్బును చాలా పొదుపుగా, అతిజాగ్రత్తగా, ప్రతి రూపాయి ఆచితూచి ఖర్చు చేసే వాళ్ళు ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుచేస్తారు, దోచుకుంటారు. ఓ కారు స్వంతంగా వాడాలంటే ఎంత దూరానికి ఎంత పెట్రోలు ఖర్చువుతుందో లెక్కలు వేసుకుని చాలా పొదుపుగా, అవసరమైనంత మేరకు వాడుకుంటాం. అదే ప్రజాధనంతో నడిచే ప్రభుత్వ వాహనమయితే పిల్లల స్కూళ్లకు, పెంపుడుకుక్కల్ని పశువుల డాక్టరు దగ్గరకు తీసుకుపోవటానికి, వంటమనిషి కూరగాయల్ని కొనటానికి, దూరపు బంధువుల్ని ఓ చోట నుంచి మరో చోటికి తరలించటానికి – ఇలా ఏ మేరకయినా వాడుకోవచ్చు! అంతటితో ఆగితే ఫరవాలేదు. సొంత ఫోను చాలా జాగ్రత్తగా వాడుకునే మనం, ప్రభుత్వ ఫోనంటే దేశంలో సుదూరప్రాంతాలకు, ఇతర దేశాలకు యథేచ్ఛగా ఫోను చేసుకుని గంటల తరబడి మాట్లాడుకోవచ్చు! నెలకి ఇరవైవేలు జీతం పొందేవాళ్ల ఫోను వాడకం అదే నెలలో రెండు లక్షల రూపాయలకు మించి సందర్భాలనేకం ఉన్నాయి. పెట్టే ఖర్చుకు, చేసేపనికి, వచ్చే ఫలితాలకు మధ్య ప్రభుత్వంలో ఏ మాత్రం పొంతన ఉండదు. ఓ మంత్రికో, చట్టసభ సభ్యుడికో, ఓ అధికారికో ప్రభుత్వం ఇంటి సదుపాయం కల్పిస్తే, కొంచెం ఇబ్బంది ఉందనో, వాస్తుప్రకారం ఆ ఇంట్లో ఉంటే ఎక్కువకాలం పదవి ఉండదనో అనిపిస్తే లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేయాటానికి వెనకాడరు. ఓ ప్రముఖ సోషలిస్టు నాయకుడు ఓ ఉన్నత పదవిని చేపట్టగానే అప్పటిదాకా బంగారంలాగా ఉన్న ప్రభుత్వ గృహాన్ని మరమ్మతులు చేసి తనకు అనుకూలంగా

మార్చుకోవటంకోసం రెండు కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని ఖర్చుపెట్టాడని వార్తలొచ్చాయి. గాంధీ మార్గాన్ని గురించి, సామ్యవాదాన్ని గురించి ఉపన్యాసాలివ్వటం మాత్రం అలాంటి వాళ్లు మానేదిలేదు. ఓట్లు వేసి గెలిపించిన సామాన్యులు, పన్నుల డబ్బులు సమర్పించుకుని పాలకులను రాజభోగాలలో ఉంచే పౌరులు – కనీస ఆరోగ్య వసతికి, టీకాలకు నోచుకోక అకాలమరణం పాలవుతుంటే, ఈ 'నేతలకు' మాత్రం చిన్నపాటి అనారోగ్యం వస్తే లక్షల ఖర్చుతో వెంటనే విదేశాలలో వైద్యం చెయ్యాలి! ఇక అంగరక్షకుల పేరుతో పెట్టే ఖర్చు అంతింతకాదు. ఎవ్వరూ పట్టించుకోని, ఎందుకూ కొరగాని, బతికినా చచ్చినా లెక్కలేని వాళ్లను కూడా రక్షించటం ఈ దేశ ప్రజల బాధ్యతగా వాళ్లకువాళ్ళే చెప్పుకుని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తగలేస్తున్నారు. ఆ విధంగా తమ 'ప్రతిష్ట' పెరుగుతుందని భావించి జనాన్ని దోచుకుంటున్నారు. చివరికి నిజజీవితంలో హంతకులు, గూండాలు, ముఠానాయకులు, దోపిడీదారులుగా ఉన్నవాళ్ళకు కూడా ప్రజాధనంతో రక్షణ కల్పించాలి. వాళ్ళ దోపిడీ నిర్విఘ్నంగా కొనసాగటానికి మనమే మళ్ళీ వాళ్ళకు రక్షణ కల్పించాలి! మన వేళ్లతో మన కళ్ళను మనమే పొడుచుకోవాలి.

## అక్రమార్జనే వృత్తి

ఈ దోపిడీ కేవలం దుబారా ఖర్చుకో, ప్రభుత్వం కల్పించే సదుపాయాలకో పరిమితమయితే కొంత మేరకు సరిపెట్టుకోవచ్చు. కాని అంతటితో ఆగితే అధికారంలో మజా ఏముంది? ప్రజాధనాన్ని ప్రత్యక్షంగా దొంగతనం చేసి సొంత ఆస్తిగా మార్చుకోకపోతే ఇక ఇంత హైరానా, శ్రమ, రిస్కు ఎందుకు?; అయినకాడికి లంచాలు మేయటం, తమకు కావలసిన అవినీతిపరుల్ని అందలాలెక్కించటం, వాళ్ల ద్వారా ప్రజాధనాన్ని, దోచుకోవటం, సామాన్యులను నిలువు దోపిడీ చేయటం అధికారంలో భాగమయిపోయింది. ఓ రాజకీయ నాయకుడు అకాలమరణం పొందితే మనం తరువాత ఎన్నో కథలు వింటున్నాం. కోట్లకొలది అక్రమంగా సంపాదించిన డబ్బును – మిత్రులు అని నమ్మి వాళ్ళ దగ్గర దాచిపెడితే, ఆ మనిషి పోగానే వాళ్ళు సొంతం చేసుకున్నారని, స్విస్ బ్యాంకులలో దాచుకున్నారని, బాగా లంచాలుమింగి సంపాదించిన మంత్రి గూఢచారి విభాగాలు ఆ కుటుంబం వెంటపడి అధికార పార్టీకి చెందాల్సిన ఆ డబ్బు ఎక్కడుందో చెప్పమని ఆదేశించాయని – ఇలా ఎన్నో పుకార్లు... కొంత వాస్తవం, మరికొంత అతిశయోక్తి కలిపిన కథలు ప్రచారంలో

ఉన్నాయి. ఒకసారి ప్రజల మద్దతుతోనో, అధినాయకుల అండతోనో, ఎన్నికలలో అక్రమాలద్వారానో అందలం ఎక్కితే ఇక ఏదో రూపంలో అక్రమార్జన చేయటం వాళ్ళ జన్మహక్కయిపోయింది. కొందరు మంత్రులు, అధికారులు నిజాయతీగా, నిక్కచ్చిగా, ముక్కుసూటిగా, ధర్మబద్ధంగా పనిచేస్తూ ఏటికి ఎదురీదుతున్నారు. అలాంటి కొద్దిమంది ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. అధిక సంఖ్యాకులు అధికారాన్ని సొమ్ముగా మార్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు నియామకాలకు, ప్రాజెక్టుల అనుమతికి, పెద్ద కాంట్రాక్టులకు, ప్రభుత్వ కొనుగోళ్ళకు, ప్రభుత్వ సంస్థల అమ్మకాలకు, లైసెన్సులకు ఇలా ఎక్కడ దొరికితే అక్కడ ఎడాపెడా దోచుకుంటున్నారు. వాళ్ళు కోటి తింటే, లంచం ఇచ్చినవాడు పదికోట్లు లాభపడుతున్నాడు. చివరికి నష్టపోయది అమాయకజనం ! మన ఆర్థిక వ్యవస్థలో ఇంతకుమించిన దోపిడీ మరొకటుంది. ప్రభుత్వంలో అధికారం చెలాయిస్తున్నప్పుడు కేవలం ఖజానా డబ్బునే దోచుకోవాలంటే కొన్ని పరిమితులున్నాయి ఎన్నో నిబంధనలు అడ్డొస్తాయి. వాస్తవానికి పనికిరాకపోయినా – పేరుకు ఆడిట్లు, లెక్కలు ఉన్నాయి. అలాగే లంచాల రూపంలో తినాలంటే ఓ స్థాయికిమించి సాధ్యంకాదు. అవతలవాడిని వేధించే శక్తి, లేదా వాడికి డబ్బు అప్పనంగా మరింత డబ్బు దోచుకునే అవకావం ఉన్నపుడే లంచం ముడుతుంది. వేధించేశక్తి లేదా వాడికి డబ్బు అప్పనంగా మరింత డబ్బు దోచుకునే అవకాశం ఉన్నప్పుడే లంచం ముడుతుంది. వేధించటం శ్రుతిమించితే ప్రజలనుంచి ప్రతిఘటన రావచ్చు. ఒక్కడికే మరీ ఎక్కువగా దోచుకునే అవకాశం ఇస్తే మిగిలినవాళ్ళు ఎదురుతిరుగుతారు. ఆర్థిక వ్యవస్థలో పోటీవల్ల ఇష్టం వచ్చినట్లు చేసే అధికారం పరిమితం. కాబట్టి అసలు నిజంగా డబ్బు దోచుకునే అవకాశం మరొకటుంది. అది ఆర్థిక సంస్థల మీద పెత్తనం. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎన్నో ఆర్థిక సంస్థలు ప్రభుత్వ అధీనంలో నడుస్తున్నాయి. ఆ సంస్థలమీద పూర్తి అధిపత్యం మంత్రులదే. ఆ సంస్థలలో ఉన్నతాధికారుల నియామకాలు, వాటి ప్రధాన నిర్ణయాలు, విధానాలు అన్నీ పాలకుల ఆదేశాలననుసరించి జరుగుతాయి. కీలక స్థానాలలో ఉన్న అధికారులే ఆర్థిక వ్యవస్థను శాసిస్తారు. ఆ అధికారాన్ని దుర్వినియోగం చేయటం, చేతనయితే ఒక్క కలంపోటుతో, రెండో కంటికి తెలియకుండా, ఎవరూ విమర్శించే అవకాశం పెద్దగా లేకుండా వేలకోట్ల రూపాయలను కైంకర్యం చేయవచ్చు. పనికిరాని ప్రాజక్టులకు బ్యాంకులు వందలకోట్ల రూపాయలు అప్పులిచ్చినా, ఓ హర్షద్‌మెహతాకు, ఓ కేతన్ పారిఖ్‌కు వందల కోట్ల రూపాయలు అక్రమంగా ముట్టినా, పెద్ద పెద్ద కంపెనీలలో అతి

ఎక్కువ ధరకు ఆర్థిక సంస్థలు షేర్లను కొని డబ్బు అప్పజెప్పినా.. ఇవన్నీ మన పాలకులు ఆర్థిక సంస్థలను ఎడా పెడా దోచుకోవటం వల్ల జరుగుతున్నవే. తేడా ఏమంటే ఆర్థిక సంస్థల దోపిడీలో పోయేది ప్రజలు దాచుకున్న సొంత డబ్బు ప్రభుత్వ ఖజానాను దోచుకుంటే పోయేది ప్రజలిచ్చిన పన్నుల డబ్బు పన్నులు కట్టాక ఇక ఆ డబ్బు పోయినట్లుగా మనం భావిస్తాం. కాని బ్యాంకుల్లోనో, యూనిట్ ట్రస్టులోనో, ఓ ఆర్థిక సంస్థలోనో 'డిపాజిట్లు పెడితే, షేర్లు కొంటే అది మన ఖాతాలోనో ఉందని, మనకు వడ్డీలను, డివిడెండ్లను ఇస్తుందని, షేరు ధర పెరిగి లాభాలను ఆర్జించి పెడుతుందని విశ్వసిస్తాం. మన పన్నుల డబ్బు దోచుకోవడంతో తృప్తిపడని పాలకులు, చివరికి మన సొంత డబ్బును దాచుకుంటే దాన్ని కూడా మింగేస్తున్నారు.

## కలంపోటుతో దోపిడీ

ఇటీవల ప్రభుత్వ రంగ ఆర్థికసంస్థ యు.టి.ఐ ఇరుక్కున్న కుంభకోణం ఇలాంటిదే. గత 37 సంవత్సరాలలో యు.యస్ 64 పేరుతో ప్రజలు పొదుపుచేసుకున్న మొత్తాన్ని ప్రభుత్వరంగ మ్యూచువల్ ఫండ్ యు.టి.ఐ. వసూలు చేసింది. కొంతకాలంపాటు బాగానే డబ్బు తిరిగి ఇచ్చింది. యూనిట్ ధరలు కూడా పెరిగి సామాన్య ప్రజలు లాభపడ్డారు. 1992-93 కాలంలో షేర్ మార్కెట్ వేలంవెర్రి దేశమంతటా వ్యాపించటంతో వేల కోట్ల రూపాయలు ప్రజల నుంచి వసూలు చేశారు. సామాన్య ప్రజలు, మధ్యతరగతి వారు క్యూలలో నుంచి మరీ తాము కష్టపడి పొదుపుచేసిన డబ్బును కట్టి యూనిట్లు కొనుక్కున్నారు. ఇక అప్పటినుంచి ప్రారంభమైంది. అసలు కథ. అధికారంలో ఉన్నవాళ్ళు తమకు కావలసిన వాళ్లను, తమమాట వినేవాళ్ళను ఆర్థిక సంస్థలలో ఉన్నతస్థానాల్లో నియమించుకున్నారు. ప్రజలు దాచుకున్న డబ్బును తమకు నచ్చిన కంపెనీలలో షేర్లుకొనే నెపంతో 'దానం' చేశారు. ఆ కంపెనీలు వందలకోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నాయి. ఆ నాయకులు, అధికారులు కోట్లకు పడగలెత్తారు. యూనిట్ ట్రస్టు దివాలాస్థితికి చేరింది. రెండుకోట్ల కుటుంబాలు మొత్తంపెట్టిన డబ్బు పోయే పరిస్థితి వచ్చింది. 1998లో ఇలాంటి పరిస్థితి వస్తే కేంద్ర ప్రభుత్వం మూడు వేల కోట్లకుపైగా పన్నుల డబ్బును ఇచ్చి సంక్షోభంలో ఉన్న యు.టి.ఐ.ని గట్టెక్కిచ్చింది. మళ్ళీ ఇప్పుడు అలాంటి పరిస్థితే ఉత్పన్నమయింది. ఎనిమిది సంవత్సరాల క్రితం పది రూపాయలు పెట్టుబడి పెడితే కనీసం నేటికి 30 రూపాయలవుతుందని ప్రజలు ఆశించారు. కాని ఇప్పుడు ప్రభుత్వం సాయం చేశాక,

ఎనిమిదేళ్ళు గడిచాక పది రూపాయలే తిరిగి ఇస్తామంటున్నారు. అంటే నాటి విలువలో మూడు రూపాయలు తిరిగి వచ్చిందన్నమాట! అదీ వేల కోట్ల రూపాయల పన్నుల డబ్బును ఇచ్చి యు.టి.ఐ. నిలబెట్టాక! అంటే ప్రజలు తమ కుడి జేబులోంచి డబ్బులిచ్చి ఎడం జేబులోకి గతంలో ఎప్పుడో ఇచ్చిన పది రూపాయలకి బదులు మూడు రూపాయలు తిరిగి తీసుకోగలుగుతున్నారన్నమాట. దానిమీద ఆనవాయితీగా పార్లమెంటులో దుమారం, పత్రికలలో ప్రకటనలు, ప్రతిపక్షాల విమర్శలు, ప్రభుత్వం హామీలు – ఇవన్నీ చూస్తున్నాం. ఈసారి కొత్తదనం ఏమంటే సాక్షాత్తు ప్రధానమంత్రి విమర్శలకు అలిగి రాజీనామా చేస్తానని బెదిరించటం, పాలకపక్షాలు ఆయన్ని బుజ్జగించి రాజీనామా ప్రతిపాదనని విరమించేలా చేయటం, ప్రభుత్వం దృష్టిలో కథ సుఖాంతంగా ముగియటం! కాని ప్రజలకు ఇది సుఖాంతం కాదు. ప్రభుత్వ ఖజానాకు ఇది సుఖాంతం కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది సుఖాంతం కానే కాదు.

## వ్యవస్థాగత మార్పులు అవసరం

అధికార భారతీయ జనతాపార్టీకి, వారికి అండగా ఉన్న ఆర్.ఎస్.ఎస్.కు అత్యంత సన్నిహితుడు, స్వదేశీ జాగరణ్ మంచ్‌లో ప్రముఖ పాత్రధారి అయిన ఎస్. గురుమూర్తి ఇటీవల ఓ ప్రముఖ పత్రికలో సంచలనాత్మకమైన, ఆరోపణలు చేశారు. 1995లో రిలయన్స్ కంపెనీలో హడావుడిగా, రాజకీయ ఒత్తిళ్ళవల్ల భారీగా ధరలకు షేర్లుకొని, అందుకోసం రూ.1073 కోట్లు ఖర్చు చేశారని, అదే ఈ సంక్షోభానికి మూలమని గురుమూర్తి ఆరోపణ. రిలయన్స్ కంపెనీ ప్రమోటర్లకు అదే సమయంలో ఆరుకోట్ల షేర్లను చాలా ఉదారమయిన షరతులతో, ఆరేళ్ళకాలంలో వడ్డీలేకుండా చెల్లించేలా తక్కువధరకు కేటాయించారు. అలా లెక్కచూస్తే ఆ షేర్లను రూ.61 చొప్పున ప్రమోటర్లు కొనుక్కున్నారు. అదేకాలంలో రెండు విడతలుగా 2.75 కోట్ల షేర్లను యు.టి.ఐ. రూ.1073 కోట్లు ఇచ్చి అంటే షేరుకి సగటున రూ.399 చొప్పున కొన్నది. అదే రేటుకు ఇతర ప్రభుత్వ ఆర్థిక సంస్థలు – జి.ఐ.సి, ఎల్.ఐ.సి కూడా కొన్నాయి. ఒక్క ఈ కొనుగోలు వల్ల రూ.1500 కోట్లు యు.టి.ఐ. నష్టపోయిందని గురుమూర్తి వాదన. ప్రస్తుతం ఈ షేర్లు రూ. 300 పలుకుతున్నాయి. అయితే ఈ లోగా బోనస్ షేర్లు ఇవ్వటంతో, యుటి.ఐ. షేర్లు రెట్టింపయ్యాయి. ఆ విధంగా ప్రస్తుత షేర్ ధరల ప్రకారం లెక్కకట్టినా, యు.టి.ఐ.కి కేవలం 6 శాతం చక్రవడ్డీ లభించిందని

గురుమూర్తి అంచనా. అంటే బ్యాంకులో డిపాజిట్ చేస్తే అంతకు రెట్టింపు ఆదాయం వచ్చేది. పోనీ 'చచ్చిన వాడికి వచ్చిందే కట్నం' అనుకుని ఆ మాత్రమైనా తిరిగి తీసుకుందామనుకుంటే అన్ని రిలయన్స్ షేర్లను కొనే నాథుడే లేడు. యు.టి.ఐ. ఆ షేర్లను అమ్ముతోందని తెలిస్తే మరుక్షణం ఆ షేరువిలువ సగానికిసగం పడిపోతుంది. ఇదీ మన ఆర్థిక సంస్థ నిర్వాకం. ప్రజలు దాచుకున్న డబ్బు వెయ్యికోట్ల రూపాయలతో ఆరు రెట్లకి పైగా ఎక్కువ ధరకు షేర్లను కొనటం ద్వారా ఆ మొత్తాన్ని రిలయన్స్ కంపెనీకి దానం చేసేశారు.! 'అత్త సొమ్మును అల్లుడు దానం చెయ్యటం' అంటే ఇదే! చివరికి రిలయన్స్ కంపెనీ మన డబ్బుతో లాభపడింది. ప్రజల నెత్తిన టోపీ పడింది. అలాగే గత సంవత్సరం ప్రధానమంత్రి కార్యాలయం ఒత్తిడివల్ల ఊరూ పేరూ లేని సైబర్ స్పేస్ ఇన్ఫోసిస్ కంపెనీలో పెద్ద ఎత్తున యు.టి.ఐ. పెట్టుబడి పెట్టిందని, 600 పనికిరాని కంపెనీలలో, బోగస్ కంపెనీలలో వందలకోట్లు పెట్టుబడి పెట్టిందని పాలకపక్షాలలో ఒకటైన శివసేన పార్లమెంటు సభ్యుడు సంజయ్ నిరుపమ్ రాజ్యసభలో ఆరోపణలు చేశారు. ప్రజలు దాచుకున్న డబ్బును పాలకులు ఎలా దోచుకుంటున్నారో ఈ ఉదంతాలు బయటపెడుతున్నాయి. 1995 నుంచి నేటిదాకా ఇలాంటివి జరగటంతో ఇందులో పాలకపక్షాలు, ప్రతిపక్షాలు అనే తేడాలు లేవని, అన్ని ప్రధాన పార్టీలు యథాశక్తిని ప్రజలను దోచుకోవటంలో పాలు పంచుకుంటున్నాయని తేటతెల్లమవుతోంది. దీనికి పరిష్కారం రాజీనామా బెదిరింపులు, సెటిల్‌మెంట్లు, కోపతాపాలు, రాజకీయ ఒప్పందాలు కాదు; ఇప్పటికైనా తప్పులు చేసిన వాళ్ళు శిక్షకు గురవుతారా? జవాబుదారీతనం నెలకొంటుందా? ప్రభుత్వంలో బాధ్యత ఉన్నవాళ్ళు ప్రజాధనం దోపిడీలో పాలు పంచుకోకుండా, ప్రజాప్రయోజనాల రక్షణకు నిలబడేలా వ్యవస్థాగతమైన మార్పుల్ని తెస్తారా? ఎన్నికలలో సంస్కరణల్ని తెచ్చి ప్రజల డబ్బుతో పాలకుల వ్యాపారంగా మారిన రాజకీయాన్ని మళ్ళీ ప్రజాసేవలకు అంకితం చేస్తారా? అక్రమార్జనపరుల్ని, దోపిడీదారుల్ని తరిమికొడతారా? ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాల మీద వాజ్‌పేయి ప్రతిష్ఠ. ఈ ప్రభుత్వ మనుగడ,. ఈ రాజకీయ వ్యవస్థ భవిష్యత్తు ఆధారపడి ఉన్నాయి.

* * *

# అనైతిక సంపాదనతో అధికారానికి గాలం!

**డిశంబర్ 6, 1999**

ఏడాది క్రితం వరకు కోలా వెంకట కృష్ణమోహన్ అంటే ఎవరికీ తెలియదు. ఆకస్మాత్తుగా కొన్ని నెలల క్రితం యూరో లాటరీలో గెలిచి ఆయన కోట్లకి పడగలెత్తాడని వార్తలు వచ్చాయి. వెంటనే ఎక్కడలేని హడావుడి, ఆర్భాటం. వెనకటికి మహ్మద్ బిన్ తుగ్లక్ అనే పేరుతో ఓ నాటకం, అదే పేరుతో ఓ తెలుగు సినిమా వచ్చాయి. కొందరు మిత్రులు మన రాజకీయం, ప్రజాస్వామ్యం ఎంత అపహాస్యమయ్యాయో, ప్రజలను ఎంతగా మోసం చేస్తున్నాయో బట్టబయలు చేయాలని నిర్ణయించుకున్నారు. వాళ్లలో ఒకడు మిత్రుల సాయంతో తుగ్లక్ మళ్లీ బతికి వచ్చాడని జనాన్ని నమ్మిస్తాడు. ప్రజల అమాయకత్వాన్ని అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని అధికారాన్ని కైవసం చేసుకుంటాడు. పదవిని చేపట్టాక వాస్తవాన్ని ప్రజల ముందు పెట్టాలని, వాళ్లు ఎంతగా మోసపోతున్నారో తెలియజెప్పాలని, ఆ విధంగా జనం కళ్లు తెరిపించాలని ఆ మిత్రుల పథకం. అయితే ఒకసారి అధికారం అందగానే తుగ్లక్‌లా నటిస్తున్న వాడి మనసు మారిపోయింది. ఇంకా సమాజాన్ని గురించి ఆలోచిస్తున్న తన పాత మిత్రుల అడ్డు తొలగించుకుని, అధికారంలో స్థిరపడి, ప్రజలను కలకాలం అలాగే భ్రమలలో మోసం చేస్తుంటాడు ఆ దొంగ తుగ్లక్.

## డబ్బే గొప్పదనానికి చిహ్నం కాదు

ఒక రకంగా కోలా కృష్ణమోహన్ కథ తుగ్లక్ పథకాన్ని గుర్తు చేస్తున్నది. ఉద్దేశం ఏమయినా, ఒక సమాజంగా మనం ఎంతగా పతనం అవుతున్నామో, ఎంతగా పలచబడ్డామో, చెప్పే మాటలకు చేసే పనులకు ఎంతగా అంతరం పెరుగుతోందో ఈ ఉదంతం తెలుపుతోంది. నిజమయిన సంపద సృష్టి జరగాలంటే ప్రజలకు అవసరమయిన వస్తువులు సేవలు ఉత్పత్తి కావాలి. అలాంటి సంపదవల్ల సమాజం అవసరాలు తీరతాయి. వ్యక్తులు ఆర్థికంగా బలపడతారు. సంపదను సృష్టించకుండా వ్యక్తుల చేతుల్లోకి డబ్బు చేరటంవల్ల సమాజానికి ఏ ప్రయోజనమూ చేకూరదు. తల్లిదండ్రుల ఆస్తులను పొందటంలోనో, లాటరీలో గెలవటంలోనో వ్యక్తి ప్రతిభ

లేదు, సమాజానికి ప్రయోజనం చేకూరదు. అలా డబ్బు పొందటంలో ఆ వ్యక్తి తప్పేమీ లేదు. కాని అదేదో గొప్ప ఘనకార్యంలాగా ఆ వ్యక్తి వెంటపడటం లేని లక్షణాలు అంటగట్టడం, నాయకత్వాన్ని ఆపాదించడం, కేవలం డబ్బు కారణంగా గొప్పతనాన్ని ఊహించకోవటం ఇవన్నీ సమాజానికి హానికరాలు. గాంధీజీలాంటి మహర్షులు – సంపాదించని డబ్బును పాపంగా భావించారు. మనలాంటి సామాన్యులకు అంతటి ఉన్నత ప్రమాణాలు పాటించటం అసాధ్యం. కాని సంపాదించని డబ్బు గొప్ప వాణ్ణి చేస్తుందనుకునే భావన మాత్రం సిగ్గుచేటు. ప్రజాస్వామ్య సమాజంలో ఓ మనిషి ఏ కులంలో, ఏ కుటుంబంలో పుట్టినా, ఎంత సంపద ఉన్నా, ఎంత బీదరికంలో మగ్గుతున్నా, ఏ పని చేస్తున్నా – అందరికీ సమానమయిన వ్యక్తిత్వం, హుందాతనం ఉన్నాయి. మనుషులందరూ ఎప్పటికీ సమానం కాలేకపోవచ్చు. కాని ఎవరికీ ఆత్మగౌరవానికి, హుందాతనానికి లోపం ఉండరాదు. డ్రెయిన్లు శుభ్రం చేసే వ్యక్తి, బాత్‌రూములో గొట్టం అడ్డు తొలగించే ప్లంబరు తమ శ్రమరీత్యా ఎవరికీ తీసిపోరు. నిజానికి ఓ కలెక్టరు, లేదా ఓ మంత్రి చేసే పని కంటే, ఆ ప్లంబరు చేసే పనివల్లనే మనకి వెంటనే ప్రయోజనం కలుగుతుంది. ఓ మనిషిని అంచనా వేసేటప్పుడు అతడి సంపదను, హోదాను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం విజ్ఞుల లక్షణం కాదు. దురదృష్టవశాన మన సమాజంలో నిజమయిన శ్రమకు విలువ, గౌరవం చాలా తక్కువ. ఆనాదిగా కులవ్యవస్థ ప్రభావం వల్ల, ఆధునిక యుగంలో ఏదో ఒక రకంగా డబ్బు సంపాదించటమే ధ్యేయం కావటం వల్ల నిజంగా సమాజంలో ప్రజల అవసరాలను తీర్చే సంపద సృష్టి అంటే తగిన గౌరవం లేకుండా పోయింది.

మతం, సంప్రదాయం, ధర్మశాస్త్రాలు అవినీతిని, దొంగతనాన్ని తప్పని ఘోషిస్తున్నాయి అయినా నేటి సమాజంలో లక్షలమంది సామాన్యులను నట్టేటముంచి కోట్లు ఆర్జించిన ఓ హర్షద్ మెహతా, పౌరులను కొల్లగొట్టి లంచాలు దిగమింగిన అవినీతిపరుడయిన ఒక అధికారి, లేదా మంత్రి, రవాణా ద్వారానో, దొంగ నోట్ల ముద్రణ వల్లనో, కల్తీ చేయటం ద్వారానో, అమాయకుల్ని మోసగించటం ద్వారానో కోట్లకు పడగలెత్తిన ఓ మోసగాడు గొప్ప వాళ్లుగా చెలామణి అయిపోతున్నారు. హీరోలుగా వెలిగిపోతున్నారు. ఇది జాతి భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు. నిజమయిన హీరోయిజం దొంగ సంపాదనలలోను, అవినీతిలోను, లక్షల అక్రమ సంపాదనను మంచినీళ్లలా ఖర్చు చేయటంలోను లేదు; వీటిని వ్యతిరేకించటంలో, సంపదని

సృష్టించటంలో, మనిషి అవసరాలను తీర్చటంలో హీరోయిజం ఉంది. మనిషి ఇతరులకు హీరో కాజాలడు. ఏ మనిషినైనా ఎంతవరకు గౌరవించవచ్చు అని చూస్తే, అతడివల్ల ఇతరులకు మంచి ప్రయోజనాలు చేకూరే వరకూ మాత్రమే అతడు గౌరవానికి అర్హుడు. అంతమేరకు అతడు, లేక ఆమె నిజమయిన హీరో. అలాకాక ఈ కృత్రిమ హీరోలను సృష్టించుకుని సమాజాన్ని అధోగతిపాలు చేయటం ఆధునిక భారతీయ సమాజ ప్రత్యేక లక్షణం. ఎలా సంపాదించాడనేది కాక, ఎలాగయినా సరే ఎంత సంపాదించాడనేది మాత్రమే ఓ మనిషి విజయానికి గీటురాయిగా ఉన్నంతకాలం ఆ సమాజం తీవ్రంగా నష్టపోతుంది. ఇదేదో కొందరు అక్రమార్జనపరులు చేస్తున్న తప్పు మాత్రమే అనుకుంటే పొరపాటు. మన చుట్టూ అక్రమాలు జరుగుతున్నాయని, మోసపోతున్నామని, దోపిడీకి గురవుతున్నామని తెలిసినా పట్టనట్లు కూర్చునే మనమందరమూ తప్పు చేస్తున్నట్లే లెక్క. ఆధునిక యుగంలో మతం, సమాజం కొంతమేరకు బలహీనపడ్డాయి. ఆ మేరకు రాజకీయం సామాజిక ప్రయోజనాలను కాపాడాలి. దురదృష్టవశాన రాజకీయం అధ్వాన్నమయి పోయింది. సమాజాన్ని మరింత బలహీనపరుస్తున్నది. అందుకే ఉద్యోగంలో ఉన్నంతకాలం అవినీతికి పాల్పడ్డవాళ్ళు కొందరికి రాజకీయ పార్టీలు నిర్లజ్జగా సీట్లిచ్చి రాజకీయంలోకి లాగుతున్నాయి. కూడబెట్టిన కోట్లు ఖర్చుపెట్టి గెలిచి రాకపోతాడా అన్నది వాటి విశ్వాసం! నిజంగా పార్టీలలో మంచివాళ్లు నిజాయతీపరులు, సచ్చరితులు ఉన్నా వాళ్లను పక్కకు నెట్టేస్తున్నారు. గూండా అయినా, హంతకుడయినా, పచ్చినెత్తురు తాగే దుర్మార్గుడయినా, మానభంగాలు చేసిన రాక్షసుడయినా ఫరవాలేదు. డబ్బు, ఇతర గూండాల అండ ఉన్నవారయితే రాజకీయంలో పదవులకు అర్హుడే. మంచి వాళ్లు ఇంకా రాజకీయంలో లేకపోలేదు. కాని దుర్మార్గుల శాతం పెరుగుతూ వస్తోంది. ఎలాంటి చరిత్రకలవాడైనా సరే ఒకసారి రాజకీయంలో చేరి పదవిలో ఉంటే చాలు, అతడికి మన సమాజం ఎంతో గౌరవాన్ని ఇస్తున్నది. ఆ వ్యక్తి అనర్హుడని, అవినీతిపరుడని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని తెలిసినా, మనసులో అసహ్యాన్ని దాచుకుంటూ పైకి వినయాన్ని ప్రదర్శించటం, అతిగా అణకువగా ఉండటం అనవాయితీ. పదవి అనేది ప్రజల సేవ కోసం ఇచ్చిన అవకాశంగా కాక, ఆ వ్యక్తికి కలిగిన అదృష్టంగాను, అతడిని, అతని కుటుంబానికి లాభం చేకూర్చే వ్యాపారంగాను అంగీకరిస్తున్నాం. సహజంగానే రాజకీయంలో ఉన్నవాళ్లు మన ప్రతినిధులుగా ఎన్నికయిన వాళ్లు ఉద్యోగులుగా ఎంపికయిన వాళ్లు అందరూ తమ

పదవి సొంత ఆస్తిలా భావించటానికి అలవాటుపడ్డారు. ప్రజలు రాజకీయాన్ని నిరసిస్తే ప్రయోజనం లేదు. ధూర్తుడికి, అజ్ఞానానికి, అవినీతిపరుడికి పదవులంటగట్టటం, పదవులు చేరగానే లేని గొప్పదనాన్ని చూడటం ఆపనంతవరకూ రాజకీయం సమాజాన్ని భ్రష్టుపట్టిస్తుంది. పదవులలో ఉన్న వాళ్లు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా సరే కేవలం ప్రజల సేవకోసం ప్రజలు నియమించుకున్న వాళ్లే. అలాకాక భూస్వామ్య సంస్కృతిని కొనసాగిస్తూ వాళ్లంతా దొరలుగాను, మనం వాళ్ల భృత్యులుగాను భావిస్తున్నంతకాలం మినహా మనిషి మనం చేయగలిగిందేమీ లేదు. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే పరిష్కారం మన చేతుల్లోనే ఉంది. అందుకే ముందు చేయవలసింది ఈ భావదాస్యానికి, ఆత్మవంచనకు సమాధి కట్టి తలలెత్తి సగర్వంగా నిలబడటం, మనిషిని మనిషిగా చూడటం, ఆత్మన్యూనతకి స్వస్తిపలకటం.

## కలిసికట్టుగా పరిశ్రమిస్తేనే ప్రగతి

రాజకీయాల్లోకి రావాలంటే మంచి సమాజంలో నాలుగు ప్రధాన లక్షణాలు కావాలి. మొదటగా ఆ వ్యక్తి సమాజహితాన్ని త్రికరణ శుద్ధిగా కోరాలి. రెండోది అతడు ప్రలోభాలకు లొంగని నిష్కామకర్ముడు కావాలి. మూడోది రాజ్యవ్యవస్థను సమాజాన్ని ఆకళింపు చేసుకున్న జ్ఞాని కావాలి. చివరగా రాగద్వేషాలకు అతీతంగా, దగాపడ్డ తమ్ముళ్లను అక్కున చేర్చి సేదదీర్చే తపస్వి కావాలి. అలాంటి వాళ్లు ప్రతి సమాజంలోలాగానే మనకు చాలామంది అందుబాటులో ఉన్నారు. కాని అలాంటి కొద్దిమంది రాజకీయాలకు దూరం అవుతున్నారు. ఇప్పుడు కావలసిందల్లా ఏదో ఒకవిధంగా కోట్లు సంపాదించి ఓట్లు కొనటానికి, ఎన్నికలలో అక్రమాలకు లెక్కలేకుండా ఖర్చు పెట్టగల వాళ్లు మొన్నటి ఎన్నికలలోనే చూస్తే, డబ్బు తప్ప ప్రజాజీవనానికి మరే అర్హత లేని వాళ్లకు ఎందరికి ప్రధాన పార్టీలు సీట్లు ఇచ్చాయో గమనిస్తే మన రాజకీయం ఎంత జుగుప్సాకరమయిన వ్యాపారంగా మారిపోయిందో బోధపడుతుంది. ఆ దుష్ట సంస్కృతిలో భాగంగానే కోలా కృష్ణమోహన్‌కు అధికార పార్టీ తరపున పార్లమెంటు సీటు దాదాపు ఖాయమయిందని వార్తలొచ్చాయి. తొందరపడి తనకు సీటు వచ్చిందని ప్రకటించుకున్న కారణంవల్లకాని, మరే ఇతర రాజకీయ లెక్కలవల్లగాని చివరికి అతనికి సీటు రాకపోయి ఉండవచ్చు. అంతమాత్రాన అది పార్టీల ఘనత కాదు. ఈ పార్టీ ఆ పార్టీ అని పోల్చనక్కరలేదు. ఎన్ని లోపాలున్నా ఇంకా సిద్ధాంతాలను నమ్ముకున్న వామపక్ష పార్టీలు తప్ప మిగతా అన్ని ప్రధాన

పార్టీల తీరు ఒకటే! విరాళం ఇస్తే తీసుకోవటాన్ని తప్పుపట్టలేం. కాని డబ్బే అర్హతగా భావించి రాజకీయాన్ని విపణి వీధిలో అమ్మే సంస్కృతి మాత్రం అత్యంత హేయమైనది. అందుకే ఎన్నికలలో మౌలిక సంస్కరణలు రావాలి. రాజకీయ స్వరూపం మారాలి. దాంతోపాటు అజ్ఞానంవల్ల, అనాలోచిత చర్యల వల్ల, పోకడలవల్ల ఎంతగా దోపిడీకి గురవుతున్నామో పౌరులుగా అందరూ గుర్తించాలి. శ్రమను గుర్తించి గౌరవించటం నేర్చుకుంటే మనల్ని మనం గౌరవించుకున్న వాళ్లమవుతాం. పరిస్థితుల్ని మార్చే అవసరం మార్చాల్సిన బాధ్యత మనదే.

* * *

# నేరాలకు బహుమతులు నిజాయతీకి శిక్షలు

## సెప్టెంబర్ 21, 2012

ఇటీవల అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ సంకటాన్ని పరిశీలిస్తే ఎన్నో గుణపాఠాలు దొరుకుతాయి. క్లింటన్ వ్యక్తిగత జీవితంలో తప్పటడుగు వేశారు. ఇల్లాలితో పడకటింటిలో జరపవలసిన ప్రేమాయణాన్ని తన వయసులో సగం ఉన్న యువతితో సాక్షాత్తూ అధ్యక్షుడి నివాసగృహం వైట్‌హౌస్ దాపున ఉన్న అధికార కార్యాలయం ఓవల్ ఆఫీసులో జరిపారు. అది అంతటితో ఆగక బయటికి పొక్కింది. ప్రతిపక్షాలు, పత్రికలు, టి.వి ల వారు కూపీ లాగటం మొదలుపెట్టారు. ఆయన మామూలుగా అలాంటి పరిస్థితులలో అందరూ చేసే పనే చేశారు. ప్రచారంలో ఉన్న ఆరోపణలు అన్నీ అబద్ధమని బుకాయించారు. దాంతో విషయం ఆగలేదు. వేరే కోర్టు కేసులో, అదీ మరో యువతితో అతిచనువుగా ప్రవర్తించారన్న కారణంగా నష్టపరిహారం కోరుతూ ఆమె వేసిన దావాలో స్వయంగా సాక్ష్మిస్తూ తన వైట్‌హౌస్ ప్రేమాయణం అంతా కల్పన అని వాదించారు. ఇప్పుడు అదే ఆయన మెడకు గుదిబండ అయికూర్చుంది.

### బేల అయిన అధ్యక్షుడు

అధ్యక్షుడిగా ఆయన బాగా రాణించాడని, పత్రికలూ, ప్రజలలో అధిక సంఖ్యాకుల అభిప్రాయం దేశ ఆర్థిక, రాజకీయ పరిస్థితి గత 50 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత బాగుంది. ఆయన మీద ఉన్న ఆరోపణలలో ఎక్కడా పదవీ బాధ్యతలలో అన్యాయం చేశాడని గాని, అసమర్ధుడనిగాని మాట రాలేదు. వ్యక్తిగతంగా అవినీతికి పాల్పడటమో, డబ్బు తినడమో పొరపాటున కూడా లేదు. అయినా ఆయన నేడు ప్రజల ముందు దోషిగా నిలబడ్డారు. పదవి ఊడటమో, లేకపోతే కాస్త మొట్టికాయలు, చివాట్లు తిని బ్రతుకు జీవుడా అని పదవిలో మిగిలిన కాలం గడపటమా – ఏం జరుగుతుందోనని అంతా ఆసక్తితో గమనిస్తున్నారు. వ్యక్తిగతంగా ఆయన రాజకీయ భవిష్యత్తు ఏమయినా, పదవిని కోల్పోకపోయినా ఆయన ప్రతిష్ఠకు, చరిత్రలో ఆయన స్థానానికి, అధ్యక్షుడిగా ఆయన హుందాతనానికి, అధికారానికి ఇప్పటికే

కోలుకోలేని దెబ్బ తగిలింది. చేసింది ఎంత చిన్న తప్పయినా, పూర్తిగా వ్యక్తిగతమయినా, అధికార బాధ్యతలతో సంబంధం లేని అంశమయినా, ఆ వ్యవస్థలో నాయకుడిని గడగడలాడిస్తున్నారు. ప్రపంచం మొత్తంలోనే అత్యంత శక్తివంతుడయిన ఒక నాయకుడు ప్రజాస్వామ్య సంప్రదాయాల ముందు, చట్టం ముందు తలవంచుకుని అర్భకుడులా, బేలగా నిలబడ్డాడు. అది మనకు చాలా విచిత్రంగా కనిపించే విషయం. ఇదేదో క్లింటన్‌కు ఒక్కరికే పట్టిన గ్రహణం కాదు. సరిగ్గా 24 సంవత్సరాల క్రితం 1974 ఆగస్టు మాసంలో మరో అమెరికన్ అధ్యక్షుడు ఇలాంటి పరిస్థితులలోనే అధిశంసనకు గురై గత్యంతరం లేక రాజీనామా చేశారు. నిక్సన్ కూడా రెండో టర్మ్‌కు అపారమైన మద్దతుతో ఎన్నికయి, అంతర్జాతీయ వ్యవహారాలలో, ప్రపంచ నాయకత్వంలో దిట్ట అనిపించుకుని, తన అధికారం అత్యున్నత శిఖరాన్ని అందుకున్న సమయంలో  అమాంతం అఖాతంలోకి పడిపోయారు. వాటర్‌గేట్ కుంభకోణంలో చిక్కుకుని, నేరాలను కప్పిపుచ్చి, అందుకోసం అధికారాన్ని దుర్వినియోగపరచి, అబద్దాల ఊబిలో దిగబడి, బయటికి రాలేక చివరికి చరిత్రలో ఎవరూ చెల్లించనంతటి మూల్యం చెల్లించాడు  నిక్సన్.

## మరి మన మాటేమిటి?

క్లింటన్, నిక్సన్ కథలలోని మంచిచెడులు, లాభనష్టాలు భారతీయులకు అంత ఆసక్తి కలిగించే అంశాలు కావుగాని, మన ప్రజాస్వామ్యం ఎలా నడుస్తోంది? నేతలు నడత తప్పితే ఎలాంటి పగ్గాలతో వారిని వారించగలుగుతున్నాము. అనే అంశాలు మాత్రం చాలా ముఖ్యమైనవి. ఈ సందర్భంగా కొన్ని యదార్థ సంఘటనల్ని మీముందుంచుతాను. కొన్నాళ్ల క్రితం నేరచరిత్రగల ఒక పెద్దమనిషి ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారాడు. పార్టీ మారుతూ ఆయన 'పెద్ద'వాడు కాబట్టి 'వర్ధమాన నాయకుడు' కాబట్టి 600 కార్లతో, కొన్ని వేల మంది అమాయక జనంతో ఊరేగింపు తీశాడు. ఆ రోజుల్లో అన్ని రాజకీయ ఊరేగింపులనూ అధికారులు నిషేధించారు. నాయకుడు ఆ నిషేధాన్ని లెక్కపెట్టలేదు. అడ్డొచ్చిన పోలీసులకు ఆయన తన అనుయాయులతో కలసి దేహశుద్ధి చేశాడు! సాక్షాత్తూ ఒక సీనియర్ మంత్రి, అందునా శాంతిభద్రతల్ని కాపాడే బాధ్యత ఉన్న మంత్రి ఆ ఊరేగింపును ప్రారంభించారు. మరో మంత్రి ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు, ప్రభుత్వాధినేత ఆ 'నాయకుణ్ణి' సాదరంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నారు. పత్రికలు మర్నాడు పతాక శీర్షికలలో గగ్గోలు పెట్టాయి. కానీ, అంతటి 'ఘన' చరిత్ర ఉండి, పోలీసులమీదే

చేయిచేసుకున్నవారెవరికీ నేటికీ శిక్షపడ్డ దాఖలా లేదు. వాళ్లగురించి అసలు పట్టించుకున్న నాధుడే లేడు!

## రారాజుల్ని ఎదిరిస్తే?

కొన్ని మాసాల క్రితం ఒకానొక జిల్లాలో ఓ విచిత్ర సంఘటన జరిగింది. అక్కడొక సిమెంటు ఫ్యాక్టరీ ప్రైవేటు రంగంలో ఉంది. దాని మేనేజరు ఉత్పత్తి అయిన ప్రతి బస్తాకి ఒక రూపాయి చొప్పున స్థానిక శాసనసభ్యుడికి అందించేవాడు. 'ఎందుకు' అని మనం అడగకూడదు. 'రక్షణ' కోసం 'ఎవరి నుంచి రక్షణ?' అని ఆశ్చర్యపోకూడదు! అది అనవాయితీ అంతే! ఆ మేనేజరు మారిపోయి కొత్త మేనేజరు వచ్చారు. ఆయనకి అన్నీ ధర్మ సందేహాలే! 'అసలు మనకూ శాసనసభ్యుడికీ సంబంధం ఏమిటి? ఆయనకు డబ్బెందుకివ్వాలి? మనది ప్రైవేటు కర్మాగారం గదా? లాభాలు బాగా వస్తే ధర తగ్గించి అమ్మకం మరింత పెంచుదాం. లేదా కార్మికులకు వేతనాలు పెంచుదాం. అంతేగాని అప్పనంగా వాళ్లెవరికో ఎందుకివ్వాలి." ఇలాంటి సందేహాలు ఆయనకు చాలా కలిగాయి. యాజమాన్యం ఆయన చేతుల్లో ఉంది కాబట్టి ఇకనుంచి బస్తాకు రూపాయి చెల్లించటం ఆపాలని ఆదేశించి, ఆ డబ్బు పోకుండా కట్టుదిట్టం చేశారు. మిగిలినవాళ్లకంటే సమర్థంగా నిజాయతీగా పనిచేస్తున్నానని మురిసిపోయాడాయన. ఆ ముచ్చట మూన్నాళ్లు కూడా నిలవలేదు. ఒకరోజున అర్థరాత్రి, కారుచీకట్లో కొంతమంది దుండగులు మేనేజరును చావచితకబాదారు. వంటిలో విరగని బొమిక లేదు. చివరికి ప్రాణం పోయినంత పనయి, అపస్మారక స్థితిలో ఉండగా రైలు పట్టాల మీద అతణ్ణి వదిలేసిపోయారు. అదృష్టవశాత్తు ఎవరో అతణ్ణి చూసి పట్టాల మీదినుంచి లాగేయటంతో బతికాడు. శారీరకంగా కుదుట పడటానికి కనీసం సంవత్సరంపైనే పడుతుంది. అంతకు మించి, ధైర్యాన్ని, ప్రపంచంపట్ల విశ్వాసాన్ని కోల్పోయిన అతడి మనసు మళ్లీ పుంజుకోవటం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. మరి "ఎవరు ఆ దారుణానికి ఒడిగట్టారు? వాళ్లకు శిక్ష ఏమిటి? వారిని కోర్టులో విచారించారా? చట్టం, న్యాయం, వాటిని రక్షించాల్సిన పెద్దలు అంతా ఏం చేస్తున్నారు?"ఇలాంటి ధర్మసందేహాలు ఎవరికయినా కలగవచ్చు. అలాంటి ప్రశ్నలు లేవనెత్తే వారికి ఇంకా జీవితానుభవం లేదని, నోట్లో వేలు పెడితే కొరకటం చేతకాని అమాయకులని అనుకోకుండా ఆ ప్రశ్నలకు సమాధానాలు వెదికితే తేలిగ్గానే దొరుకుతాయి.

## చట్టం ఎవరికి?

కొద్దిరోజుల క్రితం మరో సంఘటన జరిగింది. ఒక రైల్వే కాంట్రాక్టు కోసం దాదాపు పాతికమంది టెండర్లు పెట్టారు. అందులో ఒకరికి కాంట్రాక్టు ఖాయం కావాలని శాసనసభ్యుడి నిర్ణయం. "రైల్వే కాంట్రాక్టుకు, శాసనసభ్యుడికి సంబంధమేమిటి? కనీసం ఆ శాఖ రాష్ట్ర ప్రభుత్వానిది కూడా కాదు. కేంద్రానికి! కాంట్రాక్టులు అతి తక్కువ రేటుకి పాడినవారికి ఖాయం కావాలి కదా? మరి వేరొకరు ఎలా నిర్ణయం చేస్తారు. ఇలాంటి అమాయక ప్రశ్నలు మనలాంటి మందబుద్ధులకి పుడతాయి. అందులో ఇద్దరు కాంట్రాక్టర్లు రైల్వేవారు అంచనా చేసిన రేట్లకంటే బాగా తక్కువకు పాడారు. ఇద్దరికీ అనుభవం ఉంది. రైల్వే చీఫ్ ఇంజినీరు స్వయంగా వారిని పాటలో పాల్గొని తక్కువ ఖరీదుకు నాణ్యంగా పని చేయమని కోరారు. ఆయన మాట కాదనలేక వారు రంగంలోకి దిగారు. కాని, శాసనసభ్యుడు ఊరుకుంటాడా? పాటలో పాల్గొన్న అందరు కాంట్రాక్టర్లను శాసనసభ్యులవారు ఒక హోటల్‌లో సమావేశం కమ్మని శాసించారు. ఆ ఇద్దరు తప్ప మిగిలివారంతా హాజరయ్యారు. అక్కడ తుపాకులు, కత్తులు కఠార్లు చూపెట్టి, శాసనసభ్యుడు నిర్ణయించిన కాంట్రాక్టరు మినహా మిగిలిన వారందరితోను తాము ఆ కాంట్రాక్టు నుంచి తప్పుకుంటున్నట్లుగా సంతకాలు తీసుకున్నారు. ఇక ఇద్దరే పోటీకి మిగిలారు. పత్రికలు పతాక శీర్షికలలో జరిగిన అన్యాయాన్ని బయటపెట్టాయి. కొందరు అమాయకులు ఆ వార్తల్ని చూసి, గట్టు రట్టయింది కాబట్టి వెంటనే అన్యాయం ఆగుతుందని భావించారు. కానీ "పెద్దలు' పత్రికల వార్తల్ని పట్టించుకోనేలేదు. మీసం మెలేశారు. ఇంకా తమ అభ్యర్థితో పోటీపడుతున్న ఇద్దరికి చేయవలసిన హెచ్చరికలు చేశారు. ఉపసంహరించకుంటే వీలునుబట్టి తర్వాత సాయపడతామన్నారు. లేకుంటే మళ్లీ భార్యాబిడ్డల్ని చూడటం కష్టమవుతుందని నొక్కిచెప్పారు. చివరికి పత్రికల్లో వార్తల తరువాత కూడా... ఆ ఇద్దరూ 'బతుకుజీవుడా' అని రంగంనుంచి తప్పుకున్నారు. 'నాయకుల' వారు "బస్తీమే సవాల్" అని జబ్బచరిచి మరీ తడఖా చూపించారు! ఇవీ మన వ్యవస్థలో దారుణ నేరాలకు, హత్యలకు, గుండాగిరీకి పాల్పడితే లభించే 'శిక్షలు! ఇవీ ఈ ప్రజాస్వామ్యంలో న్యాయానికి, ధర్మానికి, పోటీకి నిలబడదామని కొందరు తపిస్తే వారికి దొరికే "బహుమానాలు"!.

## 'స్వ' రాజ్యం ఎప్పుడు?

దేశాన్ని, ప్రజల్ని, స్వేచ్ఛని ఎవరో మహాత్ములు వచ్చి ఉద్ధరించరు. జనసామాన్యం

నిరంతరం జాగరూకతతో, సంఘటితంగా, విషయ పరిజ్ఞానంతో ప్రజల సేవకులు కావలసి ఉండీ ప్రజల నెత్తినెక్కి తొక్కుతున్నవారిని నిలదీయటమొక్కటే రక్ష. అప్పుడే మనది నిజమైన స్వరాజ్యమవుతుంది. అప్పటిదాకా మాటలు కోటలు దాటుతుంటే వాస్తవాలు వెక్కిరిస్తున్నాయి. ఇదీ నిక్సన్, క్లింటన్‌ల బాగోతాల నుంచి భారతీయులం నేర్చుకోవలసిన పాఠాలు, అంతేగాని, బూతుపుస్తకాల్ని మించిన పడకటింటి పురాణాలను పత్రికల్లో ఇంటర్‌నెట్‌లో చదివితే, అవి జ్ఞానాన్నిస్తాయనుకుంటే పప్పులో కాలేసినట్టే! నీతికి గుర్తింపు, బహుమానం లేనప్పుడు అది ఎండిపోతుంది. ఇంటి పాడియావు కదా అని నిర్లక్ష్యం చేసి మేత వేయటం మానేస్తే వట్టి పోతుంది. నష్టపోయేది ఆ పాలు తాగే కామందు. అలాగే అవినీతిని, అన్యాయాన్ని, రాక్షసత్వాన్ని శిక్షించేబదులు అందలాలెక్కిస్తే అధర్మం పేట్రేగిపోతుంది. పాముకు పాలుపోసి పెంచితే కాటువేయక మానదు. అందునా నిలువెల్లా విషం ఉన్న ఖలుల్ని అందలాలెక్కిస్తే సమాజానికి అథోగతే! మరి ఈ వ్యవస్థలో అధికారంలో ఉన్నవాడు ఎంత పెద్దవాడయినా సరే అతడు ప్రజలకు సేవకుడేనని, తప్పుచేస్తే అతడికి శిక్ష పడాల్సిందేనని ఎప్పుడు చాటి చెప్పగలం? అది జరిగే వరకు దుష్పరిపాలన తప్పదు.

* * *

# అరాచకత్వం అంతమైతేనే ప్రజాస్వామ్యం భద్రం

**డిసెంబర్ 15,2003**

ప్రధానమంత్రి సంకల్పంతో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణంలో ప్రాజెక్టు డెరెక్టరుగా పనిచేస్తున్న సత్యేంద్ర కుమార్ దూబేను ఆయన సొంత రాష్ట్రమైన బీహార్‌లోని గయ జిల్లాలో, దుండగులు హత్యచేయటం దేశంలో సద్వివేచనాపరులకు దిగ్భ్రాంతి కలిగించింది. ఎన్.డి.ఎ. ప్రభుత్వ చేపట్టిన, అత్యుత్తమ పథకాలలో జాతీయ రహదారుల నిర్మాణం పథకం ఒకటి. రెండో ప్రపంచయుద్ధం తరవాత ఆనాటి అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ నిర్మించిన ప్రధాన రహదారులుగా అక్కడి ప్రజలు గుర్తుంచుకుంటున్నారు. మన దేశంలో బ్రిటిష్ వారు జాతీయ రహదారులను, రైల్వే లైన్లను నిర్మించాక స్వతంత్ర భారతంలో చెప్పకోదగ్గ రోడ్ల నిర్మాణం గాని, రైల్వే లైన్ల నిర్మాణంగాని జరగలేదు. అయితే ప్రస్తుత జాతీయ రహదారుల పథకం ప్రధానమంత్రి వాజపేయి స్వయంగా చొరవ తీసుకుని రూపొందించింది కావడంతోను ప్రభుత్వంలోని అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని సాధించటంతోపాటు, వనరుల సమీకరణకు వినూత్న పద్ధతులను పాటించడంవల్లను చాలా వేగంగా, మంచి ప్రమాణాలతో ఈ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. మన రాష్ట్రంలోనే ఇచ్ఛాపురం నుంచి తడ వరకు నిర్మిస్తున్న ఈ రోడ్లను చూసినట్లయితే మనందరికీ గర్వం కలగక మానదు. భూసేకరణ, ఇతర పాలన ప్రక్రియల్లో ప్రభుత్వ యంత్రాంగం ఇంతటి చొరవ వేగం ప్రదర్శించటం నిజంగా ఆశ్చర్యకరం.

## నీతికి బహుమానం హత్య

కడివెడు పాలు ఒక విషపుచుక్కతో కలుషితమైనట్లు, ఇంత బాగా అమలవుతున్న పథకంలో కూడా కొన్ని ప్రాంతాలలో అవినీతి, అక్రమాలు ఎలా చోటుచేసు కుంటున్నాయో దూబే హత్య రుజువుచేస్తోంది. కాన్పూర్ ఐ.ఐ.టి.లో ఇంజనీరింగ్ పట్టా పొందిన సత్యేంద్ర జాతీయ రహదారుల పథకాన్ని పర్యవేక్షించే సంస్థ (ఎన్.హెచ్.ఎ.ఐ.) లో చేరారు. చనిపోయే నాటికి ఆయన ప్రాజెక్టు డెరక్టరుగా పనిచేస్తున్నారు. గత సంవత్సరం సత్యేంద్ర ఈ రోడ్ల నిర్మాణంలో జరుగుతున్న కొన్ని అవకతవకల్ని వివరిస్తూ ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు.

రహదారుల నిర్మాణ పథకాలకు సంబంధించిన నివేదికల తయారీలోను, కాంట్రాక్టర్ల ఎంపికలోను, వారికి అడ్వాన్సులు మంజూరు చేయటంలోను, రోడ్ల డిజైన్ల తయారీకి, నిర్మాణ పర్యవేక్షణకు నిపుణులను నియమించటంలోను, పెద్ద కాంట్రాక్టర్లు మళ్ళీ చిన్న కాంట్రాక్టర్లకు పనిని అప్పగించటంలోను, రహదార్ల నిర్మాణ సంస్థ కార్యాలయం నిర్వహణలోను ఉన్న అనేక లోపాలను సత్యేంద్ర ఆ లేఖలో బయటపెట్టారు. ఆ ఉత్తరంలో తన సంతకం పెట్టకుండా, ప్రత్యేకంగా మరో కాగితంలో తన వివరాలను అందజేసి, తన పేరును గోప్యంగా ఉంచాల్సిందిగా దూబే కోరారు. పాలన ప్రక్రియల్లోని లోసుగుల వల్ల ఆ ఉత్తరం ఎవరు రాశారో బట్టబయలైంది. తదనంతర పరిణామాల్లో దూబే హతులయ్యారు. ప్రతిభ, సామర్థ్యం, నిజాయతీ ఉన్న ఓ అధికారి ఇలా అన్యాయంగా బలవటం మన వ్యవస్థకు చెంపపెట్టులాంటిది. మన రాజకీయాలు, పాలన ఎంతగా కుళ్ళిపోయాయో, నిజాయతీకి గుర్తింపు లేకపోగా ఎన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయో, అవినీతికి శిక్ష లేకపోగా ఎంతటి ప్రోత్సాహముందో దూబే ఉదంతం రుజువుచేస్తోంది. మనిషి మరణించాక ఎన్ని దుఃఖాశ్రువులు రాల్చినా ప్రయోజనం లేదు. దూబే లాంటి వారి బలిదానాలు వృథా పోరాదు. అందుకే జరిగిన ఘాతుకానికి ఆగ్రహావేశాలను, ఆవేదనను ప్రదర్శించటంతోపాటు, ఇలాంటివి జరగకుండా ఉండాలంటే ఏం చేయాలో మనం ఆలోచించాలి. ఈ నేపథ్యంలో మూడు అంశాలను లోతుగా పరిశీలించటం అవసరం.

మొదటిది: అవినీతి బాగోతాలను ధైర్యంగా బయటపెట్టే వారికి ఎలాంటి రక్షణ కల్పించాలి? యువ అధికారి దూబేలాగా అక్రమాలను ఎదిరించిన వాళ్లు విపరీత మూల్యాన్ని చెల్లించకుండా ఉండాలంటే ఎలాంటి ఏర్పాట్లుండాలి? ఈ ప్రశ్నలకు సమాధానాన్ని వెతుక్కోవాలంటే కొత్తగా పరిశోధనలు చేయనవసరం లేదు. ఇతర దేశాలలో అవినీతిని బహిర్గతం చేసినవారికి (విజిల్ బ్లోయర్స్) ఉద్యోగంలో భద్రత కోసం, వారి మీద కక్షసాధింపు చర్యలే లేకుండా ఉండటం కోసం, వారి పేర్లు వివరాలు రహస్యంగా ఉంచటం కోసం కావలసినన్ని చట్టాలున్నాయి. ఉదాహరణకు అవినీతిని బహిర్గతం చేసిన ఉద్యోగులకు అమెరికాలో 1989లో ఇలాంటి చట్టం ద్వారా రక్షణ కల్పించారు. అలాగే 1986లో ఫాల్స్‌క్లెయిమ్స్ యాక్ట్‌లో కూడా అక్రమాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టాన్ని బయటపెట్టేవారి ఉద్యోగ భద్రత కోసం ఏర్పాట్లు చేశారు. అమెరికాలోని వివిధ రాష్ట్రాలలో కూడా ఇలాంటి ఏర్పాట్లు ఉన్నాయి. న్యూయార్క్ లో ఆల్‌ఖైదా ఉగ్రవాదులు 2001 సెప్టెంబరులో జరిపిన

మారణహోమం తరవాత అమెరికా రూపొందించిన జాతీయభద్రత చట్టంలో కూడా నిర్లక్ష్యాన్ని గురించి, అక్రమాలను గురించి సమాచారం బయపెట్టిన ఉద్యోగులకు పాల్ రివెరీ చట్టం ద్వారా ఉద్యోగ భద్రత కల్పించారు. అలాగే బ్రిటన్‌లో కూడా 1998లో ప్రజా సంక్షేమంకోసం వాస్తవాలను బయటపెట్టే ఉద్యోగులకు కక్షసాధింపు చర్యలనుంచి భద్రత కల్పించారు.

మనదేశంలో సైతం జస్టిస్ జీవన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పడిన న్యాయ సంఘం తన 179వ నివేదికలో.. అక్రమాలను, అవినీతిని బయటపెట్టినవారి రక్షణ కోసం ఓ చట్టాన్ని సూచించి, నమూనా తయారుచేసింది. అలాంటి చట్టం గనుక మనదేశంలో అమలులో ఉన్నట్లయితే, అక్రమాలను గురించి దూబే ఫిర్యాదు చేసిన విషయం బయటపడేదే కాదు, అలాగే ఆ ఫిర్యాదుపై విధిగా విచారణ చేయటానికి ఆ శాఖతో సంబంధంలేని స్వతంత్ర ప్రతిపత్తిగల అధికారి – ప్రధాన విజిలెన్స్ కమిషనర్ అజమాయిషీలో పనిచేసేవారు. ఆ ఏర్పాట్లు జరిగి దూబే ఫిర్యాదు చేసినట్లు వెల్లడి కాకపోతే బహుశా దూబే లాంటి యువ అధికారి అసువులు బాసేవాడే కాదు. అక్రమాలు బయటపెట్టేవారి పేర్లు వెల్లడి కాకుండా, వారిమీద కక్షసాధింపు చర్యలు తీసుకోకుండా ఉండేలా ప్రభుత్వం ఇప్పటికయినా తగిన చట్టాన్ని తీసుకురావాలి. ఒకవేళ కొందరు ఆకతాయిగానో, లేదా ఇతరులను వేధించటం కోసమో అలాంటి చట్టాన్ని దుర్వినియోగం చేస్తారన్న భయం ఉంటే – అలాంటి వారిమీద కఠిన చర్యలు తీసుకునే ఏర్పాట్లు చేయవచ్చు. అంతేగాని, చట్టం దుర్వినియోగమవుతుందనే వంకతో అసలు చట్టమే చేయకపోవటం అనుచితం.

రెండో అంశం : ఈ దారుణ ఉదంతం నేర సామ్రాజ్యాలకు, రాజకీయాలకు, అక్రమార్జనకు, అధికార యంత్రాంగానికి మధ్య బంధం ఎంతగా బలపడిందో రుజువు చేస్తోంది. కేవలం కొన్ని సాంకేతిక లోపాలను గురించి, అవకతవకలను గురించి ప్రధానమంత్రికి ఫిర్యాదు చేసిన కారణంగానో, లేదా అతని పేరు బయటపడిన కారణంగానో గయలో నేరముఠాలు దూబేను కాల్చి చంపాయనుకోవటం పొరపాటు. తాను పర్యవేక్షిస్తున్న జాతీయ రహదారుల నిర్మాణంలో అక్రమార్జనపరులను దూబే కచ్చితంగా అడ్డుకొని ఉంటారు. అక్కడ నేరముఠాలు, రాజకీయం, అవినీతి కలిసిపోవటంచేత, తమకు కొరకరానికొయ్యగా తయారయ్యాడని దూబే అడ్డు తొలగించుకుందామని స్థానిక మాఫియా నేతలు నిర్ణయించుకుని ఉంటారు. కాబట్టి

ఇలాంటి దారుణాలను ఆపాలంటే కేవలం అక్రమాలు బయటపెట్టినవారి పేర్లు రహస్యంగా ఉంచటం, వారి ఉద్యోగాలకు భద్రతనివ్వటం సరిపోతుందనుకుంటే అది అమాయత్వమవుతుంది. విధి నిర్వహణలో క్షేత్రస్థాయిలో కఠిన నిర్ణయాలు తీసుకునేవారు. అవినీతికి తలవంచనివారు, అక్రమాలను ఎదుర్కొనేవారు, చేసే పని మంచి ప్రమాణాలతో లేకపోతే డబ్బు చెల్లించకుండా ఆపేవారు – తమ చర్యలను బహిరంగంగానే అందరికీ తెలిసేలాగానే చేయాలి. అలాంటివారి ఉద్యోగభద్రతకు ఎలాంటి అవరోధమూ ఉండదు. కానీ వారి పేర్లు రహస్యంగా ఉంచటం అసాధ్యం. అలాగే అలాంటి అధికారులు, ఉద్యోగులందరికీ రోజువారీ పూర్తి రక్షణను కల్పించటం ఏ ప్రభుత్వానికీ, ఏ వ్యవస్థకీ సాధ్యంకాదు. కాబట్టి వ్యవస్థ మూలాల్లోకి వెళ్ళి విశ్లేషించాల్సి ఉంటుంది. మన రాజకీయలకు, పాలనా వ్యవస్థకు అవినీతే పునాది అయినప్పుడు, అక్రమార్జనకు అడ్డుపడేవాళ్లను చంపటానికైనా మాఫియాలు వెనకాడనప్పుడు, నిజాయతీపరులయిన అధికారులను హత్య చేసినా శిక్షపడదనే ధీమాతో దుస్సాహసాలకు, దారుణాలకు పూనుకున్నప్పుడు – కేవలం వ్యక్తుల రక్షణతో వ్యవస్థను మారుస్తామని, అవినీతిని అంతమొందిస్తామని ఆశించటం అమాయకత్వం. అవినీతి లేకుండా మన వ్యవస్థలో ఒక్కరోజు కూడా ఏ ప్రభుత్వము నిలిచే పరిస్థితి లేదు. దాన్ని మార్చాలంటే మన ఎన్నికల వ్యవస్థలో సమూలంగా సంస్కరించాలి. నేర ప్రవృత్తికి, రాజకీయాలకు మధ్యనున్న బంధాన్ని తెంచాలి. ఎన్నికలలో గెలుపునకు అక్రమార్జనపరుల అవసరం లేకుండా మార్పులు తేవాలి. నిజాయతీపరులు ఎన్నికయ్యే విధంగా పద్ధతులను రూపొందించాలి. తప్పుచేస్తే వెంటనే శిక్షపడుతుందనే భయం అందరిలో పాదుకొనాలి. అందుకనువుగా పాలనాయంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలి. అవినీతికి పాల్పడితే ఆస్తులను జప్తు చేస్తారన్న, కటకటాలు లెక్కించక తప్పదన్న భయాన్ని కలిగించాలి. మంచికి ప్రోత్సాహం, చెడుకు శిక్ష పడుతుందని, హత్య చేస్తే ఉరిశిక్షగాని, జీవిత ఖైదు కాని ఖాయమనే భయం ఉండాలి. నేరపరిశోధక యంత్రాంగం స్వతంత్రంగా పనిచేస్తోందనే విశ్వాసం నెలకొనాలి. న్యాయస్థానాలలో సత్వరం న్యాయం అందుతుందనే హామీ ఉండాలి. ఇవన్నీ జరిగినప్పుడు, వ్యవస్థ సమూలంగా ప్రక్షాళన అయినప్పుడు – నీతికి పెద్దపీట వేయగలం; అవినీతిని సమర్థంగా ఎదుర్కోగలం. దేశంలోని చాలా ప్రాంతాలలో నేర ముఠాలు స్వైర విహారం చేస్తున్నాయి. బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లకు మాత్రమే ఈ సంస్కృతి పరిమితమని భావించటం అమాయకత్వం. మన రాష్ట్రంలోనే రాయలసీమలో, కోస్తా

ఆంధ్రాలోని కొన్ని పట్టణాలలో, హైదరాబాదు శివారు ప్రాంతాలలో ఎన్నో నేరముఠాలు రాజకీయ అండతో, కండబలంతో చట్టబద్ధ పాలనకు సవాలు విసురుతున్నాయి. మరింత ప్రమాదకరంగా ఇతర రంగాలలోకీ అవినీతి విస్తరిస్తోంది. అందుకే నేరముఠాలకు రక్షణ, ప్రభుత్వ కాంట్రాక్టులలో మాఫియాల పాత్ర, హింసాత్మక ముఠాల స్వైరవిహారం – ఇవన్నీ ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయి. ఈ మొత్తం పరిస్థితిని ఆకళింపు చేసుకుని వ్యవస్థాగత సంస్కరణలను తీసుకొచ్చినప్పుడే దూబేలాంటి వారిని రక్షించుకోగలం. అంతేగాని, ఏవో కొన్ని కంటి తుడుపుచర్యలతో ఒకటి రెండు నామమాత్రపు నిబంధనలతో పరిస్థితి మారదు.

## జాతి ఉనికికే సవాలు

ఇక మూడవది: దేశంలోని కొన్ని ప్రాంతాలలో రాజ్యవ్యవస్థ పూర్తిగా పతనావస్థకు చేరుకుంది. మన రాష్ట్రంలో కూడా కొన్ని ప్రాంతాలలో చట్టబద్ధ పాలన అంతరించి సమాజం పెత్తందార్ల చేతుల్లో చిక్కుకుంది? పాలనాయంత్రాంగం నేరముఠాల కనుసన్నల్లో పనిచేస్తోందేమోననిపిస్తోంది. బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌లాంటి ప్రాంతాలలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. చట్టబద్ధ పాలన లేనప్పుడు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ నిరర్థకమవుతాయి. బీహార్, జార్ఖండ్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం ఇటువంటి అరాచక పరిస్థితులే ఉన్నాయి. అత్యంత జనసాంద్రత, జనాభా ఉన్న ఈ ప్రాంతాలలో అరచకత్వాన్ని అంతమొందిస్తేనే మన ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుంది; మనదేశంలో నిజమయిన ప్రగతి సాధ్యమవుతుంది. పార్టీలకు, పక్షపాత రాజకీయాలకు అతీతంగా దేశంలో అన్నివర్గాలు దీన్నొక సవాలుగా స్వీకరించటం అవసరం. రాజ్యాంగ పరిధులకు లోబడి, నిర్దాక్షిణ్యంగా ఈ నేరముఠాలను రూపుమాపినప్పుడే, అరాచకత్వాన్ని అంతమొందించినప్పుడే, మన రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం. దూబే హత్య మనకు నేర్పుతున్న గుణపాఠం ఇదే.

* * *

# నీతిని నిలబెట్టడానికి నిర్దిష్టమైన ఏర్పాట్లు

## సెప్టెంబర్ 22, 1997

పాలనలో అవినీతి ఎన్నో కారణాలుగా వర్ధిల్లుతోంది. రాజ్యవ్యవస్థలోని లోపాలవల్ల అవినీతిని నిరోధించటం కష్టసాధ్యమైపోయింది. అన్ని విషయాలలో అనవసర ప్రభుత్వ జోక్యంతో సామాన్యుడు లంచాలివ్వక తప్పటం లేదు. గిరాకీ ఉన్న సేవలందించటంలో అధికారంలో ఉన్న వాళ్లు యథేచ్ఛగా నిర్ణయాలు చేసే అవకాశం ఉండడంతో అధికారాన్ని సొమ్ము చేసుకోవడం సులభమవుతోంది. రైల్వే రిజర్వేషన్ల కోసం ఒకప్పుడు ముడుపులివ్వాల్సొచ్చేది. ఎప్పుడైతే కంప్యూటర్ల ద్వారా అవి జరుగుతున్నాయో, చాలా మేరకు పరిస్థితి మెరుగుపడింది. దేశ రాజధాని ఢిల్లీ నగరంలోనే ప్రభుత్వ ఇళ్ల మంజూరు విషయంలో ఎంతగా అవినీతి తాండవించిందో పత్రికలన్నీ బయట పెట్టాయి. చివరకు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తేవాల్సి వచ్చింది.

### రాజకీయ జోక్యం : యంత్రాంగ వైఫల్యం

బదిలీలు, కీలక స్థానాల్లో నియామకాలు, వాటిలో రాజకీయ జోక్యం అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ఒక ముఖ్యమంత్రి ఒక అధికారిని జిల్లా కలెక్టరుగా నియమించారు. ప్రధాన కార్యదర్శి ఆ అధికారిని గురించి వాకబు చేస్తే, అధికారి అవినీతిపరుడని సాక్ష్యాధారాలున్నట్లు తెలిసింది. వెంటనే ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్లి విషయమంతా వివరించి ఆ నియామకాన్ని మార్చమని విన్నవించుకున్నారు. అందుకు ముఖ్యమంత్రి "నాకు తెలుసయ్యా వాడు పరమ దుర్మార్గుడని, అవినీతిపరుడని, నేను మంత్రిగా ఉన్నప్పుడు స్వయాన నా బంధువులకు ఏదో పనిపడితే న్యాయం చేయమని ఆ అధికారిని కోరాను. ఆ కేసులో 2 లక్షలు తీసుకున్నాకగాని పని చేయలేదు. కాని ఏం చేయను? వాడు రాజకీయ బలమున్న మంత్రుల్ని, చాలా మంది శాసనసభ్యుల్ని పట్టుకున్నాడు. వాళ్లంతా వాణ్ణి వెనకేసుకువచ్చి విపరీతమైన వత్తిడి తెస్తున్నారు" అని సెలవిచ్చారట. చివరకు ఆ అధికారిని తెలిసీతెలిసీ కలెక్టర్‌గా వేయక తప్పలేదు. అనుకున్న విధంగానే విచ్చలవిడిగా లంచాలు తీసుకున్నాడు. మరో సందర్భంలో ఒక ఉన్నతాధికారి అవినీతిపరుడని, అతణ్ణి కీలక పదవినుంచి

తప్పించాలని ముఖ్యమంత్రికి ప్రతిపాదన వచ్చింది. వెంటనే ఆయన వాడికి శాసనసభ్యులలో నాకంటే ఎక్కువ మద్దతుందయ్యా! వాణ్ణి, తీస్తే నన్నూ దింపేస్తారు. నిజాయితీ సంగతి దేవుడెరుగు' అని చమత్కరించి ఆ అధికారిని కొనసాగించాడట. ఇలాంటివి పలు నిదర్శనాలు. అధికారంలో ఉన్న వారికి అవినీతి గురించి తెలిసినా, అదుపు చేయాలని కోరిక ఉన్నా ఏమీ చేయలేకపోతున్నారు. దానికి తోడు ప్రభుత్వాలు తరచు మారడంతో పక్షపాత ధోరణులు ఎక్కువయిపోయాయి. తమ కులం వాడనో, తమకు బాగా పనికి వస్తాడనో, ఒక పక్క అవినీతి పరుల్ని అందలాలెక్కిస్తున్నారు. మరోవంక నిజాయితీ పరులు అడ్డువస్తే వాళ్ల మీద విచారణలు కూడా జరగటం కద్దు. ఎవరయినా మరీ పేచీలు పెట్టి అడ్డువస్తున్నారనుకుంటే లంచగొండుల మీదికి ప్రయోగించవలసిన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏదో ఒక సాకుతో నిజాయితీపరుల మీద ప్రయోగించటం సర్వసాధారణం. చివరకు నిజాయితీపరుల మీద ప్రయోగించటం సర్వసాధారణం. చివరకు నిజాయితీపరుడు, నిర్దోషి అని బయటపడినా, ఈ లోపు అవమానం, వేదన సహజం. దాంతో చాలా మంది సమర్థులు, నిజాయితీపరులైన అధికారులు నిర్ణయాలు తీసుకోవడానికే భయపడుతున్నారు. అవినీతిపరులు యథేచ్ఛగా సంచరిస్తున్నారు. ప్రస్తుతం అవినీతి నిరోధానికి చాలా పద్ధతులున్నాయి గాని, అవన్నీ కాగితాలకు పరిమితం. కేంద్రంలో నిఘా సంస్థ (సెంట్రల్ విజిలెన్స్ కమిషన్) ఉంది. అలాగే రాష్ట్రాల్లో కూడా అలాంటి నిఘా సంస్థలున్నాయి. ఈ సంస్థలు ప్రభుత్వానికి నివేదికలను, సిఫార్సులను పంపుతుంటాయి. అరోపణలపై విచారణ జరిపి, తీసుకోవలసిన చర్యలను సూచిస్తాయి. ప్రభుత్వాలు వాటిని అమలు చేయకపోతే – శాసనసభ ముందు, కేంద్ర ప్రభుత్వం విషయంలో పార్లమెంటు ముందు– వాటిని ఉంచాలి. అలాగే కొన్ని రాష్ట్రాల్లో లోకాయుక్తల నియామకం జరిగింది. ఉన్నత న్యాయమూర్తుల్ని ఆ పదవులలో నియమించారు. వారికి అవినీతి ఆరోపణలపై విచారించే అధికారం ఉంది. జాతీయ స్థాయిలో లోక్‌పాల్‌ని నియమించాలన్న ప్రతిపాదన చాలకాలంగా ఉంది. లోక్‌పాల్ బిల్లునే తీసుకుంటే ఎన్నో విషయాలు గోచరిస్తాయి. చాలకాలం ప్రధానమంత్రిని లోక్‌పాల్ పరిధిలోకి తేవాలా వద్దా అని చర్చ జరిగింది. లోక్‌పాల్ దగ్గరకు ఆరోపణలు వచ్చి, ఆయన వాటిపై విచారణ చేస్తుంటే, ఆ విషయం పత్రికలలో పొక్కకూడదని లోక్‌పాల్ బిల్లులో ప్రతిపాదించారు. అంటే మాటవినే లోక్‌పాల్ ఉంటే సంవత్సరాల తరబడి అవినీతి ఆరోపణలని తొక్కిపట్టి ఉంచవచ్చు. అలాగే లోక్‌పాల్ విచారణ పూర్తయ్యే వరకు ఆ అంశం కోర్టుల పరిధిలోకి రాకూడదని కూడా ప్రతిపాదిస్తున్నారు.

అంటే లోక్‌పాల్ సంస్థ అవినీతిని వెలికితీసి నిర్జించటానికి కాక దాన్ని కప్పిపెట్టి ఉంచటానికి, అధికారంలో ఉన్న వాళ్ళ చేతుల్లో పావులాగా ఉపయోగపడటానికి రంగం సిద్ధమైంది. చాలా రాష్ట్రాల్లో లోకాయుక్తల పనితీరుని పరిశీలిస్తే కొన్ని నిజాలు బోధపడతాయి. వ్యక్తులుగా ఆ పదవుల్లో ఉన్న వారు పమర్థులైనా, నిజాయితీపరులైనా, ఫలితాలు లేకుండా పోయాయి. ముఖ్యమంత్రులు ఇష్టం వచ్చిన వాళ్లను ఆ పదవుల్లో నియమిస్తున్నారు. అవినీతి నిరోధక శాఖని లోకాయుక్త అధినంలోకి తేలేదు. అంటే విచారణ కోసం తగిన యంత్రాంగం లోకాయుక్తలకు లేదు. ఆ పైన లోకాయుక్త నిర్ణయం శిరోధార్యం కాదు. ఒకవేళ లోకాయుక్త నిజనిర్ధారణ చేసి, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టినా, అవినీతి పరులను పదవులనుంచి తొలగించటం దాదాపు అసాధ్యమైపోయింది.

## పేకాటలో జోకర్లు

ఒక వంక నిజమైన నిజాయితీపరులు వేధింపులకు గురవుతున్నారు. అవమానాలను మౌనంగా దిగమింగుకుంటున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా వాళ్లకు తేడా లేదు. మరో వంక అవినీతిపరులు, పక్షపాతంతో వ్యవహరించేవాళ్లు ఏ ప్రభుత్వం వచ్చినా వాళ్లప్రాపకం కోసం ప్రయత్నించి విజయం సాధిస్తారు. నిజమో కాదో కాని, తమిళనాడులో డి.ఎం.కె.పార్టీ మొదట అధికారంలోకి వచ్చిన కొత్తలో జరిగినట్లు ఇలాంటి కథొకటి ప్రచారంలో ఉంది. కొత్త ముఖ్యమంత్రి అన్నాదురై, వృద్ధనాయకులు రాజగోపాలచారి దగ్గరకు వెళ్లారట. గతంలో కాంగ్రెసు ప్రభుత్వంలో చాల మంది ఆ ప్రభుత్వం ఏం చెబితే అది చేశారని అన్నాదురై నమ్మకం. వారి వల్ల తమ పార్టీకి అన్యాయంగా హాని జరిగింది కాబట్టి వాళ్లను ఏం చెయ్యాలన్నది అన్నాదురై సమస్య. రాజగోపాలచారి ఆయనతో "వారిని గూర్చి నీకేమీ బెంగ అక్కర్లేదయ్యా! గత ప్రభుత్వం అడుగులకి మడుగులొత్తిన వాళ్లు ఇప్పుడు నీ ప్రభుత్వం చెప్పిన పని కూడా చేస్తారు. వాళ్లు పేకాటలో జోకర్లలాంటి వాళ్లు. నీ సమస్యల్లా అప్పుడు ఆ ప్రభుత్వం మాట విననివారి గురించే. అప్పుడు నిజాయితీకి నిలబడి తప్పు చేయనివారు, నిష్పాక్షికంగా విధి నిర్వహణ చేసినవారు నీ ప్రభుత్వంలో కూడా అలాగే ఉంటారు. నీవు చెప్పిన మాట వినరు. వాళ్లను ఒక కంట కనిపెట్టి ఉండు' అని సలహా ఇచ్చారట. ఆ కథ వాస్తవమో, కాదోగాని నేతలు మాత్రం ఆ పాఠాన్ని బాగా ఒంటపట్టించుకున్నారు. అందుకే అవినీతికి శిక్ష చాలా అరుదుగా మాత్రమే పడుతుంది. అవినీతి నిరోధక యంత్రాగం అసమర్థమై నిర్వీర్యమైపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న అవినీతి నిరోధక చట్టాలు, యంత్రాంగం పేలవమై విఫలమయ్యాయి. ప్రభుత్వంలో ఉన్న

నేతలకు అధికారులకు, సిబ్బందికి చట్టం అంటే భయం లేకుండా పోయింది. అవినీతికి పాల్పడేవారు ఎంతో లబ్ధిపొంది యథేచ్ఛగా సంచరిస్తుండగా, నిజాయితీపరులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో అవినీతిని నిరోధించటానికి ముఖ్యంగా, ఉన్నత స్థానాల్లో ఉన్నవారిపై అవినీతి ఆరోపణల్ని విచారించి, శిక్షించటానికి అనువైన సంస్థాగత ఏర్పాట్లు కావాలి. ఈ సంస్థల ద్వారా అవినీతి నిరోధం సమర్థంగా జరగాలంటే, సంస్థలు రాజకీయాలకు, పక్షపాతాలకు అతీతంగా పనిచేయగలగాలి. వాటికి తగిన అధికారాలు వనరులు ఉండి తీరాలి. సంస్థల నిర్ణయం తుది నిర్ణయంగా ఉండి ప్రభుత్వాలకు శిరోధార్యం కావాలి. ఈ మూడు జాగ్రత్తలు తీసుకోకుండా ఎన్ని చట్టాలు చేసినా, ఎంత ఆర్భాటం, ప్రచారం జరిగినా ప్రయోజనం శూన్యం. జాతీయ స్థాయిల్లోనూ, ప్రతీ రాష్ట్రంలోనూ, ప్రతి జిల్లాలోనూ, స్థానిక ప్రభుత్వాలలో అవినీతిని ఎదుర్కోటానికి రాజ్యాంగబద్ధమైన సంస్థలను నెలకొల్పాలి. కేంద్రంలో లోక్‌పాల్ కావచ్చు, రాష్ట్రంలో లోకాయుక్త కావచ్చు, జిల్లాలో జిల్లా ఆయుక్త కావచ్చు వీరందరి నియామకం ప్రభుత్వం చేతుల్లో ఉండకుండా సమష్టిగా జరగాలి. ఎవర్ని నియమించాలి అనే విషయంలో పూర్తి స్వేచ్ఛ అధికారంలో ఉన్న నాయకులదే అయితే ఆ సంస్థల నుండి మంచి ఫలితాలను ఆశించటం వ్యర్థం. ప్రతి సంస్థలోనూ అవసరాన్ని బట్టి కనీసం ముగ్గుర్ని నియమించాలి. వారిని న్యాయమూర్తుల నుంచి, పాలనరంగం నుంచి, రాజకీయరంగం నుంచి, స్వచ్ఛంద సంస్థల నుంచి ఎంపిక చేయాలి. ఎంపిక కోసం రాజ్యాంగ బద్ధమైన సంఘాలుండాలి. ఉదాహరణకు కేంద్ర స్థాయిలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, స్పీకరు, ఉభయ సభలలో ప్రతిపక్ష నాయకులు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటే, నియామకాలు న్యాయంగా ఉండే అవకాశం ఉంటుంది. నిజంగా సమర్థులు, సచ్ఛీలురు, తగిన స్థాయిగలవారు, ప్రజలలో విశ్వసనీయత ఉన్నవారు ఎంపిక కావటం సాధ్యమవుతుంది. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులకు కూడా ఈ ఎంపికలో పాత్ర కల్పించవచ్చును. రాజ్యాంగ బద్ధంగా ఈ ఎంపిక జరిగాక వారికి నిర్దిష్ట పదవీ కాలం, రాజ్యాంగపరంగా పదవీ భద్రత ఉండాలి. ఈ రాజ్యాంగబద్ధ సంస్థలకు అధికారులపై, నాయకులపై నేరారోపణను విచారించే పూర్తి అధికారం ఉండాలి. అందుకు కావలసిన వనరులు వారికి కల్పించాలి. ఈ మేరకు అవినీతి నిరోధక విభాగాలు అన్నీ ఆ సంస్థల ఆధీనంలో పూర్తిగా వారికి బాధ్యత వహిస్తూ పనిచేయాలి, నేర పరిశోధన విభాగపు పోలీసులపై వారికి పర్యవేక్షణ ఉండాలి.

## యుద్ధ ప్రాతిపదికపై సంస్కరణలు

సంస్థలు నిర్దిష్టకాలంలో– ఆరోపణలు వచ్చిన నాటి నుంచి 90 రోజులలోగా – విచారణ పూర్తి చేసి నిజనిర్ధారణ చేయాలి. ఒకసారి ఫలానా వ్యక్తి అవినీతికి పాల్పడ్డాడని సంస్థ నిర్ణయం చేస్తే ఆ నిర్ణయం ప్రభుత్వానికి శిరోధార్యం కావాలి. మళ్లీ మరే ప్రక్రియ లేకుండా తక్షణం కొన్ని శిక్షలు అమలు జరగాలి. అవినీతిపరుడు వెంటనే పదవి కోల్పోవాలి. దాంతో పాటు అతడి ఆస్తిపాస్తుల మొత్తం, అతడి సమీపబంధువుల ఆస్తులు తక్షణం ప్రభుత్వపరం కావాలి. ఆస్తులు జప్తు చేయకపోతే లక్షల రూపాయల లంచాలు పొందాక, ఆ ఉద్యోగికి జరిగే నష్టం స్వల్పం. కోట్లు తినేసినవాళ్లకి నెల జీతం ఇచ్చే ఉద్యోగం పోవటం మాత్రమే శిక్ష అయితే, చాలా మంది అందుకు సిద్ధపడతారు. నేటి పరిస్థితుల్లో ఉద్యోగం ఊడటంతోపాటు, ఆ ఉద్యోగికి, అతని కుటుంబానికి చెందిన ఆస్తులు పోతాయన్న భయం ఉంటే, చాలామంది అవినీతికి దూరంగా ఉంటారు. అతణ్ణి వెంటనే న్యాయస్థానంలో విచారించి, కనీసం ఐదు సంవత్సరాలకు తగ్గకుండా కఠిన జైలు శిక్షవిధించే ఏర్పాటుండాలి. అలాంటి కేసులలో ఒక అప్పీలుకి మించి లేకుండా న్యాయవిచారణ, అప్పీలు రెంటికీ ఒక్కొక్క స్థాయిలో 90 రోజుల పరిమితిలో విధిగా న్యాయనిర్ణయం జరిగే విధంగా చట్టం చెయ్యాలి. నిష్పాక్షిక రాజ్యాంగ నియామకం, 90 రోజుల్లో అవినీతి ఆరోపణలపై తుది నిర్ణయం, విధిగా పదవి నుండి తక్షణం తొలగింపు, సొంత, ఇతర కుటుంబ సభ్యుల ఆస్తి ప్రభుత్వపరం, కనీస జైలుశిక్ష, అప్పీళ్లకు పరిమితులు ఇవన్నీ చాలా కఠినంగా అనిపించవచ్చు. కాని దేశవాసుల భవిష్యత్తుని సంరక్షించుకోవాలంటే, ఈ పాటి కాఠిన్యం నేటి పరిస్థితుల్లో అవసరం. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అంటే విశృంఖలత్వం కారాదు. నిర్లజ్జగా అవినీతికి పాల్పడేవాళ్లని శిక్షించకపోవటంతో, అవినీతి స్వేచ్ఛని, జాతి ప్రగతిని తీవ్రంగా దెబ్బతీస్తోంది. అవినీతిని పూర్తిగా అదుపులోకి తేవాలంటే ఈ ఏర్పాట్లతోపాటు ఇతర పాలన, రాజకీయ సంస్కరణలను చేపట్టాలి. ఉద్యోగులు, అధికారుల నియామకాలలో మధ్యయుగ అధికార సంస్కృతిని అంతమొందించటంలో, ప్రభుత్వాలు తమ మనుగడ కోసం అవినీతి తల ఒగ్గకుండా చేయటంలో, న్యాయస్థానాలు సకాలంలో న్యాయాన్నందించటంలో, ఎన్నికల ఖర్చుని క్రమబద్ధం చేసి అదుపు చేయటంలో, నేరమయ రాజకీయాన్ని అణచివేయటంలో మౌలిక ప్రజాస్వామ్య సంస్కరణలు అత్యవసం. అలాగని ఒక దానికోసం మరొకటి ఆగనక్కర్లేదు. రాజ్య వ్యవస్థని కలుషితం చేస్తున్న అవినీతిని సమర్థంగా ఎదుర్కొనాలంటే వెంటనే అందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.

* * *

# చెడుకు శిక్ష మంచికి రక్షణ ఉన్నప్పుడే సత్ఫలితాలు

**సెప్టెంబర్ 8, 1997**

సమాజంలో అన్ని వర్గాల ప్రజలకి అవినీతి పట్ల విముఖత ఉంది. ఏదో విధంగా అవినీతి రక్కసిని అంతమొందించాలన్న కసి ఉంది. ఈ లక్ష్యం నెరవేరాలంటే బహుముఖ పోరాటం అవసరం. అందులో ప్రధానమైన పోరాటం తప్పులు చేసిన నేతలకు, ఉద్యోగులకు శిక్ష పడేలా చూడడం. దేశం మొత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోను, ప్రభుత్వరంగ సంస్థలలోను కలసి కోటీ 80 లక్షల మంది ఎంపికైన ఉద్యోగులున్నారు. వీరు కాక రాష్ట్ర శాసనసభల్లోను పార్లమెంటులోను 5000 మంది ఎన్నికైన నేతలున్నారు. స్థానిక సంస్థలలో లక్షలాదిమంది ఎన్నికైన సభ్యులున్నారు. ఈ అందరిలోనూ అవినీతి విపరీతంగా వ్యాప్తి చెందిందని దేశవాసులంతా భావిస్తున్నారు. వీరిలో 50 శాతం వరకు అవినీతికి పాల్పడుతున్నారని చాలామంది అనుకుంటున్నారు. వాస్తవానికి అవినీతిపరులు చాల కొద్ది శాతమే ఉండొచ్చు నిరంతరం నిత్యజీవితంలో లంచగొండితనం వల్ల నష్టపోతున్న పౌరులకు అవినీతి భూతం మరింత పెద్దదిగా, భయంకరంగా గోచరించడం సహజం.

## ప్రజా సంక్షేమం ధ్యేయంగా అధికార్ల నియంత్రణకై చట్టం

అవినీతి పెరగటానికి కారణం జనం లోపం కాదని గ్రహించాలి. విధిలేక ప్రజలు దానికి లొంగిపోతున్నారు. కాని, ఏదో బావుకుందామని లంచాలిచ్చే వాళ్ళు బహుకొద్దిమంది మాత్రమే. అలాగే ఉద్యోగాలలో ఉన్న వాళ్లంతా ఇతర ప్రజలవంటివారే. వారిలో అధిక శాతం ప్రారంభంలో ఎంతో ఆదర్శ భావాలతో ఉద్యోగంలో చేరినవారే. కాలక్రమేణా జీవితం వారికి చాల కఠినమైన పాఠాలను నేర్పింది. జీవన పర్యంతం ఆటుపోట్లను తట్టుకోలేక అధిక సంఖ్యాకులు అవినీతి విషవలయంలో చేరిపోవటామో, ఏమీ చేయలేక మౌన ప్రేక్షకులుగా మిగిలిపోవటమో జరుగుతోంది. కొద్దిమంది మాత్రమే అన్ని సమాజాలలో, సర్వ కాలంలో తాత్కాలికమైన ప్రలోభాలకు లొంగకుండా ఉండగలుగుతారు. మనదేశంలో కూడా కారుచీకట్లలో అలాంటి దీపస్తంభాలు ఎన్నో ఉన్నాయి. అధిక సంఖ్యాకులైన సాధారణ ఉద్యోగులు

అధికార్లు అక్రమ మార్గం పట్టకుండా నిరోధించటం ఎలా అన్నది సమస్య అయితే దానికి ఒక్కటే పరిష్కారం ఉంది. తప్పుచేసినవాడికి వెంటనే శిక్షపడుతుందన్న భయం, మంచి మార్గాన పోయేవారికి రక్షణ ఉందన్న విశ్వాసం కలగాలి. మనిషి ప్రవృత్తి ఎలాంటిదైనా, అతడి ప్రవర్తనని ప్రజా సంక్షేమం కోసం నియంత్రించేదే చట్టం. నేటి రాజ్య వ్యవస్థ అధికారంలో ఉన్నవాళ్లను నిజాయితీగా ఉంచడంలో విఫలమయ్యింది. దేశంలోని కోటి 80 లక్షల మంది ఉద్యోగులలో 10 శాతం మాత్రమే అవినీతికి పాల్పడుతున్నారనుకున్నా 18 లక్షల మంది లంచగొండులున్నట్లు లెక్క కానీ ఏ సంవత్సరంలోనూ కనీసం 100 మందికి కూడా అవినీతికి పాల్పడ్డ కారణంగా ఉద్యోగాలు పోయిన దాఖలాలు లేవు. కనీసం 10 మంది లంచగొండులకు జైలుశిక్ష పడ్డ సూచనలు లేవు. కొన్నేళ్ల క్రితం చైనాతో భారతదేశంలోని కొందరు వ్యాపారం చేశారు. ఆ వ్యాపారంలో చైనాకు నాణ్యమైన సరకు ఎగుమతి చేయకుండా చైనా అధికార్లకు లంచాలిచ్చి, తప్పా తాలు పంపారు. ఆ విధంగా అక్రమంగా విపరీత లాభాన్ని ఆర్జించారు. సరకు  చైనా చేరిన తరువాత విషయం బయటపడింది. వెంటనే చైనాలో అందుకు బాధ్యులైన అధికార్లను దోషులుగా నిర్ణయం చేసి మరణశిక్ష విధించి, అమలు చేశారు. మనదేశంలో ఆ అక్రమంలో పాలుపంచుకున్న పెద్దలు రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చి పెద్ద పదవులు సంపాదించుకున్నారు. ఇక్కడ గమనించవలసిందేమంటే, తప్పు అక్కడ, ఇక్కడ రెండు చోట్లా జరిగిందిగాని , ఒకచోట బహుమానం లభించింది. ఈ నేపథ్యంలో అందరికీ ధర్మపన్నాలు చెప్పి నిజాయితీగా ఉండమని ఉద్బోధిస్తే ఏమీ ప్రయోజనం లేదు. పైన చెప్పిన సంఘటనవల్ల చైనాతో మన వాణిజ్యం చాల కాలంలపాటు తీవ్రంగా దెబ్బతిన్నది. మన సరకులమీద, వ్యాపారులమీద చైనా వ్యాపారులకి, ప్రభుత్వానికి విశ్వాసం సడలిపోయింది. దాంతోపాటు ఇలా తప్పులు చేస్తే బోలెడు లాభం ఉందని, ఏ రకమైన నష్టంకాని, శిక్షకాని ఉండే అవకాశం లేదని మన ప్రజలందరికీ చెప్పకనే చాటి చెప్పాం. ఒక వ్యక్తి లాభపడవచ్చుగాని, జాతి తీవ్రంగా నష్టపోయింది. మంచికి గుర్తింపు,చెడుకి శిక్ష లేకపోతే ఎంత ప్రమాదం జరుగుతోందో బోధపడేందుకు వీలుగా రెండు వాస్తవ సంఘటనలను పాఠకుల ముందుంచుతాను. చాల ఏళ్ల క్రితం గోదావరి డెల్టాలో ఎకరానికి ఇంత అని కొంత మొత్తం  లంచంగా నీటిపారుదల అధికార్లకు 'మామూలు'గా ఇవ్వటం  ఆనవాయితీ. అలా ఇస్తేనే రెండో పంటకు నీరందేది. అక్కడికి నీటిపారుదల    ఉన్నతాధికార్లను వేయాలంటే పైనున్న పెద్దలు 'ముడుపులు'

పెద్ద మొత్తాలలో స్వీకరించేవారు. వెళ్లిన అధికారులు కింద అధికారుల దగ్గర, చివరకు స్థానికంగా ఉండే లస్కర్లు, చిన్న అధికారులు రైతుల దగ్గర డబ్బు వసూలు చేసే వారు. డబ్బివ్వకపోతే నీరు రాక పంట పోతుంది. ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవదని రైతు భయం... దీనిలో పాలుపంచుకోకపోతే, కొంత తిని మిగిలింది పై వాళ్లకివ్వకపోతే వేధింపులు తప్పవని ఉద్యోగుల భయం. దాంతోపాటు లంచం తింటే శిక్ష లేదు, ఎంతో లాభం కనిపిస్తుంది. మిగిలినవాళ్లకు లేని సదుపాయాలు, రాజభోగాలు లంచగొండులకు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక కలెక్టరు దీన్ని నిరోధించే ప్రయత్నం చేసి, ఎంతో కష్టంమీద లంచగొండి అయిన ఒక ఉన్నతాధికారిని బదిలీ చేయించగలిగాడు. ఒక నెల తరువాత ఆ బదిలీ అయిన అధికారి కలెక్టరు దగ్గరకొచ్చి ఇలా చెప్పాడట. 'మీరు బదిలీ చేయించగలిగారు. కాని నేను రెండు లక్షల రూపాయలిచ్చి మళ్లీ బదిలీని రద్దు చేయించుకున్నాను. మీరు చేయించిన బదిలీ విలువ రెండు లక్షలు. ఈ డబ్బు నా జేబులోంచి ఏమీ రాదు. రైతుల దగ్గరనుండి, క్రింది అధికార్ల నుండి నేను మరింత ఎక్కువగా వసూళ్లు చేస్తాను. మీ నిజాయితీ పుణ్యమా అని నా రేటు పెరిగింది' అని వివరించాడట. పాపం నిజాయితీకి నిలబడ్డ ఆ కలెక్టరు తలపట్టుకొని తీరిగ్గా విచారించాడు. మరో సందర్భంలో ఒక కలెక్టరుతో ఒక ప్రముఖ మంత్రి యథాలాపంగా మాట్లాడుతూ ఒక ఉన్నతాధికారి అవినీతిని గూర్చి ప్రస్తావించాడు. ఆ కలెక్టరు నిజాయితీకి మారుపేరు, ఆయనకు అప్పటికివరకు తన కింది ఉన్నతాధికారి అవినీతి గూర్చి తెలియదు. మంత్రి చెప్పగానే నిర్ఘాంతపోయి, దాన్ని తీవ్రంగా తీసుకుని అతడిపై సాక్ష్యాలు సేకరించి చర్య తీసుకోవాలని సంకల్పించాడు. మంత్రి వద్దని వారించాడు. మంత్రిగారి సమస్య ఏమిటంటే ఆ కలెక్టరు మొండివాడు, ముక్కుకి సూటిగా పోయేవాడు, సిఫారసులు పట్టించుకోడు, ధర్మం తప్పనని భీష్మించుకుంటాడు. కాబట్టి మరో ఉన్నతాధికారి చెప్పిన మాట వినేవాడు ఉంటే కనీసం కొంతమేరకైనా మంత్రి మాట చెల్లుతుంది. అతడు అవినీతిపరుడైతే మరీ మంచిది, గుప్పిట్లో ఉంటాడు. కలెక్టరుకు మంత్రిగారు సమాచారం ఇచ్చినప్పుడు ఉన్నతాధికారి మీద చర్య తీసుకోవాలని చెప్పలేదు. మాట వరసకు చెప్పాడు. కలెక్టరు నైతిక స్థైర్యాన్ని దెబ్బతియ్యాలనే ఉద్దేశం కూడా ఉంది. 'నీవు నిజాయితీ, ప్రజాసంక్షేమం' అని మా మాట వినటంలేదు. నీ కింద ఉన్నతాధికారులే అవినీతికి పాల్పడితే ఏం చేయగలుగుతున్నావు' అని నర్మగర్భంగా కలెక్టరుకు సూచించటం మంత్రిగారి లక్ష్యం. తీరా చూస్తే అదే ఇబ్బందిగా

పరిణమించింది. ఆ కలెక్టరు విషయాలు విచారించి, కింది అధికారి అవినీతి నిజమని తెలుసుకుని, అతన్ని బదిలీ చేసి, ఆరోపణలపై చట్టబద్ధంగా చర్య తీసుకోమని ప్రభుత్వంలో పైస్థాయివారితో మొరపెట్టుకున్నాడు. పైవారు ఆ మొరనాలకించి ఆ అధికారిని బదిలీచేయగా, మంత్రి ఆ అధికారిని అక్కడే ఉంచడం కోసం విశ్వప్రయత్నం చేశాడు. ఒకవేళ బదిలీ తప్పకపోతే, అంతకంటే 'మంచి' జిల్లా, అంటే డబ్బు మరింత దండిగా దొరికే జిల్లాకు అతడిని బదిలీ చేయాలని మంత్రిగారి పట్టుదల! తరువాత ఏం జరిగిందో మనకు అప్రస్తుతం. ఆ కలెక్టరు ఈ తతంగం జరుగుతుండగా లంచాలిచ్చారని తెలిసిన కొందరు వ్యాపారస్తుల్ని పిలిచి వాస్తవాలు తెలుసుకున్నాడు. లంచాలిచ్చామని వాళ్లు ఒప్పుకోగా, కలెక్టరు వారిని తీవ్రంగా మందలించాడు. సకాలంలో న్యాయం చేసి, అందరికీ తనను కలిసే అవకావమిచ్చే కలెక్టరుగా తానుండగా లంచం ఎందుకివ్వాల్సి వచ్చిందని ఆయన ప్రశ్న అందుకు వ్యాపారులిచ్చిన సమాధానం అయ్యా! మన్నించండి. మాకు మీ సంగతి తెలుసు. మీరు ఏ సమయంలోనైనా సరే మా సమస్యలు తెలియజేస్తే వింటున్నారు, వెంటనే స్వయంగా పరిష్కరిస్తున్నారు. మీ పుణ్యమా అని మేము న్యాయంగా మా వ్యాపారం చేసుకొని సంపాదించుకున్నాం. కాని మీ అండ చూసుకుని,ఇవ్వవలసిన వాళ్లకు డబ్బులివ్వకపోతే, రేపు మా కొంప మునుగుతుంది. ఇవ్వాళ మీరున్నారు. మీలాంటి వాళ్లు ఎంత కాలముంటారో తెలియదు. ఎప్పుడో ఒకప్పుడు అవినీతిపరులైన అధికార్ల చేతుల్లో మేం చిక్కుకుంటాం. ఏదో ఒకరకంగా వాళ్లు కసి తీర్చుకోక మానరు. మమ్మల్ని దోచుకోక మానరు. ఎందుకంటే వాళ్లని శిక్షించి, మాకు ఎప్పటికీ రక్షణ ఇచ్చే శక్తి ప్రభుత్వానికి, మీకు లేదు. ఈ పరిస్థితిలో మేం చేసేది తప్పయినా, మీ ముందు తలదించుకోవాల్సి వచ్చినా, లంచాలు ఇచ్చాం. తప్పదు. ఆ అధికారి ఈ విశ్లేషణ విని అందులోని వాస్తవాన్ని గమనించి బాధపడటం మినహా ఏమీ చేయలేకపోయాడు. ఈ యథార్ధ సంఘటనలు మనకు అవినీతి ఎంతటి విషవలయమో తెలియజేస్తాయి. అందుకు అవినీతిని అంతమొందించాలంటే తప్పుచేసినవాళ్లకు శిక్ష, నిజాయితీపరులకు రక్షణ ఉందన్న విశ్వాసాన్ని బలంగా కలిగించాలి. నేటి పరిస్థితుల్లో ఆ విశ్వాసం లేకపోగా, తప్పులు చేసినవాళ్లకు విరివిగా పలుకుబడి, బహుమానం ఉండడంతో పాటు, నిజాయితీకి నిలబడితే ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కోవలసి వస్తోంది.

## నిజమైన ప్రజాస్వామ్యంతో అవినీతి అంతం సాధ్యమే

మన అనుభవ సారం ఏమంటే అవినీతి అనేది ఒక తీవ్రమైన వ్యాది లక్షణం.

అసలు వ్యాధి రాజ్య వ్యవస్థ వైఫల్యం, పతనం. అవినీతిని అంతమొదించాలంటే నిజమైన ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్ఠించాలి. తప్పులకు శిక్ష, మంచికి గుర్తింపు కలిగేలా ఏర్పాటు చేయాలి. దానితోపాటు పాలనలో దాపరికాన్ని తొలగించి ప్రజల చూపు పాలన వ్యవహారాలపై పడే విధంగా మార్పులు తీసుకురావాలి. అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజలకు జవాబుదారిగా చేయాలి. నేరమయ రాజకీయాన్ని ప్రక్షాళన చేయాలి. కీలక విషయంలో మౌలిక సంస్కరణలను చేపట్టాలి. ఇదంతా ఒక గందరగోళమైన డొంక లాంటిది. తీగ లాగితే డొంకంతా కదులుతుంది. ఒడుపుగా విషయాన్ని ఆకళింపు చేసుకుని డొంక మొత్తాన్ని తొలగించి శుభ్రం చేయాలి. కొంచెం మాత్రమే చేద్దామంటే దానికి మొదలులేదు, తుది లేదు, కొంత చేసేసరికి మళ్లీ దొంక పెరిగిపోతుంది. గుడ్డివాళ్లు ఏనుగుని తడిమి చూస్తే, ప్రతి ఒక్కళ్లూ కొంత సత్యాన్ని చూస్తారు. ఏనుగంటే స్తంభంలాగా, పాములాగా, చేటలాగా, చీపురులాగా వారికి విడివిడిగా అనిపిస్తుంది. తమకు అనిపించినదే పూర్ణస్వరూపమని భావించి, అదే సత్యమని నిర్ధారణ చేస్తే అధి అమాకత్వం అవుతుంది. పూర్ణ స్వరూపాన్ని అవగాహన చేసుకోకుండా, ఆవిష్కరించకుండా నేటి నేతలు ఆ గుడ్డివాళ్లను తలపునకు తెస్తున్నారు. ఇవి క్రియాశూన్యమైన, అవగాహనారహితమైన నినాదాలు శుష్క నినాదాలుకాక, వ్యవస్థాగతమైన సంస్కరణలపై దృష్టిని సారించాలి.

* * *

# ఆటగాళ్ళను మారిస్తే చాలదు ఆటనియమాల్నే మార్చాలి

**ఆగస్టు 25, 1997**

స్వతంత్ర భారత స్వర్ణోత్సవ నేపథ్యంలో అన్ని ప్రసంగాలలోను, సంభాషణలలోను, చర్చలలోను అవినీతి గూర్చిన ప్రస్తావన ఎక్కువగా వినబడుతోంది. ఆగస్టు 15న మన రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రుల ప్రసంగాలలో కూడా అవినీతి మీద వాగ్బాణాలు, వాగ్దానాలు వినిపించాయి. అవినీతి నినాదాలతో అంతమయ్యేది కాదు. ప్రజా జీవనంలో ప్రభుత్వ వ్యవహారాలల్లో అవినీతి తార స్థాయికి చేరుకుందన్న విషయం ఈ దేశంలో సామాన్యులకు కూడా తెలుసు. చేయవలసింది ఆ అవినీతిని అదుపులో ఉంచే పోరాటం. అమాయక పౌరులు లంచం ఇవ్వకపోతే దారుణంగా నష్టపోతున్నారు. ఆ భయంతో తప్ప అని తెలిసినా, గతి లేక లంచానికి లొంగిపోతున్నారు. కొద్ది మంది లాభాన్నాశించో, అన్యాయపు సంపాదన కోసమో లంచాన్ని ఇవ్వవచ్చు. జన సామాన్యునికి సంబంధించినంత వరకు, లంచం ఇవ్వం అని భీష్మించుకు కూర్చుంటే జరిగే అనర్థం అపారం. దాన్ని ప్రతిఘటించే శక్తి విడిగా పౌరులకు లేదు. వాస్తవం ఇలా ఉండగా, నేతు బ్రహ్మాండమైన ఉపన్యాసాలు ఇస్తూ అధికారాన్ని వాళ్ళనుభవిస్తూ, బాధ్యతని ప్రజల మీద రుద్దటం క్రూరత్వానికి, అజ్ఞానానికి తార్కాణం.

## ఒక అనుభవం

ప్రస్తుతం లోపభూయిష్ఠ వ్యవస్థలో అందరం ఒక విషవలయంలో చిక్కుకున్నాం. నిజంగా నాయకులు, అధికారులు నేటికీ చట్ట పరిధిలో ప్రయత్నించినా ఫలితాలు శూన్యం. ఈ విషయం వివరంగా విశ్లేషించటానికి అనువుగా ఒక స్వానుభవాన్ని పాఠకుల ముందుంచుతాను. దశాబ్దం క్రితం నేను ఒక జిల్లాలో కలెక్టరుగా పనిచేస్తుండగా కలిగిన అనుభవం ఇది. అప్పుడు ఆ జిల్లా తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఒక వంక తుఫానుకు గురై చాలామంది నిరాశ్రయులయ్యారు. మరో

వంక సంవత్సరాల తరబడి పత్తి పంట వివిధకారణాలవల్ల పూర్తిగా నాశనం కావటంతో పెట్టిన పెట్టుబడి తిరిగిరాక, అప్పుల బాధకు తాళలేక పూలమ్మినచోట కట్టెలమ్మలేక, పురుగు మందులు తాగి ఆత్మహత్యలకు పాల్పడి దాదాపు 40 మంది రైతులు మరణించారు. జిల్లా అంతా అట్టుడికిపోతోంది. పాలన యంత్రాంగం ఏమాత్రం అలక్ష్యం చేసినా, ప్రజలకు ప్రభుత్వం పట్ల విశ్వాసం సడలినా, మొత్తం అరాచకత్వం ఏర్పడే పరిస్థితులు వాటిల్లాయి. ఆ నేపథ్యంలో ఒక మండల రెవిన్యూ అధికారి మీద కొద్ది రోజుల తేడాతో నాకు మూడు నిర్దిష్టమైన ఆరోపణలు అందాయి. మొదటిది తుఫాను బాధితులకిచ్చే ప్రభుత్వ సహాయంలో కొంత భాగాన్ని ఆయన సొంతం చేసుకొని, మిగిలిన మొత్తాన్ని అందిస్తున్నాడని, అది తెలిసిన ప్రజలు ఒక గ్రామంలో ఆయనపై చేయి చేసుకున్నారు.పత్రికల్లో ఆ వార్త ప్రముఖంగా వచ్చింది. రెండోది తుఫాను సహాయ కార్యక్రమాల నిమిత్తం మంజూరు చేసి కొన్ని లక్షల రూపాయల నిధులను లెక్కలు చూపవలసిందని ఆ అధికారిని సబ్‌కలెక్టరు ఆదేశించగా, ఆయన అందుకు నిరాకరించాడు. ప్రభుత్వంలో కోటి రూపాయలు లంచంగా తీసుకొంటే పెద్ద శిక్ష ఉండకపోవచ్చు గాని, ఒక్క రూపాయైనా సరే ప్రభుత్వానికి లెక్కలు చెప్పకపోతే ఉద్యోగం ఊడుతుంది. మూడోది– ఆ అధికారి కుమారుడు ఆయన మీద కొన్ని తీవ్ర అభియోగాలు చేస్తూ ఆ మండలం నుంచి తన తండ్రిని బదిలీ చేయవలసిందని రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఆ ఆరోపణలు తీవ్రమైనని, నిర్దిష్టమైనవి. కాని అతడు గెజెటెడ్ అధికారి కావటంతో వెంటనే తీవ్రచర్య తీసుకునే అధికారం కలెక్టరుకు లేదు. అందువల్ల వెంటనే అతడిని అక్కడి నుండి బదిలీచేసి, ఆరోపణలపై సత్వర విచారణకు ఆదేశాలిచ్చాను. ఇక అక్కణ్ణుంచి మొదలైంది అసలు కథ. ఒక మండల రెవెన్యూ అధికారి నిబంధనల మేరకు తన మండలాన్ని దాటి వెళ్లాలంటే పై అధికారి అనుమతి కావాలి. మన రాష్ట్రంలో జిల్లా కలెక్టరు కూడా అనుమతి లేకుండా జిల్లా సరిహద్దులు దాటరాదు. కాని ఆ అధికారి బదిలీ గూర్చి వినగానే ఆ ఆదేశాలను ఖాతరు చేయకుండా వెంటనే హైదరాబాదు వెళ్లి కోర్టులో బదిలీపైన నిలుపుదల ఉత్తర్వులు (స్టే) తెచ్చాడు. ప్రభుత్వం దుబారా ఖర్చు తగ్గించాలని అనవసరమైన బదిలీలు చేయవద్దని కొన్ని ఆదేశాల ద్వారా సూచించింది. దాన్ని ఉటంకించి కోర్టు వారు నా ఉత్తర్వును పునఃపరిశీలించవలసిందని ఆదేశించారు. నేను వెంటనే ఏ కారణాలవల్ల

ప్రజా ప్రయోజనాల పరిరక్షణార్థం బదిలీ అవసరమో వివరిస్తూ చేసిన బదిలీని ఖాయం చేస్తూ, నా ఆదేశాలను ఖరారు చేశాను. వెంటనే అతడు మళ్లీ కోర్టుకు వెళ్లగా మొదట మంజూరు చేసిన 'స్టే'ని ఖాయం చేస్తూ అతణ్ణి మళ్ళీ అక్కడే ఉద్యోగంలో ఉంచవలసిందని ఆదేశించారు. అలాంటి తీవ్రమైన ఆరోపణలు, అవినీతికి ఆధారాలు ఉన్న కేసులో కోర్టు ఆదేశం నన్ను నిర్ఘాంతపరిచింది. ఇంతలో అతనిపై విచారణ చేసిన అధికారి అన్ని సాక్ష్యాధారాలతో నేరాలను, అవకతవకలను ధ్రువపరుస్తూ నివేదిక సమర్పించారు. 'బ్రతుకు జీవుడా' అనుకుంటూ వెంటనే ఆ నివేదికను హుటాహుటిన హైదరాబాదులో భూమిశిస్తు కమిషనరుకు పంపి, తక్షణం క్రమశిక్షణ చర్య తీసుకోమని వేడుకొన్నాను. ఆయన దాన్ని పరిశీలించి 24 గంటలలోగా ఆ అధికారిని ఉద్యోగం నుండి 'సస్పెండ్' చేశారు. ఇంతటితో సమస్య తీరింది కదా అని సంతోషించాను. ఎందుకంటే, ముందే చెప్పినట్లు జిల్లా తీవ్ర సంక్షోభంలో ఉంది. ఆ జిల్లాలోని 25 వేల మంది ఉద్యోగులలో వెయ్యిమంది గెజెటెడ్ అధికారులలో 56 మంది మండల రెవెన్యూ అధికారులలో ఒకరు ఈ అధికారి. అతడితో పోట్లాట పెట్టుకుని కేసుల్లో ఇరుక్కునే తీరిక, ఓపిక నాకు ఆ సమయంలో లేవు. అలాగని సహించి ఊరుకుంటే ఒక పరిపాలనకు, న్యాయానికి అర్థమే లేదు. నా సంతోషం కొద్ది రోజులు కూడా నిలబడలేదు. వెంటనే ఆ అధికారి మళ్లీ కోర్టుకు వెళ్లి, తనపై సస్పెన్షన్ అర్డర్‌ని సస్పెండ్ చేయించాడు. అంటే అతనికి మళ్లీ పదవీ బాధ్యతలు అప్పగించవలసి వచ్చింది. కాస్త ఆలోచించి, లంచం తినలేని, ప్రజలకు ఇబ్బంది కలిగించని ఒక ఉద్యోగంలో అతణ్ణి నియమించి, అతడి పై అధికారితో ఆ అధికారికి ఏమీ ఫైళు బాధ్యతలు ఇవ్వవద్దని, ప్రభుత్వం వారి 'అల్లుడు' కాబట్టి అవినీతి ఆరోపణలు పరిష్కారమయ్యేవరకు నెల జీతం మాత్రం ఇవ్వవలసిందని చెప్పాను. మళ్లీ అతడు హైకోర్టుకు వెళ్లాడు. కలెక్టరుగా నా మీద కోర్టు ధిక్కరణ నేరం ఆరోపించారు. బదిలీ చేసిన మండలంలోనే నియమించవలసిందని కోర్టువారు ఆదేశం ఇచ్చినా ధిక్కరించానని ఆరోపణ. హైకోర్టు వారు నాకు సమన్లు మంజురు చేశారు. నేను దీర్ఘంగా ఆలోచించి, ఇత స్పష్టమైన కేసులో కోర్టు ఆదేశాన్ని దిక్కరించటం న్యాయమనే నిర్ణయానికి వచ్చి, జైలుకు వెళ్లడానికి సిద్ధపడ్డాను. ఎందుకంటే, అప్పటికయినా ఆ కేసులో ప్రజాప్రయోజాలకు ఎంత నష్టం వాటిల్లిందో, అవినీతిపరుల్ని

మన వ్యవస్థ ఎలా రక్షిస్తుందో, పరిపాలన ఎలా కుంటుపడుతుందో ప్రజలకు తెలుస్తుందని, దాని మీద కాస్త చర్చ ప్రారంభమై కొన్ని మార్పులయినా వస్తాయని నా ఆశ! మన దేశంలో మంచి కూడా కొన్ని సందర్భాల్లో విచిత్రంగా జరుగుతుంది. అప్పటిదాకా జరుగుతున్న కోర్టు వ్యవహారాన్ని నేను రహస్యంగా ఉంచాను. అవినీతికి, అక్రమాలకు పాల్పడిన ఒక చిన్న అధికారిపై కూడా కలెక్టరు, ప్రభుత్వం చర్య తీసుకోలేకపోతున్నారని తెలిస్తే ప్రభుత్వ యంత్రాంగం ప్రజల్లో మరింత చులకన అవుతుందని, అవినీతిపరులు మరీ పేట్రేగి పోతారని నా భయం. ఇన్నిసార్లు కోర్టులు జోక్యం చేసుకొని, చివరకు నామీద కోర్టు ధిక్కారం ఆరోపణ రావటంతో కొందరు న్యాయవాదులకు ఆ సంగతి తెలిసింది. వారేం చేశారో తెలియదు కాని, హైకోర్టు ఆ కేసుని మరేం పొడిగించకుండా అలా విడిచిపెట్టింది. ఆ అధికారి అలానే నెల జీతం తీసుకుంటూ పని లేకుండా కూర్చున్నాడు. కనీసం ఆ జిల్లా నుండి అతణ్ణి బయటికి పంపాలని పట్టుబట్టి వేరే జిల్లాకి బదిలీ చేయించాను. చివరికి జరిగిందేమంటే, నేను ఆ జిల్లా నుండి బదిలీ అయ్యే సమయానికి, ఆ అధికారి ప్రక్క జిల్లాలో చాలా ప్రధానమైన ఒక మండలానికి అధికారిగా పనిచేస్తున్నాడు! ఆ తర్వాత కథ ఏమయిందో నాకు తెలియదు. ఈ వ్యవస్థ అవినీతిని ఎంతగా రక్షిస్తుందో నిజాయితీని పెంచటం ఎంత కష్టమో ఈ సంఘటనల వల్ల బోధపడుతుంది. నేటి పాలనలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలు ఇదేదో కొందరు అధికారులు పూనుకుంటేనో, కొందరు నాయకులు తలుచుకుంటేనో తేలే విషయం కాదు. నిజాయతీకి ప్రోత్సాహాన్ని, అవినీతికి శిక్షని ఇచ్చే శక్తిని పాలనా వ్యవస్థ కోల్పోయింది. రాబర్ట్ వేడ్ అనే పండితుడొకాయన ఆంధ్రప్రదేశ్‌లో అవినీతిని గురించి విశేషంగా అధ్యయనం చేసి, ప్రామాణికమైన పరిశోధన పత్రాలని ప్రచురించాడు. ఆయన విశ్లేషణను చూస్తే మనమొక విచ్చుకత్తుల విషవలయంలో చిక్కుకున్నామని స్పష్టమవుతుంది. బదిలీలు, వేదింపులు, కాంట్రాక్టులు, లైసెన్సులు, అక్రమ సహాయం వగైరా కారాణాలతో లంచాలు కింద నుంచి పైదాకా పోతుండగా పై నుండి కిందికి పదవులు, పలుకుబడి దిగుమతి అవుతున్నాయి. ఈ వలయంలో చిక్కుకున్న మంచివాళ్లు మౌనంగా సహించకుండా దీన్ని ఎదుర్కోవాలంటే వారికి కలిగే లాభం కన్నా నష్టం చాలా ఎక్కువ. నిజాయతీపరుడైన కిందిస్థాయి ఉ ద్యోగి లంచాలను ఆపాలని యత్నిస్తే వెలివేస్తారు. మళ్లీ మళ్లీ బదిలీలు, వేధిపులు,

శంకరగిరిమాన్యాలు తప్పవు. పిల్లల చదువులు కుంటుపడతాయన్న భయమో, రోజు ఆటుపోట్లు తట్టుకునే శక్తి లేకో, చాలా మంది నిజాయతీపరులు కూడా తాము తప్పు చేయకపోయినా మౌనంగా సర్దుకుపోతున్నారు. లంచం ఇవ్వకపోతే జరిగే జాప్యం, నష్టం, హాని అపారం. కాబట్టి వ్యక్తిగతంగా ఎదిరించే సాహసాన్ని అధిక సంఖ్యాకులు చేయటం లేదు. నేటి అక్రమ ఎన్నికల బాగోతంలో, అప్రజాస్వామిక, నేరమయ రాజకీయంలో అవినీతి పరుణ్ణి వెనకేసుకొచ్చే నాయకులు కోకొల్లలు, అందుకుతోడు కులం, వర్గం, ప్రాంతంలాంటి సంకుచిత భావాలు అవినీతికి పాల్పడే వాళ్ల రక్షణ కోసం ఉండనేఉన్నాయి. వీటన్నింటివల్ల రాజ్య వ్యవస్థ ప్రమాదకరమైన స్థిర సమత్వ స్థితి (డేంజరస్‌లీ స్టేబుల్ ఈక్విలిబ్రియం)లో ఉందని రాబర్ట్ వేడ్ విశ్లేషణ సారాంశం. అవినీతిని ఎదిరిస్తే ఆ విషవలయంలో వ్యక్తులకు లాభం కంటే ఇబ్బందులు ఎక్కువ కావటంతో వాళ్లు మౌనంగా ఉంటున్నారు. సమాజం మాత్రం అనుక్షణం తీవ్రంగా నష్టపోతోంది. అక్రమ సంపాదన పెరిగి నిజాయతీపరుల్లో స్థైర్యం తగ్గుతోంది. అవినీతి అప్రతిహతంగా సాగిపోతోంది. వీటితోపాటు రాజకీయరంగంలో ఉన్న అవకతవకల పుణ్యమా అని అక్రమంగా డబ్బు వసూలు చేయకపోతే మనుగడ, ఎన్నికల్లో విజయం అసాధ్యమయిపోయాయి. దేశంలో ఎన్నికయిన ప్రతి శాసనసభ్యుడూ, లోక్‌సభ సభ్యుడూ చట్ట పరిమితికి మించి డబ్బు ఖర్చు చేయవలసి వస్తోంది. ఎన్నిక కాగానే ప్రతి సభ్యుడు చేసే మొదటి పని తాను పరిమితికి లోబడే వ్యయం చేశానని అబద్ధమాడటం. దీనికి ఏ నాయకుడూ అతీతం కాదు. ఒకసారి అధికారంలోకి వచ్చాక ఎలాగో ఒకలాగా పదవి నిలుపుకోవాలంటే తన మద్దతుదార్లని, తన వర్గాన్ని, చట్టసభల సభ్యుల్ని తృప్తి పరచాలి. వాళ్లు కోరిన బదిలీలు, నిర్ణయాలు చేయాలి. లేకపోతే ఎవరు ఏనాడు హఠాత్తుగా తమ పదవులకు ఎసరు పెడతారో ఎవ్వరూ చెప్పలేరు. ఏతావతా తేలే దేమంటే రాజ్యాధికారాన్ని నిర్వహించే రాజకీయ నాయకులు నిజాయతీతో మనుగడ సాగించటం సాధ్యంకాని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. అందుకే ఒకప్పుడు అవినీతిపై పోరాటం సాగించి, ఆ విధంగా నాయకులయిన వాళ్లకు కూడా అవినీతి తప్పటంలేదు.

## పరిష్కారాలు సాధ్యమే

అవినీతి నశించాలని నినాదాలు చేస్తే కాదనే వారెవరూ ఉండరు. అవినీతికి

పాల్పడేవారు కూడా అందులో చేరి నినదిస్తారు. అవినీతి కొనసాగాలని బహిరంగంగా కోరే మనిషి ఒక్కరూ కనిపంచరు. అంతమాత్రాన అవినీతి తొలగిపోదు. అందుకే నినాదాల జోలికి పోకుండా, అవినీతిని అంతమొందిచటానికి అవసరమైన నిర్దిష్ట కార్యక్రమాల్ని, పాలన సంస్కరణల్ని చేపట్టాలి. గత 50 సంవత్సరాల అనుభవం నుండి మనకు ఎన్నో సంస్కరణలు గోచరిస్తాయి. ప్రభుత్వాన్ని నడిపే పెద్దలు వాటి మీద దృష్టి సారించకుండా నినాదాలకు, వాగ్దానాలకు ప్రాధాన్యమివ్వటమంటే జనానికి లేనిపోని భ్రమల్ని కల్పించటమే అవుతుంది. అవినీతి పోవాలంటే మన వ్యవస్థలో ఆటగాళ్లను మారిస్తే చాలదు– ఆట నియమాలనే మార్చి ప్రజలకు జవాబుదారిగా ఉండే దాపరికం లేని పాలన వ్యవస్థను నిర్మించాలి. ప్రజలకు నిజమైన అధికారాన్నిచ్చి ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేయాలి. తప్పుచేసిన వాళ్ళకి వెంటనే దండన ఉండే విధంగా పాలనని సంస్కరించాలి. అది అధికార బాధ్యతలు చేపట్టిన వారి తక్షణ కర్తవ్యం. సంతానం కమిటీ నుండి వోరా కమిటీ వరకు ఎన్నో నివేదికలిచ్చారు. ఇప్పుడు మళ్లీ ప్రధాని కార్యాలయంలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇవన్నీ లాంఛనప్రాయమైన కార్యక్రమాలు. ఇవి నిష్క్రియాపరత్వాన్ని, విజ్ఞత లేమిని దాచటానికి పనికివచ్చే ప్రక్రియలే తప్ప, నిజమైన పరిష్కారాల్ని సాధించి నిజాయతీని పెంపొందించే ప్రయత్నాలు కావు. సర్వాంతర్యామి అయిన ఈ అవినీతిని తొలగించే నిర్దిష్ట పరిష్కారాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిని సాధించే స్పష్టమైన మార్గాలు ఉన్నాయి. అందులో ప్రభుత్వాలకు పౌరులకు స్పష్టమైన పాత్ర ఉంది.

* * *

# అవినీతి పై సమరం జాతీయావసరం!

## డిసెంబర్ 10, 2001

జయలలిత మీద దాఖలైన మూడు క్రిమినల్ కేసులను అప్పీళ్ళలో మద్రాసు హైకోర్టు కొట్టివేయడంతో తమిళనాడు రాజకీయంలో మరో అధ్యాయం ప్రారంభమయింది. టాన్సీ భూమి కొనుగోలుకు సంబంధించిన రెండు అవినీతి కేసులలోను, ప్లెజెంట్ స్టే హోటల్‌కు ఇచ్చిన మినహాయింపునకు సంబంధించిన అవినీతి కేసులోను కింది కోర్టు జయలలితను దోషిగా నిర్ధారించి శిక్ష వేసింది. ఆ కారణంగా ఆమె ఎన్నికల్లో పోటీకి అనర్హురాలు కావటం, ఆ తరవాత శాసనసభాపక్షం నాయకురాలిగా ఎన్నికై ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం, శాసనసభ సభ్యత్వానికి అర్హత లేని వ్యక్తి ముఖ్యమంత్రి కారాదని సుప్రీంకోర్టు నిర్ణయించి ఆమెను పదవి నుంచి తొలగించటం, తదుపరి జయలలిత తరపుర రబ్బరుస్టాంపు ముఖ్యమంత్రిగా అనామకుడైన పన్నీర్ సెల్వంను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టడం– ఈ పరిణామాలన్నీ గత ఎనిమిది నెలలుగా ఎంతో వినోదాన్ని, విషాదాన్ని పంచాయి. ఇప్పుడు హైకోర్టు తీర్పుతో జయలలితపై అనర్హత వేటు తొలగి, ఆమె మళ్ళీ ముఖ్యమంత్రి పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమయింది.

### నిరాశకు తావులేదు

హైకోర్టు తీర్పు మీద సుప్రీంకోర్టు అనుమతితో మళ్ళీ అప్పీలు చేసే అవకాశం ఉంది కాబట్టి జయలలిత మరికొంతకాలం ఆగి ముఖ్యమంత్రి కావచ్చు. అలాగే, ఇప్పటికే ఒకసారి శాసనసభ్యురాలు కాకుండా ఆమెను ముఖ్యమంత్రిగా నియమించటంవల్ల, ఎన్నిక కాకుండానే మరోసారి ముఖ్యమంత్రిగా గవర్నర్ ఆమెను నియమించవచ్చా లేదా అనే ధర్మసందేహాలున్నాయి. కాబట్టి ఆమె ఏదో ఒక శాసనసభా స్థానం నుంచి ఉపఎన్నికలో పోటీ చేసి, ఎన్నికయ్యాక ముఖ్యమంత్రి కావచ్చు ఇవన్నీ కేవలం సాంకేతికమయిన అంశాలు. ఆమెకు విధించిన శిక్ష హైకోర్టులో రద్దు కాగానే ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉంది. ప్రజలిప్పటికే ఆమె పార్టీకి, నాయకత్వానికి మద్దతు పలికారు కాబట్టి ముఖ్యమంత్రి పదవిని చేపట్టేందుకు రాజ్యాంగపరంగా, చట్టపరంగా, రాజకీయంగా, నైతికంగా ఏ అవరోధాలూ లేవు. అయితే ఆమెపై మరికొన్ని కేసులలో చార్జిషీట్లు ఉన్నాయి. చార్జిషీట్లు ఎన్నికకు అవరోధం కాదు కాబట్టి ఆ కారణంగా

ఆమెను ముఖ్యమంత్రి కాకుండా అడ్డుకోవడం సాధ్యం కాదు. చాలా మంది ప్రసాస్వామ్యవాదులకు ఇదంతా వ్యవస్థ పతనానికి చిహ్నంగా కనిపించవచ్చు. అంత నిరాశ చెందాల్సిన అంశాలేమీ ఈ ఉదంతంలో లేవు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు శాసనసభ్యత్వానికి అర్హత లేనివారు మంత్రి పదవికీ అర్హులు కాదని మాత్రమే. ఎన్నికలలో ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. గెలిచింది కాబట్టి, ఆ పార్టీ శాసనసభ్యులు అనర్హులయినవారిని కూడా నాయకులుగా ఎన్నుకోవచ్చనే అసంబద్ధ వాదనను సుప్రీంకోర్టు కొట్టివేసింది. చట్టబద్ధ పాలన అంటే ప్రజల తీర్పుతో, రాజకీయ సమీకరణలతో, ఎన్నికల ఫలితాలతో నిమిత్తం లేకుండా అందరూ చట్టానికి, రాజ్యాంగానికి బద్ధులుగానే వ్యవహరించాలనే మౌలికమైన అంశాన్ని సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. ఆ మేరకు మన వ్యవస్థ బలపడి, ప్రజాస్వామ్యం మరింత వేళ్ళూనుకుంది. అనర్హత వేటు తొలిగాక జయలలిత ప్రభుత్వ పగ్గాలను ప్రత్యక్షంగా చేపట్టడం పూర్తిగా రాజ్యాంగబద్ధం, చట్టబద్ధం. ఇందులో మన వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు, రాగద్వేషాలకు తావులేదు.

ఎందరో విశ్లేషకులు ఒకే రకమైన వాస్తవాలున్న రెండు వేర్వేరు కేసులలో విభిన్నమైన నిర్ణయాలకు వస్తున్నారు. తర్కం, ధర్మం, వాస్తవాలు కాక తమ తమ రాజకీయ వాసనలు వారి వాదనల్ని ప్రభావితం చేస్తున్నాయి. నిజంగా ప్రజాభిప్రాయం, ఎన్నికల ఫలితాలు ఓ వ్యక్తి నాయకత్వాన్ని బలపరిచినప్పుడు, ఆ వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా అనర్హత లేనప్పుడు, ఆ నాయకత్వాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ మనసారా గౌరవించవలసిందే. రాజకీయ వైరం వేరు, ప్రజాస్వామ్య విలువలు వేరు. ప్రజాస్వామ్యంలో మనం చేసే ధర్మ నిర్ణయం వ్యక్తులనుబట్టి మారకూడదు. ఓ వ్యక్తి లేదా ఓ ప్రభుత్వం చేసే చర్యలు మనకు రాజకీయంగా అంగీకారం కాకపోతే, వాటిని వ్యతిరేకించటం ప్రతి పౌరుడి జన్మహక్కు మనకు కావలసినవాళ్లు చేపడితే మంచివిగా కనపడే చర్యలు, మనకిష్టం లేనివాళ్ళు చేస్తే చెడుగా కనిపిస్తే అది విజ్ఞత కాదు, విశ్లేషణ చేసేటప్పుడు నిరంతరం ఒకే ప్రమాణాలు పాటించినప్పుడే ప్రజాసంక్షేమాన్ని పరిరక్షించడం సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్యంలో అధికారం మారటంలో మూడు మౌలిక సూత్రాలున్నాయి. మొదటిది అధికార మార్పిడి ప్రజల తీర్పు ద్వారా జరగాలే కాని అర్ధరాత్రి కుట్రల ద్వారానో, చట్టసభ సభ్యుల బేరసారాల ద్వారానో జరగరాదు. రెండోది- అధికార మార్పిడి శాంతియుతంగా, ఏ హింస, రక్తపాతం లేకుండా జరగాలి. అధికారాన్ని హింసతో చేపట్టడం, బలప్రయోగంతో

పదవిలోకి రావటం నియంతృత్వానికి చిహ్నమే తప్ప ప్రజాస్వామ్యానికి సంకేతం కాదు. నాయకత్వంలో మార్పు అవసరమయితే, అందుకు రాజ్యాంగబద్ధమయిన ప్రక్రియలు, రాజకీయ సత్సంప్రదాయాలు ఉన్నాయి. ఇక మూడోది– చట్టబద్ధ పాలన అందరికీ శిరోదార్యం కావాలి. రాజ్యాంగం, చట్టం నిషేధించిన వ్యక్తి కేవలం శాసనసభ్యుల మద్దతున్నదన్న కారణంగా, ప్రజల ఓటుతో ఎన్నికయ్యారన్న కారణంగా అధికారాన్ని చేపట్టడం సాధ్యం కాదు. ఈ మూడు ప్రమాణాలు పాటించటం ప్రజాస్వామ్య మనుగడకు అవసరం. వీటిలో మొదటి ప్రమాణం మనదేశంలో తరచు ఉల్లంఘనకు గురవుతోంది. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగినా, రాజ్యాంగంలో ఉల్లేఖించిన మాటలకు వ్యతిరేకం కాదు కాబట్టి దానికి చట్టపరమైన విరుగుడు లేదు. ప్రజల విజ్ఞతే దానికి సరైన ఔషదం. శాంతియుతంగా అధికార మార్పిడి మనదేశంలో 55 సంవత్సరాలుగా నిరంతరంగా జరుగుతోంది. ఒకే ఒక్క ఉదంతంలో 1997లో ఉత్తర ప్రదేశ్‌లో జగదాంబికా పాల్ అకస్మాత్తుగా ముఖ్యమంత్రి పదవిని చేపట్టినప్పుడు, అలహాబాదు హైకోర్టు ఆ ప్రభుత్వం ఏర్పాటు చెల్లదని ప్రకటించింది. నేపథ్యంలో– బలవంతంగా ఓ ముఖ్యమంత్రిని పదవి నుంచి దింపవలసివచ్చింది. ఆనాటి ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు హైకోర్టు ఆదేశాలను జగదాంబికా పాల్‌కు చూపటం, ఆయన ముఖ్యమంత్రి కార్యాలయంలో కుర్చీని గట్టిగా పట్టుకుని రానని మొరాయించటం, బలవంతంగా ఆయన్ని గదిలో నుంచి పంపించటం, ఈలోగా, జగదాంబికా పాల్ ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని ఉండగానే, కల్యాణ్‌సింగ్ పక్కనే ఉన్న క్యాబినేట్ కార్యాలయంలో మంత్రి వర్గ సమావేశం జరపటం– ఇవన్నీ మన ప్రజాస్వామ్య చరిత్రలో ఓ విషాద ఘట్టంగా, మరిచిపోదగ్గ సంఘటనలుగా మిగిలిపోయాయి. మొత్తంమీద శాంతియుత అధికార మార్పిడి మనదేశంలో జరుగుతూ వస్తోంది. 1977లో ఇందిరాగాంధీ పరాజయంతో దేశంలో మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడినా, 1999లో ఒకే ఒక్క ఓటుతో లోక్‌సభలో వాజపేయి ప్రభుత్వం ఓటమి పాలయినా, మన రాజకీయ నాయకులు, చట్టసభల సభ్యులు అధికార మార్పిడిలో ఎంతో హుందాతనాన్ని, సంయమనాన్ని పాటించారు. హింస ద్వారా కాక శాంతియుత రాజకీయ ప్రక్రియ ద్వారా అధికారం నిర్ణయమయింది. దక్షిణాసియాలో పొరుగున ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు మనకు మధ్య ఉన్న ప్రధానమయిన తేడా అదే. ఈ కారణంగానే ఎన్ని లోపాలున్నా భారత్ ప్రపంచ ప్రశంసలనందుకుంటూ ప్రజాస్వామ్యంగా నిలబడింది. ఇక మూడోది

రాజ్యాంగానికీ, ప్రజల తీర్పునకు మధ్య సంఘర్షణ వస్తే రాజ్యాంగమే నిలబడటం. ప్రజల తీర్పు, పార్లమెంటు మద్దతు ఉన్నవన్న వంకతో 1975లో ఇందిరాగాంధీ రాజ్యాంగాన్నే కాలరాచారు. 1977 ఎన్నికలలో ప్రజలే ఆ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించి తిరస్కరించడంతో ఆ ప్రతిష్టంభన ప్రజాస్వామ్యబద్ధంగా తొలగిపోయింది. అదే 1977లో కాంగ్రెస్ గెలిస్తే ప్రజల తీర్పునకు, రాజ్యాంగ విలువలకు మధ్య సంక్షోభం మరింతగా ముదిరేది. ఎమర్జెన్సీ కాలంలో సుప్రీంకోర్టు తప్పటడుగు వేసింది. రాజ్యాంగ విలువలే ప్రధానమని, ప్రజల తీర్పు కారణంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించరాదని ఇటీవల జయలలిత కేసులో సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా తీర్పు చెప్పింది. రాజ్యాంగంలో మార్పులవసరమయితే వాటిని ప్రజల మద్దతుతో చేపట్టే అధికారం ఎన్నికయిన ప్రభుత్వాలకుంది. ఇప్పటికి 93 సార్లు ఆ ప్రయత్నం చేశారు. ప్రజాస్వామ్యాన్నే కాలరాచే హక్కు ఎవరికీ లేదు. ప్రజల మద్దతు సాకుగా చూపిరాజ్యాంగాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదు. కొన్ని పొరపాట్లు జరిగినా ఇప్పటికే ఈ విషయం దేశంలో స్పష్టమయింది. రేపు ప్రజలు బలపరిస్తే, రాజ్యాంగంలో ఏమీ అవరోధం లేదు. కాబట్టి వంశపారంపర్యంగా పార్టీ పగ్గాలు చేపట్టిన సోనియా గాంధీ, పుట్టుకతో విదేశీ వనిత అయినా ప్రధానమంత్రి కావచ్చా? కుటుంబపాలన కారణంగా దేశంలో అతిపెద్ద పార్టీకి నాయకత్వాన్ని సోనియా పొందటం నిజంగానే మనమంతా విచారించవలసిన అంశం. కానీ ఆ పార్టీ సభ్యులు ఆమెను నాయకురాలిగా ఎన్నుకున్నంతకాలం అందుకు కారణాలేవైనా కావచ్చు- ఆ నాయకత్వాన్ని అంగీకరించటం భావ్యం. రేపు ఆమె నాయకత్వంలో పార్టీకి మెజారిటీ వస్తే, ఆమెనే లోక్‌సభ సభ్యులు తమ సభాపక్షం నాయకురాలిగా ఎన్నుకుంటే, ప్రధాన మంత్రి పదవి రాజ్యాంగబద్ధంగా ఆమెదే అవుతుంది. అలాగే భారత్ అంతటి పెద్ద దేశానికి, వలస వాదనను, శ్వేతజాతి దురహంకారాన్ని వ్యతిరేకించిన సమాజానికి, ఓ ఇటాలియన్ మహిళ నాయకురాలిగా ఎన్నికైతే అది అనేకమందికి మానసిక క్షోభ కలిగించే మట వాస్తవం. ఒకసారి మనదేశ పౌరసత్వాన్ని తీసుకున్నాక చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఆ వ్యక్తి ఉన్నత పదవిని చేపట్టడానికి ఏమీ ప్రతిబంధకం లేదు. కాబట్టి రాజకీయంగా ఎంత అయిష్టం ఉన్నాసరే ఆమె నాయకత్వాన్ని శాంతియుతంగా, హుందాగా అంగీకరించాల్సిందే.

## సంస్కరణలే శరణ్యం

మరి జయలలిత అవినీతి సంగతేమిటి? ఆమె అవినీతికి పాల్పడ్డారని దేశంలో

చాలామందికి గట్టి నమ్మకం. అయితే ఆమెను మాత్రమే అవినీతిపరురాలుగా మనం భావిస్తే అది అమాయకత్వం, లేదా అజ్ఞానం. దేశంలో దాదాపు ప్రతిప్రధాన పార్టీ, ప్రతి ప్రభుత్వం అవినీతిలో పీకలదాకా కూరుకునిపోయి ఉంది. అవినీతికి పాల్పడకుండా రాజకీయం నడవటం, ఎన్నికలలో గెలవటం, చట్టసభ సభ్యుల మద్దతును కూడగట్టడం అసాధ్యమనే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. కేవలం ఓ లాలూయాదవ్, లేదా ఓ జయలలిత మాత్రమే అవినీతికి పాల్పడుతున్నారనుకోవటం భ్రమ. మిగిలిన వారు మరింత గడుసుగా అవినీతికి పాల్పడవచ్చు. పెద్దఎత్తున అవినీతికి పాల్పడని ప్రభుత్వంగాని, పాలనగానీ మనదేశంలో ఉందని చెప్పే సాహసం ఎవరికీ లేదు. మన రాజకీయాన్ని నిత్యజీవితంలో పాలనను ఏమాత్రం పరిశీలించినా మనందరికీ ఈ విషయం బోధపడుతుంది. జయలలిత పదవిని చేపట్టడాన్ని వ్యతిరేకించటానికి కారణం, ఆమె అవినీతిపరురాలని కాదు; కోర్టులో శిక్షపడ్డ కారణంగా ఆమెకు అర్హత లేదని, అవినీతిపై పోరాటం చేయటం జాతీయావసరం. కాని అందుకు మార్గం కేవలం కొంతమందిని అవినీతిపరులుగా ముద్రవేసి వారిని వ్యతిరేకించటం కాదు. ఎన్నికల సమూలసంస్కరణలు, అధికార వికేంద్రీకరణ, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి ఏర్పాట్లు, తప్పుచేస్తే సులభంగా, శీఘ్రంగా, తీవ్రంగా శిక్షించే న్యాయవ్యవస్థ– ఇవన్నీ అవినీతి నిరోధానికి, నిజాయతీని ప్రోత్సహించటానికి అవసరం. అవినీతి వ్యతిరేక పోరాటంతో జయలలిత కేసును ముడిపెట్టటం ఆత్మవంచన అవుతుంది. ఆమె ఉదంతం కేవలం రాజ్యాంగబద్ధ పాలనకు సంబంధించింది. అవినీతిని అంతమొందించటానికి వ్యవస్థలో మౌలిక సంస్కరణలు అవసరం.

* * *

# అవినీతిని అంతంచేస్తేనే సంపద సృష్టికి అవకాశం

## ఫిబ్రవరి 12, 2001

ఓ అసాధారణమైన సంఘటన గతవారం జరిగింది. బహుశా మన దేశ చరిత్రలోనే ప్రథమంగా– వందలమంది చిన్న పారిశ్రామికవేత్తలు అవినీతికి, అధికారుల దోపిడికి వ్యతిరేకంగా వీధికెక్కారు; ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు చేశారు. మన రాష్ట్ర చిన్న పరిశ్రమల సంఘాల సమాఖ్య ఆధ్వర్యాన వీరంతా సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో శ్రుతిమించిన అవినీతిని, లంచాల బెడదను భరించలేక తెగించారు. సెంట్రల్ ఎక్సైజ్ కేంద్ర ప్రభుత్వానికి అత్యధికంగా ఆదాయాన్ని అందించే పన్ను. పారిశ్రామిక ఉత్పత్తుల మీద ఈ పన్ను వేస్తారు. ఆ పన్ను వల్ల ఉత్పత్తి ఖర్చు ప్రత్యక్షంగా పెరిగినట్లే. దాని ప్రభావం వల్ల ఆ ఉత్పత్తుల ధర పెరుగుతుంది. అంటే ఆ పన్ను వల్ల పడే భారం పరోక్షంగా ప్రజల పైనే. అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే పన్ను కావటంతో దాన్ని సరిగ్గా వసూలు చేయటానికి సెంట్రల్ ఎక్సైజ్ శాఖకు అసాధారణమైన అధికారాలున్నాయి. పరిశ్రమను సోదా చేయవచ్చు లెక్కలు తనిఖీ చేయవచ్చు, పరిశ్రమను మూసేయించవచ్చు, పారిశ్రామికవేత్తలను అరెస్టు చేయవచ్చు, ఏమైనా తప్పులు దొరికితే భారీగా పెనాల్టీలు విధించవచ్చు. ఏతావతా తేలేదేమంటే సెంట్రల్ ఎక్సైజ్ అధికారులు తలచుకుంటే ఓ పరిశ్రమను నాశనం చేయగలరు. కోట్ల రూపాయల పెట్టుబడిని పారిశ్రామికవేత్త కళ్ళ ఎదురుగా గల్లంతు చేయగలరు. ఇంతటి అధికారం ఉండటంతో సహజంగానే ఆ శాఖలో అవినీతి కూడా విశృంఖలంగా ఉంది.

### అవధులు మించిన దోపిడీ

ఓ పరిశ్రమలో ఉత్పత్తి కొంత స్థాయి దాటగానే సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో నమోదు (రిజిస్ట్రేషన్) చేయించుకోవాలి. అందుకు ఇవ్వవలసిన లంచం రూ॥20.000 నుంచి రూ॥25,000 దాకా! ఒకవేళ పరిశ్రమ గిట్టుబాటులేక మూతపడిపోతే ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించుకోవాలి. అందుకు కూడా రూ॥15,000 లంచం ఇవ్వటం తప్పనిసరి. నెలనెలా పరిశ్రమను బట్టి రూ॥1,000 నుంచి రూ॥5,000 మామూళ్లు ఇవ్వాలి. ఆడిట్‌శాఖ ఎప్పుడు తనిఖీకి వచ్చినా కనీసం రూ॥15,000

సమర్పించుకోవాలి. ఇదికాక వేరే తనిఖీలుంటాయి. వారు వస్తే పరిశ్రమ ఉత్పత్తిని బట్టి, వచ్చే అధికారి స్థాయిని బట్టి రూ॥25,000 నుంచి లక్షదాకా మామూళ్ళివ్వాలి. ఇక ఏమయినా లోపాలున్నాయని అనుమానించి సోదా (రెయిడ్)కి వస్తే రూ॥50,000 నుంచి రూ॥5,00,000 దాకా లంచం ఇచ్చుకోవాలి. పన్ను ఎగవేత నిరోధక విభాగం (ఏంటీ ఎవేషన్) తనిఖీకి వస్తే ఇవ్వవలసిన లంచానికి లెక్కే లేదు. ఇక పన్ను నిఘా విభాగం (రెవిన్యూ ఇంటెలిజెన్స్) పాలపడితే ఆ పరిశ్రమను మూసేసుకోవాల్సిందే! ఇట్లా ప్రతి దానికీ పెద్ద మొత్తాలు బలవంతంగా గుంజటం, లంచం అందకపోతే కేసులు పెట్టి వేధించటం పరిపాటి అయిపోయింది. ఇది కేవలం చిన్న పరిశ్రమల అనుభవం. ఈ పరిశ్రమల వార్షిక ఉత్పత్తి చాలా సందర్భాలలో కొన్ని లక్షల నుంచి కోటి రూపాయల మేరకు ఉంటుంది. పెద్ద పరిశ్రమలయితే నెలనెలా పెద్ద మొత్తాలు సమర్పించుకోకపోతే బతకటం అసాధ్యం. ఈ అవినీతిలో మళ్ళీ రెండు రకాలున్నాయి. పరిశ్రమలో ఏ మోసం, పన్ను ఎగవేత లేకపోయినా యజమానిని వేధించి, బెదిరించి, నిర్బంధంగా లంచాలు వసూలు చేయటం ఒక రకం. లంచం ఇవ్వకపోతే పెట్టే బాధ వర్ణనాతీతం. ఇదో రకంగా రౌడీ మామూలులాంటిదన్నమాట. రెండోరకం అవినీతి – పన్నులు ఎగ్గొట్టే వాళ్ళు అధికారులతో లాలూచీపడి చాలా పెద్ద మొత్తాలు అధికారులకు అందించటం. కోట్ల రూపాయల మేరకు పన్ను ఎగ్గొట్టినప్పుడు ఆ పరిశ్రమకు మూడు రకాలుగా లాభం. మొదటిది, పన్ను డబ్బు మిగిలిపోతుంది. రెండోది, ఆ వస్తువుకు పన్నుకట్టలేదు కాబట్టి మార్కెటులో ఆ మేరకు తక్కువ ధరకు అమ్ముకోవచ్చు. అదే వస్తువును ఉత్పత్తి చేసే ఇతరులు పన్ను కడితే వాళ్ళు ఈ పోటీకి తట్టుకోలేక పరిశ్రమ మూతపడాల్సి వస్తుంది. అంటే పన్నులు కట్టిన వాళ్ళు నష్టపోగా, పన్నులు ఎగ్గొట్టిన వాళ్ళు లాభపడటమే కాక మార్కెట్లో గుత్తాధిపత్యం చలాయిస్తారు. ఇక మూడో లాభం– ఎక్సైజ్ పన్ను కట్టలేదు కాబట్టి ఆ వస్తువుల అమ్మకాలు వాళ్ళ లెక్కల్లో చూపనక్కరలేదు. లెక్కల్లో ఆ వ్యాపారం కనిపించదు కాబట్టి దాని మీద వచ్చే ఆదాయం మీద ఆదాయ పన్ను కట్టనక్కరలేదు. అంటే అటు ఎక్సైజ్ పన్ను డబ్బు మిగులుతుంది. ఇటు ఆదాయ పన్ను ఎగ్గొట్టవచ్చు. ఎన్నో పరిశ్రమల వారు ఇలా లాలూచీపడి అధికమొత్తాలు లంచాలిస్తున్నారు. దేశం మొత్తంలో మనం ఊహించనంత డబ్బు ఇలా లంచాల రూపంలో వసూలవుతోంది.

దీనివల్ల ప్రజలకు నష్టమేమిటి? చాలా రకాలుగా జాతి నష్టపోతోంది. చిన్న పరిశ్రమల యజమానులను వేధించటంతో, లంచాల పేరిట దోచుకోవటంతో, ఆ

మేరకు వాళ్ళ వస్తువుల ధరలు పెంచాల్సి వస్తోంది. ఆ లంచం డబ్బును వినియోగదార్ల నుంచి రాబట్టలేకపోతే పరిశ్రమ నష్టాల పాలై మూతపడుతుంది. దాంతో పెట్టిన పెట్టుబడి, దానిపైన తెచ్చిన అప్పులు– అన్నీ గల్లంతే. వేలమంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడుతున్నారు. ఎన్నో పరిశ్రమలు ఖాయిలా పడుతున్నాయి. దేశంలో ఉత్పత్తి తగ్గుతోంది. వస్తువుల ధరలు లంచాల కారణంగా పెంచాల్సి రావటంతో విదేశీ ఉత్పత్తులతో పోటీ పడలేకపోతున్నాం. సరకుల ఎగుమతి కష్టమవడమో, దిగుమతి చేసుకున్న వస్తువుల గిరాకీ పెరగటమో జరుగుతోంది. అంటే మన దేశంలో ఉత్పత్తి పెరిగి ఉద్యోగాలు కల్పించే బదులు, ఈ అవినీతి వల్ల, వేధింపువల్ల విదేశాలలో ఉత్పత్తి పెరిగి వాళ్ళ ప్రజలకు ఉపాధిని ఇవ్వగలుగుతున్నారు. అందుకే, ఇటీవలి కాలంలో చైనాలాంటి దేశాల నుంచి తక్కువ ఖరీదుకు ఎక్కువ మన్నికగల వస్తువులు పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్నాయి. మన ప్రజలంతా ఈ విదేశీ వస్తువులను తక్కువ ధరకు కొనటానికి ఎగబడుతున్నారు. లాలూచీపడి పన్ను ఎగ్గొడితే నిజాయతీగా పన్నుకట్టే వాళ్ళు నష్టపోతున్నారు. పన్ను ఎగ్గొట్టేవాళ్ళు మార్కెట్లో గుత్తాధిపత్యం చలాయించి మరింత పెద్దవాళ్ళయి పోతున్నారు. నిజమయిన పోటీ లేకుండాపోయి వస్తువుల ధరలు పెరగటం, నాణ్యత తగ్గటం జరుగుతోంది. పన్నుల డబ్బులు ఖజానాకు అందకపోవటంలో ప్రభుత్వ ఆదాయం తగ్గుతోంది. మన నేతల, అధికారుల అవినీతి, దుబారావ్యయం పుణ్యమా అని ఖర్చులు మాత్రం పెరగటంతో దేశం అప్పుల పాలవుతోంది. ఆ అప్పులు, వడ్డీలు చెల్లించాల్సింది ప్రజలే. ఆ కారణంగా పన్నులు పెంచాల్సివస్తోంది. లేదా దేశం తట్టుకోలేని ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. ఇక అవినీతికి పాల్పడేవాళ్ళ దర్పానికి, అహంకారానికి అంతులేదు. జీతం పదివేలయితే లంచం పది లక్షలవుతోంది. నిజాయతీపరుడయిన అధికారి తన జీతంతో తృప్తిపడి మామూలు స్థాయిలో ఉండగా దోచుకునే వాడు కోట్లకు పడగలెత్తుతున్నాడు. సహజంగానే కొంత కాలానికి నిజాయతీ చచ్చిపోయి, అవినీతి పెరిగిపోతుంది. ఎవరన్నా గట్టిగా నీతి కోసం నిలబడితే, వాళ్ళ వల్ల తమ అక్రమాలు, అవినీతి సాగవని భయపడే వాళ్ళు నిజాయితీపరులను వేధింపులకు గురిచేస్తున్నారు. కొన్ని సందర్భాలలో వాళ్ళపైన దౌర్జన్యం, హత్యాయత్నం కూడా జరుగు తున్నాయి. ఇలా ఈ లంచాల వల్ల దేశానికి, ప్రజలకు ఎన్నో రకాలుగా చెప్పనలవికాని నష్టం జరుగుతున్నది. మరి రాజకీయ నాయకులు దీన్ని ఎందుకు ఆపటం లేదు. అసలు ఈ అవినీతికి మూలం రాజకీయంలోనే ఉంది కాబట్టి! ఎన్నికలలో అక్రమాలు చేసి

కోట్లు ఖర్చుపెట్టడం ఆ విధంగా పదవులు చేపట్టడం అనవాయితీ అయింది. ఆ ఖర్చుకు పదింతలు ఆర్జించాలంటే అందుకు మార్గం ఈ అవినీతి ఎన్నికల ఖర్చు, రాజకీయం పేరుతో వేల కోట్ల రూపాయలు నాయకులు వెనకేసుకుంటున్నారు. నాయకులు, ఉన్నతాధికారుల అక్రమార్జన కనీసం పదివేల కోట్ల డాలర్లకు పైగా విదేశీ బ్యాంకులలో మూలుగుతోందని అంచనా. ఇది మన మొత్తం విదేశీ అప్పులకు సమానం. చాలామంది అంచనా ప్రకారం ఇంతకు మూడు రెట్ల డబ్బు విదేశాలలో మన అవినీతి సామ్రాట్టులు దాచుకుని ఉండవచ్చు. అదికాక ప్రతి ఏటా దేశం నుంచి ఇలా లంచాల ద్వారా ఆర్జించిన మరో రెండు, మూడు వేల కోట్ల డాలర్ల డబ్బు విదేశాలకు తరలిపోతోంది. అంటే దీని విలువ ఏటా లక్ష కోట్ల రూపాయలపైనేనన్నమాట! ఈ డబ్బు ఎలా సంపాదించినా కనీసం మన దేశానికి ఉపయోగపడక బయటకు పోతోంది! అక్రమార్జనల వల్ల సంపాదించిన డబ్బుతో మన దేశంలోనే ఏటా వేల కోట్ల రూపాయల ఆస్తులు సంపాదిస్తున్నారు. విదేశాలలో కోటీశ్వరులకు సైతం అందని రాజభోగాలనుభవిస్తున్నారు. ఓ అవినీతిపరుడైన కేంద్రమంత్రి లేదా ఓ పెద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి సంపాదన ఐదేళ్ళ పదవీ కాలంలో వెయ్యికోట్ల రూపాయల దాకా ఉంటోందని అంచనా. వాళ్ళంతా సంపాదన చెయ్యాలంటే అధికారులు, ఉద్యోగులు అంతకు పదిరెట్లు లంచాలు గుంజాలి. తలాకాస్త వాళ్ళు ఉంచుకుని మిగిలింది పైకి పంపిస్తారు. ఇదీ ఈ అవినీతి విశ్వరూపం.

ఇంతకాలం అవినీతిని సహించి అందుకు లొంగిపోయిన పరిశ్రమల యజమానులు ఇప్పుడు రోడ్డున ఎందుకు పడ్డారు? పదేళ్ళ క్రిందటి వరకు దేశంలో లైసెన్సు-పర్మిటు-కోటాల రాజ్యం నడిచింది. ప్రతి చిన్న పరిశ్రమకు ప్రభుత్వమే లైసెన్సులిచ్చేది. సొంతంగా ఏ పనిచేయాలన్నా ఆ లైసెన్సుకోసం లంచాలిచ్చి, సిఫారసులు చేయించి, పలుకుబడి ఉపయోగించి, నానా గడ్డీ తినాల్సి వచ్చేది. ఒకసారి లైసెన్సు వచ్చాక వివిధ శాఖలకు లంచాలిచ్చి పరిశ్రమ నడిపేవారు. ఆ మొత్తం భారాన్ని ప్రజల మీద మోపేవారు. నాసిరకం వస్తువుల దిగుమతిని నిరోధించే వారు కాబట్టి వస్తువులకు పోటీ లేదు. ఇలా ఈ లంచగొండి వ్యవస్థ భారమంతా ప్రజలే మోసేవారు. గత పదేళ్ళుగా ఈ లైసెన్సు రాజ్యాన్ని క్రమక్రమంగా అంతం చేస్తూ వస్తున్నారు. విదేశీ వస్తువులపైన దిగుమతి సుంకాన్ని తగ్గించి, ఆంక్షలు తొలగిస్తున్నారు. దాంతో మన ఉత్పత్తులు తిగుమతులతో పోటీ పడాల్సివస్తోంది. ఇక్కడి ప్రజలకు, వినియోగదార్లకు ఇప్పుడు తక్కువ ఖరీదుకు ఎక్కువ నాణ్యతగల వస్తువులు అందుబాటులోకి వస్తున్నాయి. దాని పర్యవసానంగా ఇక్కడి ఉత్పత్తుల గిరాకీ తగ్గి

చాలా పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ లంచాల భారం, ఈ అధికారుల వేధింపులు భరించటం పరిశ్రమలకు అసాధ్యమయింది. అందుకే చావో, బతుకో తేల్చుకుందామనే తెగింపుతో పరిశ్రమల వారు బజారునపడ్డారు. గత 50 సంవత్సరాలుగా- మన దేశంలో ఓ పరిశ్రమ పెట్టినవాణ్ణి ఓ దొంగలాగానో, దోపిడిదారుగానో, దుర్మార్గుడిలాగానో చూసే సంస్కృతికి అలవాటుపడ్డాం. పెట్టుబడి పెట్టి, ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి, ఎంతో రిస్కు తీసుకుని, శ్రమపడి, క్షణ క్షణం ఆందోళనకు, చికాకులకు లోనై, నష్టాలు భరించి, లంచాలకు తలొగ్గి ఓ పరిశ్రమను నిలబెట్టిన వాళ్ళను చిన్నచూపు చూశారు. మన అవసరాలు తీర్చటానికి కావలసిన వస్తువులను, సేవలను ఉత్పత్తి చేయటం పరిశ్రమల బాధ్యత. ఉత్పత్తిని దోపిడీగా భావించే సమాజం కచ్చితంగా పతనమవుతుంది. మనం స్వయం ఉపాధిని, పరిశ్రమలను కించపరిచి, వాళ్ళను వేధించే అధికారులను, నాయకులను నెత్తిన పెట్టుకున్నాం. దాని పర్యవసానం దేశం ఆర్థికంగా పతనమయింది. ప్రతి ఒక్కరూ ప్రభుత్వోద్యోగం కోసం, రాజకీయాధికారంకోసం ఎగబడటం ప్రారంభించారు. అక్రమ సంపాదనకు, హోదాకు, పదిమందిని వేధించటానికి అధికారం దగ్గరి మార్గమయింది. సంపద సృష్టిని నిరసించి అధికారాన్ని పూజిస్తే ప్రజలకు మిగిలేది పూజ్యమే. అందుకే ప్రభుత్వాలు దివాలా అంచున ఉన్నాయి. దేశం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. కోట్ల మంది యువకులు ఉపాధి లేక దిగాలుపడి కూర్చున్నారు.

## మారాల్సింది... ఆలోచన ధోరణి

ఇప్పటికయినా ప్రజల ఆలోచనలు మారాలి. సంపద సృష్టించటం పవిత్రమైన వ్యాసంగం. సంపద సృష్టి వల్లనే వస్తు ఉత్పత్తి ఉపాధి కల్పన జరుగుతాయి; సమాజ అవసరాలు తీరతాయి; బీదరికం తొలగుతుంది. అలవిమాలిన అవినీతి ఈ సంపద సృష్టికి అవరోధంగా నిలుస్తోంది. వేధింపుల భయం గుప్పిట్లో సంపద సృష్టించే చిన్న పరిశ్రమల వాళ్ళు గిజ గిజలాడుతున్నారు. ఇప్పుడేగతిలేక, వేరే దారి కానరాక, తెగించి రోడ్డునపడ్డారు. ఈ పోరాటం మనందరిది కావాలి. అవినీతిని నిర్మూలించి వ్యవస్థను ప్రక్షాళన చేయటం, సంపద సృష్టిని ప్రోత్సహించటం, మన వస్తువుల, సేవల నాణ్యత పెంచటం తద్వారా యువతకు ఉపాధి కల్పించటం మన కర్తవ్యాలు. అందుకు ప్రధానంగా మనం పోరాడవలసింది.... క్యాన్సరులాగా వ్యాపించిన ఈ అవినీతిపైన...

* * *

# సంక్షోభం కాదిది జాతికి మహదవకాశం

మార్చి 19, 2001

మరో అవినీతి కుంభకోణం ఇంకోసారి దేశాన్ని రాజకీయ సంక్షోభంలోకి నెట్టింది. తహల్కా డాట్‌కామ్ కంపెనీవారు సృష్టించిన సంచలనం దేశంలో అసాధారణ ప్రకపంపనలకు కారణమయింది. ఈ హడావిడిని, హంగామాను కొంతసేపు పక్కకుపెట్టి, కాస్తంత నిదానంగా ఆలోచిస్తే ఇందులో ఆశ్చర్యానికి, విస్మయానికి కారణమేమీ కనిపించదు. భారతదేశంలో రాజకీయాలు, పరిపాలన గురించి ఏమాత్రం అవగాహన ఉన్నవాళ్ళకయినా పాలకులు ఎంతెంత లంచాలుగా దిగమింగుతున్నారో తెలుసు. ఓ మోస్తరు పట్టణంలో కేవలం టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేసే వ్యక్తి ఏటా కోటి రూపాయలు ముడుపులు పుచ్చుకుంటున్నాడు! ఓ నగరంలో విద్యుత్ సంస్థలో అసిస్టెంటు ఇంజినీరు సంపాదన సాలినా ఓ అరవై డెబ్బై లక్షలుంటోంది. అలాంటప్పుడు జాతీయస్థాయిలో డబ్బు తింటున్నారంటే విస్తుపోవటం అమాయకత్వం లేదా అపార నటనా చాతుర్యంలో భాగం మాత్రమే అవుతుంది. రాబర్టు క్లైవ్ భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఓ సాధారణ కుటుంబంలో పుట్టి, పెద్దగా చదువుసంధ్యలు లేక, ఒక మామూలు గుమాస్తాగా మన దేశానికి వచ్చిన క్లైవ్ ప్రపంచ చరిత్రలో అతిపెద్ద వలస రాజ్యానికి వచ్చిన క్లైవ్ ప్రపంచ చరిత్రలో అతిపెద్ద వలస రాజ్యానికి పునాది వేశాడు. చివరికి పదవీ విరమణ చేసి బ్రిటిన్ తిరిగి వెళ్లాక అతడి పైన భారత్‌లో లంచాలు తిన్నాడని ఆరోపణలు వచ్చాయి. అప్పుడాయన ఇచ్చిన సమాధానం విని అక్కడి ప్రజలంతా అవాక్కయ్యారు. "మొత్తం హిందుస్థాన్ అంతా నాకు పాదాక్రాంతమై ఉందానాడు. నేను తిన్నది చాలా తక్కువ. వెనక్కి తిరిగి చూస్తే, నేను పాటించిన సంయమనం నాకే విస్మయాన్ని కలిగిస్తోంది" అని చెప్పాడు క్లైవ్! ఢిల్లీలో పాలకులు, వారి అంతరంగికులు, ఉన్నతస్థాయి నాయకులు కేవలం లక్షలు మాత్రమే తీసుకుంటున్నారంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. వారు లంచాలు తింటున్నారని వెల్లడవడం విచిత్రమేమీ కాదు.

## రాజకీయ వినోదం

ఎప్పటి మాదిరిగానే ఈ సంక్షోభం కూడా రాజకీయ వినోదాన్ని కలిగిస్తోంది. మామూలుగా వార్తలు పట్టించుకోకుండా టి.వి.లో సినిమాలకు, పసందైన పాటలకు, కనువిందైన నృత్యాలకు, రక్తి కలిగించే నాటకాలకు అంకితమయ్యే కోట్లమంది ప్రేక్షకులు ఇప్పుడు టి.వి.వార్తలను గుడ్లప్పగించి చూస్తున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోననే ఆసక్తితో ఓ సినిమాలాగా తిలకిస్తున్నారు. ప్రసార సాధనాల వారు కూడా వ్యాపారానికి బాగా పనికివచ్చే అద్భుత అవకాశంగా భావించి ఒకళ్లను మించి మరొకళ్లు పోటీపడుతున్నారు. పాఠకులకు, ప్రేక్షకులకు ఉత్కంఠ కలిగించటం తప్ప తహల్కా ఉదంతానికి మరో ప్రయోజనం లేనట్లు భావిస్తున్నారు. లేదంటే ఇదేదో రాజకీయ క్రీడగా భావించి ఈసారి ఎవరు గెలుస్తారు, ఎవరెవరు గద్దెనెక్కుతారు, ఎవరు ఓటమిపాలవుతారు, ఎవరికి ఉద్వాసనలు పలుకుతారు, ఎవరికి సంపాదించే అవకాశం దక్కుతుంది, ఎవరు నిరాశతో కుంగిపోతారు– వంటి కథనాలతో వాటినే సమస్యలుగా చిత్రిస్తున్నారు. తహల్కా ఉదంతంలో కాంగ్రెస్ పార్టీ రహస్య హస్తం ఉందా? లేదా? ఎన్.డి.ఎ. కూటమిలో అంతర్గత పోరాటప్రభావం ఉందా? అనే వాటికి ప్రాధాన్యమిస్తున్నారు. బోఫోర్సు కుంభకోణం బయటపడ్డప్పుడు కూడా రాజకీయ వ్యవస్థ, పత్రికా ప్రపంచం ఇదేవిధంగా వ్యవహరించాయి. అదేదో అధికార పక్షాన్ని ఇరుకున పెట్టడానికి, ప్రతిపక్షాలను గద్దెనెక్కించటానికి మహత్తర అవకాశంగా భావించారు తప్ప 'కుళ్లిన రాజకీయాన్ని ప్రక్షాళన చేయటం ఎలా' అనే అంశం మీద దృష్టి సారించలేదు. ఆ తరవాత 14 సంవత్సరాలలో ఎనిమిది ప్రభుత్వాలు మారాయి. కాని ఇప్పటికీ ఆనాడు లంచం తిన్న ఒక్కళ్లకు కూడా శిక్ష పడలేదు. అంతకుమించి వ్యవస్థ ప్రక్షాళనకు ఒక్క చర్య కూడా చేపట్టలేదు. ఫలితంగా అవినీతి ఆనాటికంటే ఇప్పుడు మరెన్నో రెట్లు పెరిగిపోతోంది. దాదాపు ప్రతి ప్రభుత్వంలో, ప్రతిరాష్ట్రంలో, జాతీయస్థాయిలో అంతులేని అవినీతి ఉందని అందరికీ తెలుసు. కేంద్రంలో రక్షణ కొనుగోళ్లలో కమీషన్ల ద్వారా పెద్దఎత్తున డబ్బు సంపాదించటం సులువు, ఏటా దాదాపు పదిహేను వేల కోట్ల రూపాయల మొత్తంలో రక్షణ సామగ్రి, ఆయుధాల కొనుగోళ్లు ఉంటాయి కాబట్టి ఏడెనిమిది శాతం డబ్బు లంచాలుగా తీసుకున్నా వెయ్యి కోట్ల దాకా దక్కుతుంది. అలాగే రాష్ట్రాలలో విద్యుత్ ప్రాజెక్టులు, కొనుగోలు ఒప్పందాలు, గ్యాస్ కేటాయింపుల వంటి పనుల్లో పెద్దఎత్తున అవినీతికి పాల్పడటం చాలా తేలిక, రాజకీయ పార్టీలు, పదవులలో ఉన్నవాళ్లు, పత్రికలు ఆలోచించవలసింది గెలుపు, ఓటముల గురించి కాదు. ఇప్పుడీ సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుని

జాతీని ఈ అవినీతి కూపంలోంచి బయటపడెయ్యటం ఎలా అన్నది మనముందున్న సమస్య. దేశం మొత్తంలో ఓ అయిదేళ్ల కాలంలో దాదాపు ఏడువేల కోట్ల రూపాయల వరకు వివిధ స్థాయుల్లో ఎన్నికలకు ఖర్చు చేస్తున్నారని అంచనా. ఈ ఖర్చు అమెరికా లాంటి అత్యంత సంపన్న దేశంలో పెట్టే ఎన్నికల ఖర్చుకు సమానం. నిరుడు అమెరికా అధ్యక్ష పదవికి, జాతీయ స్థాయిలో సభ అయిన ప్రతినిధుల సభకు, ఎగువ సభ అయిన సెనెట్‌లో మూడోవంతు సభ్యులకు, చాలా రాష్ట్రాలలో గవర్నర్ల పదవులకు, రాష్ట్రాల చట్టసభలకు ఇతర సంస్థలకు జరిగిన ఎన్నికల్లో 300 కోట్ల డాలర్లు ఖర్చయిందని అంచనా. అందులో దాదాపు సగం ఎన్నికల ప్రచారంతో నిమిత్తం లేకుండా ఎన్నో సంస్థలు తమ భావాలను, విధానాలను ప్రచారం చేసుకోవటానికి టి.వి.ల ప్రకటనలకు పెట్టిన ఖర్చు, అది మినహాయిస్తే ఎన్నికల కోసం పెట్టిన ఖర్చు దాదాపు 150 కోట్ల డాలర్లు. అది రూపాయల్లో మన దేశంలో ఎన్నికల ఖర్చుకు సమానం! అయితే ఈ రెండు దేశాల మధ్య రెండు ప్రధానమైన తేడాలున్నాయి. మొదటిది, ఆ దేశంలో వసూలుచేసే ప్రతి డాలరుకు లెక్కలుంటాయి. ప్రతి విరాళానికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలి. అలా బయటపెట్టకపోతే తీవ్ర శిక్షలుంటాయి. మనదేశంలో ఈ వసూళ్లన్నీ రహస్యంగా జరిగేవే! రెండోది, అమెరికాలో పెట్టే ఎన్నికల ఖర్చంతా నిజంగా ప్రచారానికి, ఎన్నికల సర్వేలకు, వ్యూహరచనకు ఉపయోగపడుతుంది. 70శాతం ఖర్చు కేవలం టి.వి.లో ప్రకటనలకే సరిపోతుంది. మనదేశంలో దాదాపు 80 శాతంపైగా ఓట్లు కొనడానికి, సారాయి పోయించటానికి, ఎన్నికల నిర్వహణలో పాత్ర ఉన్న ఉద్యోగులకు, పోలీసులకు లంచాలివ్వటానికి, కిరాయి గూండాలను పెట్టుకోవటానికి, దొంగ ఓట్లు వేయించటానికి ఖర్చవుతుంది. ఒక డబ్బు మొత్తం చూస్తే రెండు దేశాల్లో ఖర్చు సమానమేననిపించినా వాస్తవానికి మన ఖర్చు చాలా ఎక్కువ. అయినా ఆ ఖర్చుకు లెక్కలు లేవు; ఆ వసూళ్ల వివరాలు మనకు తెలియదు; ఆ వ్యయంలో అధిక భాగం అక్రమంగా ఓట్లు దండుకోవటం కోసం జరిగేదే! మరలాంటప్పుడు అవినీతి లేకుండా వ్యవస్థ ఎలా నడుస్తుంది? రాజకీయంలో కోటి రూపాయలు పెట్టుబడి పెడితే కనీసం పదికోట్లు ఆదాయం రావాలి. లేకపోతే బండి నడవదు. పెట్టిన ఖర్చు, పడ్డశ్రమ, కోల్పోయిన కాలం, తీసుకున్న రిస్కు, పదవివచ్చాక దర్బారు నడపటానికి, వంధిమాగధుల్ని పోషించటానికి అయ్యే ఖర్చు కుటుంబానికి కావలసిన సరంజామా, వచ్చే ఎన్నికలకు కావలసిన పెట్టుబడి, కొన్ని తరాలపాటు దరిద్రం దరిదాపులకు కూడా రాకుండా ఉండటానికి

కూడబెట్టాల్సిన మొత్తం ఇవన్నీ కలిపితే భారి రాబడి అవసరం. ఇందులో కొంత డబ్బు పైస్థాయిలో రక్షణ ఒప్పందాలలో, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలలో, ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టులలో, పెద్ద పెద్ద కాంట్రాక్టులలో ముడుతుంది. మిగిలిన మొత్తాన్ని రోజువారీగా కోట్ల మంది ప్రజల నుంచి లంచాల రూపంలో వసూలు చేయాలి. అందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించాలి. నిష్పత్తి ప్రకారం చూస్తే ప్రతి రాజకీయ నాయకుడికి సగటున దాదాపు నాలుగువేలమంది ఉద్యోగులున్నారు. వాళు ,, ప్రతి ప్రభుత్వ సేవకు మన దగ్గర లంచం గుంజాలి. ప్రతి ఉద్యోగి తలాకాస్త వెనకేసుకున్నా వసూలు కావలసిన మొత్తం మరింత భారీగా పెరుగుతుంది. ఎన్నికలలో ఎలా అవకతవకలున్నంత కాలం నిజాయతీపరులు రాజకీయాల్లో ఇమడటం అసాధ్యమవుతుంది. ఇంకా ఇప్పటికీ రాజకీయాల్లో కొద్దిమంది నిజాయతీపరులున్నారు. వాళ్లెంత పళ్లబిగువుమీద, ఎంత కష్టంతో రాజకీయాన్ని నడుపుతున్నారో తెలుసుకుంటే గుండె అవిసిపోతుంది. అవినీతి లేకుండా అధికారంలో మనగలగటం అసాధ్యమయిన పరిస్థితుల్ని మనం సృష్టించుకున్నాం. అలాంటప్పుడు ఈ అవినీతిని చూసి ఆశ్చర్యాన్ని అభినయించటం నిరర్థకం. ఎన్నికల సమూల ప్రక్షాళనే ఈ అవినీతి అంతానికి ప్రథమ సోపానం కావాలి. ఓటర్ల జాబితాలో అవకతవకలు లేకుండా పోస్టాఫీసుల ద్వారా సులభంగా నమోదు చేయించుకునే అవకాశం; దొంగ ఓట్లు, రిగ్గింగు లేకుండా పకడ్బందీగా అమలయ్యే ఓటర్ల గుర్తింపు కార్డుల పథకం; నేరమయ రాజకీయాలను అంతం చేసే చట్టపరమయిన ఏర్పాట్లు ఎన్నికల కోసం వసూలుచేసే ప్రతిరూపాయి గురించి వివరాలు విధిగా బయటపెట్టేలా నిబంధనలు, రహస్యంగా వసూళ్లు చేసినా, అక్రమంగా ఖర్చుపెట్టినా తీవ్రంగా శిక్షించే చట్టం– ఇవన్నీ మన వ్యవస్థను ప్రక్షాళన చేయటానికి అవసరం. వీటితోపాటు నియోజకవర్గంలో ఏదో విధంగా మరికొన్ని ఓట్లు దండుకుని ఒక్క ఓటు మెజారిటీతోనయినా గెలిస్తే పదవులు వరిస్తాయని ఊరించే బ్రిటిష్, అమెరికా ఎన్నికల పద్ధతి మారాలి. దామాషా పద్ధతిని, ప్రస్తుతమున్న గెలుపుగుర్రం పద్ధతితో కలిపి నిజాయతీగా గెలిచే అవకాశం కల్పించాలి. అలాగే రాష్ట్రాలలో ప్రభుత్వాల ఎన్నిక తీరు గురించి ఆలోచించాలి. ఎన్నో భాషలు, వైరుధ్యాలు, వైవిధ్యం ఉన్న దేశంలో జాతీయస్థాయిలో పార్లమెంటుకు జవాబుదారీగా ఉండి మనగలిగే క్యాబినేట్ వ్యవస్థ సముచితం. రాష్ట్రస్థాయిలో చట్టసభ, ప్రభుత్వం కలిసిపోవటంతో అవినీతి అంతు లేకుండాపోతుంది. కాబట్టి రాష్ట్రాలలో,స్థానిక ప్రభుత్వాలలో అధికారాల విభజన చేపట్టి ప్రత్యక్షంగా ప్రభుత్వాన్ని ఎన్నుకునే ఏర్పాట్లు

చేయాలి. లేదా ఇజ్రాయెల్ పద్ధతిలో ప్రత్యక్షంగా ప్రభుత్వాధినేతనెన్నుకుని, ప్రభుత్వం చట్టసభకు జవాబుదారీగా ఉండేలా ఏర్పాటు చేయాలి. దాంతోపాటు అధికార వికేంద్రీకరణ, పాలనలో దాపరికం లేకుండా ప్రజలందరికీ సమాచార హక్కు, తప్పుచేసిన వారికి సత్వరం శిక్ష పడేలా న్యాయవ్యవస్థలో సంస్కరణలు, నేరపరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా స్వతంత్ర ప్రతిపత్తి- ఇవన్నీ చేపట్టినవాడు అవినీతిని కచ్చితంగా ఎదుర్కోగలుగుతాం.

## రోగానికి తగిన చికిత్స

అవినీతి ప్రత్యేకంగా మన దేశానికి మాత్రమే పట్టిన గ్రహణం కాదు. అదేవిధంగా చికిత్స లేని రోగమూ కాదు. ప్రపంచంలో అన్ని దేశాలు ఏదో ఒక దశలో అవినీతి రుగ్మతకు గురయ్యాయి. సావధానంగా, విచక్షణతో తగిన ఏర్పాట్లు చేసుకోవటం వల్ల, కావలసిన సంస్కరణల్ని చేపట్టడంవల్ల అవినీతిని చాలావరకు అదుపు చేయడం సాధ్యమే. ప్రస్తుతం దేశంలో తలెత్తిన సంక్షోభం వల్ల కొన్ని అధికార పీఠాలు కదలవచ్చు. కొన్ని ఆశాసౌధాలు కుప్పకూలవచ్చు కొందరి ఆశలు మళ్లీ చిగురించవచ్చు. కొందరికి కష్టంగాను, మరికొందరికి ఇష్టంగాను అనిపించవచ్చు. కాని ఈ దేశ ప్రజలకు, ఈ జాతిలో నిజమైన సార్వభౌములకు ఈ అధికార క్రీడలపై మీమాంస అనవసరం. ఇప్పుడు కావలసింది వ్యవస్థ ప్రక్షాళన. అన్ని పార్టీలు ఒకే తానులో ముక్కలయినప్పుడు ఎవరొస్తారు. ఎవరు పోతారు అనేది ఆలోచించడం అసంబద్ధమే అవుతుంది. నిజంగా నాయకత్వ పటిమ, జాతి భవిష్యత్తు పట్ల కొంచెమైనా మమకారం ఇంకా మిగిలి ఉంటే ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకురాలు తక్షణమే ఎన్నికల ప్రక్షాళనకు, వ్యవస్థ సంస్కరణకు నడుం కట్టాలి. నటన మాని, ప్రజల ముందు వినమ్రంగా తలవంచి వాస్తవాలను వెల్లడించాలి. గత వైఫల్యాలకు క్షమాపణ కోరి, సరైన చర్యలు చేపడితే దేశప్రజలు కచ్చితంగా ఆదరించి అక్కున చేర్చుకుంటారు. మన జాతిలో ఇంకా జవసత్వాలు మిగిలి ఉన్నాయి. ప్రజల్లో ఎంతో నిజాయతీ, నిబ్బరం ఉన్నాయి. యువతలో ఆదర్శం, ఆవేశం చచ్చిపోలేదు. ఇబ్బందల్లా ఏమంటే పరిష్కారాలు చూపవలసిన రాజకీయం మనకు అసలు సమస్యగా తయారయింది. ఆ రాజకీయాన్ని ప్రక్షాళన చేస్తే మన సమాజం సులభంగా ఆటుపోట్లకు తట్టుకుని గర్వించే దేశాన్ని నిర్మించుకోగలదు.

* * *

# అవినీతికి అడ్డుకట్ట వేసేదెలా?

## జూలై 18, 2005

ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఇటీవల జి-8 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు బ్రిటన్ వెళ్లినప్పుడు అవినీతి గురించి ప్రస్తావించారు. ఆర్థిక సంస్కరణల కారణంగా అవినీతి తగ్గిందని ఆయన అన్నారు. ఇది సరైన వాదనేనా? దీన్ని సమర్థించగలమా? ఇంతకీ అవినీతి పెరుగుతోందా, తరుగుతోందా? అవినీతి పూర్తిగా నిర్మూలించకపోయినా, కనీస స్థాయికైనా తగ్గించగలమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించవవలసి ఉంది.

**కారణాలు...**

అవినీతిని అంచనావేసి, కచ్చితమైన నిర్ణయాలకు రావడం సాధ్యమే. కొన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణల ప్రభావాన్ని అవగతం చేసుకోవడానికి మన అనుభవం, లోకజ్ఞానం తోడ్పడతాయి. టెలికాం రంగాన్ని తీసుకొందాం. దశాబ్దం క్రితం వరకూ టెలిఫోన్ కనెక్షన్ తీసుకోవడమన్నది వ్యయ ప్రయాసలతో కూడుకొన్న పని. ప్రభుత్వ గుత్తాధిపత్యం, లైసెన్సులు కోటాలపై ఆధారపడిన వ్యవస్థవల్ల డిమాండ్‌కు సరిపడా సరఫరా ఉండేది కాదు. కొరతగా ఉన్న వస్తు సేవల కోసం విపరీతమైన పోటీ ఏర్పడినప్పుడు అవినీతి అనివార్యం. టెలిఫోన్ కనెక్షన్లు, సిమెంటు పర్మిట్లు, చక్కెర కోటాలు, ఉక్కుపై నియంత్రణలు, లైసెన్సుల జారీ తీరుతెన్నులు దేశవ్యాప్తంగా అవినీతి పాతుకుపోవడానికి కారణమయ్యాయి. దేశ ప్రజల ఆర్థిక స్వేచ్ఛ ఇతరుల దయాభిక్షపై ఆధారపడే స్థాయికి దిగజారింది. తరవాత పరిస్థితి మారింది. పోటీ విపరీతంగా పెరిగింది. ఎన్నో అవకాశాలు విచ్చుకున్నాయి. కొత్త సాంకేతిక ప్రక్రియలు తెరమీదికి వచ్చాయి. దాంతో ఉత్పత్తి పెరిగింది. వ్యయం తగ్గింది. నాణ్యత మెరుగైంది. అవినీతికి అడ్డుకట్టపడింది. నేటి యువతరం నమ్మకపోవచ్చు కానీ, మోటారుకారు అంటే గతంలో గగన కుసుమమే. ఒకేసారి భారీగా డబ్బు కట్టాల్సి వచ్చేది.

ప్రత్యక్ష పోటీకి అవకాశం కల్పించని రంగాల్లో కూడా సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకతవల్ల పరిస్థితులు మెరుగుపడ్డాయి. రైల్వే రిజర్వేషన్లు ఇందుకు మంచి ఉదాహరణ. ఒకప్పుడు బెర్తు కావలంటే సంబంధిత అధికారి చేయి తడపాల్సి వచ్చేది.

ఆన్‌లైన్ కంప్యూటరైజ్డ్ రిజర్వేషన్‌తో అవినీతి చాలావరకు తగ్గింది. అనేక రాష్ట్రాల్లో జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, భూమి రికార్డుల విషయంలో కంప్యూటరీకరణవల్ల ప్రజలకు అనవసర కష్టనష్టాలు తప్పాయి. అవినీతికీ కళ్ళెం పడింది. 'పాన్'ను ప్రవేశపెట్టడంతో పాటు పన్నుల విధానాన్ని సరళతరం చేసిన దరిమిలా ఆదాయ పన్ను శాఖలో అవినీతి గణనీయంగా తగ్గింది. ప్రత్యేకించి పాస్‌పోర్టుల జారీ ప్రక్రియ అద్భుతంగా మెరుగుపడింది. ప్రస్తుతం మనదేశంలోని చాలా ప్రాంతాల్లో సహేతుకమైన గడువులోగా పాస్‌పోర్టులు జారీ చేస్తున్నారు. వేగవంతమైన ప్రక్రియలు, దరఖాస్తు ఫారాలను సునాయసంగా అందుబాటులో ఉంచటం, ఆన్‌లైన్ పర్యవేక్షణ కారణంగా అవినీతి, జాప్యం బాగా తగ్గాయి. ఆర్థిక సరళీకరణ, అమరికలు లేని విధానాలవల్ల ఒనగూడిన ప్రయోజనాలివి. ఈ విధానాలవల్ల కొన్ని రంగాల్లో అవినీతి చాలా తగ్గింది. పరిస్థితులు మెరుగుపడ్డాయి. ప్రజా ప్రయోజనాల పరిరక్షణకు మరిన్ని చర్యలు తీసుకొంటే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుంది. వ్యాట్‌ను ప్రవేశపెట్టడంతోపాటు సరళీకృత, పారదర్శక విధానాలను అనుసరించడం వల్ల, ఆన్‌లైన్ కంప్యూటరైజేషన్ వల్లపరోక్ష పన్నుల వసూళ్లు తప్పనిసరిగా మెరుగుపడతాయి. అధికారాలను వికేంద్రీకరిస్తే అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. అవినీతి తగ్గుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన సమాచార హక్కు చట్టం పారదర్శకతను పెంపొందిస్తుంది. నిరంకుశత్వానికి, అవినీతికి అడ్డుకట్ట వేస్తుంది.

ఇదంతా చూస్తుంటే అంతా బాగానే ఉందని, నిరాశ నిస్పృహలకు లోనయ్యే పనే లేదని అనిపిస్తుంది. అంత మాత్రాన దిలాసాగా  ఉండే పరిస్థితే లేదు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టి.ఐ.) విడుదల చేసిన నీతిమంతమైన దేశాల చిట్టాలో మనం ఇప్పటికీ అడుగునే ఉన్నాం. అనేక రంగాల్లో అవినీతి రాజ్యమేలుతోందని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ ఇటీవల నిర్వహించిన టి.ఐ. ఇండియా సర్వేలో వెల్లడైంది. ఈ సర్వే కోసం ఆరు ఆవశ్యక సేవా రంగాలను, అయిదు మౌలిక సేవా రంగాలను ఎంచుకొన్నారు. సర్వే జరిపిన ఆవశ్యక సేవారంగాల్లో గ్రామీణ పరపతి సంస్థలు, ఆదాయం పన్ను విభాగం, మునిసిపాలిటీలు, న్యాయవ్యవస్థ, రెవెన్యూ, పోలీసుశాఖ ఉన్నాయి. మౌలిక సేవారంగాల్లో పాఠశాలలు, నీటి సరఫరా, ప్రజా పంపిణీ, విద్యుత్తు, ప్రభుత్వ ఆస్పత్రుల స్థితిగతుల్ని పరిశీలించారు. సర్వే ఫలితాలు ఆసక్తికరంగా  ఉన్నాయి. మౌలిక సేవారంగాల్లో కన్నా ఆవశ్యక సేవారంగాల్లో అవినీతి అధికంగా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. ఇది మొట్టమొదట గమనించాల్సిన ముఖ్యమైన విషయం. పూర్తిగా ప్రభుత్వ

అధీనంలో ఉన్న మునిసిపాలిటీలు, రెవెన్యూ, పోలీసు వ్యవస్థలు అవినీతికి ఆలవాలమైనట్లు తేలింది. ప్రభుత్వ గుత్తాధిపత్యం అంతగా లేని గ్రామీణ పరపతి సంస్థల్లో మాత్రం అవినీతి తక్కువగా నమోదైంది. మౌలిక రంగాల్లో తీసుకొంటే- ప్రభుత్వ రంగంలోని పాఠశాలలు, నీటి సరఫరా, ప్రజా పంపిణీ వ్యవస్థలు, ఆసుపత్రులు క్రమేపీ ప్రజానీకానికి దూరమవుతున్నాయి. ఖర్చు భరించగలిగిన వారంతా ప్రైవేటు రంగంవైపు మొగ్గుచూపుతున్నారు. అందువల్ల ఈ రంగాల్లో అవినీతి కొంత తక్కువగా ఉంది. విద్యుత్ రంగం మాత్రం ఇందుకు మినహాయింపు. ప్రభుత్వ గుత్తాధిపత్యంలోనే కొనసాగుతున్న ఈ రంగంలో అవినీతి 'షాక్' కొడుతోంది. ఆరోగ్య రంగం అనారోగ్యంతో కునారిల్లుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులైనా, ప్రైవేటు ఆసుపత్రులైనా ఒకటే. రోగుల్లో దాదాపు సగంమంది నేటికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స పొందుతున్నారు. దాంతో సర్కారు దవాఖానాలకు డబ్బు జబ్బు పట్టుకొంది. మౌలిక సేవారంగాల్లో అవినీతి కూపంలో కూరుకుపోయిన వాటిలో ప్రభుత్వ ఆసుపత్రులదే అగ్రస్థానం.

## తారతమ్యాలు...

అవినీతి విషయంలో వివిధ రాష్ట్రాల మధ్య తేడాలు ఉండటం మనం గమనించాల్సిన రెండో అంశం. ఎన్నో వైవిధ్యాలు, వైరుధ్యాలతోకూడుకొన్న దేశం మనది. వివిధ విషయాల్లో సగటు తీసుకొని దేశమంతటికీ దాన్ని వర్తింపజేస్తుంటాం. అన్ని సందర్భాల్లో అది సరికాదు. అవినీతి విషయంలో వివిధ రాష్ట్రాల మధ్యగల అంతరాలు గమనార్హమైనవి. కేరళ, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్‌లలో అవినీతి తక్కువగా ఉంటే- బీహార్, జమ్మూకాశ్మీర్‌లలో అది వేళ్లూనుకుపోయి ఉంది. అవినీతిలో ఎవరి స్థానం ఏమిటన్నది కచ్చితంగా అంచనా వేయడం కష్టం. కానీ అవినీతికి, పరిపాలన తీరుకు మధ్య సంబంధం ఉందని స్పష్టమవుతోంది. అధికారాల వికేంద్రీకరణ, మీడియా క్రియాశీలత, పౌరుల చైతన్యం, పటిష్టమైన అవినీతి నిరోధక యంత్రాంగం, వివేకవంతమైన నాయకత్వం ఉన్నచోట అవినీతికి తావుండదు. అధికారాలన్నీ కొందరి గుప్పిట్లోనే కేంద్రీకృతం కావడం, చట్టం చట్టుబండలైపోవడం, స్థానిక మీడియా పెద్దగా పట్టించుకొనకపోవడం, నీతి, రీతిలేని పరిపాలన సాగడం- అవినీతి తోడ్పడతాయి.

అవినీతి కార్యకలాపాల ద్వారా ప్రజాసేవలకులు అపార సంపదను కూడబెట్టుకొంటున్నారు. మనం పరిశీలించాల్సిన మూడో అంశమిది. టి.ఐ.-సి.ఎం.ఎస్.సర్వే ప్రకారం పదకొండు సేవారంగాల్లో కనీసం రూ॥21,000 కోట్ల మేరకు అవినీతి చోటుచేసుకొంది. దేశంలోఅన్ని రంగాల్లో అవినీతిని పరిగణనలోకి తీసుకొంటే, అంతకన్నా పదిరెట్లు ఉంటుంది. పరోక్ష పన్నులు అవినీతికి అలంబనగా మారాయి. వీటిలో రాష్ట్రాల స్థాయిలో అమ్మకం పన్ను, ఎక్సైజ్ సుంకం; యూనియన్ స్థాయిలో కేంద్ర ఎక్సైజ్ సుంకం, కస్టమ్స్ సుంకం ఉన్నాయి. మనదేశంలో రోజుకు 30 లక్షల ట్రక్కులు వస్తు సామగ్రిని రవాణా చేస్తుంటాయి. చెక్‌పోస్టులు, ఆక్ట్రాయ్, ఎంట్రీ పన్నుల పుణ్యమా అని ఒక్కో ట్రక్కువాలా రోజుకు కనీసం 200 రూపాయలు లంచం ఇచ్చుకోవలసి వస్తుంది. దీని ప్రకారం ఈ ఒక్క రంగం నుంచే ఏడాదికి రూ॥22 వేల కోట్ల వరకు అవినీతిపరుల జేబుల్లోకి చేరుకొంటున్నాయి. అధికారుల బదిలీలు, కాంట్రాక్టులు, టెండర్లు, మౌలికరంగ ప్రాజెక్టుల నిర్మాణం, అధికార దుర్వినియోగం- అవినీతికి కారణభూతమవుతున్నాయి.

## రాజకీయ సంస్కరణలు కీలకం

ఇదంతా గమనించినప్పుడు రెండు అంశాలు స్పష్టమవుతాయి. పోటీ, విస్తృత అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకత ఉన్నచోట అవినీతి తగ్గుతోంది. అదే సమయంలో - ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని తొలగించలేని రంగాల్లో అవినీతి పెచ్చుమీరుతోంది. ఇది మొదటి అంశం. అక్రమ ధనమే మన రాజకీయ వ్యవస్థకు ఇంధనంగా కొనసాగుతోంది. దాని పర్యవసానమే అవినీతి ప్రజ్వలనం. ఇది రెండో అంశం. సరళీకరణవల్ల ఆర్థిక రంగంలో అవినీతికి అడ్డుకట్ట పడినప్పటికీ, ఇతర రంగాలోల అది ప్రమాదకర స్థాయిలో పెచ్చరిల్లుతోంది. అది రాజకీయ ప్రేరితమైనది. రాజకీయ సంస్కరణలతోనే దాన్ని నిరోధించాల్సి ఉంటుంది. అవినీతిని గణనీయంగా తగ్గించవచ్చు. అందుకు గట్టి కృషి, స్థిర సంకల్పం, అన్నింటినీ మించి దీర్ఘకాల ప్రభావం చూపగల రాజకీయ సంస్కరణలు ముఖ్యం.

* * *

# పటుతర చట్టంతోనే అవినీతికి పగ్గం

## మే 15, 2006

కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల అవినీతి సర్వసాధారణ అంశంగా తయారవుతోంది. హర్యానాలో ఓ ప్రముఖ రాజకీయ నాయకుడు 1500 కోట్ల రూపాయల మేరకు అక్రమంగా వెనకేసుకున్నాడన్న ఆరోపణలు ఇటీవల బలంగా వినిపించాయి. ఆయన ఇంటిపై సి.బి.ఐ. దాడులూ జరిగాయి. రాజకీయ విశ్లేషకులు కానీ, ప్రసార సాధనాలు కానీ ఈ అంశంపై అంత ఆసక్తి చూపలేదు. రాజకీయ నాయకులంటేనే ఇప్పుడు చాలామందిలో సదభిప్రాయం లేదు. నేతలు ఏనాటికీ తమ జేబులు నింపుకోవడం కోసమే పనిచేస్తారన్న భావనా ప్రజల్లో స్థిరపడుతోంది. బహుశా అందువల్లేనేమో... హర్యానా నేత అవినీతి అంశం పెద్ద చర్చనీయాంశం కాలేకపోయింది. అవినీతికి సంబంధించి వినపడే కథనాల్లో చాలావరకు ఉన్నదాన్ని ఎక్కువ చేసి చెప్పేధోరణే వ్యక్తమవుతోందన్నది నా అభిప్రాయం. ఎవరైనా ఓ వ్యక్తిపై అవినీతి ఆరోపణలు వస్తే... అవినీతి జరిగిందని చెబుతున్న దాంట్లో కనీసం 20 శాతం మొత్తం అతనికి అంది ఉండవచ్చన్నది నా భావన.

### నీతి నిజాయతీలకు చోటేదీ?

సమాజంలోని అన్ని పార్శ్వాల్లోకి అవినీతి పాకిపోయిందన్న వాస్తవాన్ని మాత్రం అందరం ఒప్పుకోక తప్పదు. ప్రభుత్వ కార్యాలయాల నిబద్ధత ప్రాతిపదికగా తీసుకొని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇటీవల ప్రకటించిన అవినీతి పట్టికలో భారత్ అట్టడుగు స్థానాల్లో ఉంది. దేశంలోని పది రంగాల్లో చిన్న స్థాయిల్లో జరిగే అవినీతి సంవత్సరానికి 21,000 కోట్ల రూపాయల మేర ఉంటుందని 2005కు గాను సి.ఎం.ఎస్.-టి.ఐ సంస్థ జరిపిన ఆధ్యయనం అంచనా వేసింది. చిన్న స్థాయుల్లో అవినీతే ఇంత మొత్తంలో ఉంటే ఇక... దేశంలోని అన్ని రంగాల్లో సకల రకాలుగా జరిగే అవినీతి అందుకు కనీసం పదిరెట్లు ఎక్కువే ఉంటుంది. రోడ్డు రవాణా వ్యవస్థలో 30 లక్షల ట్రక్కుల ఉదంతాన్ని ఇందుకు ఉదాహరణగా చూపవచ్చు చెక్ పోస్టుల దగ్గర, ఆక్ట్రాయ్ కేంద్రాల వద్ద, మిగిలిన అన్ని చోట్ల కలిపి దేశంలో ప్రతి రోజు ఒక్కో ట్రక్కు నుంచి

200 రూపాయల లంచం రూపంలో వసూలవుతోందన్నది ఓ అంచనా. కేవలం ట్రక్కుల రవాణాలో చిన్నస్థాయిలో చోటుచేసుకుంటున్న ఈ అవినీతి విలువే ఏడాదికి 20,000 కోట్లుగా తేలుతోంది. దీని ఆధారంగా మన దేశంలో జరిగే అవినీతి స్థాయిని లెక్క కడితే– ఏడాదికి 200,000 కోట్ల రూపాయలు అక్రమార్కుల జేబుల పాలవుతున్నాయన్నది తేటతెల్లమవుతుంది.

హర్యానా రాజకీయ ప్రముఖుడు 1500 కోట్ల రూపాయలను అక్రమంగా వెనకేసుకున్నాడంటే చాలామంది మరో మాట లేకుండా నమ్మే పరిస్థితే ప్రస్తుతం ఉంది. కానీ ఆ నాయకుడి కుటుంబం మరీ ఇంత అమాయకంగా ఎలా దొరికి పోయిందబ్బా అన్న విషయం మాత్రం ఎందరినో ఆశ్చర్యానికి లోను చేస్తోంది. దీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉంటున్న ఎంతోమంది నేతలు అక్రమ మార్గాల్లో చాలినంత సొమ్ము వెనకేసుకున్నారన్నది నిజం. కానీ వారెప్పుడూ దొరకలేదు. ఎన్నికల నామినేషన్ పత్రాల్లో నాయకులు వెల్లడిస్తున్న ఆస్తుల వివరాలకు, వారు అనుభవిస్తున్న జీవనశైలికి చాలా పెద్ద అంతరమే కనిపిస్తుంది. సి.బి.ఐ. దాడుల వల్ల అంతిమంగా ఒరిగేదేమీ ఉండదని, అవినీతి నాయకులంతా వివిధ మార్గాల ద్వారా నిర్దోషులుగా బయటపడగలరని నమ్మేవారి సంఖ్య ఎక్కువే ఉంది. ఎన్నికల్లో పోటీచేసేవారు తమ ఆస్తుల వివరాలను వెల్లడించాలంటూ 2002లో సుప్రీంకోర్టు జోక్యంతో అమల్లోకి వచ్చిన నిబంధన కొన్ని అసహజ పరిణామాలకు అంటుకట్టింది. ఎంతో డబ్బుందని, అవినీతిపరుడని ప్రజలందరికీ తెలిసిన నాయకులు– నామినేషన్ పత్రాల్లో వెల్లడిస్తున్న ఆదాయాలు, ఆస్తులు నామమాత్రంగా ఉంటున్నాయి. అదే సమయంలో న్యాయమైన మార్గాల్లో డబ్బు కూడబెట్టుకున్న నిజాయతీపరులైన రాజకీయ నాయకుల ఆస్తి వివరాలు మాత్రం ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్తులు, ఆదాయ వివరాల వెల్లడి మొత్తం ఓ ప్రహసనంగా మారిపోయింది. వాస్తవానికి మన సమాజంలో నిజాయతీ పరులైన అధికారులు, రాజకీయ నాయకులు ఎందరో ఉన్నారు. వీరందరినీ అవినీతిపరుల గాటన కట్టేస్తూ పోతే ఇక ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకమవుతుంది.

ఎన్నికల్లో నెగ్గేందుకు నిర్దేశిత పరిమితికి మించి ఖర్చుపెడుతున్న వారే నేడు ఎక్కడ చూసినా కనిపిస్తారు. అక్రమమార్గాల్లో ఓట్లను కొనుక్కోవడం కోసం, జనాన్ని మద్యం మత్తులో ముంచేందుకు, గూండాలను మేపేందుకు, అధికారులను లోబరచుకొనేందుకే ఈ లెక్కాపత్రాలు చూపని ఖర్చంతా సరిపోతోంది. పరిమితిలేని

ఖర్చు నేపథ్యంలో ఎన్నికల వ్యయాన్ని కచ్చితంగా లెక్కకట్టడం అసాధ్యంగా మారిపోయింది. దేశంలోని పార్టీలన్నీ అయిదు సంవత్సరాల కాలంలో ఎన్నికల్లో లెక్క చూపకుండా చేస్తున్న వ్యయం10,000 కోట్ల రూపాయల నుంచి 20,000కోట్ల రూపాయల వరకు ఉంటుందని విశ్వసనీయ అంచనాలు తెలుపుతున్నాయి. రాజకీయాలను ఓ వ్యాపారంగా పరిగణించే ధోరణే ఈ అపరిమిత ఖర్చుకు కారణం. అంతకు అంతా సంపాదించుకోవచ్చున్న ఆలోచనే వారిని అపరిమితమైన ఖర్చువైపు నడిపిస్తోంది. మితిమీరిన ఎన్నికల వ్యయం వల్ల అవినీతి తామర తంపగా పెరిగిపోతోంది. రాజకీయాల్లో చేసిన ఖర్చుకు తగిన ప్రతిఫలం ఉంటుందా లేదా అన్న విషయాన్ని ఊహించడం కష్టం. కాలం గడుస్తున్న కొద్దీ గెలవడంకోసం చేయాల్సిన ఖర్చు మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతూ ఉంటుంది. ఇంత అస్థిరమైన పరిస్థితుల్లో పెడుతున్న పెట్టుబడులకు భారీ రాబడులు రావాలని కోరుకోవడం సహజం. ఎన్నికల్లో గెలిచిన తరవాత చాలా పార్టీలకు తమ కార్యకర్తలకు 'భృతి' కల్పించాల్సిన బాధ్యత ఏర్పడుతుంది. ఇందుకోసం మళ్ళీ ప్రజాధనాన్నే కొల్ల గొడతారన్న విషయాన్ని వేరే చెప్పనవసరం లేదు. ప్రతిదానికీ కమిషన్లు పుచ్చుకునే దళారులు ఈ అవినీతి భూతాన్ని మరింత పెంచి పోషిస్తున్నారు. ఉద్యోగుల బదిలీల దగ్గర నుంచి, ఉ ద్యోగాలిప్పించడం వరకు ప్రతి పనికీ ఓ 'ధర' సిద్ధం చేసి పెట్టారు. ప్రజాస్వామ్య భారతంలో అవినీతి అంతా ఓ పద్ధతి ప్రకారం జరిగిపోతోంది. అవినీతి సర్వం వ్యవస్థీకృతమైపోయింది. అవినీతి జరిగే పద్ధతిలో మార్పులేకపోయినా గతానికీ ఇప్పటికీ ఉన్న తేడా అంతా ఒక్క 'ధర' విషయంలోనే. ఫలితంగా అవినీతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది.

పై పదవుల్లో ఉన్న తమ రాజకీయ గురువుల అనుగ్రహం పొందేందుకు ఛోటామోటా నాయకులు చేసే భారీ వ్యయమూ రాజకీయాల్లో అవినీతి మరింతగా వేళ్లూనుకొనేందుకు దోహదం చేస్తోంది. అధినాయకులు ప్రాపకం పొంది ఏదో ఒక పదవిని సంపాదించాక, దాని ఆధారంగా అప్పటివరకు పెట్టిన పెట్టుబడికి పదింతలు ఎక్కువగా రాబట్టుకునే దుస్సంస్కృతి ప్రబలిపోయింది. ఓ మున్సిపల్ చైర్మన్‌నో లేక ఓ ఎమ్మెల్యేనో పొగుడుతూ పత్రికల్లో ప్రకటనలు గుప్పించే నాయకుల తీరు కూడా ఇందుకు ఏమాత్రం భిన్నం కాదు. భారీవ్యయానికోర్చి వారు పత్రికా ప్రకటనలు ఇవ్వడానికి కారణం- భవిష్యత్తులో రెట్టింపు లాభాలను ఆశించేనన్నది విస్పష్టం.

రాజకీయాల్లో అవినీతి పోటీతత్వాన్ని మంటగలుపుతోంది. ప్రభుత్వ సేవలను కుంటుపడేలా చేస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలను హరించివేస్తోంది. ప్రజాజీవనాన్ని ఛిన్నాభిన్నం చేస్తోంది. ఆర్థిక పురోభివృద్ధికి పగ్గాలు వేస్తోంది. ఇలా...జాతి పురోగతిని దెబ్బతీస్తున్న అవినీతి భరతం పట్టాలంటే ఏంచేయాలి?

## ప్రభుత్వ వైఫల్యమే కారణం

పోటీతత్వం, అవకాశాల పరిధి విస్తృతమైన చోట అవినీతికి అడ్డుకట్ట పడుతుంది. టెలికాం రంగాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మలచుకుని వినియోగించుకోగలిగితే అవినీతి రహిత సమాజ స్థాపన సాధ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ రికార్డుల కంప్యూటరీకరణ ప్రారంభమైనా, భూముల రిజిస్ట్రేషన్‌లో అవినీతి తగ్గుముఖం పట్టలేదు. కానీ, ఇదే ప్రక్రియ మహారాష్ట్రలో విజయవంతమైంది. ఇటీవలి కాలంలో డ్రైవింగ్ లైసెన్సుల జారీ, రెన్యూవల్ విధానంలో అవినీతి ఉద్ధృతి తగ్గడానికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వినియోగించుకోగలగడమే కారణం. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని, తమదైన రీతిలో దౌర్జన్యకరమైన విధానాల ద్వారా న్యాయంచెప్పి, సొమ్ము చేసుకునే సాయుధ ముఠాలు న్యాయవ్యవస్థను ఇప్పటికే 'ప్రైవేటు'బాట పట్టిస్తున్నాయి. న్యాయానికి వెల గడుతున్న దుండగుల ఆగడాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాజకీయాలు భ్రష్టుపట్టడానికి, చట్టసభల్లోకి నేరస్తులు ప్రవేశించగలగడానికి కూడా ఈ రకమైన ప్రభుత్వ వైఫల్యాలే కారణమవుతున్నాయి. అందువల్ల, అవినీతి అంతానికి 'ప్రైవేటీకరణ' ఒక్కటే పరిష్కారం చూపలేదు. అవినీతిపరులు అక్రమమార్గాల్లో కూడబెట్టిన సొమ్ము, ఆస్తులు వారికి ఉపయోగపడకుండా చేయడం– ఈ సమస్యకు ఓ పరిష్కార మార్గం. పదవుల్లో ఉన్న వారు లంచాలు మరిగి సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని లా కమిషన్ తన 166వ నివేదిక (1999)లో సిఫారసు చేసింది. ఇటువంటిదే ఓ చటాన్ని జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం ఇటీవలే రూపొందించుకొంది. ఇలాంటి చట్టాలను సమర్ధవంతంగా అమలుచేయడం, బినామీ లావాదేవీలు చెల్లుబాటుగాని విధంగా కఠినతరమైన చర్యలు తీసుకోవడం ద్వారా అవినీతిపై ఉక్కుపాదం మోపవచ్చు ఉన్నంతలో సమాజం నుంచి అవినీతిని పారదోలేందుకు ఇది తేలికైన పరిష్కారమార్గం.

నీతిమంతులకు, నిజాయతీపరులకు మాత్రమే అందలం ఎక్కే అవకాశం కల్పించేందుకు వీలుగా ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్నా, రంగు మారిన రాజకీయాలను సన్మార్గం పట్టించాలన్నా మరెన్నో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అన్నిటికంటే ముందు– అవినీతిపరుల ఆటకట్టించేందుకు వారి ఆస్తులను జప్తు చేసేందుకు వీలుకల్పించే చట్టానికి రూపకల్పన చేయడం మన తక్షణ కర్తవ్యం. అందుకు ప్రభుత్వం వీలైనంత త్వరగా నడుం బిగించాలి.

* * *

# అవినీతి నిరోధక చట్టాలు పదును తేలాలి ఇకనైనా!

## జూన్ 2, 2003

ప్రపంచవ్యాప్తంగా సుప్రసిద్ధమైన ఒక పత్రిక కొన్ని సంవత్సరాల క్రితం ఓ సర్వే నిర్వహించింది. ఆ పత్రికవారు– చాలా దేశాలలో– కొంత డబ్బును అడ్రసు ఉన్న సంచులలో పెట్టి వివిధ బహిరంగ స్థలాలలో జారవిడిచారు. ప్రతి దేశంలోనూ అక్కడి కొనుగోలు శక్తినిబట్టి సుమారుగా సమానస్థాయిలో డబ్బును ఆ సంచులలో పెట్టారు. అంటే ఆ సంచులు దొరికినవారికి అన్ని దేశాలలోను సమాన ప్రలోభం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. భారత్‌లో అలా సంచులు దొరికిన వారిలో నూటికి 85 మందికి పైగా ఆ డబ్బును సంచిలో ఉన్న చిరునామాకు అందజేశారట! మన సమాజంలో అత్యధికులు నిజాయతీపరులని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ.

### వ్యవస్థాపరమైన మార్పుల ద్వారా సత్ఫలితాలు

మన దేశంలో అవినీతిని అంతం చేయాలంటే వ్యవస్థాగత మార్పులు చేపట్టాలని 'లోక్‌సత్తా' ఉద్యమం బలంగా వాదిస్తోంది. ఎందరో ఆలోచనాపరులు ఈ సంస్కరణలను బలపరుస్తున్నారు. ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నోచోట్ల గతంలో ఇంతకుమించిన అవినీతి కానవచ్చింది. అక్కడి నాయకత్వం ప్రజలనో, సంస్కృతినో, విలువలనో తప్పు పట్టకుండా వ్యవస్థాపరమయిన మార్పుల ద్వారా సత్ఫలితాలు సాధించింది. మనదేశంలో కూడా ఎన్నికల సమూల సంస్కరణలను, అధికార వికేంద్రీకరణను, న్యాయవ్యవస్థ సంస్కరణలను, జవాబుదారీతనాన్ని పెంచటం కోసం సంస్థాగత ఏర్పాట్లను సాధించాలి. ఈ సంస్కరణలు ఒక్క రోజులో సాధ్యమయ్యేవి కావు. ఇప్పటికే కొన్ని మంచి ఫలితాలు వస్తున్నమాట వాస్తవం. విధిగా ప్రజలముందు ఉంచాలనే నిబంధన వాస్తవరూపందాల్చింది. ఎన్నికల నిధుల వసూళ్లు, వాటి వినియోగం పారదర్శకంగా ఉండే విధంగా, అభ్యర్థులు ఎన్నికల ఖర్చును నిజాయతీగా సమకూర్చుకునేలా బిల్లు త్వరలో పార్లమెంటు ఆమోదాన్ని పొందబోతోంది. చట్టసభ సభ్యులలో 10 శాతం లోపే మంత్రులుగా ఉండాలనే నిబంధన రాబోతోంది. పార్టీ ఫిరాయింపులు జరిగినప్పుడు ఒకరు పార్టీ మార్చినా, కొందరు ఆ పనిచేసినా తేడా

లేకుండా చట్టసభ సభ్యత్వం రద్దయ్యేలా చట్టం రాబోతోంది. ఓటర్ల జాబితాలను పొందటానికి, పొరపాట్లను సవరించటానికి పోస్టాఫీసును కేంద్రంగా మార్చాలని 'లోక్‌సత్తా' చేసిన ప్రతిపాదన జాతీయస్థాయిలో త్వరలో వాస్తవ రూపం ధరించే సూచనలు కనపడుతున్నాయి. సంస్కరణలన్నీ అద్భుతంగా అమలవుతున్నాయని చెప్పలేంగానీ, కొన్ని లోపాలున్నా సంస్కరణల మార్గం సరయినదే. దాదాపు 20-25 ఏళ్లుగా ఇలాంటి మార్పులు కావాలని చాలామంది అభిలషిస్తున్నారు. నిపుణుల కమిటీలెన్నో నివేదికలనిచ్చాయి. అయినా ఇంతకాలం అవి అమలుకాలేదు. ప్రజాస్వామ్య ఉద్యమాలు విచక్షణతో, చిత్తశుద్ధితో, విషయపరిజ్ఞానంతో జనాన్ని సంఘటితం చేస్తూ ఒత్తిడి తీసుకురాగానే... చాలాకాలంగా అమలు జరగని సంస్కరణలన్నీ త్వరత్వరగా కార్యరూపం ధరిస్తున్నాయి. అంతమాత్రాన వ్యవస్థ బాగుపడుతుందని కాదు. ఈ మార్పులన్నీ అవసరమేగానీ, అవే చాలవు. ఇప్పుడు జగన్నాధ రథం కదిలింది. ఈ ప్రజాస్వామ్య సంస్కరణల రథాన్ని ఆపటం సాధ్యం కాదు. వచ్చే కొద్ది సంవత్సరాలలో మరెన్నో పెనుమార్పులను మనం చూడబోతున్నాం. ఎన్ని సంస్కరణలు సాధించినా అవినీతిని పూర్తిగా తుడిచిపెట్టటం అంతతేలిక కాదు. వ్యవస్థలో ప్రస్తుతం ఉన్న లోపాలవల్ల అవినీతి లేకుండా రాజకీయం, పాలన నడిచే పరిస్థితి లేదు. సరయిన ప్రజాస్వామ్య సంస్కరణలు చేపట్టడంవల్ల అవినీతి లేకుండా పాలన సాగించడం సుసాధ్యమవుతుంది. వ్యవస్థను సంస్కరించినా అవినీతికి ప్రలోభపడే వారిని పూర్తిగా తుడిచి పెట్టలేం. మంచి వ్యవస్థలో కూడా - అప్పనంగా ప్రజాధనం అందుతుంటే కాజేయాలనే తత్వంగలవారు ఎప్పుడూ ఉంటారు. నిజాయతీని గుర్తించి, గౌరవించినప్పుడు, అవినీతిని పసిగట్టి, శిక్షించినప్పుడు మాత్రమే వ్యవస్థ సజావుగా సాగుతుంది. అవినీతి, అక్రమం అదుపులో ఉన్న అన్ని సమాజాలలోను జరిగిందిదే.

అవినీతి స్థూలంగా రెండు రకాలు. లంచం ఇవ్వకపోతే అపారంగా కష్టనష్టాలు వాటిల్లుతాయనే భయంతో నూటికి 95 మంది ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. మిగిలిన అయిదు శాతం లలూచీపడి ప్రజాధనాన్ని మింగుతున్నారు. ఓపెద్ద కాంట్రాక్టులో టెండరు విలువను అపరిమితంగా పెంచటమో, దొంగ లెక్కలు చూపి ఖజానాను దోచుకోవటమో, కొనుగోళ్ల కుంభకోణం ద్వారా ఎక్కువ ఖరీదుకు నాసిరకం వస్తువులను సరఫరా చేయటమో, కట్టడాలలో ప్రమాణాలను తగ్గించి అక్రమ లాభాలు ఆర్జించటమో- ఇవన్నీ ఇలాంటి లాలూచీవల్ల జరిగే కుంభకోణాలే. లంచం పుచ్చుకున్న

వాడిని, లాలూచీ పడినవాడిని, లంచం ఇచ్చి ఖజానాను దోచుకున్న వాడిని శిక్షించినప్పుడే అవినీతిని ఆపగలం. మనదేశంలో పేరుకు అవినీతి నిరోధక శాఖ ఉన్నా, అవినీతి ఆరోపణలపై పరిశోధనకు ఆ శాఖకు అనుమతులివ్వరు. ఎన్నో నిపుణుల సంఘాలు నివేదికలు సమర్పించినా, అవినీతిని అంతమొందించటానికి చట్టబద్ధ చర్యలు తీసుకోరు. ఉదాహరణకు 1988లోనే బినామీ ఆస్తుల నిషేధ చట్టాన్ని ఆమోదించినా ఇంతవరకు దాన్ని అమలుచేసే ప్రయత్నం జరగలేదు. ఆ చట్టంలో కొన్ని పొరపాట్లున్న మాట వాస్తవం. రాజ్యాంగ సమీక్షా సంఘం కూడా ఆ లోపాలను గుర్తించింది. బినామీ ఆస్తులకు ఆ చట్టంలో ఇచ్చిన నిర్వచనం ప్రకారం... కన్నబిడ్డల కోసం తల్లిదండ్రులు తమ సంపాదనతో ఆస్తులను కొన్నా అది 'బినామీ' అవుతుంది. అలాంటి లోపాలను సవరించటం అవసరం. ఆ లోపాలను అలా ఉంచితే, ఆ చట్టంలో అయిదో సెక్షన్ ప్రకారం బినామీ ఆస్తులను ఎలాంటి పరిహారం చెల్లించకుండానే ప్రభుత్వపరం చేయవచ్చును. ఇలా బినామీ ఆస్తులను ప్రభుత్వపరం చేయటానికి– ఆ చట్టంలో 8వ సెక్షను ప్రకారం– యూనియన్ ప్రభుత్వం నిబంధనలను తయారు చేసి వెలువరించాలి. అయితే 1988లో రూపొందిన ఆ చట్టం అమలుకు సంబంధించిన నిబంధనలను 15 ఏళ్లు దాటినా భారత ప్రభుత్వం తయారు చేయలేకపోయింది! అంటే చట్టాలను అమలు చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం లేదని స్పష్టమవుతోంది. నిబంధనలను తయారుచేసి ఆ చట్టాన్ని సరిగ్గా అమలుచేస్తే, బినామీగా చూపెట్టే అక్రమ ఆస్తులనన్నింటినీ ప్రభుత్వపరం చేయవచ్చును. ఆస్తులన్నీ పోతాయన్న భయం ఉంటే అవినీతికి పాల్పడటానికి జంకుతారు.

అవినీతి ద్వారా సొంత కుటుంబ సభ్యుల పేర్లమీద ఆస్తులను కూడబెట్టినప్పుడు బినామీ ఆస్తుల చట్టం ద్వారా వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటం ప్రస్తుతం సాధ్యం కాదు. ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేకంగా మరో చట్టం అవసరం. అవినీతికి పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగుల మొత్తం ఆస్తులను శాశ్వతంగా ప్రభుత్వపరం చేసే చట్టం అవసరం. ఆ ఆస్తులను చట్టబద్ధంగా ముందే ప్రకటించకపోతే, వాటిని అవినీతితో కూడబెట్టలేదని రుజువు చేసే బాధ్యత అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మీదనే పెట్టాలి. ప్రభుత్వోద్యోగులు రిజిస్ట్రేషను లేకుండా, అమ్మకపు ఒప్పందాల ద్వారా ఆస్తులను కొన్నా, లావాదేవీలు జరిపినా, దాన్ని నేరంగా ప్రకటించి వారికి శిక్షవేయాలి. వారి ఆస్తిపాస్తులను పూర్తి వివరాలను ప్రభుత్వానికి అందజేయకపోయినా, వాస్తవాలను దాచిపెట్టినా వాటిని శిక్షార్హమయిన నేరాలుగా గుర్తించేలా చట్టం చేయాలి.

వారు ప్రకటించిన ఆస్తిపాస్తుల వివరాలను ప్రజల ముందు ఉంచాలి. ఎన్నికలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఆర్థిక వివరాలను ప్రజల ముందు ఉంచాలని కట్టడి చేస్తున్నప్పుడు, ప్రభుత్వ ఉద్యోగుల ఆస్తిపాస్తుల వివరాలను కూడా బయటపెట్టటం అవసరం. ఆస్తులను ప్రభుత్వపరం చేసే చట్టాలను, లంచం పుచ్చుకున్న వాళ్లకేకాక లాలూచీపడి లంచాలిచ్చినవారికి కూడా వర్తింపజేయాలి. ఈ మొత్తం ఆస్తుల స్వాధీనం ప్రక్రియను నేర న్యాయస్మృతి పరిధిలో కాకుండా ఆస్తిపాస్తులకు సంబంధించిన సివిల్ కేసుగా గుర్తించాలి. లేకపోతే ఏదో నెపం మీద శిక్షలను, ఆస్తుల జప్తును తప్పించుకునే ప్రయత్నం చేస్తారు.

## పెద్ద శిక్షలు ఉంటేనే మేలు

అవినీతికి పాల్పడినట్లు రుజువయినా, బినామీ ఆస్తులను కూడబెట్టినా ఉన్న ఆస్తులన్నీ పోతాయన్న భయం కలిగినప్పుడు చాలా మంది అవినీతికి పాల్పడటానికి వెనుకాడతారు. కేవలం అవినీతి నిరోధక చట్టం కింద నేరారోపణ చేస్తే చాలదు. నేరారోపణ జరిగాక కూడా శిక్ష పడుతుందన్న భయం మనదేశంలో లేదు. కాబట్టి అసలు ఆస్తులన్నీ పోయి కుటుంబం వీధులపాలవుతుందనే భయం చాలా మందిని అవినీతికి పాల్పడకుండా ఆపుతుంది. అవినీతికి పాల్పడినప్పుడుగాని, అక్రమ నిర్ణయాలు తీసుకున్నప్పుడుగాని, బుద్ధి పూర్వకంగా ప్రభుత్వ ఖజానాకు, ప్రభుత్వ ప్రజాప్రయోజనాలకు నష్టం కలిగించినప్పుడుగాని అందుకు బాధ్యులయిన వారికి మామూలు శిక్షలతోపాటు భారీగా జరిమానాలు విధించే ఏర్పాటు చేయాలి. చేసిన తప్పులను కోట్ల రూపాయల మేరకు జరిమానా పడుతుందన్న భయం ఉన్నప్పుడే అవినీతిని, అక్రమ పాలనను అదుపుచేయడం సాధ్యం.

ప్రస్తుత చట్టాల ప్రకారం అవినీతికి పాల్పడినట్లు రుజువయిన సందర్భాలలో – కొంతకాలం జైలు శిక్ష, ఉద్యోగం పోవటం – ఈ రెండు భయాలు మాత్రమే ఉన్నాయి. తెగించి కోట్ల రూపాయలు మింగేసినా శిక్షపడకుండా తప్పించుకోవచ్చు! ఒకవేళ శిక్ష పడినా, అక్రమార్జన మొత్తాన్ని చాలా వరకు కుటుంబ సభ్యులో, స్వయంగా అవినీతిపరుడో అనుభవించవచ్చు! అలాకాక, చాలా పెద్దయెత్తున జరిమానాలు పడతాయనే భయం, మొత్తం కూడబెట్టిన ఆస్తులన్నీ పోతాయనే గుబులు ఉన్నప్పుడే అవినీతిని అంతమొందించగలం.

* * *

# ప్రజాపోరాటంతోనే
# అవినీతి అంతం

**జూన్ 30, 2003**

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ చిన్న పని జరగాలన్నా లంచాల బెడదతప్పడం లేదు. పట్టాదారు పాసుపుస్తకాల నుంచి పెద్ద పెద్ద కాంట్రాక్టుల వరకు ఏ విషయంలోనైనా సరే– లంచాలు లేకుండా పని జరగటం దాదాపు అసాధ్యం. ఇదంతా 'మనఖర్మ' అని సరిపెట్టుకోవటమో, మనల్ని మనం నిందించుకుంటూ కూర్చోవటమో వ్యర్థం. లంచాలకు కారణం మన దేశంలో నీతి, నిజాయతీ నశించటమేనని భావిస్తే అంతకంటే పొరపాటు మరొకటి లేదు. మన ప్రజలు ధర్మనిరతిలో, నిజాయతీలో ఎవరికీ తీసిపోరు. మనం కృత్రిమంగా ఏర్పరచుకున్న పద్ధతులే అవినీతికి దారితీస్తున్నాయి.

## పరిష్కార మార్గాలెన్నో....

నిజానికి అధికారం ఎక్కడుంటే అక్కడ అవినీతికి తావుంటుంది. చట్టాల అమలులో సిబ్బంది సొంత నిర్ణయాలతో పక్షపాతంతో వ్యవహరిస్తుంటారు. అప్పుడు డబ్బు కోసం బెదిరించటమో, లేదా లంచాలు మింగి కొందరికి వత్తాసు పలకటమో చేస్తుంటారు. ప్రజాధనాన్ని ఖర్చు చేసేటప్పుడు కొనుగోళ్లలో, కాంట్రాక్టులలో, సబ్సిడీల పంపిణీలో, సంక్షేమ పథకాలలో అవినీతికి ఎప్పుడూ అవకాశం ఉంటుంది. అనవసరమైన లైసెన్సులు, పర్మిట్లతో ఉత్పత్తికి, పోటీకి ప్రభుత్వం అవరోధాలను సృష్టిస్తే వస్తువులకు, సేవలకు కృత్రిమ కొరత ఏర్పడి గిరాకీ పెరుగుతుంది. అది అక్రమార్జనకు అవకాశం కల్పిస్తుంది. అవినీతిని అంతం చేయటానికి వివిధ ప్రక్రియలున్నాయి. కానీ చాలా సందర్భాలలో చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. చట్టాలను అమలు చేయటానికి కేవలం ప్రభుత్వ యంత్రాంగం పైనే ఆధారపడటం వల్ల లాభం లేదు. దానివల్ల ప్రయోజనాలు చేకూరతాయని కచ్చితంగా చెప్పలేం. కంచే చేను మేసినా అడిగే నాథుడు లేడు. మన దేశంలో జరుగుతోందదే. అవినీతిపరులను నిలదీయాల్సిందిగా ప్రజలను ఉద్బోధించిన

మాత్రాన పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. బలమైన ప్రభుత్వాలను, అధికార యంత్రాంగాన్ని వ్యతిరేకిస్తే ఏదో ఒక రూపంలో కక్షసాధింపు చర్యలకు గురవుతామని చాలా మందికి సహజంగానే భయం ఉంటుంది. అవినీతి అంతమైతేనే తమకు లాభం చేకూరుతుందని ప్రతి ఒక్కరూ భావిస్తారు. మనుషుల్లోని ఈ 'స్వలాభాపేక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి. అవినీతికి కళ్లెంవేసే ప్రయత్నంలో ప్రతి మనిషిని భాగస్వామిని చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. ఉదాహరణకు ప్రభుత్వ కొనుగోళ్లు, కాంట్రాక్టులు, సబ్సిడీల పంపిణీలు– ఈ రంగాలన్నింటిలో అవినీతిని తగ్గించటానికి చక్కటి పద్ధతులున్నాయి. అమెరికా లాంటి దేశంలో అలాంటి చట్టాలను, పద్ధతులను రూపొందించి మనిషి నైజాన్ని అవినీతిపై పోరాటానికి ఉపయోగించుకుంటున్నారు. సాధారణంగా ప్రభుత్వాలు పెట్టే ఖర్చులో సగానికిపైగా వస్తువులు, సేవలు లేదా సబ్సిడీలపై వ్యయమవుతుంది. ఓ ఆసుపత్రి సేవల కోసం ప్రభుత్వం సి.జి.హెచ్.యస్. పథకం ద్వారా డబ్బు చెల్లించవచ్చు. ప్రభుత్వ నిర్వహణ కోసం ఎన్నో వస్తువులను టెండర్ల ద్వారా కొనవచ్చు. రోడ్లు, నీటిపారుదల పథకాలు, విద్యుత్ ప్రాజెక్టుల నిర్వహణ కోసం సామాగ్రి కొనుగోలు, భవనాల నిర్మాణం, ఓడరేవుల ఏర్పాటు, రైల్వే లైనుల అధునికీకరణ, రక్షణ పరికరాల సేకరణ– వంటి ఎన్నో పనులకు, అవసరాలకు కాంట్రాక్టులు కురుర్చుకోవటం, టెండర్లు పిలవటం ప్రభుత్వానికి పరిపాటి. ఇక వివిధ సంక్షేమ పథకాల కింద రైతులకి, బీదలకు, దళితులకు, బలహీనవర్గాల వారికి ఎన్నో సబ్సిడీలు ఇవ్వడం, స్కాలర్‌షిప్పులు పంపిణీ చేయటం జరుగుతోంది. ఇలా కొనుగోళ్లు, కాంట్రాక్టులు, సబ్సిడీల కింద ప్రభుత్వవ్యయంలో సగభాగంపైన ఖర్చవుతోంది. మన దేశమంతటా కలిసి ఏటా మూడులక్షలకోట్ల రూపాయలకు పైగా ఈ విధంగా ఖర్చవుతోంది. వీటన్నింటిలో అవినీతి విపరీతంగా ఉందని, లంచాలు లేకుండా కాంట్రాక్టులు ఖరారు కావటం అరుదని మనందరికీ తెలుసు. ఈ అవినీతి వల్ల కనీసం 25శాతం డబ్బు వృథా అవుతోంది. కొన్ని రంగాల్లోనైతే నూటికి 90 రూపాయల దాకా డబ్బు స్వాహా అయిపోతోంది. ఈ రకమైన అవినీతిని అరికట్టటానికి, ప్రభుత్వ కొనుగోళ్లు, కాంట్రాక్టులలో పారదర్శకతను పెంచటానికి ప్రపంచమంతటా కొన్ని మంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కాంట్రాక్టులకు సంబంధించి– ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వాణిజ్య న్యాయ సంఘం ఓ నమూనా చట్టాన్ని తయారుచేసి, అన్ని దేశాలు అలాంటి పద్ధతులను పాటించాలని సూచించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ కొన్ని నిబంధనలను రూపొందించగా, 1996లో ఒక ఒప్పందంగా సభ్య దేశాలన్నీ వాటిని ఆమోదించాయి.

ఇలాంటి మంచి చట్టాలు, నిబంధనలు రూపొందించడం మాత్రమే చాలదు. వాటి అమలుకుపౌరుల తోడ్పాటు కావాలి. అందుకు కొత్త పద్ధతులు కావాలి. దండించటానికి సమర్ధన్యాయ వ్యవస్థ ఉండాలి.

ప్రభుత్వ కొనుగోళ్లలో అవినీతి నిర్మూలనకు అమెరికాలో రెండు వినూత్న పద్ధతులను విజయవంతంగా అమలుచేస్తున్నారు. మొదటిది, టెండర్లు ఖరారు చేసేటప్పుడు పాటించేనిబంధనలు అమెరికాలోని పలు రాష్ట్రాలలో ఓ నిబంధన అమలులో ఉంది. ఓ కాంట్రాక్టరు ప్రభుత్వానికి ఏ వస్తువునయినా, సేవనయినా విక్రయించినప్పుడు- దానికి ప్రైవేటురంగంలో అమ్మిన ధరకన్నా ఎక్కువ ధరను వసూలు చేయరాదు. ఎక్కువ ధరకు టెండరు వేసినా దాన్ని రుజువు చేసయడానికి, అదనంగా వసూలు చేసిన డబ్బును తిరిగి రాబట్టడానికి ఈ నిబంధన దోహదం చేస్తుంది. టెండర్లు ఎలా వేశారు...? అందులో పద్ధతులను సక్రమంగా పాటించారా...? లేదా?- అన్న అంశాలతో నిమిత్తం లేకుండా ప్రజాప్రయోజనాలను కాపాడవచ్చు. ఒక కాంట్రాక్లరు ప్రభుత్వం దగ్గర ఎక్కువ సొమ్ము వసూలు చేసినట్లో, మోసం చేసినట్లో ఆధారాలుంటే, ఆ వివరాలను బయటపెట్టి రుజువు చేయటంలో సామాన్య పౌరులకు అసాధారణమైన పాత్రను కల్పిచారు. అమెరికాలో ఇలాంటి అక్రమ చెల్లింపులన నిరోధించటానికి ఓ చట్టం(ఫాల్స్ క్లెయిమ్స్ యాక్ట్) ఉంది 1996లో దానిలో మరిన్ని మార్పులు తెచ్చారు. ప్రభుత్వం నుంచి ఏ సంస్థ అయినా అక్రమంగా డబ్బు రాబడితే, ఏ పౌరుడైనా దాన్ని పరిశోధించి వెలికితీయడానికి ఈ చట్టం వీలుకల్పిస్తోంది. అలా వివరాలు తెలిశాక ప్రభుత్వం తరపున పౌరులే కోర్టులో కేసువేసి జరిమానాతో సహా చెల్లింపులను రాబట్టవచ్చు. ఇలా పౌరులు వేసే దావాలను 'క్విటేమ్' దావాలంటారు. అక్రమ చెల్లింపులు నిజమేనని కోర్టు విచారణలో రుజువైతే- ఆ చెల్లింపుల ద్వారా ప్రభుత్వం నష్టపోయిన డబ్బుకు మూడు రెట్ల జరిమానాను ఆ సంస్థకు విధిస్తారు. ఆ డబ్బులో 15 నుంచి 25 శాతం వరకు దావా వేసిన పౌరుడికి చెందుతుంది. ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా కేవలం ఆ పౌరుడే దావాను నడిపితే, అతని పారితోషికం 30 శాతం ఉంటుంది. ఇలా అక్రమాలను అరికడితే పౌరులకు వ్యక్తిగతంగా బోలెడంత లాభం చేకూరుతుందన్నమాట. దీంతో ప్రభుత్వ కాంట్రాక్టులలో, లావాదేవీలలో జరిగే అక్రమాలను వెలికితీయటమే వృత్తిగా పెట్టుకుని వేలమంది పౌరులు అక్కడ రెండు చేతులా సంపాదిస్తున్నారు. తద్వారా అటు ప్రభుత్వానికి లాభం చేకూరుతోంది, ఇటు వారికీ జీవనోపాధి లభిస్తోంది; పర్యవసానంగా అవినీతికి అడ్డుకట్ట పడుతోంది. 1986 నుంచి నేటి వరకు ఇలాంటి దావాల వల్ల వెయ్యికోట్ల

డాలర్లు అంటే– రూ॥48,000కోట్లను జరిమానాలుగా వేసి రాబట్టగలిగారు. ఇందులో దాదాపు రూ॥30,000 కోట్లు కేవలం పౌరులు వేసిన 4000 దావాల వల్ల వసూలు చేశారు. దీని వల్ల ఆ పౌరులకు సుమారు రూ॥8000కోట్ల వరకు వ్యక్తిగత ఆదాయం చేకూరింది. ఈ దావాల ద్వారా 2002వ సంవత్సరంలో ప్రభుత్వం రాబట్టిన డబ్బు వివరాలను కొన్నింటిని పరిశీలిస్తే ఈ చట్టం వల్ల అక్రమాలను ఎలా అరికట్టగలుగుతున్నారో బోధపడుతుంది. ఉదాహరణకు టి.ఎ.పి. అనే మందుల కంపెనీ అక్రమ పద్ధతులను అవలంభించి, లంచాలను ఇచ్చి 'లూప్రాన్' అనే మందు అమ్మకాలను పెంచింది. ఆ మందు ధరని కూడా పెంచి– ప్రభుత్వ నిధుల ద్వారా వైద్యసేవలందించే మెడికెయిడ్, మెడికేర్ పథకాల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేసింది. దానిపై దావా వేయటంతో ఆ కంపెనీ రూ॥2800 కోట్ల జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఆరోగ్య సేవలందించే 'పసిఫికేర్' అనే మరో కంపెనీ ప్రభుత్వోద్యోగులకు అందించిన వైద్య సేవలకుగాను ప్రైవేటు రోగలనుంచి వసూలు చేసే ఛార్జీలకంటే ఎక్కువ ఛార్జీలను వసూలు చేసింది. దానిపై దావా వేసి రూ॥425 కోట్లు మొత్తాన్ని ఆ కంపెనీ నుంచి తిరిగి రాబట్టారు. జనరల్ అమెరికన్ జీవితబీమా కంపెనీ మిస్సోరి రాష్ట్రంలో ప్రభుత్వ నిధులతో అందే వైద్య సేవలలో దొంగ బిల్లులు సృష్టించి డబ్బు తీసుకుంది. దానిపై దావా వేయగా ఆ కంపెనీ రూ॥375కోట్ల మేరకు ప్రభుత్వానికి జరిమానా చెల్లించాల్సివచ్చింది. ప్రభుత్వంలో ఆ కంపెనీ ఐదేళ్లపాటు లావాదేవీలు జరపకుండా నిషేధం కూడా విధించారు.

## పౌరులకు భాగస్వామ్యం

అవినీతిని అరికట్టాలన్న సంకల్పం ఉండాలేగాని అందుకు ఎన్నో మంచి పద్ధతులున్నాయి. మన ప్రభుత్వాలు పైపై ప్రకటనలకే పరిమితమవుతున్నాయి తప్ప– అవినీతిని అరికట్టాలన్న ఆకాంక్షకానీ, ప్రజాప్రయోజనాలను కాపాడాలన్న అభిలాషకానీ వాటికిలేదు. కేవలం ప్రభుత్వ అధికారుల ద్వారానే అవినీతిని అరికట్టాలని ప్రయత్నించటం వల్ల ప్రయోజనం ఉండదు. అవినీతిపై పోరాటంలో సామాన్య పౌరులను భాగస్వాముల్ని చేయాలి. అవినీతి అరికట్టడానికి పోరాడిన వారికి వ్యక్తిగతంగా లాభం చేకురేలా సంస్థాగత ఏర్పాట్లను చట్టబద్ధంగా చేయాలి. ఈ చట్టవిచారణ పూర్తయి న్యాయం అందేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయాలి. ఇంతమాత్రం ప్రయత్నంచేస్తే ఎంతటి సత్ఫలితాలు వస్తాయో అమెరికా అనుభవం చెబుతోంది. అలాంటి పద్ధతులను ప్రవేశపెట్టేంతవరకు ప్రజాధనాన్ని అవినీతిపరులు నిస్సిగ్గుగా దోచుకుంటూనే ఉంటారు.

* * *

# రాజకీయ సంకల్పంతోనే అవినీతికి అడ్డుకట్ట!

## నవంబరు 3, 2003

అవినీతిని, పాలనలో అలసత్వాన్ని ఎదుర్కొనేందుకు మూడు చట్టాలను తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల నిర్ణయించినట్లుగా వార్తలొచ్చాయి. ప్రభుత్వ శాఖల సంస్థల విధినిర్వహణలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఓ చట్టాన్ని తేవటం, అవినీతి పరులుగా తేలిన అధికారుల, ఉద్యోగుల ఆస్తులను ప్రభుత్వ స్వాధీనం చేసేందుకు వీలుగా చట్టాన్ని తీసుకురావడం; ప్రభుత్వ కాంట్రాక్టులలో, టెండర్ల జారీలో అక్రమాలను అరికట్టేందుకు కొన్ని కొత్త నిబంధనల్ని ప్రవేశపెట్టడం- ఈ మూడు చర్యలను చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పాలనలో అవినీతి సర్వత్రా వ్యాపించి ఉన్న సంగతి అందరికీ స్వానుభవమే. ఈ పరిస్థితులలో అవినీతిని ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నా సంతోషమే. అయితే అవి ఏ మేరకు లంచాలను నిలవరించగలవన్నదే ప్రశ్న. ఈ అవినీతి భాగోతాన్ని కొంచెం లోతుగా పరిశీలిద్దాం.

### అవినీతిపై విజయాలు

అవినీతిని సమర్థంగా ఎదుర్కొవాలంటే లంచాలు బెడద తగ్గించటంలో ఇటీవల సాధించిన విజయాలను అధ్యయనం చేసి, వాటి నుంచి కొన్ని పాఠాలను నేర్చుకోవాలి. అవినీతి ఏయే శాఖల్లో, సేవల్లో విశృంఖలంగా కొనసాగుతోందో పరిశీలించి అందుకు కారణాలను అన్వేషించాలి. అన్నింటినీ మించి అవినీతికి పాలనావ్యవస్థ ఎలా కొమ్ముకాస్తోందో, అవినీతి పునాదుల మీద మన రాజకీయాలు ఎలా నిలబడి ఉన్నాయో అర్థం చేసుకోవాలి. లంచాలను తగ్గించటంలో గొప్ప విజయాలు సాధించిన రంగం టెలి కమ్యూనికేషన్లు. పదేళ్లక్రితం కొత్త ఫోను కావాలన్నా, ఉన్న ఫోనును మరో ఇంటికి మార్చాలన్నా, ఫోను పనిచేయకపోతే సరిచేయాలన్నా వినియోగదారుడికి ముచ్చెమటలు పట్టేవి. ఎంతోకాలం పడిగాపులు, లంచాలు, వేధింపులు అందరికీ అనుభవమే. అలాంటిది గత ఆరు సంవత్సరాలలో అనూహ్యమైన మార్పులొచ్చాయి. కొత్త ఫోను కావాలంటే ఇప్పుడు చిటికెలో సాధ్యమవుతోంది. ఎలాంటి లంచమూ

ఇవ్వకుండానే ఫోను పెట్టించు కోవచ్చు. ఒకప్పుడు మొబైల్ ఫోనులు కేవలం సంపన్నులకే అందుబాటులో ఉండగా, ఇప్పుడు ఎందరో సామాన్యులూ వాటిని ఉపయోగించు కుంటున్నారు. సేవలు మెరుగుపడుతున్నాయి. ధరలు తగ్గుతున్నాయి. ఈ మొత్తం మార్పునకు కారణం పోటీని పెంచటం. టెలిఫోన్ల రంగంలో గతంలో ప్రభుత్వ కంపెనీకి గుత్తాధిపత్యం ఉండేది. లైసెన్సు– పర్మిటు– కోటారాజ్యం అమలులో ఉండేది. కొత్త టెలిఫోను పరికరాలను తయారుచేయాలన్నా అందుకు లైసెన్సుల అవసరం ఉండేది. పరికరాలకు గిరాకీ ఉన్నా, వాటిని అదనంగా ఉత్పత్తి చేయాలంటే అనుమతులు అవసరమయ్యేవి. ఇలా అన్నీ ప్రభుత్వ నియంత్రణలో ఉండటంతో అడుగడుగునా అవినీతి రాజ్యమేలేది. ఆ గుత్తాధిపత్యాన్ని తొలగించటం, లైసెన్సు–పర్మిటు రాజ్యాన్ని చాలా మేరకు అంతం చేయటం, ఆరోగ్యకరమైన పోటీకోసం స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థను ఏర్పాటు చేయటం, పెట్టుబడులను ప్రోత్సహించటం– వంటి చర్యలవల్ల టెలిఫోన్ల విషయంలో అవినీతి చాలా మేరకు తగ్గింది.

సేవలలో అవినీతి తగ్గటం విషయానికి వస్తే రైల్వే రిజర్వేషన్ సౌకర్యం, పాసుపోర్టులు మంజూరీ మంచి ఉదాహరణలు, ఒకప్పుడు దూరప్రయాణానికి రైల్లో రిజర్వు చేసుకోవాలంటే విపరీతమయిన యాతన, లంచాలబెడద ఉండేవి. ఇప్పుడు కంప్యూటరీకరణతో ప్రతి సామాన్యుడు కొన్ని నిమిషాలలో రిజర్వేషన్ చేయించు కోగలుగుతున్నాడు. ఒకవేళ అన్ని సీట్లు భర్తీ అయిపోతే వెయిట్ లిస్టులో ఎన్నో స్థానంలో ఉన్నాడో వెంటనే తెలుస్తోంది. ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవటం; ప్రయాణీకులను ఇబ్బందులకు గురిచేయ కుండా పాలనపరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం ఈ మెరుగుదలకు కారణాలు. పాసుపోర్టుల విషయంలోనూ అవినీతి బాగా తగ్గింది; పౌరులకు సౌకర్యం పెరిగింది. ఎవరినీ అశ్రయిచకుండానే నాలుగైదు వారాలలో పాసుపోర్టు ఇంటికి అందుతోంది. కంప్యూటరీకరణతో పాటు పాసుపోర్టు విభాగం పనితీరును మెరుగుపరుస్తూ ఎన్నో చర్యలు తీసుకోవటంతో లంచాల బెడద లేకుండా పోయింది.

ఇక రాష్ట్రం విషయానికి వస్తే కొన్నేళ్ల క్రితం మునిసిపాలిటీలలో పౌరహక్కుల పత్రాలను (సిటిజన్ చార్టర్లు) అమలు చేయటంతో– జనన, మరణ సర్టిఫికేట్ల వంటి సేవలకు సంబంధించి అవినీతి బాగా తగ్గింది. అలాగే ఇంటి యజమానే స్వయంగా పన్ను మదింపు చేసుకుని ఆస్తిపన్ను కట్టే వీలుకల్పించటంతో అవినీతి తగ్గింది; నగరాల

ఆదాయం పెరిగింది. ఇలా జవాబుదారీతనాన్ని పెంచేందుకు నిర్దిష్ట చర్యలను తీసుకోవటం, కొన్ని స్పష్టమయిన ప్రమాణాలను నిష్పక్షపాతంగా పాటించటంవల్ల లంచాలు తగ్గిపోయాయి. అయితే పౌరహక్కుల పత్రాలున్నా– ఇప్పటికీ ఇంటి నిర్మాణం ప్లాన్‌ను ఆమోదించటంలో లంచాలు తగ్గలేదు. ఏదో ఒక వంకన యక్షప్రశ్నలు వేసి పౌరుణ్ని వేధించే అవకాశం, నిర్మాణాన్ని నిలిపే అధికారం సిబ్బందికి ఉండటంతో గృహ నిర్మాణానికి పౌరులు గతిలేని పరిస్థితులలో లంచాలు సమర్పించుకోవలసిన పరిస్థితి ఇప్పటికీ ఉంది. ఏదైనా వ్యాపారాన్ని ప్రారంభించాలంటే వాణిజ్యపన్నుల శాఖలో నమోదు చేసుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం లంచం ఇవ్వనిదే పేరు నమోదు చేసుకోని పరిస్థితి ఈ శాఖలో వ్యాపించి ఉందనడానికి స్పష్టమైన ఉదాహరణలున్నాయి. అబ్కారీ శాఖలో అవినీతి కొనసాగుతూనే ఉంది. దాదాపు 8000 మద్యం దుకాణాల నుంచి ఏటా కాక పారిశ్రామిక అల్కమాల్, ఇతర పదార్థాల నియంత్రణ పేరుతో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. అందుకే అబ్కారీ శాఖలో జిల్లా అధికారుల బదిలీ కోసం రేటు రూ॥25 లక్షల రూపాయల దాకా పలుకుతోందని వినికిడి. ఇక 25 ఏళ్ల క్రితమే రైతుల ఆస్తి హక్కును నమోదుచేసే పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేసినా ఈ నాటికీ చాలామందికి అవి అందనేలేదు. అవి అందిన రైతుల్లోనూ లంచం ఇవ్వకుండా పాసుపుస్తకాలు ముట్టినవాళ్లు చాలా అరుదుగా కనిపిస్తారు.

కొన్ని శాఖలలో ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ప్రవేశపెట్టినా లంచాల బెడద తగ్గలేదు. ఉదాహరణకు మన రాష్ట్రంలో భూమి రికార్డులను అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలలోను కంప్యూటరీకరించారు. అయినా భూమి అమ్మకాలను నమోదు చేసేటప్పుడు ఆనవాయితీగా పెద్దయెత్తున లంచం ఇవ్వవలసి వస్తోంది. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ శాఖలలో అవినీతికి అంతేలేదు. ప్రతి చిన్న, మధ్య తరగతి పారిశ్రామికవేత్తను ఆయా శాఖల అధికారులు వేధించడం మామూలే. అవినీతి కొన్ని సేవలలో తగ్గుముఖం పట్టినా, మరెన్నో రంగాలలో నిరాటంకంగా కొనసాగుతోంది. ఇందుకు మూలకారణం రాజకీయాలు వ్యాపారమయం కావడం. నిజానికి అవినీతి వల్ల ఎక్కువ భాగం డబ్బుముట్టేది అధికారులకు, ఉద్యోగులకే. రాజకీయాల్లో అవినీతి ఉన్నప్పుడు అవినీతి పరులను అదుపుచేసే చేవగాని, చిత్తశుద్ధిగాని ప్రభుత్వానికుండవు. ఎన్నికల్లో అక్రమంగా కోట్లు ఖర్చుపెట్టి అధికారానికి

ఎగబాకిన వాళ్లు మళ్ళీ అవినీతికి పాల్పడి పెట్టిన పెట్టుబడికి పదిరెట్లు సంపాదించక తప్పదు. అలా తమ రాజకీయ అవసరాల కోసం నాయకులు అక్రమాలకు, లంచాలకు పాల్పడినప్పుడు– ప్రభుత్వ యంత్రాంగం దాన్ని అలుసుగా తీసుకుని లంచాల రూపంలో కోట్ల రూపాయలు మింగటం సహజం. ప్రస్తుతం జరుగుతోంది అదే. అందుకే మన అవినీతి వ్యవస్థకు పునాది రాజకీయాలు, ఎన్నికల వ్యవస్థ. వాటిని సరిదిద్దకుండా అవినీతిని అంతమొందించటం అసాధ్యం.

అవినీతిభారాన్ని ప్రజల నెత్తిమీద నుంచి తొలగించటం కొంతమేరకైనా సాధ్యమే. కొన్ని చట్టాలను తీసుకువచ్చి వాటిని సక్రమంగా అమలు చేస్తే కొంతమేరకు అవినీతి తగ్గుతుంది. అయితే ఇవి మాత్రమే చాలవు. ఉదాహరణకు విధి నిర్వహణలో జవాబుదారీతనం కోసం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న చట్టం ద్వారా ఉన్నతస్థాయి కమిటీ నిజాయతీపరులను, సమర్థులను ప్రోత్సహించి, అవినీతి పరులను, అసమర్థులను శిక్షించే అవకాశం ఉంది. ఆ మేరకు మంచే జరుగుతుంది. అయితే అది సరిగ్గా అమలయ్యేందుకు తగిన యంత్రాంగాన్ని, పద్ధతులను రూపొందించటం; కమిటీ నిష్పాక్షికంగా, నిక్కచ్చిగా వ్యవహరించటం చాలా అవసరం. అలాగే అవినీతి పరులుగా రుజువైనవారి ఆస్తులను ప్రభుత్వపరం చేసేందుకు చట్టం తీసుకురావడం అవసరమే. కాని ప్రస్తుతం కోర్టులలో అవినీతి రుజువవుతున్న వారి సంఖ్య అతి స్వల్పం. అవినీతికి పాల్పడితే శిక్షపడుతుందన్న భయాన్ని నిజంగా కల్పించినప్పుడే ఇలాంటి చట్టాలవల్ల ఫలితాలు వస్తాయి. ప్రస్తుతం ఎందరో ఉన్నతాధికారుల మీద అవినీతి ఆరోపణలు– ఏ రకమయిన పరిశోధన, విచారణ లేకుండా సాక్షాత్తు ముఖ్యమంత్రి దగ్గరే ఏళ్ల తరబడి నిలిచిపోయాయని వార్తలొచ్చాయి. ఎందరో అవినీతి పరులను కీలక స్థానాలలో నియమించడం, ఏళ్ల తరబడి వాళ్ల లంచాల బాగోతాన్ని చూస్తూ కూర్చోవటం పాలనానుభవం ఉన్నవారందరికీ తెలుసు. అలాంటప్పుడు అవినీతి నిరోధక యంత్రాంగం కేవలం కొద్దిమంది చిరు ఉద్యోగులమీద తన ప్రతాపాన్ని చూపడమే తప్ప నిజంగా అవినీతికి పెద్దయెత్తున పాల్పడే అధికారులమీద చర్య తీసుకోలేదు. అలాగే ఒక వేళ పరిశోధన చేసి, సాక్ష్యాలు సేకరించి కోర్టుముందు నిలబెట్టినా, అవినీతికి శిక్షపడటమే చాలా అరుదు. అలాంటప్పుడు శిక్ష పడ్డవాళ్ల ఆస్తులను జప్తుచేస్తే వచ్చే ప్రయోజనం చాలా తక్కువ. లంచగొండులకు సత్వరం శిక్షలు పడేలా ప్రత్యేక న్యాయస్థానాల సంఖ్యని పెంచటం, అవినీతి విచారణ పద్ధతులను మెరుగుపరచటం, చిత్తశుద్ధితో లంచగొండుల భరతం పట్టడం అవసరం.

## నిజమైన చేతలు కావాలి.

కాంట్రాక్టులు, టెండర్లలో కొన్ని ప్రాంతాలలో నేర రాజకీయాల నీడ పడుతోందని, ఎన్నో సందర్భాలలో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని కైంకర్యం చేస్తున్నారని, ప్రజాపనుల ప్రమాణాలు అధ్వానంగా ఉంటున్నాయని రోజూ మనం వింటున్నదే. టెండర్ల ఖరారు కోసం అనుసరించే పద్ధతులను మార్చటం, అందుకు కొత్త చట్టాన్ని తీసుకురావటం అవసరమే. అయితే నిజంగా ప్రభుత్వ టెండర్లలో అవినీతి పోవాలంటే అమెరికాలోలాగా పౌరులే అవినీతిని బయట పెట్టేందుకు వీలు కల్పించాలి. అవినీతి పరులకు కోర్టులు విధించే నష్టపరిహారంలో–పౌరులకు నిర్ణీత శాతం ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేయటం అవసరం. ఇలాంటి వినూత్న పద్ధతులలో పౌరులను ప్రోత్సహించినప్పుడే అవినీతిని కట్టడి చేయగలం. అవినీతి కేవలం దుష్పరిపాలనకు, కుళ్ళిపోయిన రాజకీయ వ్యవస్థకు సంకేతం మాత్రమే. మీనమేషాలు లెక్క పెట్టకుండా గతానుభవాన్ని, ఇతర దేశాలలో విజయ వంతంగా అనుసరించిన పద్ధతులను పరిశీలించి, సరయిన ఏర్పాట్లు చేస్తే అవినీతిని కచ్చితంగా అంత మొందించగలం. ఎన్నికల హడావుడి వచ్చినప్పుడల్లా ఏవో ఆర్భాటాలు చేస్తే అవినీతి తగ్గదు. అవినీతిని నిర్మూలించలాంటే ప్రధానంగా కావలసింది చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పం. నినాదాలతో, కంటితుడుపు చర్యలతో తృప్తి పడకుండా, చిత్తశుద్ధితో, దృఢ సంకల్పంతో మౌలిక మార్పులకోసం కృషిచేస్తేనే అవినీతి మహమ్మారినుంచి సామన్యులను రక్షించగలం.

* * *

# రూపు మార్చుకొని కాటు వేస్తున్న అవినీతి సర్పాలు

## డిసెంబర్ 1, 2003

ఇటీవలి కాలంలో బయటపడ్డ కొన్ని అవినీతి కుంభకోణాలు, అక్రమాలు మారుతున్న మన సమాజంలో కొత్తగా పుట్టుకొస్తున్న సమస్యలకు అద్దం పడుతున్నాయి. ఆర్థిక సంస్కరణలు అమలు చేయటానికి పూర్వం కూడా దేశంలో అన్ని రంగాలలోను అవినీతి విపరీతంగా ఉండేది. ఆనాడు అవినీతి ప్రధానంగా- ఆర్థిక నిర్ణయాల చుట్టూ అల్లుకొని ఉండేది. గతంలో నెలకొల్పిన లైసెన్సు- పర్మిట్- కోటా రాజ్యంలో అడుగడుగునా లంచం ఇస్తేనే పనయ్యేది. ఓ చిన్న పరిశ్రమ స్థాపించాలంటే చెప్పులరిగేలా రాజకీయ నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి దక్షిణ తాంబూలాలు సమర్పించుకోవాల్సి వచ్చేది. చివరికి వడ్డీకి బ్యాంకు లోను కావాలన్నా నాయకులకు నజరానాలివ్వాల్సి వచ్చేది. ఓ పరిశ్రమలో ఉత్పాదక శక్తిని పెంచాలన్నా లైసెన్సు అవసరమయ్యేది! ఇప్పుడు చాలా మేరకు పరిశ్రమల స్థాపనకు లైసెన్సులు అవసరం లేకపోవటంతో ఆ రకమయిన అవినీతి తగ్గింది. ఇప్పటికీ వివిధ నియంత్రణల పేరుతో అవినీతి కొనసాగుతున్న మాట వాస్తవం. అయితే పరిశ్రమల స్థాపనలో అవినీతి పూర్వమంతగా అడ్డుపడటం లేదు. ఒక ముడిసరుకును దిగుమతి చేసుకోవాలన్నా, వస్తువులను ఎగుమతి చేయాలన్నా, సిటీ బస్సు నడపాలన్నా, చివరికి పంచదారగాని, సిమెంటుగాని సొంత అవసరాలకు కొనుక్కోవాలన్నా అనాడు పర్మిట్ల అవసరముండేది. అడుగడుగునా పర్మిట్ల కోసం అమ్యామ్యాలు చెల్లించటం ఆనాడు మామూలయ్యింది. ఆ పర్మిట్లు ఉన్న వాళ్లు కోట్లకు పడగలెత్తే వారు; నిజాయతీగా ఓ వ్యాపారాన్నో, మరో ఆర్థిక కార్యక్రమానో చేపట్టే వారు అనుక్షణం నరకయాతన అనుభవించేవారు. నేడు-చాలా వరకు ఆ పర్మిట్లకు కాలం చెల్లిపోవటంతో ఆ మేరకు అవినీతి బెడద తగ్గింది.

### మూసుకుపోతున్న మార్గాలు

తరవాతి కాలంలో అవసరార్థం ఆర్థిక సంస్కరణలను చేపట్టి ఆర్థిక నిర్ణయాలలో ప్రభుత్వ పాత్రను చాలా మేరకు తగ్గించారు. దాంతో అక్రమార్జనకు, అవినీతికి

గతంలో ఉన్న సులభ మార్గాలు క్రమక్రమంగా మూసుకుపోతున్నాయి. నేటికీ సెంట్రల్ ఎక్సైజు, కస్టమ్స్, అబ్కారీ, వాణిజ్య పన్నులు, ఆదాయం పన్నులాంటి శాఖలలో అవినీతి బెడద బాగా ఉన్న మాట వాస్తవం. ఈ శాఖలలో పారదర్శకత పెంచటం కోసం, అవినీతిని అదుపు చేయటం కోసం వత్తిడులు పెరుగుతున్నాయి. దాంతో పరిస్థితులు కొంత మేరకు బాగుపడుతున్నాయి. మన రాజకీయ వ్యవస్థ మొత్తం గత 40 ఏళ్లలో అవినీతి పునాదుల మీద నిలబడింది. ఏదో విధంగా పెద్దయెత్తున అక్రమార్జన చేయకుండా, ప్రజాధనాన్ని దోపిడీ చేయకుండా – రాజకీయాన్ని నడపటం, ఎన్నికలలో నెగ్గడం, అధికారాన్ని సాధించటం, పదవులను నిలుపుకోవటం సాధ్యం కాదు. నిజానికి క్రమంగా– రాజకీయంలో ఇలాంటి అక్రమ ఖర్చు, డబ్బు అవసరం పెరిగిపోతోంది. అలాగే రాజకీయంలో రిస్కు కూడా పెరిగింది. గతంలో ఏకపార్టీ పాలన ఉన్నప్పుడు గెలుపు ఓటములు ముందుగానే నిర్ణయించటం సాధ్యమయ్యేది. ఇప్పుడు ప్రతి రాష్ట్రంలోనూ తీవ్రమయిన రాజకీయ పోటీ ఉంది. కాబట్టి నియోజకవర్గ స్థాయిలోగాని, రాష్ట్రం మొత్తంలో గాని ఎవరు గెలుస్తారో కచ్చితంగా ఊహించటం సాధ్యం కాదు. బాగా డబ్బు ఖర్చు పెట్టినా ఓ పార్టీ గెలుస్తుందనే నమ్మకం లేదు. దాంతో రాజకీయంలో ఖర్చు పెరిగింది. రిస్కులు కూడా పెరిగాయి. అక్రమార్జన గతంలో కంటే మరింతగా అవసరమయింది. డబ్బు అవసరం పెరుగుతుండగా ఆర్థిక నిర్ణయాలలో ప్రభుత్వ పాత్ర తగ్గుతూ వస్తోంది. కాబట్టి అక్రమార్జన మార్గాలు మూసుకుపోతున్నాయి ఇదో విచిత్రమైన పరిస్థితి. అందుకే అవినీతి కూడా ఆర్థిక నిర్ణయాల నుంచి ప్రభుత్వం తప్పుకోలేని ఇతర రంగాలకు క్రమక్రమంగా పాకుతోంది. నేర పరిశోధన, ప్రభుత్వ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, చట్టబద్ధ పాలన, సహజ వనరుల అభివృద్ధి– ఇవన్నీ నిరంతరం ఏ వ్యవస్థలోనయినా ప్రభుత్వం చేతుల్లోనే ఉంటాయి. ఇటీవలి కాలంలో ఈ రంగాలలో అక్రమాలు, అవినీతి విపరీతంగా పెరిగిపోయాయి.

ఆస్తులు కొన్నప్పుడు చట్టబద్ధంగా హక్కులు బదిలీ కావాలంటే ఆ కొనుగోళను నమోదు చేసుకోవటం అవసరం. అందుకు స్టాంపు డ్యూటీ పేరుతో ప్రభుత్వానికి పెద్ద యెత్తున పన్ను కట్టాలి. ఆ పన్నులు మరీ ఎక్కువగా ఉండటంతో కొనేవారు తక్కువ మొత్తాలకు నమోదు చేయించుకోవటం, ఆ విధంగా 'కోల్పోతున్న' ఆదాయాన్ని పెంచాలని ప్రభుత్వం ఆ భూముల మౌలిక విలువను విపరీతంగా పెంచి పన్నులు కట్టించుకోవటం, పన్ను ఎంత చెల్లించినా రిజిస్ట్రేషన్ అధికారులకు మామూళ్లు

సమర్పించుకోవటం- ఇవన్నీ ప్రజలకు అనుభవమే. అబ్దుల్ కరీం తెల్గీ పుణ్యమా అని అసలు- నకిలీ స్టాంపు పత్రాలనే అచ్చు వేసి ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయలు గండి కొట్టవచ్చని, ఆ విధంగా ఎందరో కోట్లకు పడగలెత్తవచ్చని కొత్తగా అనుభవంలోకి వచ్చింది. ఇలాంటి అక్రమాలు ప్రభుత్వంలో, రాజకీయంలో పలుకుబడి, అధికారం ఉన్న వాళ్ల అండతో మాత్రమే సాధ్యం. మన రాష్ట్రంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, మహారాష్ట్రలో శాసన సభ్యుడు అనిల్ ఘోటే ఇప్పటికే ఇందులో అరెస్టయ్యారు. మహారాష్ట్రలో ఉప ముఖ్యమంత్రి చగన్ భుజబల్, మాజీ ముఖ్యమంత్రి విలాసరావ్ దేశ్‌ముఖ్, కర్ణాటకలో మరి కొందరు పెద్ద నాయకులకు ఈ కుంభకోణంతో సంబంధముందని ఆరోపణలు వస్తున్నాయి. ముంబాయి నగరంలో నిన్న మొన్నటి దాకా పోలీసు కమిషనర్‌గా పనిచేసిన ఆర్.యస్.శర్మ, మహారాష్ట్రలో నిఘా విభాగం ఐ.జి.గా పని చేసి అరెస్టయిన శ్రీధర్, వాఘే, ధారవి నేరపరిశోధక విభాగం అధికారి దిలీప్ కామత్, మరెందరో పోలీసు అధికారులు ఈ దారుణ నేరంలో కుమ్మక్కయ్యారని ఆధారాలు దొరికాయి. రాజీవ్ గాంధీ ప్రభుత్వం బోఫోర్స్ కొనుగోలులో రూ॥64కోట్ల రూపాయల కమిషన్లు పుచ్చుకుందనే ఆరోపణ 1989లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమయింది. అలాంటిది ఓ మామూలు నేరస్తుడు స్వార్ధరాజకీయ నాయకుల, లంచగొండి అధికారుల అండతో వేల కోట్ల రూపాయలను అవలీలగా కైంకర్యం చేయగలిగాడంటే అవినీతి స్వరూపం గత రెండు దశాబ్దాలలో ఎలా మారిందో మనకు అర్థమవుతుంది.

బీహార్‌కు చెందిన రంజిత్ సింగ్ అలియాస్ కుమార్ సుమన్ సింగ్ అనే ప్రబుద్ధుడు ఇటీవల ప్రతిష్ఠాత్మకమయిన ఐ.ఐ.ఎం.ల ఉమ్మడి ప్రవేశ పరీక్ష పత్రాలను వెల్లడి చేసిన సంఘటన సంచలనం సృష్టించింది. సి.బి.ఐ.కి దొరికిన ఆధారాల ప్రకారం అతడి ముఠా చాలా ఏళ్లుగా ఎన్నో ప్రశ్న పత్రాలను వెల్లడి చేసి అమ్ముకుంటోందని, అతడి అక్రమార్జన ఏటా 100 కోట్ల రూపాయల వరకు ఉందని తెలుస్తోంది! అన్నింటినీ మించి అతడి లక్ష్యం పార్లమెంటు సభ్యుడై అధికారంలో కూర్చోవడమట! మన అదృష్టం కొద్దీ పట్టుబడ్డాడు కాని లేకపోతే ఏ కేంద్ర మంత్రిగానో, ముఖ్యమంత్రిగానో ఈ బడా నేరస్తుడు కొద్ది సంవత్సరాలలో దర్శనమిచ్చేవాడు. నేరచరిత్రకు, అక్రమార్జనకు, రాజకీయాలకు మధ్యనున్న అవినాభావ సంబంధాన్ని రంజిత్ సింగ్ ఉదంతం మరోమారు బట్టబయలు చేస్తోంది. మైనింగ్ లీజులు ఇప్పించటంలో సాయం చేస్తానని లంచం తీసుకుంటూ వీడియో కెమెరా సాక్ష్యంతో

పట్టుబడ్డ కేంద్ర మంత్రి, చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బడానేత, దిలీప్‌సింగ్ జుదేవ్ సంగతి మనందరికీ తెలిసిందే. జుదేవ్, బంగారు లక్ష్మణ్‌లాంటి వారు సాక్ష్యాలతో పట్టుబడవచ్చు. కాని నూటికి 90 మంది నాయకులు ఏదోఒక రూపంలో డబ్బు పుచ్చుకుంటున్నారని, లేకపోతే మన రాజకీయం, ఎన్నికలు నడవవని అందరికీ తెలుసు. కొందరు బహిరంగంగా, పట్టుబడేలా ముడుపులు పుచ్చుకుంటుండగా, మరికొందరు చాలా గోప్యంగా ఎవరికీ దొరకకుండా డబ్బు వసూళ్లు చేస్తున్నారు. అక్రమార్జన పద్ధతిలో తేడా తప్ప, అవి నీతి రాజకీయంలో తేడాలే లేవు.

నిజానికి మనదేశంలో ప్రతి ప్రభుత్వమూ అవినీతి పునాదుల మీదే నిలబడి ఉంది. కొందరు వ్యక్తులు, నాయకులు నిజాయతీకి మారుపేరుగా నిలబడుతున్న వారున్నారు. ఉదాహరణకు కేరళ ముఖ్యమంత్రి ఎ.కె.ఆంటోని, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, మాజీ ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్, మాజీ విద్యుత్ మంత్రి సురేష్‌ప్రభు, ఉప ప్రధాని ఎల్.కె.అద్వాని, మంత్రులు అరుణ్‌శౌరి, అరున్‌జైట్లీ లాంటివారి నిజాయతీ విషయంలో ఎవరికీ అణుమాత్రం కూడా సందేహంలేదు. నిజాయతీపరులు ఉన్న శాఖలలో, ప్రభుత్వాలలో కూడా అవినీతి విశృంఖలంగా కొనసాగుతున్న మాట వాస్తవం. ఒక నాయకుడు నిజాయతీగా ఉన్నా, మన రాజకీయ వ్యవస్థే అవినీతి పునాదులమీద నీలబడ్డ కారణంగా ఈ ఊబిలోంచి తప్పుకోవటం ఎవరికీ సాధ్యం కావటం లేదు.

ఉదాహరణకు నవంబరు 19వ తేదీన కేరళలోని ఎర్నా కుళం నగరంలో మాజీ ముఖ్యమంత్రి, వృద్ధి కాంగ్రెస్ రాజకీయుడు కరుణాకరన్ ఓ పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ఆ ప్రదర్శన సభకు కనీసం రూ॥10 కోట్ల పైన ఖర్చయిందని అంచనా. పొరపాటునగాని, కుతూహలంతోగాని ఆ సభా ప్రాంగణంలోకి ఎవరయినా ప్రశేశించినా, వారికి భోజనం కూపన్లతో పాటు ఒక్కొక్కరికీ రూ॥150 నగదును అక్కడికక్కడే ఇచ్చారు! ఇక చాలామందిని దూరప్రాంతాల నుంచి తరలించటానికి, కిరాయి జనాన్ని సమీకరించటానికి కోట్ల రూపాయల ఖర్చయింది. ఇంతకీ ఆ సభ లక్ష్యం ఏమిటా అని ఆరాతీస్తే అందులో ప్రజాసంక్షేమంగాని, జనానికి పనికొచ్చే సందేశం గాని, రాజకీయాన్ని మరింత సంపన్నం చేసే అంశాలుగాని ఏమీలేవు. కేవలం ఎ.కె.ఆంటోనీని ముఖ్యమంత్రి పదవి నుంచి దించటం, కరుణాకరన్‌ను ఆ గద్దెమీద కనీసం కొంతకాలమయినా కూర్చోబెట్టడం, అతని కుమారుడు మురళీధరన్‌ను, కుమార్తె పద్మజను కాబోయే మహానాయకులుగా చిత్రించటం మాత్రమే

ఆ సభ లక్ష్యాలు. అంతపెద్ద యెత్తున నల్లధనాన్ని ఖర్చు పెట్టినప్పుడు అంతకు పది రెట్లు అక్రమార్జన చేయకపోతే రాజకీయం నడవదు. కేవలం సభకు తీసుకురావడానికే తలసరి ఖర్చు 300–400 రూపాయలు ఉన్నప్పుడు, రేపు ఓట్లు వేయించుకోవాలంటే ఎంత ఖర్చవుతుందో అంచనా వేయవచ్చు దీన్నంతా తట్టుకొని నిలబడాలంటే ఆంటోని మంత్రివర్గానికి ఎంతటి దినదిన గండమో ఊహించుకోవటం కష్టం కాదు. అందుకే అవినీతి, అక్రమార్జన, నిరంతర కుట్రలు, వాటిని తట్టుకునే శక్తి, కండబలం అండ, నేరస్తుల ప్రమేయం లేకుండా మన రాజకీయం నడవదు. ఆర్థిక సంస్కరణల పేరుతో అవినీతికి కొన్నిమార్గాలను మూసేసినా, మరింత ప్రమాదకరమయిన, సమాజానికి హానిచేసే మార్గాలు తెరుచుకోక తప్పదు. అందుకే ప్రస్తుత పద్ధతిలో రాజకీయం నడచినన్నాళ్లు తెల్గీ లాంటి వాళ్ల తెగువతో స్టాంపుల కుంభకోణాలు, రంజీత్ సింగ్ లాంటి వారు. డబ్బుకు ప్రతిఫలంగా చేసే పక్షపాత నిర్ణయాలు తప్పవు.

## మార్పు సాధ్యమే

మన రాజకీయ వ్యవస్థలో అక్రమార్జన, నేరస్తుల పాత్ర, సామాన్యులను ఏదో ఒక విధంగా వంచించి సమీకరించటానికి కులమతాల ప్రమేయం విడదీయరాని అంతర్భాగాలయ్యాయి. కాబట్టే ఇప్పుడు మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఢిల్లీలలో జరిగే ఎన్నికలలో ఎవరుగెలిచినా తేడా ఉండదు. ఈ పందెంలో గెలిచేవారు అక్రమార్జనకు ఉవ్విళ్ళూరుతుండగా, ఓడేవారు పెట్టుబడి వృథా అయిందిగదా అని దిగులు పడి, మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు అధికారం సాధించటం ఎలాగా అని పథకాలు వేయటం, ఈలోగా పార్టీలు మారి గద్దెనెక్కే ప్రయత్నాలు చేయటం– ఇవన్నీ షరా మామూలే. ఇది కేవలం దోపిడీచేసే హక్కు కోసం జరిగే పోరాటమేగాని, దోపిడీని ఆపేందుకు జరిగే ప్రయత్నం కాదు. ప్రస్తుతం ఉన్న ఎన్నికల వ్యవస్థ కొనసాగినంత వరకు ఆటగాళ్ల మార్పే తప్ప, ఆట నియమాలు మాత్రం మారవు. ఎవరు గెలిచినా నిరంతరం ఓడేది ప్రజలు మాత్రమే. ఎన్నికల వ్యవస్థను సమూలంగా మార్చి... డబ్బు ఖర్చు, నేర చరితుల అవసరం, కులసమీకరణలు లేకుండా ఎన్నికయ్యే పద్ధతులను ప్రవేశపెట్టినప్పుడు; నిజాయతీగా అధికారంలో కొనసాగే పరిస్థితులు కల్పించినప్పుడు మాత్రమే మన ఎన్నికలవల్ల మంచి పాలన లభిస్తుంది. జరుగుతున్న గారడీ, కొనసాగుతున్న దోపిడీ జనసామాన్యానికి అర్థమయినప్పుడే ఎన్నికల వ్యవస్థలో మౌలిక మార్పులు సాధ్యమవుతాయి.

* * *

# పాలకుల ప్రయోజకత్వంలో పెరుగుతున్న అవినీతి

## ఏప్రిల్ 21, 2003

అవినీతిని గురించి రోజూ ఏదో ఒక రూపంలో మనం చర్చిస్తున్నాం. పత్రికలలో అడపాదడపా పత్రికా శీర్షికలు వస్తున్నాయి. అవినీతికి వ్యతిరేకంగా ప్రతి పార్టీ. పౌర సమాజంలోని ప్రతి సంస్థ ఆర్భాటంగా ప్రకటనలు చేస్తుంటాయి. అవినీతిని అంతం చేయటానికి కంకణం కట్టుకున్నట్లు ప్రతి ప్రభుత్వం ప్రతిజ్ఞ చేస్తుంది. అవినీతికి అడ్డుకట్టవేయడానికి తాము చేస్తున్న ప్రయత్నాలను అవినీతి నిరోధక సంస్థలకు చెందిన అధికారులూ తరచు ఏ కరువు పెడుతూ ఉంటారు. అయినా అవినీతి విశృంఖలంగా కొనసాగుతూనే ఉంది. లంచాలు లేకుండా ఏ పనీ జరగటం లేదు. లంచ గొండితనానికి మూలకారణం మన ప్రజలలో నైతిక విలువలు కొరవడటమేనని కొందరు చేస్తున్న వాదన అసంబంద్ధమైనదే. మన దేశంలో నూటికి 90 మంది ప్రజలు ఇప్పటికీ నీతి నియమాలకు కట్టుబడి జీవన యాత్ర సాగిస్తున్నారు. సగటు భారతీయుడు ఇతరుల సొమ్మును ఆశించడని, పర ధనాన్ని పాపంగా భావిస్తాడని, నీతిగా బతుకుతాడని ఎన్నో సందర్భాల్లో రుజువయింది. సంపన్నుల్లో, ఉద్యోగుల్లో, అధికారుల్లో, రాజకీయనాయకుల్లో చాలామంది ఏదో ఒక రూపంలో అవినీతికి పాల్పడుతున్నారని కొందరు వాదించవచ్చు. కానీ ఆ వర్గాలలోనూ చాలా మంది నిజాయతీపరులున్నారు. ఉదాహరణకు ఇటివలిదాకా కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన సురేష్ ప్రభు నిక్కచ్చిగా, నిజాయతీగా వ్యవహరించిన వ్యక్తి, నీతి, నిజాయతీలకు అంకితమయినవారు అధికార యంత్రాంగంలోను ఎందరో ఉన్నారు. నిజానికి రాజకీయాల్లో ప్రవేశించేవారిలో లేదా ఉద్యోగాల్లో చేరేవారిలో చాలా మందికి మొదట్లో సదాశయాలు, సదుద్దేశాలు  ఉంటాయి. కానీ ఆ తరవాతే రెండు విషయాలు వారికి బోధపడతాయి. నేటి మన రాజకీయాల్లో నిజాయతీతో మనుగడ సాగించటం అసాధ్యం. రాజకీయాలు నడవాలంటేనే అవినీతి అవసరమయింది. అక్రమార్జన లేకుండా, లెక్కకు మించి ఖర్చు చేయకుండా, అస్మదీయులకు అందినంత దోచిపెట్టకుండా అధికార క్రీడలో గెలుపొందటం అసాధ్యం. అందునా ప్రధాన పార్టీలకు రాజకీయం ఓ పెద్ద వ్యాపారంగా మారిపోయింది. రాజకీయ నాయకులు వ్యక్తిగతంగా

నిజాయతీగా ఉన్నప్పటికీ, అవినీతి పునాదుల మీద నిలబడ్డ రాజకీయాల స్వభావాన్ని మార్చే పరిస్థితుల్లో మాత్రం వారు లేరు. ఆ దిశగా వారు మరీ గట్టిగా ప్రయత్నిస్తే పదవీ గండం తప్పదు. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నవాళ్లకు చప్పున అర్థమయ్యే మరో విషయమేమంటే వ్యవస్థలో నీతి, నిజాయతీలకు తగిన గుర్తింపు, గౌరవం లేవు. పైపెచ్చు నిజాయితీపరులకు ఎన్నో ఎదురుదెబ్బలు, పరాభవాలు, ఇబ్బందులు తప్పడం లేదు. అవినీతిపరులకు శిక్షపడక పోగా వారికి సంపద, అధికారం, పలుకుబడి, హోదా సమకూరుతున్నాయి. మంచి వల్ల లాభం కన్నా ఇబ్బందులు. అవినీతి వల్ల శిక్ష లేకపోగా ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తించి చాలామంది ఏదో ఒక రూపంలో అవినీతినే ఆశ్రయిస్తున్నారు.

## అధికారాల వికేంద్రీకరణే శరణ్యం

రాజ్య వ్యవస్థలో అవినీతి లేకుండా అధికారంలో మనుగడ సాగించలేని ఈ దుస్థితిని మార్చాలి. ఎన్నికలలో కోట్లు పెట్టుబడిగా పెట్టి పదవి పొంది, ఆ తరువాత అంతకు పదింతలు దోచుకోవటం సహజం. కాబట్టి ఎన్నికల సమూల ప్రక్షాళనతోనే అవినీతిని అంతమొందించగలం అధికారం ఎంతగా కేంద్రీకృతమైతే అవినీతి కూడా అంతగానూ పెరుగుతుంది. అధికారాన్ని పూర్తిగా వికేంద్రీకరించి ప్రజలకు చేరువగా, వారు వేసే ఓటుకు, జరిగే మంచికి మధ్య సంబంధం బలపడేలా, పౌరులు కట్టే పన్నులకు వారికి అందే సేవలకు మధ్య లంకె అర్థమయ్యేలా పాలనను మారిస్తే అవినీతి తగ్గుతుంది. విశృంఖల అధికారం ఎప్పుడూ అవినీతికి దారితీస్తుంది. గద్దెమీద కూర్చున్నవారు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా, పాలన పారదర్శకంగా ఉండేలా, అధికారం, బాధ్యత మిళితమయ్యేలా మార్పులను తెస్తే అవినీతిని అణచివేయవచ్చు. అందుకే పరిపాలన స్వచ్ఛంగా ఉండాలంటే– పాలనా సమాచార హక్కు, పౌరహక్కుల పత్రాలు వంటి ఏర్పాట్లు అత్యవసరం.

ఎలాంటి వ్యవస్థను రూపొందించినా తమ తాత్కాలిక స్వప్రయోజనాల కోసం సమాజ హితాన్ని తాకట్టు పెట్టేవారు. కొందరు ఎప్పుడూ ఉంటారు. అలాంటి వారిని గుర్తించి– అవినీతికి పాల్పడితే శిక్ష తప్పదనే భయాన్ని వారిలో కల్పించకపోతే లంచగొడులు పేట్రేగిపోతారు; నిజాయతీపరులు బలహీనమవుతారు. అందుకే అవినీతిని నిరోధించడానికి బలమైన యంత్రాంగం, తప్పుచేస్తే శిక్షించే వ్యవస్థ అవసరం. ఇటు వంటి ఏర్పాట్లు చేయాలన్న చిత్తశుద్ధి మన ప్రభుత్వాలకు, పార్టీలకు లేదు. అవినీతిని అడ్డుకోవాల్సిన సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో అడ్డంకులు

కల్పిస్తున్న తీరే ఇందుకు నిదర్శనం. అవినీతిపరులైన అధికారుల, ఉద్యోగుల చర్యలను పరిశోధించటానికి, వారిపై నిఘా వేయటానికి, వారు లంచం స్వీకరించినట్లుగాని, ఆదాయాన్ని మించిన ఆస్తులు కూడబెట్టినట్లుగాని ఆధారాలుంటే వారిమీద నేరారోపణ చేసి కోర్టుముందు నిలబెట్టడానికి రాష్ట్రాలలో ఎ.సి.బి. పేరిట ఓ సంస్థ ఉంది. అయితే ఏదో గుమాస్తా వంద రూపాయలు లంచం పుచ్చుకున్నాడని అరెస్టు చేయడమో, ఓ కిందిస్థాయి అధికారికి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని కేసులు పెట్టడమో తప్ప అవినీతికి మూలవిరాట్టుగా ఉన్న ఉన్నతస్థాయి అధికారులపై చర్య తీసుకునే అవకాశం ఎ.సి.బి.కి లేదు. కొన్ని సందర్భాలలో అవినీతి మీద నిఘా వేయవలసిన ఎ.సి.బి.లోనే అవినీతిపరులు ఉండవచ్చు. ఎ.సి.బి.అధికారులు నిజాయతీగా పనిచేసి అవినీతిని ఎదుర్కొనే ప్రయత్నం చేస్తే వారిని ప్రభుత్వం అడ్డుకుంటున్న సందర్భాలూ ఉన్నాయి. ఉదాహరణకు ఎందరో ఉన్నతాధికారుల మీద అవినీతి ఆరోపణలున్నాయని, అవి పరిశీలనార్హమైనవని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, పరిశోధనకు అనుమతించాలని ఎ.సి.బి కోరినా, ఏళ్లతరబడి ఆ ఫైళ్లకు ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయిలో మోక్షం లభించడంలేదు. అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు చేస్తే ఎక్కడ ఏ లోసుగు బయటపడుతుందోనన్న భయంతోను, ఉన్నతాధికారులను తమ చెప్పుచేతుల్లో ఉంచుకోవాలన్న కోరికతోను- ఓ స్థాయికి మించిన అధికారులపై పరిశోధనను తమ అనుమతి లేకుండా చేపట్టరాదని ప్రభుత్వం ఆదేశాలనిచ్చింది. రాజ్యాంగ విలువలకు, చట్టబద్ధ పాలనకు ఇది పూర్తిగా విరుద్ధం అయినా నిర్లజ్జగా ముఖ్యమంత్రులు ఎ.సి.బి.కి సంకెళ్లు వేసి అవినీతిని పెంచి పోషిస్తున్నారు. అవినీతిపరులను రక్షిస్తున్నారు.

రాష్ట్రాలలో తీరు ఇలా ఉంటే కేంద్ర ప్రభుత్వం కూడా అందుకేమీ తీసిపోకుండా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోంది. జాతీయ స్థాయిలో సి.బి.ఐ మీద విచ్చలవిడిగా పెత్తనం చలాయిస్తూ ఏ కేసులలో పరిశోధన కొనసాగించాలో, వేటిని తొక్కిపట్టాలో ప్రభుత్వం నిర్ణయిస్తోంది. అదేమంటే ఢిల్లీ ప్రత్యేక పోలీసు యంత్రాంగం చట్టంలోని 4వ సెక్షన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం అజమాయిషీ కింద సి.బి.ఐ. పనిచేయాలని, కాబట్టి నేర పరిశోధనలో తమ ఆదేశాలకు లోబడి పనిచేయాలని ప్రభుత్వ వాదన. అవినీతి ఆరోపణలున్న అధికారులు ఓ స్థాయికి పైబడినవారయితే వారిమీద దర్యాప్తు చేయటానికి ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని ఇందిరాగాంధీ ప్రభుత్వం 1960లలో ఆదేశాలిచ్చింది. వాటినే ఆ తరవాతా పునరుద్ధాటించారు. అంటే ఎవరిమీదనైనా దర్యాప్తు చేయాలో, వద్దో సాక్ష్యాల ఆధారంగా స్వతంత్రంగా నిర్ణయం

తీసుకునే వీలు కేంద్ర నేరపరిశోధన సంస్థకు లేదు. ఆ దర్యాప్తులకు సంబంధించి సి.బి.ఐ.కి ప్రభుత్వమే రాజకీయ కారణాలతో, పక్షపాత వైఖరితో ఆదేశాలిస్తుంది! ఇది రాజ్యాంగ విరుద్ధమని 1997లో వినీత్ నారాయణ్ కేసులో (జైన్ హవాలా కేసు) సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఆ తీర్పులో రెండు కీలకమైన అంశాలున్నాయి. చట్టంలో ప్రభుత్వ అజమాయిషీ ఉండాలని పేర్కొన్నంత మాత్రాన అది రోజువారీ ప్రభుత్వ నియంత్రణ కారాదని, కేసులలో ప్రభుత్వ జోక్యం ఉండరాదని కోర్టు ఆదేశించింది. కేంద్ర నిఘా సంఘం అయిన సి.వి.సి. అజమాయిషీ కింద సి.బి.ఐ. పనిచేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇక రెండో అంశం– ఉన్నతాధికారుల అవినీతిపై దర్యాప్తు కోసం ముందస్తుగా ప్రభుత్వ అనుమతి కావాలని ఇచ్చిన ఆదేశం రాజ్యాంగంలో 'చట్టం ముందు అందరూ సమానులే' అనే సూత్రాన్ని ఉల్లంఘిస్తోంది కాబట్టి అది చెల్లదని సుప్రీంకోర్టు నిర్ధారించింది.

## దర్యాప్తులపై నియంత్రణకు ప్రయత్నం

సుప్రీంకోర్టు తీర్పును నీరుగార్చటం కోసం ప్రభుత్వం ఇప్పుడు పూనుకొంది. వినీత్ నారాయణ్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా సి.వి.సి.కి చట్టబద్ధతతోపాటు దానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించటం కోసం ప్రభుత్వం ఓ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. అవినీతి కేసులలో సి.వి.సి. ఆదేశాలకు లోబడి సి.బి.ఐ. పనిచేయాలని ఆ బిల్లులో నిర్దేశించారు. ఆ విధంగా సి.వి.సి.ద్వారా సి.బి.ఐ.ని శాసించేందుకు సంకల్పించారు. అలాగే సి.ఎ.సి.ముందస్తు అనుమతి లేకుండా ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్. ఫారెస్టు సర్వీస్, గ్రూప్–1కి చెందిన అధికారులు, ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న అధికారులు– వీరెవరిపైనా సి.బి.ఐ స్వతంత్రంగా దర్యాప్తు చేపట్టరాదని చట్టంలో నిర్దేశించారు. అంటే ఏదో ఒక రూపంలో ప్రభుత్వ నియంత్రణ కొనసాగాలని ప్రయత్నిస్తున్నారు. మన ప్రభుత్వాలు అవినీతి పునాదులమీద ఎలా నిలబడి ఉన్నాయో రుజువు చేయటానికి ఈ ఒక్క ఉదంతం చాలు ఈ నిబంధన కూడా రాజ్యాంగ విరుద్ధమని కోర్టు ప్రకటించవచ్చు. ప్రజాస్వామ్యంలో అధికారాల విభజన కీలకం. ప్రభుత్వం, చట్టసభలు, న్యాయస్థానాలు ప్రతి విభాగం దేని పరిధిలో అది పనిచేయాలి. మన రాజకీయాలను సమూలంగా ప్రక్షాళన చేయకుండా, ఎన్నికల వ్యవస్థను మార్చకుండా ఈ దేశంలో అవినీతిని అరికట్టలేం. అవినీతి జాతిని బలహీనపరుస్తోంది. భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారుతోంది. అవినీతిని అంతం చేయాలంటే ముందుగా రాజకీయాలను, ఎన్నికల సరళిని సమూలంగా మార్చాలి.

* * *

# రాజకీయ అవినీతిని అరికట్టే మార్గమేది?

## సెప్టెంబరు 9, 2002

అవినీతి ఆరోపణల కారణంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి రాజీనామా చేయటంతో మరోసారి ప్రజల దృష్టి అవినీతి మీదకు మళ్ళింది. ఈ ఉదంతంతో మన రాజకీయంలోను, పరిపాలనలోను ఉన్న లొసుగులన్నీ బయటపడ్డాయి. మంచి పరిణామాలను ముందుగా పరిశీలిద్దాం. గత 35 సంవత్సరాలుగా మన దేశంలో ఆటవిడుపు లేకుండా కొనసాగుతూనే ఉన్న అవినీతి పట్ల ప్రజలలో వ్యతిరేకత, అసహనం, నిరసన ఇటీవలి కాలంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు... అయిల్ డీలర్ల నియామకంలో లక్షల రూపాయలు చేతులు మారటం కొన్ని దశాబ్దాలుగా జరుగుతోంది. చివరికు సుప్రీంకోర్టు కూడా గతంలో ప్రభుత్వంపై అక్షింతలు వేసింది. ఒక మంత్రికి 50 లక్షల రూపాయల జరిమానా సైతం విధించింది. ఆ తరవాత మళ్ళీ ఆ జరిమానాను మాఫీ చేశారు. కాని ఈసారి వివరాలు బయటపడగానే ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. దాంతో మంజూరుచేసిన పెట్రోలు బంకుల్ని రద్దుచేయటం, విచారణకు ఆదేశించటం, కోర్టు కేసులు అనివార్యమయ్యాయి. అలాగే స్టేషనరీ కొనుగోలు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి చర్య తీసుకోక తప్పిందికాదు. గతంలోలాగా ప్రజాధనాన్ని దోచుకుంటూ ఉంటే ఇక చూస్తూ ఊరుకోబోమని ప్రజల నుంచి సంకేతం అందుతోంది. ఇదో శుభ పరిణామం. మరో ఆశాజనక విషయమేమంటే– పత్రికల క్రియాశీలక పాత్ర. కొందరు పాత్రికేయులు చాలా సావధానంగా విషయాలను విచారించి కూపీలాగారు. అయిల్ డీలర్ల నియామకం వ్యవహారంలోను, మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖలో కాగితాలు, ఇతర సామాగ్రి కొనుగోళ్ల ఉదంతంలోను పత్రికలు అత్యున్నతప్రమాణాలతో తమ పాత్రను నిర్వహించాయి.

### పరిపాలన పేరుతో దోపిడీ

మంత్రి రాజీనామా నేపథ్యంలో కొన్ని ముఖ్య అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఖజానా ఖాళీ అయి, ప్రభుత్వాలు దివాళా తీసే స్థితిలో ఉండి,

ప్రజల పన్నుల డబ్బుకు తగినట్లుగా ఏ సేవలూ అందని ఈ కాలంలో కూడా పాలన పేరుతో ఎలా యథేచ్ఛగా దోచుకుంటున్నారో మరో మారు ఈ సంఘటన రుజువుచేసింది. మామూలు ప్రభుత్వ కార్యాలయాలలో కేవలం కాగితాలకు, కార్యాలయ రోజువారీ నిర్వహణ కోసం అవసరమయ్యే సామగ్రికి రెండున్నర కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారంటే ఎంత నిర్భయంగా, నిర్లజ్జగా ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారో తెలుస్తోంది. కొనుగోళ్లు, కాంట్రాక్టులు, టెండర్లు, బిల్లుల మంజూరు, తనిఖీలు, ఇలా ఎక్కడ వీలయితే అక్కడ డబ్బు తినటం మామూలయి పోయింది. అసలు ఖరీదుకు కొన్ని రెట్లు చెల్లించినా, అవసరాన్ని మించి, పదేళ్ళపాటు కూడా ఖర్చు చేయనంత డబ్బును కొద్దివారాలలో ఒకే పద్దుకింద ఖర్చుచేసినా, ఖజానా నుంచి డబ్బును అలవోకగా బయటకు తీసినా ఇంతకాలం బయట పడలేదంటే ప్రభుత్వ వ్యవస్థ ఎంతటి పతనావస్థలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనిలో దాగున్న మరో అంశం అధికారంలో ఉన్న వాళ్ల కుటుంబాల పాత్ర. మంత్రి అల్లుడికి ప్రభుత్వశాఖల కొనుగోళ్లలో ఎంతటి పాత్ర ఉందో ఈ ఉదంతం బయట పెడుతోంది. ఇదేదో ఒక మంత్రికో, లేదా కొందరు రాజకీయనాయకులకో మాత్రమే వర్తించే అంశం కాదు. ఎందరో అధికారుల విధి నిర్వహణలో వాళ్ల కుటుంబాలు జోక్యం చేసుకోవటం చూశాం. రాజకీయాలలో అయితే అధికారం కుటుంబ వ్యవహారంలాగా, సొంత ఆస్తిలాగా మారిపోయింది. ఓ అధికారి గాని, మంత్రిగాని తన బంధువు ద్వారా డబ్బు తీసుకోవటం, ఆ డబ్బు ముట్టినట్లు నిర్ధారణ అయ్యాక ఆయన ఫైళ్లమీద సంతకం చేయటం దేశమంతా జరుగుతోంది. గతంలో మన రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగుల నియామకాలకు బంధువుల ద్వారా డబ్బులు గుంజారని తీవ్ర ఆరోపణలున్నాయి. చిత్తశుద్ధితో, నిజాయతీగా పనిచేస్తున్న అధికారులు, మంత్రులు లేకపోలేదు. అలాంటి వారి విధి నిర్వహణలో కుటుంబ జోక్యానికి గాని, పక్షపాతానికి గాని ఇతరుల ఒత్తిళ్ళకు గాని తావులేని మాట వాస్తవం కాని ప్రభుత్వంలో చాలా మంది లంచగొండులున్నమాట కూడా వాస్తవమే. వారు అధికారంలో ఉంటే వారి కుటుంబాల్లోనివారు పైరవీకారులుగాను, లంచాలు గుంజే బ్రోకర్లుగాను, డబ్బులు వసూలుచేసే ఏజెంట్లు గాను చలామణీ అవుతున్నమాట నిజం. కొందరయితే వేరే రాష్ట్రాలలోని తమ బంధువుల ద్వారా డబ్బు వసూలుచేసి, వారి సూచనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవటం కద్దు. స్టేషనరీ కొనుగోలు ఉదంతంలో అధికారులు కుమ్మక్కయినట్లు స్పష్టమయిన ఆధారాలు కనిపిస్తున్నాయి. కొనుగోళ్ల

జరుగుతున్నప్పుడు, లంచాలు మింగుతున్నప్పుడు, ప్రజాధనం కొల్లగొడుతున్నప్పుడు, అక్రమాలు జరుగుతున్నప్పుడు, ఒక్క అధికారి కూడా దాన్ని ఆపలేకపోయారు. ఆ విషయాన్ని బయట పెట్టలేకపోయారు. ఎందువల్ల? అందరు అధికారులు, ఉద్యోగులు లాలూచీపడ్డారంటే విశ్వసించటం కష్టం. రాజకీయ నాయకులలాగానే ఉద్యోగులలో కూడా చాలామంది నిజాయతీపరులున్నారు. కాని అవినీతిపరులతోపాటు వారు కూడా మౌన ప్రేక్షకులుగా మిగిలి పోయారు. ఎందుకు? దీనికి కారణం మన బదిలీలు, నియామకాల వ్యవస్థ. రాష్ట్రాలలో అవినీతిలో చాలా భాగం బదిలీల ద్వారా, కీలక స్థానాలలో నియామకాల ద్వారా కొనసాగుతూ ఉంటుంది. ఎన్నో సందర్భాలలో ఒక ఉద్యోగి లేదా అధికారి బదిలీకి డబ్బు తీసుకోవటం గూర్చి మనం విన్నాం. అలాగే కీలకస్థానాలలోకి ఎవరినయినా బదిలీ చేయాలంటే డబ్బు చేతులు మారటం ఆనవాయితీ, ఇక్కడ 'కీలకస్థానం' అంటే ప్రజలకు బాగా సేవచేసే అవకాశమున్న స్థానం అని కాదు; ప్రజాధనాన్ని బాగా దోచుకునే అవకాశమున్న పదవి అని! కొన్ని శాఖలలోనైతే పదవులకు వేలంపాట ద్వారా నిర్ణయాలు జరగటం, ఎవరు ఎక్కువ పాడితే వారు ఆ స్థానాన్ని దక్కించుకోవడం పరిపాటి. మరికొన్నిచోట్ల ఓ స్థానంలో ఉన్న అధికారి నెలసరి 'మామూలు' పైవారికి చెల్లించాలి. లేదంటే స్థాన చలనం తప్పదు. లేదా వేధింపులు, అవమానాలు, తిరస్కారాలు, మెమోలు, విచారణలకు గురికావాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితులలో డబ్బు ఇచ్చి బదిలీలు చేయించుకునే వాళ్ళకు, నెల మామూళ్లిచ్చే వాళ్ళకు, పై వాళ్ళ అడుగులకు మడుగులు ఒత్తి వాళు చెప్పినట్లు చేసే వాళ్లకు ఏ ఇబ్బందులు ఉండవు. కానీ నిజాయతీ పరులైన అధికారులకు, ఉద్యోగులకు రోజూ తంటాయే! ఏ ఫైలులో ఏముందో, ఎక్కడ తమను ఇరికిస్తారోననే భయం ఒక వంక, చెప్పిన మాట వినకపోతే ఎక్కడ రుసరుసలాడతారోననే జంకు మరోవంక, అన్నింటినీ మించి తమకు శంకరగిరి మాన్యాలు పట్టిస్తారనే బెరుకు మరోవంక– ఇలా క్షణ క్షణం నిజాయతీపరులు భయం భయంగా గడపటం సర్వసాధారణం. ఒకటి రెండు సందర్భాలలో అవినీతిని ఎదిరించి, ఆ కారణంగా భంగపడ్డవాళ్లు, ఇష్టం వచ్చినట్లు బదిలీలకు గురి అయినవాళ్లు ఇక అవినీతిని ఎదిరించే సాహసం చేయరు. తాము కూడా అవినీతి చక్రంలో చిక్కుకుని, లంచాలకు అలవాటుపడిపోతారు. లేదా, తాము నీతిని తప్పకపోయినా, చుట్టూ ఉన్న అవినీతిని పట్టించుకోకుండా తలలు వంచుకుని తమ పనిని తాము చేసుకుపోతూ ఉంటారు. లేదంటే వారికి ఇబ్బందులు తప్పవు. ఇలా ఓ భయంకర విషవలయంలో

అందరూ చిక్కుకుని పోయారు. అందుకే అంతమంది ఉద్యోగులు ఉన్నా, ఒక్కరు కూడా ధైర్యం చేసి సకాలంలో వాస్తవాలను బయటపెట్టలేకపోయారు. ఇందుకు మరో కారణం ప్రజలకు పాలనాసమాచార హక్కు లేకపోవటం, అసలు ఎక్కడ, ఎవరు, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారో అంతా అయిపోయేదాకా బ్రహ్మరహస్యం. దాంతో జరగాల్సిందంతా జరిగిపోయేదాకా అక్రమాలు బయటికి పొక్కవు ఆ తరవాత కూడా విషయం బయటపడాలంటే ఎన్నో కూపీలు లాగాలి. పరిశోధన చెయ్యాలి, అదే పనిగా పెట్టుకుని చాలా కష్టపడాలి.కొనుగోళ్ల లాంటి అంశంలో కొంతమేరకు వాస్తవాలను అలస్యంగానయినా సేకరించవచ్చు. కాని చాలా ఇతర అంశాలలో కొంతకాలం గడిచాక అసలు ఏ సాక్ష్యమూదొరకదు. మన ప్రభుత్వాల అవినీతిని నిరంతరం పెంచి పోషించేది ఈ దాపరికమే. ప్రజలకు సమాచారాన్ని అందించే చట్టాన్ని చేయటం మన పాలకులకు నామోషి పొరపాటున ఏదైనా చట్టం వచ్చినా, దాన్ని ఎందుకూ పనికి రాకుండా, అవినీతికి ఏవిధంగాను అడ్డురాకుండా చేయటం వారికి వెన్నతోపెట్టిన విద్య! 'కేవలం కాగితాల కొనుగోళ్లలో ఇంత అవినీతి ఎలా సాధ్యమయిందా...?' అని మనకు ఆశ్చర్యం కలుగుతుంది. పాలన ఎంతగా కేంద్రీకృతమయితే, పెద్ద పెద్ద కుంభకోణాలు అంత సులువు. అధికారాన్ని వికేంద్రీకరిస్తే అవినీతి ఉండదని కాదు. కాని చిన్న స్థాయిలో ఇంత పెద్దఎత్తున అవినీతి సాధ్యం కాదు. ఒకవేళ ఎవరైనా అవినీతికి పాల్పడినా దాన్ని దాచటం కష్టం. అలాగే లంచగొండులను ఎదిరించటం, వాళ్ళ భరతం పట్టడం స్థానికంగా చాలా తేలిక. పాలనలో ఎంత కేంద్రీకరణ ఉంటే అంతగా వాస్తవాలను దాచిపెట్టవచ్చు; మసిపూసి మారేడు కాయ చేయవచ్చు.

## ఎన్నికల రాజకీయం వల్లే...

ఇక ఈ అవినీతి మొత్తానికి మూలం ఎన్నికలు జరిగేతీరు. పార్టీ అభ్యర్థులకు పై నాయకులు ఇచ్చే ఆదేశం ఒక్కటే "ఎంత ఖర్చుపెట్టి అయినా సరే, ఏం చేసినా సరే, ఏదో ఒక రకంగా సీటును గెలుచుకుని రా, అంతే! అప్పటిదాకా మాట్లాడకు"! అని అందుకే ఎన్నికల్లో గెలవడంకోసం నానా అడ్డదారులు తొక్కి, కోట్ల డబ్బును మంచినీళ్లప్రాయంగా ఖర్చుచేస్తున్నారు. ఓట్లు కొంటున్నారు, సారాయి పంచుతున్నారు. ఇంతా చేసి గెలిచాక రాజకీయాన్ని వ్యాపారంగా మార్చకపోతే పదవులు నిలవవు. ఎక్కడ వీలుంటే అంత దోచుకుతిన్నాల్సిందే. లేకపోతే రాజకీయంలో నిలదొక్కుకోలేరు. అలాగే తమ విజయం కోసం నానా కష్టాలు పడి, లాఠీ దెబ్బలు తిని, చీటికి మాటికీ

వీధుల్లోకి వచ్చి, ధర్నాలు చేసి, మిగిలిన పనులన్నింటినీ వదిలేసి, రాకీయాన్ని వృత్తిగా చేసుకున్న 'కార్యకర్తల'ను 'సంతృప్తి' పరచాలంటే అవినీతి తప్పదు. అది మద్యనిషేధకాలంలో సారా స్మగ్లింగుతో రాజకీయ నాయకులు కోట్లకు పడగలెత్తటం కావచ్చు. ప్రైవేటు వివాదాలను తీర్చడానికి పోలీసులను, అధికారబలాన్ని, పలుకుబడిని ఉపయోగించి డబ్బు దండుకోవటం కావచ్చు, గుండాలకు అభయమిచ్చి నేరరాజకీయాలలో అరితేరటం కావచ్చు, పనికి ఆహార పథకంలో కోట్లు మింగటం కావచ్చు– ఇలా ఏదోఒక రూపంలో దోపిడీ చేయకపోతే, కార్యకర్తల జీవితాలకు భరోసా ఇవ్వకపోతే ప్రస్తుత ఎన్నికల రాజకీయం సాధ్యం కాదు... ఇటీవల ఓ జిల్లాలో పర్యటించినప్పుడు కొందరు ప్రజలు నాకు కొత్తగా కట్టిన పెద్ద గిడ్డంగులను చూపెట్టి "అవే పనికి ఆహారపథకం గోడౌన్లు" అని చెప్పారు. అవేవో ఆ పథకంలో భాగం కాబోలుననుకున్న నాకు వారి వివరణ ఆశ్చర్యాన్ని కలిగించింది. పనికి ఆహారపథకంలో అక్రమాల ద్వారా వెనకేసుకున్న డబ్బుతో స్థానిక రాజకీయ నాయకుడొకాయన ఆ గోడౌన్లను కట్టుకున్నాడట! పనికి ఆహార పథకాన్ని తమకు అనుకూలంగా మలుచుకొని– ఓ జిల్లాలో ఉన్న శాసనసభ్యులలో ఇద్దరు, ముగ్గురు మినహాయించి మిగిలిన వారు ప్రతిఒక్కరూ ఆరునెలల కాలంలో కోటి నుంచి మూడు కోట్ల రూపాయల దాకా కూడా బెట్టుకున్నారని స్వయంగా జిల్లా కలెక్టరే నాకు చెప్పారు. ఈ అవినీతిని అంతమొందించటానికి మార్గాలు పుష్కలంగా ఉన్నాయి. చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పం, సామర్థ్యం, మౌలికమయిన మార్పులను చేపట్టే చేవ ఉంటే దుష్పరిపాలనను దోపిడీని వెంటనే అరికట్టవచ్చు. అలా కానినాడు ఈ అవినీతి వారానికో సినిమా చూసినట్లుగాను, టి.వి.సీరియల్ లాగాను అనిపిస్తుందే తప్ప పరిస్థితులు మారవు. పత్రికలు కూడా జరుగుతున్నదాన్ని వివరించటంతో పాటు, తెరచాటు వ్యవహారాలనూ బట్టబయలు చేయాలి.

* * *

# పునాదుల నుంచి పెకలిస్తేనే అవినీతి అంతం

## సెప్టెంబర్ 18, 2000

అవినీతి నిరోధకశాఖ దాడులలో ఓ మాజీ హౌసింగుబోర్డు అధికారి దగ్గర రెండు కోట్లకు పైగా డబ్బు, మరెన్నో నగలు, ఆస్తులు బయపడటం సంచటనం కలిగించింది. ఓ ఖాయిలా పడ్డ సంస్థలో, ఓ బాధ్యతాయుత స్థానంలో ఉన్న అధికారి ఇంత అక్రమ సంపాదనకు ఒడిగట్టగలిగాడంటే మన పాలనలో అవినీతి ఎంతగా వ్యాపించిందో తేలిగ్గా బోధపడుతుంది.

### లంచం- ప్రమాదకర ప్రభావం

ఇదేదో పత్రికలలో వచ్చిన ఓ వార్తే కాని, దీనికి మన జీవితాలకూ సంబంధం లేదని భావిస్తే అంతకంటే పొరపాటు మరొకటి లేదు. ఈ ఉదంతాన్నే తీసుకుంటే– ఆ అధికారి పాల్పడ్డ అవినీతి వెనక ఎంతో మందికి జరిగిన అన్యాయం ఉంది. లంచాలు తినాలంటే, కట్టే ఇళ్ల నాణ్యత లోపించాలి. కూకట్‌పల్లిలో, అనంతపూర్‌లో తదితర ప్రాంతాలలో అల్పాదాయ వర్గాల కోసం హౌసింగుబోర్డు కట్టిన ఇళ్ల స్థితిని చూస్తే ఈ అవినీతికి సామాన్యులు ఎలా బలయిపోతున్నారో వెల్లడవుతుంది. జీవితం మొత్తం ఆదా చేసుకున్న డబ్బు కట్టి, ఆపైన వడ్డీలకు రుణాలు తీసుకుని కొత్త ఇంట్లోకి ప్రవేశించాక ఆనందంగా బతకాల్సిందిపోయి నిత్యం నరకం చవిచూడాల్సి వస్తుంది. ఇదంతా అధికారుల అవినీతి పుణ్యమే. రోడ్లు కావచ్చు, నీటిసరఫరా కావచ్చు, పంట పొలాల మురుగునీటి కాల్వ కావచ్చు, పట్నాలలో వర్షపునీరు పోవటానికి నిర్మించే డ్రెయిన్లు కావచ్చు– ఇలా అన్ని రంగాలలో అవినీతి గబ్బే. దీని వల్ల సామాన్యులు పడే బాధ అంతా ఇంతా కాదు. లంచాలు మేసేవాడు వందరూపాయలు తింటే, దానివల్ల ప్రజలకు కలిగే నష్టం వెయ్యిరూపాయల నుంచి లక్షల రూపాయల దాకా ఉంటుంది. ఓ ఇల్లు కట్టేటప్పుడు సిమెంటు సరైన పాళ్లలో కలపకపోయినా, అవసరమయినంత స్టీలు లేకపోయినా, సరిగా క్యూరింగు చేయకపోయినా కలిగే నష్టం ఆ అధికారులు మింగిన లంచంకంటే కనీసం

వందరెట్లుంటుంది. ఓ డ్రెయిను కట్టేటప్పుడు కనీస ప్రమాణాలను పాటించకపోతే... ఇటీవల మనం చూసినట్లుగా వరదలు వచ్చినప్పుడు కలిగే నష్టం వెయ్యిరెట్లుంటుంది. ఓ పెద్ద వంతెన కట్టినప్పుడు అవినీతికి పాలప్పడితే రేపు అది కాస్తా కూలుతుంది. అప్పుడు జరిగే నష్టం అపారం. ఓ నది మీద డ్యాం కట్టినప్పుడో, వరద రాకుండా గట్లు కట్టినప్పుడో అవినీతికి పాల్పడితే, రేపు డ్యాం కూలిపోయినా, లేదా కట్టలు తెగి వరద నీళ్లు ఊళ్లలోకి ప్రవేశించినా కలిగే నష్టం ఆ అధికారులు పాల్పడ్డ అవినీతికి లక్ష రెట్టుంటుంది. అవినీతివల్ల కలిగే నష్టం కేవలం కట్టడాలకు, ఇళ్లకు, రోడ్లకు, డ్రెయిన్లకు మాత్రమే పరిమితం కాదు. ఏ చిన్న సేవ అందాలన్నా లంచం లేకుండా సాధ్యం కావటం లేదు. ఆసుపత్రిలో బీదలకు వైద్యం దగ్గరినుంచి, ఓ రేషన్‌కార్డు వరకు– అన్ని ప్రభుత్వ సేవలకు లంచం రేట్లు నిర్దిష్టంగా ఉన్నాయి. ఏదన్నా స్థిరాస్తిని కొనుక్కుని రిజిస్టరు చేయించుకోవాలంటే రిజిస్ట్రేషను ఫీజితోపాటు 'మామూలు' చెల్లించాల్సిందే. డ్రైవింగులైసెన్సు పొందాలంటే చట్టప్రకారం చెల్లించాల్సిన ఫీజు కట్టి పరీక్షకు కూర్చోవాలి. దాంట్లో తప్పటం దాదాపు ఖాయం. అదే ఎవడో మధ్య దళారీకి ఐదొందలిస్తే లైసెన్సు మన కాళ్ల దగ్గర కొస్తుంది. లంచానికి ధనిక, బీద తారతమ్యం లేదు, అందరికీ వర్తిస్తుంది. డబ్బున్నవాళ్లకు ఈ లంచం కేవలం చికాకు మిగులుస్తుంది. కానీ బీదల జీవితాలతో అది ఆడుకుంటుంది; కొన్ని సందర్భాలలో ప్రాణాలనే తీస్తుంది. ఆసుపత్రిలో సరిగ్గా వైద్యం అందక చనిపోయే బీదలు కోకొల్లలు. కాయకష్టం చేసుకుని బ్రతికే సామాన్యుల పొట్టకొట్టటం, లంచాల కోసం వాళ్లను ఏడిపించటం, క్షణక్షణం వేధించటం మన దగ్గర కొత్తకాదు. చివరకు ప్రభుత్వం బీదలకు ఉచితంగా అందించే అధునాతన వైద్యంలో కూడా లంచాలున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నిజామ్ ఆసుపత్రి (నిమ్స్)లో ఖరీదయిన వైద్యం ఉచితంగా అందాలంటే బీదలకిచ్చే తెల్లరేషన్ కార్డులుండాలి. నిజంగా ఎందరో బీదలకు ఈ కార్డులు లేవు. స్థోమత ఉన్నా దొంగరేషను కార్డు దొరకపుచ్చుకుని యాభైవేల రూపాయల వరకు ఉచిత వైద్యం పొందాలనే ఆశ చాలా మందికుంది. అలాంటివాళ్లకు బోగస్ రేషన్ కార్డులు ఏర్పాటుచేసి, కార్డుకు పాతికవేల రూపాయలు పుచ్చుకునే పద్ధతి అమలులో ఉందట! దొంగకార్డును అలా కొనుక్కున్నవాళ్లకు ప్రభుత్వం నుంచి యాభైవేల దాకా ఉచితవైద్య సాయం అందుతుంది కాబట్టి ఆ పెట్టుబడి గిట్టుబాటే! సహజంగానే ఇలాంటి కుంభకోణంలో రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల శాఖ, వైద్యశాఖ సిబ్బంది కుమ్మక్కయి ఉంటారు. పట్టణాలలో కూలిచేసుకు బతికే

బలహీనవర్గాలు, షెడ్యూల్డు కులాలవారు పిల్లలను హాస్టల్‌లో పెట్టాలన్నా, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందాలన్నా కులం సర్టిఫికేట్లుడాలి. తాము పుట్టి పెరిగిన చోటుకు వెళ్ళి అక్కడి అధికారుల నుంచి వాటిని తెచ్చుకోవాలి. సత్యసంధుల్లా ఆ ప్రయత్నం చేసేవారు పడే బాధ వర్ణనాతీతం. అలాంటివారికి అడుగడుగునా చేదు అనుభవాలు ఎదురవుతాయి. లంచం వేధింపులు జన సామాన్యానికి రోజువారీ అనుభవమయిపోయాయి. ఇటీవలి కాలంలో ఆర్థిక రంగంలో ప్రభుత్వ ప్రమేయం తగ్గుతోంది. దీనివల్ల లంచం తగ్గిపోతోందనో, పోటీ పెరిగి సరయిన వస్తువులు-సేవలు అందుతాయనో భావించవచ్చు. కానీ లంచం వల్ల అక్కడ కూడా పోటీని దెబ్బకొట్టడం, దాని మూలంగా ఖరీదు పెరగటం సర్వసామాన్యమయింది. మాజీ కేంద్ర మంత్రి సుఖ్‌రాం ఇక్కడ మంచి ఉదాహరణ. టెలికాం ప్రైవేటీకరణలో నిజమైన పోటీ లేకుండా, అస్మదీయులను ప్రోత్సహించటంవల్ల ఆయన దండుకోగలిగారు. అలాగే కాంట్రాక్టులు, టెండర్లు, విద్యుత్ ప్రాజెక్టులు, కొనుగోళ్లు- ఒకటేమిటి, ప్రభుత్వం నిజాయతీగా పోటీ ద్వారా నిర్ణయించవలసిన ప్రతిచోటా లంచాలదే రాజ్యం కావటంతో అనర్హులు నెగ్గుతున్నారు. దానివల్ల పని నాణ్యత తగ్గుతోంది. లేకపోతే లంచం వల్ల ప్రాజెక్టుల ఖర్చు విపరీతంగా పెరిగి ఆ భారం మళ్లీ ప్రజలమీద పడుతోంది. చివరకు చిన్న చిన్న ఉద్యోగాల నియామకాలలో కూడా అభ్యర్థుల భయాందోళనలను, ఆదుర్దాను ఆసరాగా చేసుకుని కోట్లకు కోట్లు సంపాదించటం వ్యాపారమయిపోయింది. లంచం ఇచ్చి ఉద్యోగం తెచ్చుకునే ఉద్యోగి పెట్టుబడిని పూడ్చుకునేందుకు రేపు లంచాలకు పాల్పడటం, ఆ క్రమంలో ప్రజలను వేధించటం ఖాయం. రోజువారీ పనులలో లంచం రాబట్టుకోవటం కోసం జరిగే జాప్యం, ప్రజలను పెట్టే బాధలు ఇన్నన్ని కావు. వీటన్నింటినీ మించి, లంచం వల్ల కోట్లు వెనకేసుకున్న వాడివల్ల సమాజం మీద పడే ప్రభావం చాలా దారుణమయింది. నిజాయతీ పరుడయిన ఉద్యోగి రోజుగడిస్తే చాలన్నట్లు బతుకు వెళ్లదీస్తుంటే, పక్క సీట్లో కూర్చునే అవినీతిపరుడు విలాసంగా లక్షలు ఖర్చుపెడుతున్నాడు, కోట్లు వెనకేస్తున్నాడు. అలాంటి అవినీతిపరులు పైవాళ్లకు ఆప్తులుగా మారటం... వాళ్లు తిష్ఠవేసుకుని కూర్చోవటం... పార్టీలు పోటీపడి వాళ్లకు ఎన్నికలలో సీట్లివ్వటం- ఇవన్నీ మనం చూస్తున్నాం. అవినీతికి శిక్ష పడకపోవటం, మేతగాళ్ల జీవితం వడ్డించిన విస్తరి కావటం, నిజాయతీగా పనిచేసే ఉద్యోగులు అనామకులుగా మిగిలిపోవటంవల్ల సమాజానికి ఎంతో చేటు కలుగుతోంది. ఇదంతా చూసి చిన్నతనంలోనే పిల్లల మనసులు కలుషిత

మవుతున్నాయి. "ఈ సమాజం అవినీతిపరులకు పట్టం కడుతుంది; నిజాయతీపరుల్ని ఇబ్బంది పెడుతుంది"-అనే పాఠం యువతకు చాలా త్వరగా వంటబడుతోంది. ఇది అత్యంత ప్రమాదకరం, విషాదకరం. ఈ తరంలో విలువలు పోతున్నాయని వాపోవటం ఆత్మవంచన. 'అక్రమార్జన సంస్కృతి'ని నరనరాల్లో జీర్ణించుకుని, అది లేకపోతే రాజకీయం- పరిపాలన నడవని స్థితికి తీసుకువచ్చి, ఆనక సమాజంలో విలువల గురించి మాట్లాడటం వ్యర్థం. ఇలా అక్రమార్జన చేసిన రాజకీయ నేతలు, అధికారులు విదేశాలలో దాచుకున్న డబ్బు దాదాపు 100 బిలియన్ డాలర్లు- అంటే నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలు- ఉంటుందని అంచనా.

బందిపోట్ల ముఠా వచ్చి ఇంట్లో దొగతనానికివస్తే తిరగబడండని, ప్రాణాలతో వదలవద్దని అధికారులు చెబుతున్నారు. ఇంట్లో పనిమనిషి వందరూపాయలు కాజేసినట్లు అనుమానం వస్తే చాలు వేధిస్తాం, సాధిస్తాం, ఇంట్లోంచి వెళ్లగొడతాం, ఒక్కొ ప్రజాధనాన్ని ఇలా దోచుకునేవాళ్లకు సమాజం వేస్తున్న శిక్ష ఏమిటి? అవినీతి నిరోధక శాఖ లేదా సి.బి.ఐ. అధికారులు లంచాలు మింగినవాళ్లను, వాళ్ల ఆస్తులను అప్పుడప్పుడైనా బయట పెట్టడం మనకు కొంత ఊరట కలిగిస్తుంది. కానీ వాస్తవమేమంటే, పట్టుబడ్డాక కూడా నూటికి తొంబై తొమ్మిది మంది తప్పించుకుపోతుండటం. సుఖ్‌రాం నివాసాలపైన దాడులు జరిగాయి, డబ్బు బయటపడింది, ఎన్నో ఆరోపణలొచ్చాయి. ఇదంతా జరిగి ఐదేళ్లయింది. చివరికి ఏమయింది? ఆయన హిమాచల్‌ప్రదేశ్‌లో ఓ ప్రముఖ నాయకుడిగా చక్రం తిప్పుతున్నాడు! ఇలా ఎన్నో ఉదంతాలను చెప్పుకోవచ్చు. దీనికి బాధ్యత అవినీతి నిరోధక శాఖలు, విభాగాలది కాదు. విధులను వారు సరిగా నిర్వర్తించినా ఫలితం వారి చేతుల్లో లేదు. నిజంగా అవినీతి అంతం కావాలంటే ఈ కేసులలో రాజకీయ జోక్యం పోవాలి. ఎందరో ఉన్నతాధికారులమీద ఆరోపణలున్నా ప్రభుత్వాలు విచారణకు అనుమతినివ్వవు. ఎందుకంటే రాజకీయ నేతలు- అధికారులు కుమ్మక్కయ్యారు కాబట్టి! ఒకవేళ అవినీతి నిరోధక శాఖలో రాజకీయ జోక్యం లేకుండా నిజాయతీగా, సమర్థంగా పనిచేసినా మనదేశంలో అవినీతిపరులకు శిక్షపడటం చాలా అరుదు. ఏదో ఒక వంకన కేసు కొట్టేస్తారు. ఏళ్ల తరబడి విచారణలో జాప్యం జరుగుతుంది. ఇంత జరిగినా చివరకు అవినీతిపరులు కాలరెత్తుకు తిరుగుతారు. అవినీతికి పాల్పడి సస్పెండయినవాళ్లు చాలా సందర్భాలలో చట్టంలో లొసుగుల కారణంగా మళ్లీ ఉద్యోగంలోకి ప్రమోషన్‌తో, పాత ఉన్నత పదవిలో కూర్చుంటారు! అందుకే కోర్టులలో

త్వరగా న్యాయం జరిగేట్లుగా, లంచగొండులకు శిక్షపడేట్లుగా సంస్కరణలు కావాలి. లంచం తిన్నవాళ్లకు తీవ్ర శిక్షలు కనీసం –10 సంవత్సరాలకు తగ్గకుండా జైలుశిక్ష ఉండేలా ఏర్పాటు చేయాలి. వాళ్ల ఆస్తులు, సమీప బంధువుల ఆస్తులు విధిగా ప్రభుత్వపరం చేయాలి. కఠిన శిక్షలు పడతాయన్న భయాన్ని సృష్టించకపోతే అవినీతిపరుల భరతం పట్టడం అసాధ్యం.

## సమాజం వెలివేయాలి

కేవలం లంచగొండులను శిక్షించగలిగితే చాలదు. లంచాలకు మూలం మూడు అంశాలలో ఉంది. పాలనలో దాపరికం, అధికార కేంద్రీకరణ, ఎన్నికలలో అక్రమాలు. వీటిన్నింటిలో సమూల ప్రక్షాళన జరగాలి. ప్రస్తుతం రాజకీయం, పాలన అవినీతి పునాదులమీద నిలబడ్డాయి. అవినీతికి పాల్పడకుండా మన రాజ్యవ్యవస్థ ఒక్క క్షణం కూడా నిలబడలేదు. గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలున్నాయని వాపోవటం అవివేకం. నిజంగా అవినీతిని అంతం చేయాలనే మంచివాళ్లు రాజ్యవ్యవస్థలో సమూల ప్రక్షాళన కోసం పోరాడాలి. ఈ లోగా అవినీతిపరుల్ని సమాజం వెలివేయాలి. ఎక్కడికక్కడ వాళ్లను బయపెట్టి నిలదీయాలి. అప్పుడే అవినీతిని ఎదుర్కోవటం సాధ్యమవుతుంది.

* * *

# అధికారం - అక్రమార్జనల విషవలయాన్ని ఛేదించడం ఎలా?

**ఆగస్టు 12, 2002**

మన రాజకీయంలో నిరంతరం ఏదో ఒక వివాదం లేదా సంక్షోభం చోటు చేసుకోవలసిందే. ఒక వారం తహల్కాటేపుల ఉదంతం. మరో వారం గుజరాత్ మత కల్లోలాలు. ఇంకో వారం గుజరాత్ అసెంబ్లీ రద్దు. మధ్యలో రాష్ట్రపతి ఎంపిక వివాదం. ఇటీవల పనికి ఆహారం పథకంలో అవకతవకలు. ప్రస్తుతం పెట్రోలు డీలర్ల నియామకంలో అశ్రిత పక్షపాతం, అవినీతి ప్రజల దృష్టిని ఆకట్టుకుంటున్నాయి.

## వ్యర్థ చర్చలు

ప్రజాస్వామ్యంలో ఇలాంటి కుంభకోణాలు బయటపడటం వ్యవస్థ ఆరోగ్యానికి మంచిది. తిరుగులేని అధికారం చలాయిస్తున్న ప్రభుత్వ పాలనలో కుంభకోణాలు బయటపడనంత మాత్రాన అవినీతి లేదనుకోవటం పొరపాటు. అవినీతిని దాచిపెట్టడడంలో పాలకులు సిద్ధహస్తులని రుజువవుతోంది. వారానికో అవినీతి భాగోతాన్ని బయటపెట్టి, రాజకీయాన్ని, పాలకులను, న్యాయమూర్తులను నిందించి, ఇక మన బాధ్యత తీరిందన్నట్లు చేతులు దులుపుకోవటం అవివేకం. ఇలాంటి సంస్థాగత అవినీతి వెనక ఉన్న మౌలిక కారణాలపైన దృష్టి సారించకుండా కేవలం విమర్శలతోనే తృప్తి పడితే ప్రయోజనం లేకపోగా నిరాశ కలుగుతుంది. మనదేశంలో ఇలాంటివి బయటపడ్డప్పుడు వాటిని కేవలం రాజకీయ ప్రయోజనాలకోసం, ప్రత్యర్థులను ఇరుకున పెట్టడం కోసం, వారిమీద బురద చల్లడంకోసం మాత్రమే వినియోగించటం అనవాయితీ అయింది. సత్యాసత్యాలు అప్రస్తుతాలయిపోయాయి. అధికార క్రీడలో ఇలాంటివన్నీ వ్యూహాత్మక అంశాలుగా ఉపయోగపడుతున్నాయి. కాని, వ్యవస్థలో అవినీతిని అంతం చేయటానికి చేపట్టవలసిన సంస్థాగత ఏర్పాట్లపైన శ్రద్ధ లేకుండా పోయింది. పౌరులు కూడా అవినీతి వార్తలను, పార్లమెంటులో ప్రకంపనల వివరాలను రోజువారీ సంభాషణలలో మళ్ళీమళ్ళీ చెప్పుకొని విమర్శించటం, నిస్పృహను ప్రదర్శించటమే తప్ప, ఈ పరిస్థితిని అధిగమించటానికి ఏం చేయాలో ఆలోచించటంలేదు.

ఇలా ఊబుసుపోక అనవసర చర్చలే తప్ప, ప్రజల ప్రయోజనాలకు, బహిరంగ చర్చకు మధ్య, సంబంధం లేకుండా పోయింది. ప్రతి దాన్ని అధికార క్రీడలో భాగంగానే తప్ప, మరో విధంగా మనం చూడలేక పోతున్నాం. ఆ కారణంగానే రాజకీయ పార్టీలు, ప్రభుత్వ యంత్రాంగం, పౌరులు అందరం సమస్యలో భాగం అవుతున్నామే తప్ప, పరిష్కారంలో పాలుపంచుకోలేక పోతున్నాం. అందువల్లనే అధికార క్రీడ, ఎన్నికలు కేవలం కొంతమంది స్వలాభం కోసం పనికి వస్తున్నాయి తప్ప, అది దేశ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించడం లేదు. ఎన్నికలు కేవలం మేక పిల్లలను కబళించటానికి ఏ తోడేలుకు హక్కుందో నిర్ణయించే ప్రక్రియగా మారాయి తప్ప, దోపిడీని ఆపటానికి సాధనంగా ఉపకరించటం లేదు. కుంభకోణాలు బయటపడినప్పుడు పార్టీలు ప్రదర్శించే వైఖరి మన పరిస్థితికి అద్దం పడుతోంది. అధికారపక్షం వారి వాదన ఏమంటే మీరు అధికారంలో ఉన్నప్పుడు ఇంతకంటే దారుణాలనే చేశారు. మా తప్పులతో పాటు గతంలో మీరు తప్పుకొని మాకు అధికారాన్ని అప్పగించండి. గతంలో మా తప్పులను బయటపెడితే మాత్రం మేం చూస్తూ ఊరుకోం. అలాగని రాజకీయంలో ఉన్న వాళ్లంతా దొంగలని, వాళ్లు కేవలం ప్రజలను మోసం చేయటంకోసం కంకణం కట్టుకున్నారని భావించటం పొరపాటు. అన్ని పార్టీలలోను ఎందరో నాయకులు నిజాయతీగా తమ విధుల్ని నిర్వర్తిస్తున్నారు. అయితే ఈ పరిస్థితుల్ని మార్చే శక్తి వారికి లేకుండా పోయింది.

## క్లిష్టమయిన సమస్యలు

పెట్రోలు డీలర్ల నియామకాన్నే పరిశీలిస్తే అధికారంలో ఉన్న పెద్దలు గత 35 ఏళ్లుగా డబ్బులు తీసుకుని నిర్ణయాలు చేస్తున్నారని అందరికీ తెలుసు. కొద్దిమంది అర్హులను నిజాయతీగా నియమించినా, అధిక సంఖ్యాకుల నియామకాలలో పైరవీలు, పలుకుబడులు, లంచాలు విరివిగా చోటుచేసుకుంటున్నాయన్నది నిర్వివాదాంశం. ఈ ఎంపిక కోసం న్యాయమూర్తులను నియమించినా అవినీతి ఆగటంలేదని, అవన్నీ కంటితుడుపు చర్యలేనని, గతంలో కేంద్రమంత్రి సతీష్‌వర్మను సుప్రీంకోర్టు అభిశంసించి. రూ॥50 లక్షలు జరిమానా వేసిందని, చివరికి ఆ కోర్టే ఆ జరిమానాను రద్దు చేసిందని మనందరికీ తెలుసు. డీలర్లు రూ॥15 లక్షల నుండి పాతిక లక్షలదాకా లంచాలిచ్చి సేషన్లు తెచ్చుకొన్నప్పుడు ఇందనంలో కల్తీలు, పెట్రోలు కొలతల్లో మోసాలు తప్పవని అందరికీ తెలుసు. ఆపైన ప్రభుత్వ శాఖల అధికారులు లంచాలు తీసుకుంటున్నారని, ఆ కారణంగా నిజాయతీ పరులయిన డీలర్లు ఎంతో ఇరుకున

పడుతున్నారని ప్రజలెరుగుదురు. పెట్రోలు స్టేషన్లలో కొలతల మోసాన్ని అరికట్టేందుకు 1998లో 'లోక్‌సత్తా' ఉద్యమం చేపట్టేంత వరకు జంటనగరాలలో ఉన్న 104 పెట్రోలు బంకులలో కేవలం అరడజను మాత్రమే మీటర్లలో మోసం చేయకుండా వినియోగదార్లకు నిజాయతీగా పంపిణీ చేస్తున్నాయని పేరుంది. మిగిలిన బంకుల వారంతా మోసాలకు పాల్పడుతున్నారన్నది బహిరంగ రహస్యం. చివరికి పరిస్థితి ఎంతదాకా వచ్చిందంటే, కొలతల్లో మోసంచేసిన పంపిణీ చేయకుండా అమ్మినట్లు లెక్కలు చూపించిన మొత్తంపైన కూడా తమకు బేటాలు కావాలని కార్మికులు వాటా అడిగారు. ఓ బంకులో జరిగిన అమ్మకాలనుబట్టి కార్మికులకు కొంతశాతం ఇచ్చే ఆనవాయితీ ఉంది. నిజంగా పోసిన పెట్రోలుకు మాత్రమే ఈ బేటాలిస్తామని యజమానులు; కాదు, అమ్మకం చూపిన మొత్తానికి బేటాలివ్వాలని కార్మికులు వాదించుకున్నారు!

అలాగే.... పనికి ఆహారం పథకంలో అవినీతి చోటుచేసుకుందని తెలియని వాళ్లు లేరు. ఎన్నో నియోజకవర్గాలలో నాయకులు గత అయిదారు నెలలుగా ఈ పథకంలో అవకతవకల ద్వారా కోట్ల రూపాయలు అక్రమంగా వెనకేసుకున్నారని ప్రజలందరికీ తెలుసు. ఎలాగూ కేంద్ర ప్రభుత్వం పంపిన ఆహారధాన్యాలే కాబట్టి " ఈ రూపంలో మనకు కొన్ని వనరులు వస్తాయి, వాటితో పనులు చేస్తే ప్రజల్లో పలుకుబడి వస్తుంది, కొంత డబ్బు 'మన' వాళ్లే తింటే పట్టించుకోనక్కరలేదు" అని ప్రభుత్వ నేతలు భావించవచ్చు. "ఎన్నికలలో కోట్లు ఖర్చుపెట్టి గెలిచాం. తిరిగి సంపాదించకపోతే పెళ్ళాం, బిడ్డలు అన్యాయమైపోతారు. ఎందరో కార్యకర్తలు పార్టీ విజయం కోసం చాలా కష్టపడ్డారు. ఏదో ఒకరూపంలో వాళ్లకు ఆదాయ చూపకపోతే రాజకీయం నడవదు" అని నాయకులు అక్రమాలకు పాల్పడవచ్చు. "దేనికీ నిధులు లేనప్పుడు ఏదో ఒక పేరుతో కొన్ని పనులు, కొంత మేరకయినా జరుగుతున్నాయి. ఈ పథకం కూడా లేకపోతే ఇక అసలు మనకు రోడ్లే రావు. నూటికి 20 రూపాయలు మధ్యలో తిన్నా, కనీసం మిగిలిన పనయినా జరుగుతోంది. అయినా ఇది ప్రభుత్వం డబ్బే కదా" అని ప్రజలు భావించవచ్చు "దొరికిందే ఛాన్సు ఏ పార్టీవాళ్లు వచ్చినా ఎలాగూ వాళ్లు కోట్లు మింగటం ఖాయం. వాళ్లు చెప్పినట్లు చేస్తే మన 10 శాతం వాటా మనకు వస్తుంది. అర్ధాంతరంగా బదిలీలు, వేధింపులు ఉండవు. అందరూ దోచుకుంటూంటే నాకేం పోయింది. ఎదిరిస్తే అన్నీ ఇబ్బందులే. కలిసిపోతే అంతా లాభమే" అని అధికారులు కుమ్మక్కయిపోవచ్చు. ఇలా అందరూ రాజీ పడిపోతున్నారు.

చివరికి ఈ వివాదం రాజకీయ రూపు దాలుస్తోందే కాని, ప్రజలకు జరిగే నష్టాన్ని పట్టించుకునేవారు తక్కువ. అలాగే గతంలో సిటీబస్సు పర్మిట్లు పూర్తిగా ప్రభుత్వాధికారుల చేతుల్లో ఉండేవి. జిల్లా కలెక్టర్లు, ఎస్.పి, ప్రాంతీయ రవాణాధికారి కలిసి చేసే ఎంపిక– కాబోయే కోటేశ్వరుణ్ణి నిర్ణయించేది. పలుకుబబడితోనో, సిఫారసుతోనో, లంచంతోనో కొంత మందికి పర్మిట్లు దక్కేవి. ఆ పర్మిట్లకు ఎంతో పోటీ ఉండేది. పెద్ద పెద్ద లాయర్లు తమ క్లయింట్ల తరపున వాదించే వారు. 1987లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం మోటారు వాహనాల చట్టాన్ని మార్చి ఎంతమందికయినా పర్మిట్లు ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వాధికారులు పర్మిట్లను నిర్ణయించడంకాక, ఎవరయినా కొన్ని నిబంధనల ప్రకారం బస్సులు నడుపుకొని, పోటీకి తట్టుకుని నిలబడటం ఆ చట్టం లక్ష్యం. 1989లో ఆ చట్టాన్ని మొదటగా తూర్పుగోదావరి జిల్లాలో అమలుచేసి అందరికీ పర్మిట్లనిచ్చినప్పుడు వాహనాల యజమానులు, లాయర్లు– అందరూ నిర్ఘాంతపోయి వ్యతిరేకించారు! పర్మిట్లు పొందినవారు కూడా, ఎవరో ఒకరికి పర్మిటునివ్వాలని, అందరికీ అవకాశం ఇవ్వరాదని వాదించారు. చివరికి హైకోర్టుకు అప్పీలు చేసుకోగా, అర్హులయిన వారందరికీ పర్మిట్లివ్వటం సబబని, పోటీలో ఎవరు నిలబడితే వారు కొనసాగుతారని, మిగిలిన వారు విరమించుకుంటారని తీర్పు వచ్చింది. పోటీని వ్యతిరేకించే వారు, పైరవీలపైన ఆధారపడేవారు, లంచాలు పుచ్చుకునేవారు ఇలా– ప్రభుత్వ విచక్షణాధికారం కొనసాగుతూనే ఉండాలని ఆశించటం సహజం. ప్రభుత్వానికి ఏ సంబంధమూ ఉండకూడని అంశాలపైన కూడా విచక్షణాధికారాన్ని కొనసాగించటం మనం నిరంతరం చూస్తున్నాం. ఉదాహరణకు లౌకిక రాజ్య వ్యవస్థలో దేవాలయ ట్రస్టు బోర్డుల నియామకంతో ప్రభుత్వానికి ఏ సంబంధమూ ఉండరాదు. అయినా స్థానిక శాసనసభ్యుల నిర్ణయం ప్రకారం ప్రభుత్వం ఈ నియామకాలు చేస్తోంది. అలాగే రైతులు తమ ఉత్పత్తిని అమ్ముకునే మార్కెట్ కమిటీలలో అధ్యక్షులుగా, సభ్యులుగా ప్రభుత్వం 'అస్మదీయులను' తమ ఇచ్చానుసారం నియమిస్తోంది. అలా నియమించిన వారిలో కొందరు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నమాట వాస్తవం. కాని ఇలా విచక్షణాధికారం ఉన్నప్పుడు అవినీతి, పైరవీలు జోరుగా కొనసాగటం సహజం. ఎందుకిలా చేస్తున్నారని పాలకులను నిలదీస్తే, "అయ్యా, ఇప్పటికే మా కార్యకర్తలు విసిగిపోయి ఉన్నారు. పల్లకీని మోసే బోయీలు తామయితే, శాసన సభ్యులు, మంత్రులు సౌఖ్యాలను అనుభవిస్తున్నారని విమర్శిస్తున్నారు. వాళ్లకు ఏవో పదవులనిచ్చి సంతృప్తి పరచకపోతే మేం రాజకీయాల్ని నడపలేం" అని సమాధానం వస్తోంది.

## సంస్థాగత పరిష్కారాలు

ఇవన్నీ అత్యంత క్లిష్టమయిన అంశాలు. వీటికి సంస్థాగత పరిష్కారాలను అన్వేషించకుండా అవినీతిని అరికట్టడం అసాధ్యం. మూడు దిశలలో మనం పరిష్కారాలను వెతకాలి. మొదటిది, ప్రభుత్వానికి ఎంతగా విచక్షణాధికారం ఉంటే, అంతగా అవినీతి, పక్షపాతం చోటుచేసుకుంటాయి. ప్రభుత్వంలో గుత్తాధిపత్యం కొనసాగితే అక్రమాలను అరికట్టలేం. ఆయిల్ కంపెనీలు ప్రభుత్వం చేతుల్లో ఉండాల్సిన అవసరమే లేదు. అయిల్ డీలర్ల నియామకానికి, ప్రభుత్వానికి ఏ సంబంధం ఉండరాదు. ఆ గుత్తాధిపత్యాన్ని, నిర్ణయాధికారాన్ని ప్రభుత్వం చేతుల్లో ఒకసారి పెట్టాక అవినీతి ఉందని వాపోవటంలో అర్థం లేదు. ప్రభుత్వం చేయవలసిన పనులను విస్మరించి, వ్యాపారంలో వేళ్లు పెట్టడం వల్ల కలిగిన అనర్థం ఇది. ఒకప్పుడు- చివరికి సిమెంటు, స్టీలు కొనేందుకు కూడా ప్రభుత్వ పర్మిట్లు కావాల్సి వచ్చేది. ఇలాంటి గుత్తాధిపత్యం, లైసెన్సు- పర్మిట్లు- కోటాల రాజ్యం అవినీతికి పునాది. టెలిఫోన్లు పూర్తిగా ప్రభుత్వం చేతుల్లో ఉన్నప్పుడు డబ్బిచ్చినా టెలిఫోను కావాలంటే సాధ్యమయ్యేది కాదు. ఎందరో లంచాలిచ్చి, సిఫారసులతో పనులు చేయించుకునే వారు. ఎందరో పార్లమెంటు సభ్యులు తమకున్న విచక్షణాధికారంతో ఆశ్రితులకు ఫోను మంజూరు చేయించేవారు. కొందరు ఫోన్ల మంజూరుకు డబ్బు తీసుకునే వారు. ప్రభుత్వాధిపత్యం అంతరించటంతో ఇప్పుడు ఫోన్లు కొద్ది రోజులలోనే ఏర్పాటవుతున్నాయి. ఎవరికీ ఏ లంచమూ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆ విషయంలో నాయకులకు విచక్షణాధికారం లేదు. ఇక అవినీతిని అంతం చేసే రెండో మార్గం- అధికార వికేంద్రీకరణ అన్ని అధికారాలకు కేంద్రీకరించిన ప్రభుత్వం చేతుల్లో పెట్టకుండా, ఎక్కడికక్కడ నిర్ణయాలు చేసే బాధ్యతను ప్రజలకు అప్పగించాలి. అవినీతి వల్ల తామే నష్టపోతున్నామని, పోయేది మన డబ్బేనని, ఆ డబ్బును సద్వినియోగం చేస్తే అది తమకే మరో రకంగా ఉపయోగపడుతుందని ప్రజలకు అర్థం కావాలి. స్థానిక పాలనవల్ల అన్నీ సక్రమంగా జరుగుతాయని, అందరూ నిజాయతీగా ఉంటారని అనుకోవటం అమాయకత్వం. కాని తాము కట్టే పన్నులకు, తమకు జరిగే పనులకు, అందే సేవలకు మధ్య సంబంధం స్పష్టంగా ఉంటే ప్రజలు జాగరూకతతో అవినీతిని నిరోధిస్తారు. అలాగే అధికారంలో ఉన్నవారుపార్టీ కార్యకర్తలకు విచక్షణాధికారంతో పదవులను కట్టబెట్టటం కన్నా, స్థానికంగా నిజాయతీగా నాయకులు ఎదిగే అవకాశాన్నిస్తే పార్టీల పునాది బలపడుతుంది, నిజాయతీ నిలబడుతుంది.

అన్నింటినీ మించి అవినీతి అంతానికి అతి ముఖ్యమార్గం ఎన్నికల సంస్కరణలు. కోట్ల ఖర్చుతో చట్టసభకు ఎన్నికై అక్రమార్జనతో అధికారాన్ని నిలుపుకొనే అవకాశం ఉన్నంత వరకు ఈ విషవలయం కొనసాగుతూనే ఉంటుంది. రాజకీయంలో డబ్బు వినియోగాన్ని క్రమబద్ధీకరించి, చట్టబద్ధమైన ఏర్పాట్లు చేసినప్పుడే నిజాయతీగా ఎన్నికలలో గెలిచే అవకాశం కలుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ సమస్య వర్ణననుంచి పరిష్కారం మీదకి దృష్టిని సారించటం అవసరం.

* * *

# నిజాయతీపరులకు గౌరవం సామాజిక బాధ్యత

## ఏప్రిల్ 1, 2002

మంచి మిత్రుడు, నిజాయతీకి, ఆర్ద్రతకు, చిత్తశుద్ధికి మారుపేరుయిన ఐ.ఎ.ఎస్.అధికారి నాగర్జున మరణం వార్త అశనిపాతంలాగా తాకింది. ఎప్పుడూ చిరునవ్వుతో, పేదలపట్ల అనురక్తితో, అంకితభావంతో పనిచేసే ఓ సహృదయుడు ఇక లేడంటే నమ్మశక్యం కాకుండా ఉంది. మనిషి జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే సత్యాన్ని ఈ అకాల మరణం మరోసారి చాటిచెప్పింది. మరోవంక... అహంకారాన్ని, అలవిమాలిన స్వార్థాన్ని, అజ్ఞానాన్ని వదులుకోలేని ఎందరో మనుషుల మనస్తత్వాలను గమనిస్తే జుగుప్స కంటే జాలి కలుగుతుంది. మరణం ఎప్పుడూ శోకాన్ని మిగులుస్తుంది, అందునా అకాలమరణం మరింత విషాదాన్ని కలిగిస్తుంది. సమాజానికి పనికివచ్చే ఓ సహృదయుడి మరణమైతే విషాదంతోపాటు, తీరనిలోటు తెలుస్తుంది. ఎందరో ఉన్నతాధికారులున్నారు. చాలా మందికి పదవివల్ల వచ్చే గుర్తింపు తప్ప వ్యక్తిగత ప్రతిభ గాని, వారు సాధించిన ఘనకార్యాలు గాని, సమాజానికి వారివల్ల కలిగే ప్రయోజనం గాని ఉండవు. అతికొద్దిమంది విషయంలో మాత్రం పరిస్థితులు వేరు. వారి వల్ల పదవికి రాణింపు వస్తుంది కాని, పదవివల్లవాళ్ళు బాటవుకునేదీమే లేదు. దురదృష్టవశాత్తూ ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్.లలో అత్యధికులు పదవివల్ల గుర్తింపుపొందే వాళ్లే కాని తమ వృత్తికి వన్నె తెచ్చేవాళ్ళుకారు.

### అద్భుతాలు సాధించిన అధికారులు

గతంలో ఇలా ఉండేది కాదు. ఎల్.పి.సింగ్ లాంటి ఐ.సి.ఎస్. అధికారులు అసాధారణమైన ప్రతిభాపాటవాలను కనబరచారు. స్వతంత్రం వచ్చిన తొలిరోజుల్లో ఆనాటి హోమ్ మంత్రి, నవభారత నిర్మాత సర్దార్ పటేల్, హోమ్ కార్యదర్శి ఎల్.పి.సింగ్ ఓ జట్టుగా పనిచేసి 520 సంస్థానాలను అనతికాలంలో శాంతియుతంగా భారత్‌లో విలీనం చేశారు. ఒక్క హైదరాబాద్ సంస్థానం తప్ప మరెక్కడా బలప్రయోగం అవసరం రాలేదు. ఎంతో చాకచక్యంతో, నైపుణ్యంతో వారు వ్యవహరించి అసాధ్యమనుకున్న అద్భుతాన్ని సుసాధ్యం చేశారు. భారత్‌లో మూడోవంతు జనాభా, భూభాగాలకు

ప్రాతినిధ్యం 'వహిస్తున్న సంస్థానాలు శాంతియుతంగా, అతి తక్కువ కాలంలో మన దేశంలో అంతర్భాగమయ్యాయి. ప్రపంచ చరిత్రలో మరెక్కడా ఇంతటి జనాభా, విస్తీర్ణం ఉన్న 500కి పైగా సంస్థానాలు, స్వతంత్ర రాజ్యాలు అంత త్వరగా విలీనం కాలేదు. ఒక వంక అసమాన సంకల్పబలం ఉన్న రాజకీయ నాయకత్వం, మరో వంక అపారమయిన సామర్థ్యం, చిత్తశుద్ధి మూర్తీభవించిన అధికార యంత్రాంగం మన జాతి గౌరవాన్ని ఇనుమడింపజేశాయి. స్వతంత్ర భారతంలో మన జాతి సాధించిన అతి గొప్ప విజయమైన హరిత విప్లవంలో కూడా రాజకీయ నాయకత్వం, అధికార యంత్రాంగం ప్రధాన పాత్ర వహించాయి. ఆనాటి వ్యవసాయ మంత్రి సి.సుబ్రహ్మణ్యం, వ్యవసాయ కార్యదర్శి బి.ఎన్.శివరామన్, డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ ఆధ్వర్యంలో నిపుణులయిన శాస్త్రజ్ఞులు ఉమ్మడిగా అద్భుత విజయాలు సాధించారు. ఆ హరిత విప్లవం ఫలితమే నేడు మనకు ఇబ్బందిగా పరిణమించినా ఆహారధాన్యాల మిగులు. ఒకప్పుడు ఏటా ఆరుకోట్ల టన్నుల ధాన్యాన్ని పండిస్తుండగా, ఇప్పుడు ఆరు కోట్ల టన్నులు గిడ్డంగులలో పేరుకుపోయి ఉన్నాయి! ఆ విధంగానే అంతరిక్షనౌకల ప్రయోగాలలో, అణ్వస్త్రాల తయారీలో, మనమంతా గర్వించే ఐ.ఐ.టి.ల నిర్మాణంలో, అద్భుతమయిన విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో, పంటపొలాలకు నీటినందించిన పథకాల రూపకల్పనలో రాజకీయ సంకల్పం, అధికారుల చిత్తశుద్ధి, సాంకేతిక నిపుణుల దీక్ష దాగి ఉన్నాయి. కేవలం స్వతంత్రం తరవాత మాత్రమే అధికారులు చిత్తశుద్ధితో విధి నిర్వర్తించారనుకుంటే పొరపాటు. బెంగాల్‌లో పర్మనెంట్ సెటిల్మెంటుకు ఏర్పాట్లు చేయటంలో సమర్థులయిన అధికారుల పాత్ర ఉంది. మద్రాసు రాష్ట్రంలో సర్ థామస్ మన్రో ఆధ్వర్యంలో జరిగిన రైతువారీ సెటిల్మెంటు రైతులకు, గ్రామీణ ప్రజలకు ఎంతో ఊరట కలిగించింది. పంజాబ్‌లో అరాచకత్వాన్ని అంతమొందించటంలో ఎందరో అధికారుల అనుపమానమయిన సేవలున్నాయి. సతీ సహగమనాన్ని, బాల్య వివాహాలను నిషేధించటంలో మన సంఘ సంస్కర్తలకు ఎందరో అధికారుల అండదండలు లభించాయి. నరహత్యలకు పాల్పడే దోపిడీ ముఠాలైన థగ్గులను, నరబలులతో మధ్య భారతాన్ని గడగడలాడించిన పిండారీలను అణచివేయటం కోసం ఎందరో అధికారులు అసువులు బాశారు. మనదేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు, సహజవనరుల అభివృద్ధికి ఆనాటి అధికారులు అహర్నిశలు కృషి చేశారు. మనదేశంలో స్వతంత్ర రాజ్యాలను ఏదో ఒకమిషతో బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేసిన డల్హౌసీ పట్ల మనందరికీ నేటికీ చాలా కోపం ఉంది. 1857లో తిరుగుబాటుకు

కూడా ఆనాటి డల్హౌసీ విధానాలే ప్రధాన కారణం. అదే డల్హౌసీ మనదేశంలో రైల్వేల నిర్మాణానికి, జాతీయ రహదారుల ఏర్పాటుకు అహరహం శ్రమించారు. ప్రపంచంలో రైల్వేలు ప్రారంభమయిన తొలిరోజుల్లోనే భారత్‌లో అతిపెద్ద రైల్వే రవాణా మార్గాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తెలుగునాట మన మంతా స్మరించుకునే సర్ ఆర్థర్ కాటన్ ఓ శ్వేత జాతి ఇంజనీరు. ఆయన కృషి ఫలితమే. కృష్ణా, గోదావరి బ్యారేజీల నిర్మాణం, కావేరిపై శ్రీరంగపట్టణం వద్ద బ్యారేజీ. వేసవిలో గుక్కెడు నీళ్ళులేక అవస్థపడే ప్రాంతంలో, తిండిలేక పిల్లలను అమ్ముకునే రోజుల్లో కాటన్ మహాశయుడి కృషి లక్షలమందికి వరప్రసాదమయింది.

## వెలవెలబోతున్న యంత్రాంగం

అంతగా ప్రజల మన్ననలందుకున్న ఉన్నతాధికారవర్గం దేశమంతటా ఇప్పుడు వెలవెలబోతోంది. అతికొద్ది మంది మాత్రమే నిజాయతీకి చిత్తశుద్ధికి, సామర్థ్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నారు. అందుకే అలాంటి వారిలో ఒకరిద్దరిని కోల్పోతే మనం విలవిలలాడిపోతున్నాం. ఈ పతనానికి కొన్ని కారణాలున్నాయి. బ్రిటిష్ కాలంలో ఐ.సి.ఎస్. అధికారుల సంఖ్య చాలా పరిమితంగా ఉండేది. ప్రధాన బాధ్యతలను మాత్రమే వారికి అప్పగించేవారు. ప్రతి అధికారి గుణగణాలు, చరిత్ర, పాలనాదక్షత అందరికీ తెలిసేవి. ఒక అధికారి ప్రవర్తనలోగాని, విధి నిర్వహణలోగాని లోపాలు గోచరిస్తే వెంటనే నిలదీసి హెచ్చరించేవారు. తక్షణం దారికి తెచ్చేవారు. అరుదుగా ఎక్కడయినా అవినీతి కనిపిస్తే నిర్దాక్షిణ్యంగా పదవులనుంచి తొలగించేవారు. ఉన్నతాధికారులలో సమష్టితత్వం, హుందాతనం, తలవంచరాదనే ఆత్మగౌరవం, తలవంపులు తేగూడదనే పట్టుదల ఉండేవి. స్వతంత్ర భారతంలో అదేపనిగా ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్.ల సంఖ్యాబలాన్ని పెంచేసి ఆ సమష్టితత్వానికి గండికొట్టారు. పిడుక్కి, బియ్యానికి ఒకటే మంత్రంలాగా ప్రతి ఉద్యోగానికి ఐ.ఎ.ఎస్. అధికారులను నియమించటం మొదలుపెట్టారు. ఆ ఉద్యోగాలలో కొన్ని ప్రతిష్ఠాత్మకంగాను, కొన్ని అనామకంగాను కనిపించటంతో బదిలీలలో, ఉద్యోగాలలో పోటీ, పైరవీలు, పక్షపాతాలు అనివార్యమయ్యాయి. కాలక్రమేణా అసలు ప్రజల సంక్షేమానికి, మంచి పాలనకు కావలసిన ఉద్యోగాల విలువతగ్గి, లైసెన్సులు, పర్మిట్లు, మంజూరుచేసే శాఖలకు, విలాస జీవనాన్నందించే ప్రభుత్వ రంగ సంస్థలకు గిరాకి పెరిగింది. కాలక్రమేణా సహజంగానే ప్రజల దృష్టిలో ఐ.ఎ.ఎస్.విలువ తగ్గనారంభించింది.

ఉన్నతాధికారుల పదవులలో రాజకీయ జోక్యం పెరిగిపోయింది. కొన్ని పదవులలో బదిలీలకు కోట్ల రూపాయలు చేతులు మారటం– జాతీయస్థాయిలో కొన్ని రాష్ట్రాలలో రివాజయింది. ఒకప్పుడు ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారులలో అవినీతి అనే మాట వినపడేది కాదు. ఇప్పుడు వారి అవినీతిని గురించి చిలవలుపలవలుగా చెప్పుకుంటున్నారు. నేటికీ– నిజాయతీకి మారుపేరయిన చిత్తశుద్ధితో ప్రజా సంక్షేమాన్ని కాపాడే ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్. అధికారులు ఎందరో ఉన్నారు. కానీ చెడుకు వచ్చిన గుర్తింపు మంచికి ఉండదు. అదీగాక చెడుత్వరగా వ్యాపిస్తుంది. మంచి కుంచించుకుపోతుంది. దాంతో అవినీతి పెరిగిపోయిందనే మాట సర్వత్రా వినవస్తోంది. చివరికి ఉన్నతాధికారుల సంఘాలు కూడా అవినీతిపరులకు రక్షణనిస్తున్నాయి. పొరపాటున ప్రభుత్వం ఎప్పుడయినా అవినీతిపరులను పక్కన పెట్టినా, ఈ సంఘాలు ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ సంకల్పాన్ని బలహీనపరుస్తున్నాయి. అలాగే నియామకాలు, క్రమశిక్షణ చర్యలు కేంద్ర ప్రభుత్వం చేతిలోను, బదిలీలు, జవాబుదారీ తనం రాష్ట్ర ప్రభుత్వం చేతిలోను ఉండటంతో కొందరు అధికారులు తెలివిగా రాజకీయమాడి తప్పించుకుంటున్నారు. అందునా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉంటే అఖిల భారత సర్వీసులకు చెందిన అధికార్లలో కొందరికి అది అయాచిత వరమవుతుంది. ఇలా వివిధ కారణాలవల్ల తప్పుచేసి అధికారులను దండించటం అసాధ్యం కాగా, నిజాయతీకోసం నిలబడి విధి నిర్వహణలో రాగద్వేషాలకతీతంగా నిలిచే వారికి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఎందరో సమర్థులు, నిజాయతీపరులు విసిగిపోయి నిస్తేజంగా, స్తబ్దంగా పదవులు నిర్వహిస్తున్నారు. ఎందరో అధికారులు అధినాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారు. పైవారి మనోభావాలు గుర్తెరిగి, వారి అభిప్రాయాలకనుగుణంగా వ్యవహరించటం అలవాటయిపోయింది. అధికార యంత్రాంగంలో కొనసాగాలంటే చెప్పింది చేయటమే తప్ప మారు పలకరాదని, పైవాళ్ళ రాజకీయ ప్రయోజనాలే తప్ప ప్రజా సంక్షేమం పరమావధికారాదని బాగా ప్రచారంలోకి వచ్చింది. ముళ్ళబాటమీద ప్రయాణం చేయాల్సివస్తుందేమోననే బెరకు మామూలు మనస్తత్వంగల చాలా మంది అధికారులను కుంగదీస్తోంది. అందుకే చూసిరమ్మంటే కాల్చివచ్చే వాళ్ళు అధికమయ్యారు. రాజును మించిన రాజభక్తి ప్రదర్శించటం సర్వసామాన్యమయింది. కాస్త వంగి ఉండమంటే సాష్టాంగ ప్రణామం చేసేవాళ్ళు పెరిగిపోయారు.

## ప్రజల అండదండలు ముఖ్యం

మంచివారికి నష్టం కలగకపోయినా, నిజాయతీపరులు ఆర్థికంగా చాలా కష్టనష్టాలకు గురవుతున్నారు.సామాన్య పౌరులతోపోలిస్తే వారి జీవితం బాగానే కనిపించినా, తోటివారితో పోలిస్తే నిజాయతీపరులు అనేక ఇబ్బందులు పడాల్సినస్తోంది. తమకున్న అధికారంతో పోలిస్తే, తమతోటివారు అధికార దుర్వినియోగంవల్ల రాజభోగాలనుభవిస్తుంటే, దానికతీతంగా సాదా జీవనం గడపాలంటే చాలా స్థిరప్రజ్ఞత్వం, సంయమన దృక్పథం అవసరం. ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా, కనీసం నిజాయతీపరుడిని గౌరవిస్తే ఎంతో తృప్తి కలుగుతుంది. అలాంటి వారికి అండనివ్వగలిగితే మంచితనం నిలబడుతుంది. అదే నిరాదరణకు, తిరస్కారానికి గురయితే ఆ మంచితనం ఆట్టేకాలం ప్రజలకు పనికిరాదు. ఇప్పటికీ ఎందరో ఉన్నతాధికారులు అద్భుత సేవలందిస్తున్నారు. వివిధ రాష్ట్రాలలో చిత్తశుద్ధిగల అధికారుల అనుపమాన సేవలకు తిరుగులేని సాక్ష్యాలున్నాయి. గతవారం అసువులు బాసిన సుప్రసిద్ధ నీటిపారుదల ఇంజనీరు శ్రీరామకృష్ణయ్య ఆ కోవలోని మనిషే, వయసు మళ్ళినా, పదవీ విరమణ చేసినా, శరీరం పట్టుతప్పినా, పక్షవాతంతో మంచానపడినా, మరణించేవరకు అహర్నిశలు ఆయన నీటి పథకాల గురించి, సహజ వనరుల వినియోగాన్ని గురించి, అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి తపన పడ్డారు. నేటి సమాజంలో అలాంటి సామర్థ్యం, నిజాయతీ, చిత్తశుద్ధి అపురూపమైనవి, “మీ ఇంటికొస్తే మాకేమిస్తావు? మా ఇంటికొస్తే మాకేం తెస్తావు?” అంటూ, ప్రతిదాన్ని రూపాయి, పైసలతో విలువ కట్టే రోజులలో తమ జీవితాన్ని కొవ్వొత్తిలాగా కరిగిస్తూ సమాజానికి ప్రేమాభిమానాలు పంచేవారు నిజమయిన ధీరోదాత్తులు. అటువంటి వారిని ప్రేమించటం, అభిమానించటం, గౌరవించటం సమాజ ప్రగతికి అవసరం ‘జాతస్య మరణం ధృవం.’ తమ జీవితాలను ప్రజల విముక్తికి, వారి బిడ్డల భవిష్యత్తుకు వెచ్చించే వ్యక్తులు ధన్యజీవులు. కోరి కష్టాలు తెచ్చుకుంటూ ప్రజలకు అమృతాన్ని పంచే అధికారులను, ఉద్యోగులను గౌరవించుదాం. ఆ స్ఫూర్తితోనే, నాగార్జున స్మృతికి అశ్రుతర్పణం చేద్దాం. మనం చేసే పోరాటం అవిశ్రాంతం. మళ్ళీ గుండె దిటవు చేసుకుని ఈ ధర్మపోరాటంలో పాలుపంచుకుందాం.

* * *